పిడుగులజడి గరిమెళ్ళ

గరిమెళ్ళ సాహిత్యం - వెలుగు నీడలు



బి. కృష్ణకుమారి

పిడుగులజడి గరిమెళ్ళ

గరిమెళ్ళ సాహిత్యం – వెలుగు నీడలు



గరిమెళ్ళ సత్యనారాయణ

15.07.1893 – 18.12.1952

బి. కృష్ణకుమారి

పిడుగులజడి గరిమెళ్ళ
గరిమెళ్ళ సాహిత్యం – వెలుగు నీడలు
రచయిత : బి. కృష్ణకుమారి
మొదటి ముద్రణ : జూన్ 1993
ఇ–బుక్ : ఏప్రిల్ 2021
ముఖచిత్రం : బాపూ

వివరాలకు :
బి. కృష్ణ కుమారి
4–9/1, వెస్ట్ గాంధీనగర్,
రాంపల్లి చౌరస్తా,
నాగారం – 500 083
కీసర మండల్, మేడ్చల్ జిల్లా
bommakanti.krishnakumari56@gmail.com

ప్రతులకు :
e-book PDF

స్వాతంత్ర్యోద్యమంలో పోరాడిన
త్యాగమూర్తులకు, విస్మృత వీరులకు

" ... అట్టడుగున పడి కాన్పించని ...

కథలన్నీ కావాలిప్పుడు .... "

శ్రీశ్రీ

30 ఏళ్ళ తర్వాత...

30 ఏళ్ళ తర్వాత ఈ e-book కి ముందుమాట రాస్తున్నప్పుడు బోలెడు జ్ఞాపకాలు, ఉద్వేగాలు చుట్టుముడుతున్నాయి. ఎక్కువగాను, కృతజ్ఞతాపూర్వకంగాను కూడా గుర్తొస్తున్నవి కొన్ని ఉన్నాయి.

ప్రధానంగా స్వాతంత్ర సమరయోధుల్ని కలుసుకున్న సందర్భాలు, వాళ్ళ సంస్కారం మొదలైనవి. తర్వాత ప్రొఫెసర్ వి. రామచంద్ర, ప్రొఫెసర్ చల్లా రాధాకృష్ణ శర్మ గార్లు యిచ్చిన ధైర్యం. ఇంత చిన్న పుస్తకానికి కె.వి.ఆర్. ముందుమాట రాయటం.

నేను 1989 నవంబర్‌లో మద్రాసు యూనివర్సిటీలో ఎం.ఫిల్‌లో చేరాను. ఇంటర్వ్యూ సమయంలోనే 'గరిమెళ్ళ సాహిత్యం – విమర్శనాత్మక పరిశీలన' అనే శీర్షికతో synopsis ఇచ్చాను. ఆ అంశమే ఖరారయ్యింది.

ఆ తరవాత ఒకటి రెండు నెలలకే గరిమెళ్ళ కుటుంబ సభ్యుల పరిస్థితి గురించి, ఆయన సాహిత్యాన్ని ఎవరూ పెద్దగా పట్టించుకోకపోవటం గురించి వివరిస్తూ, గరిమెళ్ళ సత్యనారాయణ శతజయంతి జరపాలని విజ్ఞప్తి చేస్తూ ప్రముఖ సాహిత్యకారులు పరకాల పట్టాభి రామరావు, మహీధర రామ్మోహనరావు గార్ల పేర్లతో వార్తాపత్రికలలో ఒక ప్రకటన వచ్చింది. ఆ ప్రకటనకు అప్పటి తెలుగు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డా. సి. నారాయణరెడ్డి సానుకూలంగా స్పందించారు.

అప్పటికే ఉద్యోగం చేస్తున్న అనుభవం వల్లనో ఏమో, నేను వెంటనే నా పరిశోధనాంశం గురించి తెలియచేస్తూ పరకాల పట్టాభిరామారావు గారికి ఉత్తరం రాశాను. ఆయన సంతోషిస్తూ వెంటనే జవాబు యిచ్చారు. అలా మొదలయింది అనేకమంది స్వాతంత్ర సమరయోధులతో నా పరిచయం.

వాళ్ళందరూ నా కన్నా కనీసం నలభై (ఇంకా ఎక్కువేమో కూడా) యేళ్ళు పెద్దవాళ్ళు. ఏం అడిగితే ఏం అనుకుంటారో అని భయం. అయినా వాళ్ళ జ్ఞాపకాల

కోసం 15-20 మందిని (హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి, కాకినాడ, శ్రీకాకుళం) కలిశాను. ఒక ప్రశ్నాపత్రం తయారు చేసుకుని వెళ్ళాను. జవాబులతో పాటు ఇతరత్రా మీకు తెలిసిన విషయాలు తరువాతైనా నాకు పంపించండి అని చెప్పాను. కొందరు గరిమెళ్ళ సాహిత్యం గురించి మాట్లాడారు. కొందరు గరిమెళ్ళ గురించి చెప్పలేకపోయినా స్వాతంత్రోద్యమం గురించి, స్వాతంత్ర సమరయోధుల గురించి భావోద్వేగంతో తమకు తెలిసిన విషయాలు పంచుకున్నారు. ఇవన్నీ చాలా సంతోషాన్నిచ్చాయి.

ఇంతకాలం తర్వాత ఇప్పుడు ఈ పరిశోధన వల్ల ఏం ఉపయోగం అని కొందరు నిరాశగా మాట్లాడారు. కొందరు విసుక్కున్నారు కూడా. ఒకాయన చాలా కోపంగా మాట్లాడారు. అయినా ప్రశ్నాపత్రం ఆయన టేబుల్ మీద పెట్టి నమస్కరించి వచ్చేశాను. ఇంతలో కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి గారి 50వ వర్ధంతి సంచిక వస్తోందని, ఆ పని మీద హైదరాబాద్ వస్తున్నానని, ఆ సమాచారం నీకు ఉపయోగపడచ్చు వచ్చి కలవమంటూ పరకాల పట్టాభిరామరావు గారు రాసిన ఉత్తరం వచ్చింది. మఖ్దూమ్ భవన్‌కి వెళ్ళి ఆయన్ని కలిసి ఆయనిచ్చిన కాగితాలు చూస్తూ నాకు కావాల్సినవి రాసుకుంటున్నాను. ఒకటి రెండు సార్లు కలవటం ద్వారా, ఉత్తరాల ద్వారా ఆయనతో కొంచెం పరిచయం ఏర్పడింది. నా మౌనం గమనించి కాబోలు ఒక అరగంట తర్వాత ఆయన "ఏమైందమ్మా" అన్నారు. ఇంక అంతే ఏడుపు తన్నుకొచ్చేసింది. పేరు చెప్పకుండా ఆ స్వాతంత్ర సమరయోధుడు కోపంగా అన్న మాటలు చెప్పేశాను. కొంచెం సేపయాక "కృష్ణా, మీ తాతగారు నిన్ను ఏమైనా అన్నారనుకో, ఇలాగే మనసులో పెట్టుకు కూర్చుంటావా!" అన్నారు. "ఆయన పెద్దాయన. ఈ పాటికి మర్చిపోయి కూడా ఉంటారు. నువ్వు దాన్ని మనసులో పెట్టుకుని బాధపడుతూ కూర్చుంటే ఏం ప్రయోజనం? నువ్వు చక్కగా చెయ్యగలవు. నీ పని నువ్వు చెయ్యి. అయినా ఏదైనా పని నిర్వహిస్తున్నప్పుడు పూలు, రాళ్ళు కూడా పడతాయి. సిద్ధంగా ఉండాలి" అన్నారు. ఈ మాటలు ఆ తరవాత కూడా చాలాసార్లు నన్ను సవ్యంగా నడిపించాయి. ధైర్యాన్నిచ్చాయి. అందుకని ఈ మాటలు తప్పకుండా చెప్పాలనిపించి చెపుతున్నాను. పట్టాభిరామరావు గారు చెప్పినట్లే ఆ పెద్దాయన ఆ తర్వాత తన కోపం వదిలేసి, నన్ను కోప్పడినందుకు 'సారీ' చెపుతూ, తనకు తెలిసిన విషయాలతో పెద్ద ఉత్తరం రాశారు.

దొరికిన సమాచారాన్నంతా ఒక చోట చేర్చి చదువుతున్నపుడు ఈ అంశంపై నేను సరిగా రాయగలనా అనిపించింది. ఒక పక్కన గరిమెళ్ళ శతజయంతి సంబరాలకు తెలుగు యూనివర్సిటీ సన్నద్ధం అవుతున్న సందర్భంలో ఆయన రచనలపై విమర్శనాత్మక పరిశీలన చేస్తే ఆ విషయాన్ని సాహిత్యకారులు, స్వాతంత్ర సమరయోధులు ఎలా స్వీకరిస్తారో అని ఆందోళన పడ్డాను. అప్పుడు నా పరిశోధనా పర్యవేక్షకులైన ప్రొఫెసర్ వి. రామచంద్ర గారు "పంట చేతికొచ్చినప్పుడు గింజ, తాలు రెండూ ఉంటాయి. వాటిని విడదీసి చూసి ఉపయోగిస్తాం. దేని విలువ దానిదే. ఇదీ అంతే. ముందు నువ్వు రాసే పని చూడు" అంటూ ధైర్యం చెప్పారు. ఆ మాటలు గుర్తు వచ్చినపుడల్లా 'ఎంత simple గా చెప్పేశారో' అని ఆశ్చర్యం వేస్తుంది. ఆ విషయంలో ప్రొఫెసర్ చల్లా రాధాకృష్ణ శర్మ గారు కూడా ధైర్యం చెప్పారు. వాళ్ళు ఇచ్చిన ప్రోత్సాహం వల్లే నేను సకాలంలో పరిశోధన ముగించగలిగాను. ఎం.ఫిల్ డిగ్రీ చేతికొచ్చింది.

ఆ తరవాత 1993 లో దాన్ని పుస్తకంగా తీసుకొస్తున్నపుడు ముందుమాట రాయమని కె. వి. ఆర్. ని అడగాలనుకున్నాను. అప్పటికే ఆయన సాహిత్యవిమర్శనా రంగంలో ప్రసిద్ధులు. ఈ చిన్న పుస్తకానికి ముందుమాట రాయటానికి ఒప్పుకుంటారో ఒప్పుకోరో, తీరిక ఉంటుందో లేదో! అని భయపడ్డాను. అయితే గరిమెళ్ళ గారి మీద ఉన్న ప్రేమకొద్దీ రాస్తారేమో అని ఒక ఆశ. నా ఆశ వమ్ము కాలేదు.

నేను పుస్తకాన్ని తీసుకొచ్చాను కానీ, నా పుస్తకానికి ఆవిష్కరణ సభ పెట్టలేదు. గరిమెళ్ళ సత్యనారాయణ సాహిత్యం మీద పరిశోధన జరిగిందని, అది పుస్తకంగా ప్రచురించబడిందని తెలుసుకుని రాజమండ్రిలోని స్వాతంత్ర సమరయోధులు ఆ పుస్తకాన్ని రాజమండ్రిలో ఆవిష్కరిస్తామని అడిగారు. 18-12-1995 న గరిమెళ్ళ సత్యనారాయణ గారి వర్ధంతి సందర్భంగా అక్కడి గవర్నమెంట్ హైస్కూల్‌లో సభ పెట్టారు. సభకి ముందు ఆయన ఫోటో పట్టుకుని రాజమండ్రి వీధులలో ఊరేగింపు తీశారు. నా పుస్తకాన్ని ఆ సభలో చల్లా రాధాకృష్ణ శర్మ గారు ఆవిష్కరించారు. ఆ సభలో వావిలాల గోపాలకృష్ణయ్య గారు ఆ హైస్కూల్‌కి గరిమెళ్ళ సత్యనారాయణ పేరు పెట్టాలని ప్రతిపాదించారు. తర్వాతి కాలంలో ప్రభుత్వ విద్యా శాఖ దానిని అంగీకరించి ఆ హైస్కూల్‌కి ఆయన పేరు పెట్టింది. తెలుగు యూనివర్సిటీ గరిమెళ్ళ శతజయంతి ఉత్సవాలను ఘనంగా జరిపింది. ఆయన రాసిన కొన్ని వ్యాసాలను ప్రచురించి ఆ ఉత్సవాలలో ఆవిష్కరించారు కూడా. ఆయన గేయాలను పరకాల పట్టాభిరామరావు గారి సంపాదకత్వంలో విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారు ప్రచురించారు. జాతీయోద్యమ సాహిత్యం - గరిమెళ్ళ (1996), గరిమెళ్ళ

సాహిత్యం–జాతీయోద్యమం (2003) అనే పేర్లతో గరిమెళ్ళ రచనలను కె. ముత్యం సంపాకత్వంలో దృష్టి, హైదరాబాద్, గరిమెళ్ళ శతజయంతి ఉత్సవాల సారధ్య సంఘం, శ్రీకాకుళం సంస్థలు ప్రచురించాయి. కొన్నేళ్ళ క్రితం ఉస్మానియా యూనివర్సిటీ తన తెలుగు డిగ్రీ సిలబస్‌లో 'మాకొద్దీ తెల్లదొరతనం' పాఠం చేర్చారు. డిసెంబర్, 2019 లో గరిమెళ్ళ విజ్ఞాన కేంద్రం, శ్రీకాకుళం వారు మరి కొన్ని వ్యాసాలను వ్యాఖ్యానాలతో సహా ప్రచురించారు. శ్రీకాకుళంలో గరిమెళ్ళ విగ్రహాన్ని కూడా ప్రతిష్ఠించారు.

ఇవన్నీ జరగాలని 1952 లోనే టేకుమళ్ళ కామేశ్వరరావు గారి వంటి ఆయన సమకాలికులు, ఇతర స్వాతంత్ర సమరయోధులు, పరకాల పట్టాభిరామరావు, మహీధర రామమోహన రావు గారి వంటి సాహిత్యజీవులు కోరుకున్నారు. ఆలస్యంగా నయినా అవి చాలా మటుకు జరిగాయి. అందులో నాకు కూడా కొంచెం భాగం ఉన్నందుకు సంతోషంగా ఉంది.

పుస్తకం తీసుకురావడమైతే తీసుకొచ్చాను కాని ఆ పనిలో అనుభవం లేక ప్రూఫులు సరిగా చూసుకోలేకపోయాను. చాలా అచ్చుతప్పులు వచ్చాయి. చాలా బాధ పడ్డాను. పరిశోధనా పుస్తకాలు పెద్దగా ఎవరూ కొనరు. అందుకని చాలా కాపీలు ఉండిపోయాయి. అచ్చుతప్పులకు క్షమించమని కోరుతూ ఆ కాపీలను లైబ్రరీలకు ఉచితంగా పంపేశాను. కొందరికైనా అందుబాటులో ఉంచగలిగానని చాలా సంతోషించాను.

రిటైర్ అయ్యాక కాస్త తీరికగా ఆ పుస్తకం చదువుతోంటే ఇన్ని అచ్చుతప్పులతో లైబ్రరీలకు ఇచ్చానా అని బాధేసింది. ఏం చేయాలో తోచలేదు. మళ్ళీ ప్రింట్ చేయటం, మార్కెటింగ్ నా వల్ల కాదు అనిపించింది. అలాంటి సమయంలో "E-Book గా తీసుకొచ్చెయ్యి" అని స్నేహితురాలు వేమన వసంతలక్ష్మి సలహా ఇచ్చింది. అలా మళ్ళీ మీ ముందుకు వస్తోంది ఈ పుస్తకం.

చాలా చాలా థాంక్స్ వసంత.

బొమ్మకంటి కృష్ణకుమారి
ఏప్రిల్, 2021

కృతజ్ఞతలు

ఈ పరిశోధన చేయటానికి అవకాశం కలిగించిన మద్రాసు విశ్వవిద్యాలయ అధికారులకు –

నా ఆసక్తిని, అభిరుచిని గమనించి గరిమెళ్ళ సాహిత్యంపై పరిశోధనకు అంగీకరించి, ప్రోత్సహించి, పర్యవేక్షించిన తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య డా. వి. రామచంద్ర గారికి –

అమూల్యమైన సలహాలిచ్చిన డా. ఎస్. అక్కిరెడ్డి, డా. జి.వి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి, డా. ఎస్. శమంతకమణి గార్లకు –

పరిశోధనాంశాన్ని సూచించిన మిత్రుడు కె. శ్రీనివాస్‌కి –

నా చదువుకు సెలవు మంజూరు చేసిన డైరెక్టర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్ గారికి –

డైరెక్టర్ ఆఫ్ స్టేట్ ఆర్కైవ్స్, హైదరాబాద్, మద్రాస్ కార్యాలయాల అధికారులకు, కన్నెమరా లైబ్రరీ, మద్రాసు; అమరజీవి పొట్టి శ్రీరాములు గ్రంథాలయం, మద్రాసు; సారస్వతనికేతనం, వేటపాలెం; గౌతమీ గ్రంథాలయం, రాజమండ్రి; గంగిరెడ్డి గ్రంథాలయం, అనపర్తి; ఆంధ్ర సాహిత్యపరిషత్ ప్రభుత్వ ప్రదర్శనశాల మరియు పరిశోధనా కేంద్రం, కాకినాడ; ఠాగోర్ గ్రంథాలయం, విజయవాడ అధికారులందరికీ–

తొంభై ఏళ్ళు పైబడిన వయసులో నాకు ఇంటర్వ్యూ ఇచ్చి గరిమెళ్ళ గురించి ఎన్నో విషయాలు తెలియచేసిన శ్రీ పుల్లెల సీతారామయ్య గారికి –

ఆ ఇంటర్వ్యూ ఏర్పాటు చేసిన శ్రీ గరిమెళ్ళ రామ్మూర్తి గారికి –

తమ లైబ్రరీని 'సొంతం'లా వాడుకోనిచ్చి ఆదరించిన కాకరాల గారికి, కాంతి గారికి –

తన అమూల్యమైన కాలాన్ని నా కోసం కేటాయించి నా భావానికి రూపం ఇచ్చిన శ్రీ బాపు గారికి –

ఇంకా ఆచార్య డా. చల్లా రాధాకృష్ణశర్మ, జయధీర్ తిరుమలరావు గార్లకు–

వావిలాల గోపాలకృష్ణయ్యగారు, పరకాల పట్టాభి రామారావుగారు, కాళోజి నారాయణరావుగారు మరియు చాలా మంది స్వాతంత్ర్య సమరయోధులకు –

చాలా పనుల ఒత్తిడులలో ఉండి కూడా ఈ పుస్తకాన్ని చదివి తన అభిప్రాయాలను వెల్లడించి నన్ను అభినందించిన కె. వి. ఆర్ (కె. వి. రమణారెడ్డి) గారికి –

పుస్తక ప్రచురణకి ఆర్థిక సహాయాన్ని అందించిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్ వారికి –

పరిశోధన ప్రారంభించినది మొదలు పుస్తక రూపాన్ని సంతరించుకునే వరకు రకరకాల సహాయాలు చేసిన అనేకానేక మంది మిత్రులకు –

ముఖ్యంగా తమ స్నేహ వీచికలు, చిరుజల్లులతో నా అజ్ఞానాన్ని పోగొట్టి నా అభివృద్ధికి ప్రత్యక్షంగా పరోక్షంగా పాటుపడుతూ దాన్ని చూసి ముచ్చటపడే స్నేహితులు కె.ఎన్. చారి, వసంతలక్ష్మిలకు –

ప్రగతిశీల గ్రంథాలను కేవలం వ్యాపారంగా కాక ఒక వ్యసనంగా అచ్చువేసి ఆప్యాయతని కురిపించే నాగేంద్ర ప్రెస్ బాబూరావు గారికీ, ఆయన సిబ్బందికీ –

కృతజ్ఞతలు, కృతజ్ఞతాభివందనాలు.

* * *

ముందుమాట

ఎం.ఫిల్. పరిశోధనకు ఏ అంశాన్ని ఎన్నుకోవాలి? అని మిత్రులతో చర్చిస్తున్నప్పుడు కె. శ్రీనివాస్ గరిమెళ్ళ సాహిత్యంపై పరిశోధన చేయమని సూచించాడు. 'అరుణోదయం' నవలలో కొడవటిగంటి కుటుంబరావు ఒక పాత్ర చేత "నా దృష్టిలో సాహిత్యమంటే మాకొద్దీ తెల్లదొరతనం" అనిపించారు. నాకు వెంటనే ఆ మాట గుర్తు వచ్చింది.

గరిమెళ్ళ సత్యనారాయణ గురించి తెలుసుకునే క్రమంలో కె.వి. రమణారెడ్డి రాసిన 'వాల్మీకిధార' చదివాను. అది చదివాక గరిమెళ్ళ జీవితం, సాహిత్యం తెలుసుకోవలసినవి అనిపించాయి.

మద్రాసు విశ్వవిద్యాలయంలో ఎం.ఫిల్. పరిశోధనకు సీటు వచ్చాక, నా ఆసక్తిని అభిలాషను గమనించి తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య డా. వి. రామచంద్ర ఆ అంశంపై పరిశోధనకు అంగీకరించి, ప్రోత్సహించారు.

తరువాత చల్లా రాధాకృష్ణ శర్మ గారు రాసిన 'గరిమెళ్ళ సాహిత్యం' అనే పుస్తకం గరిమెళ్ళ జీవితరేఖల గురించి తెలుసుకోవటానికి ఉపకరించింది. ఆ తరువాత రచనల కోసం ఆర్కైవ్స్ కార్యాలయాలు, గ్రంథాలయాలు తిరిగాను. గరిమెళ్ళ గురించిన జ్ఞాపకాల సమీకరణ కోసం కొందరు స్వాతంత్ర్య సమరయోధులను కలిశాను. ఆ రకంగా నేను సేకరించిన గరిమెళ్ళ రచనలు డెబ్బై (70).

ఆయన రచనలు చదువుతోంటే వాటిలోని భాష, సున్నితమైన హాస్యం, కారుణ్యం, వ్యాసాలు రాసిన విధానం, వాటిలోని విషయాలు మొదలైనవన్నీ చెపుతూ పరిశోధన చేయవచ్చనిపించింది. కానీ, అది ఎం.ఫిల్. పరిశోధనా పరిధి దాటిపోతుంది.

'మాకొద్దీ తెల్లదొరతనం' గేయంలో కళాసౌష్టవం లేదన్న వారితో "ఆ గేయం విని అనేక లక్షల మంది చైతన్యవంతులు అయ్యారు. అందులో కళాసౌష్టవం లోపించిందని వారికి తట్టనేలేదు" అనిపిస్తారు కొడవటిగంటి కుటుంబరావు అదే 'అరుణోదయం' లో.

ఈ సమాధానం మళ్ళీ నన్ను ఆలోచనలో పడేసింది. లక్షలాది మందిని చైతన్యవంతులను చేసిన సాహిత్యం గురించి నేను ఏ విధంగా పరిశోధన చెయ్యాలి? ఆ సాహిత్యంలో ఉన్న కళాసౌష్టవానికి ప్రాధాన్యత నివ్వటం ఎంత తెలివితక్కువ పనో కొడవటిగంటి కుటుంబరావు చెప్పనే చెప్పారు. కొందరేమో గరిమెళ్ళ సాహిత్యం ప్రచార సాహిత్యం అన్నారు. ఇది కూడా నన్ను ఆలోచింపచేసింది. అది ప్రచారమే. కానీ, ఆ ప్రచారం మంచివైపుకా చెడువైపుకా? దేన్ని ప్రచారం చేశారు? ఎలా ప్రచారం చేశారు? ఎందుకు ప్రచారం చేశారు? అనే ప్రశ్నలు తలెత్తాయి. వీటికి సమాధానాలు వెతుకుతూ పరిశోధన చేయాలని భావించాను.

ఏ సాహిత్యానికి అయినా ముఖ్యంగా ఉండేది సామాజిక నేపథ్యం. అందువల్ల గరిమెళ్ళ రచనాకాలం నాటి దేశ పరిస్థితులను మొదటి అధ్యాయంలో వివరించాను.

ఆయా పరిస్థితుల్లో ఉద్యమాలు ఉధృతంగా ఉన్నప్పుడు రాసినవి పాటలు. ఆ పాటల ద్వారా ఆయన శ్రోతలు ఎవరు, ఎవరెవర్ని చైతన్యవంతుల్ని చేయాలనుకున్నారు, ఆ పాటలలో ఏం చెప్పారనేదాన్ని రెండవ అధ్యాయంలో చర్చించాను.

ఉద్యమాలు సద్దుమణిగినప్పుడు రాసినవి వ్యాసాలు. వీటిలో గరిమెళ్ళకు పలు విషయాల పట్ల ఉన్న అభిప్రాయాలను పరిశీలించాను. ఈ వ్యాసాలు సంపుటంగా లేవు. అక్కడక్కడ పత్రికలలో లభిస్తున్నాయి. ఆయన అభిప్రాయాలు కాస్త వివరంగా తెలియజేయడం కోసం వ్యాసగత విషయాలతో సహా మూడవ అధ్యాయంలో వివరించాను.

గరిమెళ్ళ రచనలలో ఎక్కువ భాగం రాజకీయాలకు సంబంధించినవి. అందువల్ల ఆయన సాహిత్యం ఆధారంగా ఆయన రాజకీయ అవగాహనను తెలుసుకోవటానికి నాలుగవ అధ్యాయంలో ప్రయత్నించాను.

లక్షలాది మందిని చైతన్యవంతుల్ని చేసిన ఈ కవి జీవితం ఎలా గడిచిందో ఐదవ అధ్యాయంలో వివరించాను.

గరిమెళ్ళ అనువాద రచనలు కూడా చేశారు. కానీ, నా ఎం.ఫిల్. సిద్ధాంత వ్యాసానికున్న పరిమితుల వల్ల వాటిని నా పరిశోధనా పరిధిలోకి తీసుకోలేదు. ఆయన స్వతంత్ర రచనలను మాత్రమే పరిశీలించాను.

అనుబంధంలో గరిమెళ్ళ పాటలు కొన్ని, ఆయన 'స్వరాజ్య గీతాల' కేసుకు సంబంధించిన వివరాలు కొన్ని ఇచ్చాను.

ఈ మధ్యనే కె. ముత్యం గారి ద్వారా అందిన ఒక గరిమెళ్ళ వ్యాసం, ఆ వ్యాసం గురించిన నా అభిప్రాయాన్ని కూడా ఇప్పుడు (e-book లో) అనుబంధంలో చేర్చాను.

❋ ❋ ❋

రాజకీయ రచయిత

గరిమెళ్ళ సాహిత్యం గురించి బి. కృష్ణకుమారి విమర్శనాత్మక పరిశీలన చేసి మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఫిల్. పట్టా పొందారు. ఏదో పది పుస్తకాలు తిరగేసి మూల రచనల ఊసు ఎత్తకుండా చేసిన ఆషామాషీ పరిశోధన కాదిది. పేరు మాత్రమే తెలిసి అసలు దినుసు అయిపు లేకుండా పోయిన పత్రికలను వెదికి పట్టుకుని గరిమెళ్ళ రచనలను సేకరించి వాటి సారాన్ని తేల్చడం అలివి మాలిన కృషి. దీనికి రచయిత్రిని అభినందించక తప్పదు.

గరిమెళ్ళ సత్యనారాయణ భావావేశపరుడుగా కవిత్వాన్ని పుంఖానుపుంఖాలుగా వెలయించాడు. ఆలోచనాపరుడుగా వ్యాసాలు ఎన్నో రచించాడు. స్వయంగా సత్యాగ్రహం చేయకపోయినా "మాకొద్దీ తెల్లదొరతనము" పాట రచయితగా జైలుకు వెళ్ళి వచ్చాడు. అటు తర్వాత కొంతకాలానికి వార్ధా ఆశ్రమంలో గాంధీ మెప్పును చూరగొన్నాడు కూడా. ఆబాలగోపాలం నాలుకల మీద చిందులు వేసిన ఈ గొప్ప పాట వల్లనే గరిమెళ్ళ కీర్తి ఈ నాటికీ నిలిచి ఉంది. మరొకనాటికీ నిలిచి ఉంటుంది. ఇంచుమించు దీనితో తులతూగే పాటలు తన కలం నుంచి వెలువడ్డాయి. రైతాంగ ఉద్యమ విజృంభణ సందర్భంగా మరొక మంచి గేయం వచ్చింది. అయితే ప్రధానంగా తాను సహాయ నిరాకరణ ఉద్యమ సంరంభకాలంలోనే కవిగా ప్రసిద్ధి పొందాడు. శాసనోల్లంఘన ఉద్యమంగాని, క్విట్ ఇండియా ఉద్యమంగాని గరిమెళ్ళను ఒక ఊపు ఊపిన సాహిత్య దాఖలాలు లేవు. సహాయ నిరాకరణోద్యమం చల్లారిన దరిమిలా కాంగ్రెసులోనే ఒక వర్గం 'స్వరాజ్య' పార్టీగా శాసనసభా ప్రవేశాన్ని కోరినపుడు కౌన్సిల్ రాజకీయాల్ని నిరసిస్తూ, 'నోఛేంజర్' వైఖరిని అవలంబించాడు.

కరాన ద్రవ్యము జల్లి
కౌన్సిల్ లోపాల దూరయ్యా

ఖరాల్ ఖరాలున ప్రశ్నలు వేస్తూ
కంగాళీకి దిగవయ్యా

"ప్రభువు గాంధీ" లో ధర్మదేవత సాక్షాత్కారం దర్శించిన కవి, గాంధీ నిర్మాణ కార్యక్రమంలోని ప్రతి ముఖ్య అంశం – హరిజనులు, మద్యనిషేధం, రాట్నపరిశ్రమ – గురించే గేయాలు రాశాడంటే ఆశ్చర్యమేమీ కాదు. అలాంటిది 1937 లో కాంగ్రెస్ మొత్తంగానే శాసనసభా ప్రవేశానికి అంకితం అయిపోవడం తనకు బాధాకరమే అయి ఉంటుంది. దానితో గేయ ప్రవాహం ఆగిపోయింది. వ్యాస సంపద మొదలయింది.

జాతీయోద్యమంలో తిలక్ యుగ ప్రభావం గాఢంగా తన మీద పడిందేమో, పోను పోను గరిమెళ్ళ హైందవ మతతత్వాన్ని బయల్పరుస్తూ వ్యాసాలు రాశాడు. ముస్లిములీగు మీద సరే, ముస్లిములందరి మీద అమిత్ర భావం పెంచుకున్నాడు. "ముష్కర ముస్లిములు" అని నిర్విచక్షణగా దూషించే దాకా వెళ్ళాడు. దేశవిభజన తనను బాగా నొవ్వించింది. ఇండియాను "డినియా"గా మార్చే దుష్ట సంకల్పం ముస్లిములీగుకు కలిగిందని అనుమానాన్ని పెనుభూతం చేసుకున్నాడు. కృష్ణకుమారి పరిశోధనలో బయల్పడిన అంశాలలో ఇది ఒకానొకటి.

స్వాతంత్ర్యం అనేది ప్రాప్తించాక గాంధీ లాగే కాంగ్రెస్ 'లోక సేవక్ సమాజ్' కావాలని తానూ అనుకున్నాడుగాని, రాజ్యాధికారం రుచి మరిగిన కాంగ్రెస్ నాయకులు దీనిని పట్టించుకోలేదు. జాతీయోద్యమ సంస్థగా ఉండిన కాంగ్రెస్ అధికార పార్టీ అయి కూచుంది. ప్రజాతంత్రం నేతిబీరకాయలోని నెయ్యి అయిందని బాధపడ్డాడు. "గుజరాతీ మార్వాడీ ధనాధిష్టిత విజృంభణ"కు అది మేలిముసుగుగా మారింది. పదవుల కోసం కుమ్ములాటలో కాంగ్రెసువాళ్ళు "శాఖామృగజీవులుగా మారారు. ధనాశాతత్వం పెచ్చుపెరిగింది. ఓట్లు తస్కరించి లాభాలు దేవుకునే వేషాలరాయుళ్ళు దేశాన్ని ఏలుతున్నారు. గాంధీ అహింసా మార్గం వల్లనే ఈ నాయకత్వం పడిపోదు. ఎవరో ఒక మహా వీరుడు ఒక్క కలంపోటుతో దీన్నంతా రద్దు చెయ్యాలి"ట. "మహా నిస్వార్థియగు త్యాగపురుషుడు" అవతరించాలట. ఇలాంటి వెర్రి గరిమెళ్ళను ఆవహించింది.

అర్థశాస్త్రం కావలసిందల్లా 'అనర్థశాస్త్రం' అయిందని బాధపడతాడు. యంత్రపరిశ్రమ ఫలితమైన ఉత్పత్తి పెరుగుదలతో పాటు మార్కెట్ల కోసం పోటీ వల్ల

యుద్ధాలు సంభావిస్తున్నాయన్న సత్యాన్ని తాను సరిగానే గ్రహించాడు. వ్యాపారంలో అరాచకం వ్యాపించింది. ధరలు పెరిగిపోతున్నై. ఆందోళన పంథా పట్టిన ప్రజల మీద ప్రభుత్వం విరుచుకు పడుతోందని అణచివేతను నిరసించాడు. దేశానుగుణమైన కమ్యూనిజం ఏర్పడాలన్నాడు. అందరికీ నిత్యావసరాలు తీరాక, మిగులు ధనాన్ని దేశాభ్యుదయానికి వ్యయం చేయడం అవసరమన్నాడు. అయితే ప్రైవేట్ ఆస్తిని ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నప్పుడు నష్టపరిహారం చెల్లించాలన్నాడు. కమ్యూనిజమైతే అన్నీ తానే సర్వస్వమూ అయి, ప్రజలను అబాధ్యులుగా చేస్తుంది కాబట్టి, మన దేశానికి కావలసింది సోషలిజమేగాని, కమ్యూనిజం కాదని మరొక చోట అంటాడు. ఎందుకంటే, సోషలిజంలో తక్కువ పరిపాలన ఉండి ప్రజల చొరవకు ఇతోధిక అవకాశాలు ఉంటాయట.

రైతాంగ ఉద్యమాన్ని గేయాలలో సమర్థించిన కవే జమీందారీ, ఇనాందారీ రద్దును విమర్శిస్తాడు. సాహిత్యాది కళాపోషణ చేశాయి కాబట్టి జమీందారీ, ఎస్టేటులను రద్దు చేయటం తగదంటాడు. ఆనాటి మద్రాసు ప్రభుత్వం చేసిన జమీందారీ రద్దు చట్టం జాతీయ సంప్రదాయ విరుద్ధం అంటాడు. మరోవైపున ఎస్టేట్లలో సమష్టి వ్యవసాయం, పోనీ సహకార వ్యవసాయం అమలుపరచాలి అంటాడు. వ్యాపార పంటలను తగ్గించి ఆహార పంటలకు ప్రాముఖ్యం కల్పించాలి అంటాడు.

భాషాప్రయుక్త రాష్ట్ర నిర్మాణం విషయంలో కూడా గరిమెళ్ళది ద్వంద్వాత్మక వైఖరే. బస్తరు వగైరా ప్రాంతాలు ఆంధ్రరాష్ట్రంలో చేరాలట. కొన్ని రాష్ట్రాలు అయితే 'బహుభాషాప్రయుక్తాలు' అవాలట.

ఈ పరిశోధనావ్యాసంలో ఇలాంటి అంశాలెన్నో ప్రస్తావనకు వచ్చాయి. సాధు విమర్శకు అగ్గమయ్యాయి. కాబట్టి, ఇది వీరారాధనకు పూనుకోదు. గరిమెళ్ళ ఆలోచనలలోని వెలుగునీ నీడనీ బయల్పరుస్తుంది. రాజకీయ, సాంఘిక, సాహిత్య పరిస్థితుల నేపథ్యంలో గరిమెళ్ళ సాహిత్యాన్ని పరిశీలిస్తుంది. సాహిత్య పరిశీలనతో సరిపెట్టుకోకుండా, రాజకీయ పరిజ్ఞానాన్ని విమర్శిస్తుంది. ఇలా ఒక మంచి పరిశోధనా ప్రయత్నం తృప్తికరంగా సాగించిన కృష్ణకుమారిని అభినందిస్తున్నాను.

కె. వి. ఆర్.

(కె. వి. రమణారెడ్డి)

విషయ సూచిక

అధ్యాయము - 1

దేశ పరిస్థితులు

శ్రీ గరిమెళ్ళ సత్యనారాయణ క్రీ. శ. 1893 నుంచి 1952 వరకు జీవించారు. ఇంచుమించు 1910 నుంచి 1952 వరకు రచనలు చేశారు. ఆయన రచనలను అర్థం చేసుకోవటానికి వాటికి నేపథ్యాన్ని ఇచ్చిన దేశపరిస్థితులు తెలుసుకోవటం చాలా ఉపకరిస్తుంది. అందువల్ల గరిమెళ్ళ పుట్టుకకు ఎనిమిది తొమ్మిది సంవత్సరాల ముందు నుంచి అంటే కాంగ్రెస్ ఆవిర్భవించిన సంవత్సరం నుంచి ఆయన చనిపోయే వరకు గల దేశపరిస్థితులను ఈ అధ్యాయంలో వివరిస్తాను. రచనా సౌలభ్యం కోసం వాటిని రాజకీయ పరిస్థితులు, సాంఘిక పరిస్థితులు, సారస్వత పరిస్థితులుగా విభజించాను.

1.1 రాజకీయ పరిస్థితులు

1857 లో జరిగిన ప్రథమ భారత స్వాతంత్ర్య పోరాటాన్ని ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రభుత్వం క్రూరంగా అణిచేసింది. మరుసటి సంవత్సరమే 1858 లో భారతదేశం కంపెనీ పరిపాలన నుండి బ్రిటిషు రాజరిక పరిపాలనలోకి మారింది.

ఈ పోరాటానికి మధ్యతరగతి మేధావుల అండదండలు లభించలేదు. వారు బ్రిటిషు పాలకుల, బ్రిటిషు ప్రజల సహాయంతో భారతదేశాన్ని స్వతంత్ర ప్రజాస్వామిక దేశంగా మార్చాలని ఆశించారు. మొగల్ చక్రవర్తిని తిరుగుబాటుకు ప్రతినిధిగా నిలిపి ఫ్యూడల్ ప్రభుత్వాలను, ఫ్యూడల్ సమాజాన్ని తిరిగి నెలకొల్పటానికి వారు అంగీకరించలేదు. బ్రిటిషు వారు తమ దేశంలో సాధించిన ప్రగతిని భారతదేశంలో కూడా సాధించాలని ఆశించారు. కాని రాణి పరిపాలనలోకి వచ్చాక వీరి ఆశలు నెరవేరే పరిస్థితి ఏమీ వారికి కనిపించలేదు. ఉన్నతాధికారుల విషయంలో తమ పట్ల

బ్రిటిషువారు వర్తించిన తీరు భారతీయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసింది. ఇండియన్ సివిల్ సర్వీస్ పరీక్షలలో ప్రథమ స్థానం పొందిన బెంగాలీ యువకుడైన సురేంద్రనాథ బెనర్జీని ఏవేవో సాకులతో ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ సంఘటన బెంగాల్లోనే కాక భారతదేశమంతటా విద్యావంతులలో అసంతృప్తి కలిగించింది. ఈ వివక్షను భారతీయుల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధానంగా పరిగణించి భారతీయుల హక్కులను కాపాడుకోవటానికి ఆందోళన ప్రారంభించాలనే ఆలోచన చేశారు. ఈ విషయంలో ప్రజాభిప్రాయాన్ని సేకరించటంలోను, ప్రతిఫలించటంలోను పత్రికలు అపూర్వమైన కృషి చేశాయి. పత్రికలు నిర్వహించిన పాత్రను గుర్తించిన ప్రభుత్వం దేశీయ పత్రికలను అదుపు చేయటానికి ఒక చట్టాన్ని తెచ్చింది. దీని వల్ల భారతీయులు సాధించుకోవలసిన హక్కుల సంఖ్య పెరిగింది. ఆ తరువాత 1878 లో కరువుకాటకాలు వచ్చాయి. అటువంటి సమయంలో కూడా విక్టోరియరాణి పరిపాలనా రజతోత్సవాలను మహావైభవంగా జరుపుకోవటం దేశీయులలో ఆలోచనను రేకెత్తించింది. భారతీయులకు తోడుగా భారతదేశంలో ఉన్న ఆంగ్లేయులు కొందరు భారతీయుల హక్కులను బలపరుస్తూ తమ తమ పద్ధతుల్లో మద్దతు ప్రకటించారు. పై విషయాలకు సంబంధించి కలకత్తాకు చెందిన బ్రిటిష్ ఇండియా అసోసియేషన్, పూనాకు చెందిన సార్వజనికసభ, మద్రాసు మహాజనసభ ప్రజలను చైతన్యవంతుల్ని చేయటానికి కృషి చేశాయి. వీటన్నింటినీ సమైక్యపరచి ఒక జాతీయ మహాసభ ఏర్పాటు చేయవలసిన అవసరాన్ని నాయకులు గుర్తించారు. దీని ఫలితంగానే 1885 లో జాతీయ కాంగ్రెస్ ఆవిర్భవించింది.

జాతీయ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జాతీయవాదులు తమ కోర్కెల సాధన కోసం ఆందోళనను మొదట ప్రార్థనాపూర్వక వినతిపత్రాలతోనే ప్రారంభించారు. తర్వాత తర్వాత సామాన్య ప్రజల పట్ల పోలీసుల నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా ఆందోళన చేశారు. భారతదేశంలో విద్యా, వైద్య, ఆరోగ్య సౌకర్యాలను కలిగించాలనీ, సాంకేతికాభివృద్ధికై ప్రభుత్వం పాటుపడాలనీ కోరారు. జాతీయవాద పత్రికలు పై విషయాలను ప్రచారం చేస్తూ బ్రిటిషు ప్రభుత్వ విధానాలను నిశితంగా విమర్శించేవి. ఈ పరిణామాలను ఊహించని బ్రిటిషు ప్రభుత్వం వార్తాపత్రికలను అదుపు చేయాలని ప్రయత్నించింది. జాతీయవాదులు ఈ చర్యను తీవ్రంగా ప్రతిఘటించారు. ఫలితంగా బాలగంగాధర తిలక్‌కి 18 నెలల పాటు కఠిన కారాగారవాస శిక్ష విధించారు. ఈ సందర్భంగా దేశమంతటా నిరసన సభలు జరిగాయి. పెరుగుతున్న ప్రతిష్టను, ప్రజలలో

వస్తున్న రాజకీయ చైతన్యాన్ని గమనించిన బ్రిటిషు ప్రభుత్వం తన 'విభజించి పాలించు' పద్ధతిలో 1905లో బెంగాల్‌ను విభజించి హిందూ-ముస్లిముల మధ్య విభేదాలను తీవ్రతరం చేసింది. హిందూ-ముస్లిములను విడదీయటమే కాకుండా సమైక్య బెంగాల్లో నడుస్తున్న ఉద్యమాన్ని అణిచివేయటానికి దీన్ని ఒక సాధనంగా ఉపయోగించింది. దీన్ని వివరిస్తూ రాంగోపాల్ తన అభిప్రాయాన్ని ఈ విధంగా వ్యక్తం చేశారు.

Curzon's Partition Scheme was as earnestly disapproved of in official and un-official quarters in London as it was in India, but the mounting nationalism, that was its consequence, suggested to the rulers that a political get-together of Hindus and Muslims must at all costs be prevented."[1]

బెంగాల్ విభజన బ్రిటిషువారి పరిపాలనా స్వభావానికి అద్దం పట్టింది. బెంగాల్ విభజనకు నిరసనగా బ్రిటిషు వస్తువులను బహిష్కరించాలని కాంగ్రెస్ తీర్మానించింది. బెంగాల్ ప్రజల కోపతాపాలను తన స్వదేశీ గీతాల ద్వారా రవీంద్రనాథ్ ఠాగూర్ వ్యక్తం చేశారు. బొంబాయి కాంగ్రెస్‌లో అతివాదుల, మితవాదుల అభిప్రాయ భేదాలు బయటికొచ్చాయి. ఈ సందర్భంలో స్వదేశీ, జాతీయ విద్యల మూల లక్ష్యం స్వరాజ్యసాధనేనని తిలక్ ప్రకటించారు. ఈ బహిష్కరణోద్యమానికి విద్యార్థులు, మహిళలు, రజకులు, పూజారులు, డాక్టర్లు, న్యాయవాదులు, వ్యాపారులు మొదలైన అనేకమంది నుండి తోడ్పాటు లభించింది.

ఈ ఉద్యమం బెంగాల్‌కు సంబంధించినది అయినప్పటికీ దానికి సానుభూతిగా ఇతర చోట్ల స్వదేశీ ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. ఆంధ్రలో గాడిచర్ల హరి సర్వోత్తమరావు గారి అధ్వర్యంలో బిపిన్ చంద్రపాల్ విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, మచిలీపట్నం మొదలగు పట్టణాలలో ఉపన్యాసాలిచ్చారు. మద్రాసు రాష్ట్రంలో ఈయన ఉపన్యాసాలకు ఉత్తేజితులైన చిదంబరం పిళ్ళై సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని ఉపన్యసించారు. అప్పటికే చిలకమర్తి లక్ష్మీనరసింహం, అయ్యదేవర కాళేశ్వరరావు, కొమర్రాజు లక్ష్మణరావు మొదలైనవారు జాతీయోద్యమంచే ప్రభావితులైనారు. రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలకు 'వందే మాతరం' బాడ్జీలను ధరించి వచ్చినందుకు హరి సర్వోత్తమరావు, రామచంద్రరావు మొదలైన 140 మందిని ఆ కళాశాల ప్రిన్సిపాల్ అయిన 'హంటర్' కళాశాల నుండి తొలగించారు. హరి సర్వోత్తమరావు విజయవాడలో 1907 లో 'స్వరాజ్య' అనే పత్రికను స్థాపించారు. ఆంధ్రలో ప్రజల నుంచి వచ్చిన

స్పందనను 'భారత స్వాతంత్ర్య సమరంలోని ఉజ్వల ఘట్టాలు(1858–1947)' అనే పుస్తకంలో ఈ క్రింది విధంగా రికార్డు చేశారు.

"1907 జూలైలో కాకినాడలో వందేమాతరం నినాదం చేసినందుకు కెంప్ అనే ఆంగ్లాధికారి కోపల్లె కృష్ణారావును బాగా కొట్టి పోలీసు స్టేషన్లో అప్పగించగా, ప్రజలు కోపోద్రిక్తులై కెంప్ విశ్రాంతి నిలయంపైన దాడి చేశారు. ఈ సందర్భంలో ఆరుగురు జైలుశిక్ష అనుభవించారు. 1909 లో కోటప్పకొండలో శివరాత్రి రోజున తిరుగుబాటు చేసి పోలీసు స్టేషన్‌కు నిప్పు పెట్టారు. ఈ సంఘటనలో ఇద్దరు పోలీసులతో సహా ఏడుగురు మరణించడం, తరువాత విచారణలో ఉన్న చిన్నప్పరెడ్డికి ఉరిశిక్ష విధించడం జరిగింది."[2]

ఈ సందర్భంలోనే బ్రిటిషువారిని పారదోలటానికి సాయుధపోరాటమే మార్గం అనుకున్నవారు కూడా ఉన్నారు. మహారాష్ట్రలో పూనా, బొంబాయి మొదలైన చోట్ల బాంబులు ఉత్పత్తి అయ్యేవి. కొంతమంది అధికార్లపై బాంబులు విసిరారు.

తమ పాలనకే ముప్పు వచ్చే విధంగా నడుస్తున్న ఉద్యమాన్ని ఆపటం కోసం తిలక్ కు ఆరేళ్ళ జైలుశిక్ష విధించి మాండలేకు పంపారు. పత్రికలను సెన్సార్ చేశారు. బహిరంగ సమావేశాలను నిషేధించారు. విప్లవ సంఘాలపై కేసులు పెట్టారు.

జాతీయతాభావాన్ని పెంచటం కోసం తిలక్ ఏర్పాటు చేసిన శివాజీ, గణపతి ఉత్సవాలు, కాళీ దేవత ముందు దౌర్జన్యవాదులు చేసిన ప్రమాణాలు, విభజన వ్యతిరేక ఉద్యమాలు జయప్రదం కావటం కోసం గంగాస్నానాలు చేయటం మొదలైన పనులు ముస్లిములలో హిందువుల పట్ల వ్యతిరేకభావాన్ని కలిగించాయి. అంతకుముందే బ్రిటిష ప్రభుత్వం ఉర్దూతో పాటు హిందీని కూడా అధికారభాషగా చేసింది. తమ భాషకు గల ప్రాముఖ్యం ఈ చర్య వల్ల తగ్గిందని భావించిన ముస్లింలు దీనిని వ్యతిరేకించారు. హిందువులు సమర్థిస్తూ సభలు జరిపారు. దీని వల్ల కూడా హిందూ ముస్లిం సంబంధాలలో కొంత మార్పు వచ్చింది. కర్జన్ తన విభజన పథకం వల్లనే కాకుండా తూర్పు బెంగాల్ వైపు ఉన్న ముస్లింలతో సంబంధాలు కొనసాగించటం మొదలైనవాటి ప్రభావం వల్ల అసంతృప్తి చెందిన ముస్లింలు 1906 లో అఖిలభారత ముస్లింలీగ్ ఏర్పాటు చేసికొన్నారు. వీరు బెంగాల్ విభజనను వ్యతిరేకించారు.

బెంగాల్ విభజనానంతరం యువతరం ఉత్తేజితమైంది. వారిలో కొందరు సాయుధంగా పోరాడటం కోసం రహస్య విప్లవ సంఘాలు స్థాపించారు. బెంగాల్లో మిత్రా అధ్యక్షతన ఏర్పడిన అనుశీలన సమితి వీటిలో మొదటిది. మొదట్లో దానిలో చిత్తరంజన్ దాస్ వంటి నాయకులు పాల్గొన్నారు. అనుశీలన సమితి శాఖలు మొత్తం బెంగాల్ అంతటా వ్యాపించాయి. ఈ సంస్థ పుస్తకాలు 'యుగాంతర్' మొదలైన పత్రికల ద్వారా ప్రజలలోకి వెళ్ళాయి. వారు బాంబులు మొదలైన ఆయుధాలను తయారు చెయ్యాలని కూడా తలపెట్టారు. 'వర్తమాన రత్ననీతి' అనే ఆధునిక యుద్ధ పద్ధతులను తెలియచేసే గ్రంథాన్ని, విదేశాల నుండి ఆయుధాలు పొందటం గురించి చెప్పే 'ముక్తికోన్ పథ్' అనే గ్రంథాన్ని వెలువరించారు. తమకు కావలసిన ధనాన్ని దోపిడీల ద్వారా సంపాదించేవారు. స్త్రీలను హింసించేవారు కాదు. తమ లక్ష్యాలతో యువకులను ఆకర్షించి వారికి ఆయుధాలు ప్రయోగించటంలో శిక్షణనిచ్చేవారు.

బ్రిటిష్ ప్రభుత్వాన్ని కూలదోయటానికి మొట్టమొదట విప్లవసంఘం స్థాపించిన వాసుదేవ బలవంత ఫడ్కే, తరవాత దామోదర్, బాలకృష్ణ ఛాపేకరులు విప్లవకారులుగా ప్రఖ్యాతిగాంచారు. మహారాష్ట్రలో నిరంకుశ వైఖరి నవలంబించిన ఆంగ్ల సైనికాధికారి రాండ్‌ను, అతని అనుచరుడైన అయేర్స్ట్ (Ayerst) ను చంపి ఉరికంబం ఎక్కారు. ఆ తరువాత సావర్కర్ సోదరులుగా పిలువబడే గణేష్, దామోదర్ సావర్కారులు అభినవ భారత సంఘం అనే విప్లవసంఘం స్థాపించారు. ఈ సంస్థకు చెందిన విప్లవకారులు పారిస్ వెళ్ళి బాంబులు తయారుచెయ్యటంలో తర్ఫీదు పొందారు. అభినవ భారత సంఘం మాత్రమే కాకుండా ఇంకొన్ని విప్లవసంఘాలు మహారాష్ట్రలో పనిచేశాయి. వాటిలో దామోదర్‌జోషి వర్గం, ఖార్వే వర్గం ముఖ్యమైనవి. గణేష్ సావర్కార్ పై రాజద్రోహం ఆరోపించి ద్వీపాంతరవాస శిక్ష వేసినపుడు ఖార్వే వర్గం ఆ శిక్ష విధించిన నాసిక్ జిల్లా కలెక్టర్ జాక్సన్‌ను కాల్చి చంపింది. ఇది నాసిక్ కేసుగా ప్రసిద్ధి చెందింది. 1906 లో లండన్ వెళ్ళిన వినాయక దామోదర సావర్కార్ 1857 తిరుగుబాటుపై 'ప్రథమ స్వాతంత్ర్య సమరం' అనే పుస్తకాన్ని ప్రచురించారు. ఈ పుస్తకాన్ని బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది. విప్లవ కార్యక్రమాలతో ఆకర్షితుడైన మదన్ లాల్ డింగ్రా సర్ కర్జన్ విల్లీ అనే ఆంగ్ల అధికారిని హత్య చేశాడు.

పంజాబ్, బీహార్, ఒరిస్సా, మద్రాస్ మొదలైన చోట్ల హర్షదయాళ్, అజిత్ సింగ్, అర్జునలాల్, రావుగోపాల్ సింగ్, వైద్యనాథ విశ్వాస్, ప్రభుదయాళ మార్వారీ,

చిదంబరం పిళ్ళై, సుబ్రమణ్య శివ మొదలైనవారి ఆధ్వర్యంలో విప్లవ కార్యక్రమాలు నడిచాయి. వీరంతా కూడా విప్లవ సాహిత్యాన్ని ప్రచురించి, ఆయుధాలను తయారు చెయ్యటంలోను, ఉపయోగించటంలోను శిక్షణనివ్వటం, ఆంగ్ల అధికారులను మట్టుపెట్టటం మొదలైనవి చేశారు.

లండన్‌లో శ్యాంజీ కృష్ణవర్మ ఆధ్వర్యంలో విప్లవ సంఘం స్థాపించారు. వినాయక దామోదర సావర్కర్ లండన్ పోయినపుడు ఈ సంఘంలో పని చేశాడు. మేడం కామా సర్దార్ సింగ్ రాణా అనే విప్లవకారునితో కలిసి అమెరికా, ఫ్రాన్స్ మొదలైన దేశాలలో భారతదేశంలో బ్రిటిష్ పాలన అంతం కావాలంటూ ప్రచారం చేశారు.

అమెరికాలో మేడం కామా, శ్యాంజీ కృష్ణవర్మల ప్రచారానికి ఉత్తేజితులైన తారానాథ దాస్ 1908 లో 'ఫ్రీ ఇండియా' అనే పత్రికను నడిపి ఉద్యమాన్ని ఉధృతం చేశారు. ఆ తరవాత 1912 లో గదర్ పార్టీ, గదర్ పత్రిక ఏర్పడ్డాయి. ఆంధ్రుడైన దర్శి చెంచయ్య ఈ పార్టీలో సభ్యుడిగా చేరారు.

మొదటి ప్రపంచ యుద్ధకాలంలో విప్లవకారులు భారత – జర్మనీ స్నేహసంఘాన్ని స్థాపించారు. ఈ సంఘం ద్వారా జర్మనీ సహాయం పొంది భారతదేశాన్ని బ్రిటిష్ పాలన నుండి విముక్తం చేయాలని పథకం వేశారు. కానీ, అది సఫలం కాలేదు.

మొత్తంగా ఈ విప్లవ సంఘాలను, విప్లవకారులను అర్థం చేసుకోవటానికి ఈ క్రింది వివరాలు ఉపకరిస్తాయి.

"ఎవరైనా ఒక వ్యక్తిని గాని కొందరు వ్యక్తులను గాని బెదిరించటం, అనవసరంగా కొట్టడం, హత్య చేయడం, బెదిరించి స్వంతానికి ఉపయోగించుకొనడం మొదలైన వాటిని దౌర్జన్యచర్యలుగా పేర్కొనవచ్చును. కానీ, విప్లవకారులు చేసిన దోపిడీలలో గాని హత్యలలో గాని స్వార్థం ఏ కోశాన లేదు."[3]

"విచారణ సమయంలో ఢింగ్రా 'తను హత్య చేసింది భారతీయులపై జరుగుతున్న దౌరన్యాన్ని' అని పలికిన పలుకులు చిరస్మరణీయమైనవి."[4]

"బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడటం సాధ్యమా? అన్న ప్రశ్నకు 'ఇనుప గొలుసు నా తల్లి గొంతును నులిమేస్తుంటే ఆ గొలుసు లాగివేస్తున్న నాకు, గొలుసు లాగివేయడం సాధ్యమా? కాదా? అన్న ఆలోచనకు తావెక్కడిది?' అని వీరు చెప్పిన జవాబు మరువరానిది."[5]

అనేక విధాలుగా జరిగిన ఈ పోరాటాల వల్ల 1911 లో బెంగాల్ విభజనను రద్దు చేసి బీహార్, ఒరిస్సాలను కలిపి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేశారు.

"స్వాతంత్ర్యపోరాట చరిత్రలో మొట్టమొదటిసారిగా ప్రజాందోళనా బలం ముందు ప్రభుత్వం తలొగ్గవలసి వచ్చింది. ఫలితంగా 'ఒక భాష మాట్లాడే ప్రజలందరికీ ఒకే రాష్ట్రం' అనే కొత్త సూత్రం కూడా ఆచరణలోకి వచ్చింది. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆ తర్వాతి రోజులలో ప్రసిద్ధి గాంచిన అనేక సంఘటనల పరంపరకు ఇదే ఆరంభం."[6]

బెంగాల్ విభజన రద్దు కావటంతో బ్రిటిష్ ప్రభుత్వం యొక్క 'విభజించి పాలించు' రాజనీతి ముస్లింలీగ్ నాయకులకు అవగాహన అయింది.

మొదటి ప్రపంచయుద్ధం ప్రారంభం అయింది. తిలక్ జైలు నుండి విడుదలయ్యారు. కాంగ్రెస్ చీలిపోవటం వల్ల దాని పనులు దెబ్బతిన్నాయి. బ్రిటిష్ ప్రభుత్వ రాజనీతిని తెలుసుకున్న ముస్లింలీగ్ కూడా ఆలోచనలో పడి కాంగ్రెసుతో సంబంధాలను మెరుగుపరచుకోవటానికి సిద్ధమయ్యింది. అనేక ప్రయత్నాల ఫలితంగా కాంగ్రెసులో అతివాదులకు మితవాదులకు మధ్య 1915 లో ఐక్యత సాధించగలిగారు. ఐక్యత సాధించిన కాంగ్రెస్ ముస్లింలీగులు భారతదేశం సాధించుకోవాల్సిన పరిపాలనా సంస్కరణలకు సంబంధించి కొంతమేరకు ఏకీభావాన్ని సాధించాయి. ముస్లింలీగు, కాంగ్రెస్ కలిసి విప్లవకారుల వైఖరిని వ్యతిరేకించాయి. 1916 లో తిలక్, అనీ బిసెంట్ ఆధ్వర్యంలో హోం రూల్ సంస్థలు ఆవిర్భవించాయి. వీరిద్దరూ కేసరి, మరాఠా, కామన్ వీల్, న్యూ ఇండియా మొదలైన తమ పత్రికల ద్వారా హోం రూల్ ఉద్యమాన్ని గురించి విశేష ప్రచారం సాగించారు. ఉపన్యాసాలు ఇచ్చారు.

"ఆంధ్రలోని అనేక ప్రాంతాల్లో సుమారు 52 హోం రూల్ శాఖలు స్థాపించబడ్డాయి. మదనపల్లిలోని జాతీయ విద్యాకేంద్రం, జాతీయ కళాశాలలు హోం రూల్ గురించి విస్తృతంగా ప్రచారం చేశాయి. దివ్యజ్ఞాన సమాజ శాఖలు కూడా హోం రూల్ ప్రచారానికి తోడ్పడ్డాయి. గాడిచర్ల హరిసర్వోత్తమరావు ప్రచురించిన స్వరాజ్యశబ్దము అనే అనేక పత్రాల ద్వారా ఉద్యమానికి మంచి ప్రచారం లభించింది. 1916 లో ఆంధ్ర జిల్లాలలో అనీ బిసెంట్ పర్యటించి చిత్తూరు, రాజమండ్రిలలో ప్రసంగిస్తూ స్వపరిపాలన అన్నది అగ్రవర్ణాలు ముఖ్యంగా బ్రాహ్మణులకే వర్తిస్తుందని కొందరు తెలిపేది దుష్ప్రచారమని, భారతీయులకంతా హోం రూల్ అవసరమని వివరించింది."[7] – పై విధంగా హోం రూల్ ఉద్యమం ఆంధ్రలో పాదుకొంది.

ఉద్ధృతమవుతున్న ఈ ఉద్యమాన్ని అడ్డుకోవాలని నిర్ణయించిన ప్రభుత్వం నిర్బంధ చర్యలకు పూనుకొంది. అనీ బిసెంట్ నుండి 12,000 రూకలను పూచీగా వసూలు చేసింది. అందువలన ఆమె పత్రికా ప్రచురణను ఆపివేయవలసి వచ్చింది. తిలక్, బిపిన్ చంద్రపాల్‌లను పంజాబ్, ఢిల్లీలలో పర్యటించరాదని నిషేధాజ్ఞలు జారీ చేసింది. బీసెంట్, అరండేల్, వాడియాలను నిర్బంధించింది. ఆంధ్రలో 'దేశమాత' పత్రికలో ప్రచురింపబడిన కొన్ని వ్యాసాల ఫలితంగా చిలకమర్తి లక్ష్మీనరసింహం గారిని 1,000 రూపాయలు హామీగా అడిగింది. ఈ నిర్బంధ చర్యలకు నిరసనగా ఆందోళన చేయాలని మద్రాసు ప్రాంత సంఘాలు నిర్ణయించుకొన్నాయి. ఆ నిర్ణయం తీసుకున్న కొద్ది రోజులకే 1917 ఆగస్టు 20 న మాంటేగ్ భారతదేశంలో బాధ్యతాయుత పాలన ప్రవేశపెట్టబడుతుందని ప్రకటించాడు. అనేక చర్చల తరవాత 1919 మాంటేగ్ చెమ్స్ ఫర్డ్‌ల చట్టం రూపం తీసుకుంది. ఈ చట్టం ద్వారానే 'ద్వంద్వపాలన' అమల్లోకి వచ్చింది.

గాంధీ 1915 లో దక్షిణాఫ్రికా నుంచి అహింస ప్రధానంగా గల సత్యాగ్రహ పద్ధతిని చేపట్టి భారతదేశంలో అడుగు పెట్టారు. అహ్మదాబాద్‌లో సబర్మతీ నదీతీరాన ఆశ్రమం నిర్మించుకుని భారతదేశంలో అనేక ప్రాంతాలను సందర్శించి పరిస్థితులను ఆకళింపు చేసుకోవటంలో కొంతకాలం గడిపారు. 1917 లో బీహార్ రాష్ట్రంలోని చంపారన్ లోనూ, 1918 లో కైరా జిల్లాలోనూ రైతుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు నడిపి విజయం సాధించారు. 1917 లో 'రౌలట్' అనే న్యాయాధీశుని అధ్యక్షతలో విప్లవకారుల చర్యలను, ఇతర ప్రభుత్వ వ్యతిరేక చర్యలను పరిశీలించి నివేదించమని బ్రిటిష్ ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ నివేదిక ననుసరించి 1919 మార్చి 18 న రౌలట్ చట్టాన్ని ప్రవేశపెట్టింది.

ఈ చట్టం ప్రకారం "ఏ వ్యక్తినైనా వారంట్ లేకుండా నిర్బంధించడానికి, ఇళ్ళు సోదా చేయడానికి, ఆస్తులు వశపరచుకొనడానికి ప్రభుత్వానికి హక్కు ఉంటుంది. అంతేకాక ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు తలపడినవారిని 'ప్రత్యేక న్యాయస్థానాలు' అనే న్యాయస్థానాలలో విచారించవచ్చు. ఈ న్యాయస్థానాల తీర్పుకు ఎదురు లేదు." [8]

ఆ చట్టాన్ని విరమించుకోవలసిందిగా గాంధీ వైస్రాయిని కోరారు. ఫలితం శూన్యం అవటంతో 'సత్యాగ్రహసభ' అనే సంఘాన్ని స్థాపించి కరపత్రాలను అచ్చు

వేసి ఈ చట్టం పట్ల ప్రజలలో నిరసన భావాన్ని కలుగచేశారు. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఒకరోజు ప్రార్థనలు, ఉపవాసాలూ జరిపి హర్తాళ్ పాటించాల్సిందిగా పిలుపు ఇచ్చారు. ఈ హర్తాళ్‌ను మొదట 1919 మార్చి 30 న పాటించాలని నిర్ణయించి ఆ తర్వాత దానిని 1919 ఏప్రిల్ 6 కు వాయిదా వేశారు.

ఈ సమయంలో బ్రిటిష్ దమననీతికి పరాకాష్టగా జరిగింది జలియన్ వాలాబాగ్ ఉదంతం. ఏప్రిల్ 13 న ఏకైక ద్వారం గల జలియన్ వాలాబాగ్ మైదానంలో ప్రజలు ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. సభలు, సమావేశాలపై విధించిన నిషేధాజ్ఞలను అన్ని ప్రాంతాలలో పాటించలేదు. 10,000 మంది పైగా హాజరయిన ఆ సభలో హన్స్ రాజా అనే నాయకుడు ఉపన్యసిస్తూ ఉండగా జనరల్ డయ్యర్ కాల్పులకు ఉత్తరువు ఇచ్చాడు. దాదాపు 1000 మంది మరణించారు. ఈ హింసాకాండ ఫలితంగా ఏప్రిల్ 18 న గాంధీ సత్యాగ్రహాన్ని ఉపసంహరించారు. ఈ సందర్భంలో నూటికి 90 పాళ్ళు ప్రభుత్వహింసే జరిగింది.

ఈ మారణకాండకు నిరసనగా రవీంద్రనాథ ఠాగూర్ 'సర్' బిరుదును త్యజించారు. పండిత్ మాలవ్యా ఒక ప్రశ్నావళిని ముందుపెట్టి ప్రభుత్వం నుంచి జవాబును ఆశించారు. కంటితుడుపు చర్యగా ఈ దురాగతాలను విచారించటానికి ప్రభుత్వం హంటర్ కమిటీని ఏర్పాటు చేసింది. అది నిష్పక్షపాతంగా వ్యవహరించటానికి అవకాశాలు తక్కువగా ఉన్న కారణంగా గాంధీ, అబ్బాస్ త్యాబ్జీ మొదలైనవారితో కూడిన కమిటీని కాంగ్రెస్ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ నివేదిక హంటర్ కమిటీ నివేదిక ఎంత పాక్షికమో తెలియచేసింది.

రౌలట్ సత్యాగ్రహం తరవాత వచ్చినది ఖిలాఫత్ ఉద్యమం. మొదటి ప్రపంచయుద్ధ సమయంలో ముస్లిం పవిత్ర స్థలాలకు, సుల్తాన్ అధికారానికి హాని తలపెట్టనని మాట యిచ్చిన లాయిడ్ జార్జ్ దాన్ని తప్పాడు. భారతదేశంలోని ముస్లింలకు ఇది కోపాన్ని తెప్పించింది. ఇస్లామిక్ దేశాలన్నీ ఖలీఫా అధికారంలోనే ఉండాలని కోరుతూ ఖిలాఫత్ ఉద్యమం ప్రారంభమయింది. అక్టోబర్ 17 న అఖిలభారత ఖిలాఫత్ దినం పాటించాలని ఖిలాఫత్ సంఘం పిలుపు నిచ్చింది. అనేక రాష్ట్రాలలో ఇది జయప్రదంగా నిర్వహించబడింది. 1920 ఆగస్టు, 1 న తిలక్ మరణించారు. 1920 ఏప్రిల్‌లో గాంధీ హెూం రూల్ అధ్యక్షుడయ్యారు. 1920 లో

జరిగిన కలకత్తా – నాగపూర్ కాంగ్రెస్ సమావేశాల్లో సహాయ నిరాకరణోద్యమ తీర్మానాన్ని ఆమోదించారు. ఇందులోని అంశాలు చాలావరకు 'వందేమాతరం' ఉద్యమం నాటివే.

'ఏడాదిలోనే స్వరాజ్యం' అనే నినాదంతో సహాయ నిరాకరణోద్యమం 1921 లో మొదలయింది. ఇది ఒకే సమయంలో నిర్మాణ, బహిష్కరణ కార్యక్రమాలను చేపట్టింది. శాసనసభలను, కోర్టులను, విదేశీ వస్త్రాలను, ఆంగ్లవిద్య మొదలైన వాటిని బహిష్కరించాలి అనే పిలుపుతో ఈ ఉద్యమం మొదలైంది.

నిర్మాణ కార్యక్రమంలో నూలు వడకడం, ఖద్దరు ధరించడం, అస్పృశ్యతా నివారణ, హిందూ ముస్లిం ఐక్యత కోసం పాటు పడటం, తిలక్ స్మారక స్వరాజ్యనిధికి ఒక కోటి రూపాయల విరాళాన్ని పోగుచేయటం మొదలైనవి ఉన్నాయి.

నిర్మాణ, బహిష్కరణ కార్యక్రమాలు ప్రజల అండదండలతో దేశమంతటా చురుకుగానే సాగాయి. విదేశీ వస్త్ర బహిష్కరణ కారణంగా బ్రిటిష్ ప్రభుత్వానికి ఆర్థికంగా బాగానే నష్టం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రచారం చేయటం కోసం గాంధీ భారతదేశమంతా పర్యటించటంతో ప్రజలు ఉత్తేజితులై అనుకున్న దానికంటే ఎక్కువగానే తిలక్ నిధికి విరాళాలు యిచ్చారు.

దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ఆధ్వర్యంలో విజయవాడలో 1921 ఏప్రిల్‌లో కాంగ్రెస్ సమావేశం జయప్రదంగా నిర్వహించబడింది. కొన్ని మార్పులతో పింగళి వెంకయ్యగారు రూపొందించిన జెండాను జాతీయపతాకంగా ఆమోదించారు.

1921 లో పల్నాడులో పుల్లరి సత్యాగ్రహం జరిగింది. పల్నాటి ప్రాంతం అడవి ప్రదేశం. అక్కడి ప్రజలు ఆ అడవిలో కట్టెలు ఏరుకోవాలన్నా, పశువులను మేపాలన్నా ఫారెస్ట్ అధికారుల అనుమతి తీసుకోవాలి. పన్ను చెల్లించాలి. దీన్ని 'పుల్లరి' అంటారు. పుల్లరి చెల్లించకపోతే ఆస్తులు జప్తు చేస్తారు. పశువుల్ని బందెలదొడ్లకు తోలుకుపోతారు. పుల్లరి చట్టాల పేరుతో ఫారెస్ట్ అధికారులు ప్రజలను యమయాతనలకు గురిచేసేవారు. అది భరించలేక 'అసలు పన్నులు కట్టం. పోండి.' అని ప్రజలు తిరుగుబాటు చేశారు. బ్రిటిష్ ప్రభుత్వం కన్నెగంటి హనుమంతును కాల్చి చంపింది. ఈ ఉద్యమాన్ని వెంటనే ఆపవలసిందిగా గాంధీ ఆదేశించారు.

1921 లో మలబారులోలో మోప్లాల తిరుగుబాటు జరిగింది. ఈ తిరుగుబాటులో "... పండికాడ్‌లో 43 మంది గూర్ఖా పోలీసులు మరణించగా 3000 మంది మోప్లాలు మరణించారు. మోప్లాలను ఒక రైల్వే కంపార్టుమెంటులో బంధించి తీసుకెళ్తుండగా ... ఊపిరాడక 70 మంది చనిపోయారు."[10] దీని వల్ల ఈ తిరుగుబాటు ఎంత క్రూరంగా అణచివేయబడిందో తెలుస్తోంది.

1921 నవంబర్ 17 న వచ్చే బ్రిటన్ యువరాజు రాకను బహిష్కరించాలని కాంగ్రెస్ పిలుపు నిచ్చింది. దాని కనుగుణంగా అనేక చోట్ల శాంతియుతంగా నిరసన ప్రదర్శనలు జరిపారు. రాజకుమారుడు బొంబాయిలో ఓడ దిగగానే స్వాగతమివ్వటానికి వచ్చిన భారతీయులపైనా, యూరోపియన్‌ల పైనా ప్రజలు రాళ్ళు రువ్వటంతో సాయుధులైన పోలీసులు కాల్పులు జరిపారు. ఈ మారణకాండ ఐదు రోజులు జరిగింది. 53 మంది మరణించారు. 400 మంది గాయపడ్డారు.

ఈ సంఘటన గురించి గాంధీ స్పందనను తెలియచేస్తూ ఇ. ఎం. ఎస్. నంబూద్రిపాద్ ఇలా రాశారు.

"మృతి చెందిన 53 మందిలో 45 మంది, గాయపడిన 400 మందిలో 350 మంది సహాయనిరాకరణ సభ్యులో, సానుభూతిపరులో అని గాంధీ పేర్కొన్నారు. ... అయినప్పటికీ గాంధీ బొంబాయిలో అల్లర్లకు ప్రజలనే నిందించారు. పాలకులను కాదు. ఈ హింసాత్మక సంఘటనపై ఆయన ఏమని వ్యాఖ్యానించారో చూడండి. 'గత రెండురోజులుగా నాకు కనిపించిన స్వరాజ్యం నా ముక్కుపుటాలను అదరగొట్టింది'..."

ఆ తర్వాత నవంబర్ 23 న జరప తలపెట్టిన బార్డోలి సత్యాగ్రహాన్ని వాయిదా వేశారు. ఈ హింసాకాండకు నిరసనగా గాంధీ 5 రోజులు నిరాహారదీక్ష చేశారు. సహాయ నిరాకరణోద్యమాన్ని అణచటం కోసం ప్రభుత్వం ప్రజలను అనేక నిర్బంధాలకు గురి చేసింది. సభలు, సమావేశాలపై నిషేధాన్ని ఉల్లంఘించిన ప్రజల్ని అసంఖ్యాకంగా జైళ్ళలో పెట్టింది.

సహాయ నిరాకరణోద్యమ పిలుపు ననుసరించి ఆంధ్రలో అయ్యదేవర కాళేశ్వరరావు శాసనసభ అభ్యర్థిత్వాన్ని, గులాం మొహినుద్దీన్, సుబ్బరాయలు

మొదలైనవారు గౌరవ పదవుల్ని, కొండా వెంకటప్పయ్య, ప్రకాశం మొదలైనవారు న్యాయవాదవృత్తిని వదిలేశారు.

1922 ఫిబ్రవరి 5 న చౌరీచౌరా వద్ద పికెటింగ్ జరిగిన సందర్భంలో పోలీసులు తూటాలు అయిపోయేదాక వాలంటీర్లపై కాల్పులు జరిపారు. అది గమనించిన వాలంటీర్లు, పోలీసులు పోలీసుస్టేషన్ లోనికి పోయి తలుపులు మూసుకోగానే ఆ పోలీసుస్టేషన్‌ను తగులబెట్టారు.

ఈ సంఘటనతో ఫిబ్రవరి 8న భారతదేశమంతటా సహాయ నిరాకరణోద్యమాన్ని నిలిపివేస్తున్నట్లుగా గాంధీ ప్రకటించారు. బ్రిటిష్ ప్రభుత్వం రాజద్రోహ నేరంపై గాంధీని అరెస్టు చేసి జైలుశిక్ష విధించింది.

ఆ తరువాత కాంగ్రెస్‌లోనే ఉంటూ శాసనసభా ప్రవేశం చేయాలనే అభిప్రాయంతో ఒక వర్గం 'స్వరాజ్యపార్టీ' పేరుతో కొనసాగింది. అది రాష్ట్ర శాసనసభలలో ప్రభుత్వాన్ని కొంతవరకు ఎదుర్కోగలిగింది. అనారోగ్య పరిస్థితుల కారణంగా గాంధీ శిక్షాకాలం పూర్తి కాకముందే విడుదలయ్యారు. స్వరాజ్యపార్టీ వారి పద్ధతి ఆయనకు నచ్చక పోయినప్పటికీ ప్రతిఘటించక నిర్మాణ కార్యక్రమం వైపు దృష్టి మరల్చారు. శాసనసభా ప్రవేశంతో పెద్దగా ప్రయోజనం లేకపోవటంతో 1926 లో స్వరాజ్యపార్టీ శాసనసభల నుండి రాజీనామా చేసింది.

1922-24 లో ఆంధ్రలోని మన్నెం గిరిజనులు అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో అడవులపై హక్కుని రక్షించుకోవటం కోసమూ, నిర్బంధ పని విధానానికి వ్యతిరేకంగానూ సాయుధ పోరాటం జరిపారు.

సోవియెట్ యూనియన్‌లోని ఉజ్బెకిస్తాన్ రాజధానియైన తాష్కెంటులో 1920 అక్టోబర్ 17 వ తేదీన భారత కమ్యూనిస్ట్ పార్టీ ఏర్పడింది. అందులో ఎం. ఎన్. రాయ్ మొదలైనవారు ఉన్నారు.

1924 డిసెంబర్ 7 నా మాలవ్యా ఆధ్వర్యంలో హిందూ మహాసభ, డిసెంబర్ 28 న అఖిలభారత బ్రాహ్మణేతర పక్షాల సంఘం బెల్గాంలో ఏర్పడ్డాయి.

1924 తర్వాత హిందూ ముస్లిం కొట్లాటలు ఎక్కువగా జరిగాయి. 1926 డిసెంబర్ 23 న స్వామి శ్రద్ధానందను ఒక ముస్లిం యువకుడు హత్య చేశాడు.

1927 నవంబర్ 8 న నూతన సంస్కరణల ప్రతిపాదనను పరిశీలించటానికి బ్రిటిష్ ప్రభుత్వం సైమన్ అధ్యక్షతన ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీని బహిష్కరించాల్సిందిగా కాంగ్రెస్ పిలుపునిచ్చింది. 'సైమన్ గో బ్యాక్' అంటూ దేశమంతటా నిరసన ప్రదర్శనలు జరిగాయి. అప్పుడు జరిగిన లాఠీ ఛార్జిలో లజపతిరాయ్ దెబ్బలు తిని వాటినుంచి కోలుకోకుండానే మరణించారు. మద్రాసులో పోలీసు తూటాల కెదురుగా 'కాల్చుకో' అని నిర్భయంగా నిలబడ్డ టంగుటూరి ప్రకాశం 'ఆంధ్ర కేసరి'గా పేరుపొందారు.

1922 లో సహాయ నిరాకరణోద్యమం విరమించిన తర్వాత 1923 లో విప్లవ సంఘాలు పునరుద్ధరించబడ్డాయి. చిట్టగాంగ్‌లో సూర్యసేన్, గోపీనాథ సాహూలు విప్లవసంఘాన్ని నడిపారు. 1924 లో విప్లవకారులు హిందూస్థాన్ రిపబ్లిక్ సంఘాన్ని స్థాపించారు. ఈ సంఘం చేసినొక దోపిడీకి సంబంధించి 25 మందిపై ప్రభుత్వం కేసు పెట్టింది. ఇది 'కకోరీ కుట్ర కేసు'గా ప్రసిద్ధి చెందింది. ఈ కేసులో తప్పించుకున్న చంద్రశేఖర అజాద్ 1928 లో 'హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ సంఘం' స్థాపించారు. ఈ సంఘంలో సభ్యుడైన భగతసింగ్ తర్వాత కాలంలో లాలా లజపతిరాయ్‌ని బాధించిన సాండర్స్ ను హత్య చేసి తప్పించుకున్నారు. 1929 ఏప్రిల్ 8 న భగత్‌సింగ్, బటుకేశ్వర దత్తా తమ ఉనికిని తెలియచేసేందుకు ఢిల్లీ అసెంబ్లీలో బాంబులు వేసి 'హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ ఆర్మీ' వేసిన కరపత్రాలను వెదజల్లారు.

'చెవిటివాళ్ళకు వినిపించటం కోసం బాంబులు పేల్చడం అవసరం' ఫ్రెంచ్ అరాచకవాది వేలియా సూక్తితో ప్రారంభమైన ఆ కరపత్రంలో బ్రిటిష్ ప్రభుత్వాన్ని విమర్శించి తాము ఎటువంటి సమాజం రావాలనుకుంటున్నారో చెపుతూ 'ఇంక్విలాబ్ జిందాబాద్' అనే నినాదంతో ముగించారు.[12]

భగత్‌సింగును కోర్టులో 'విప్లవం అంటే ఏమిటి?' అని ప్రశ్నించినపుడు "మా ఉద్దేశంలో విప్లవం అంటే కొంతమంది వ్యక్తుల్ని చంపడం మాత్రం కాదు. ఒక మానవుడిని మరో మానవుడు దోచుకోవడాన్ని అంతం చేసి, ఈ దేశంలో సమ సమాజాన్ని నిర్మించటం మా ఆదర్శం"[13] అని చెప్పారు. రష్యన్ విప్లవం యొక్క ప్రభావం ఈ సంస్థపై ఉంది.

1929 డిసెంబర్ 29 న లాహోర్‌లో జవహర్ లాల్ నెహ్రూ అధ్యక్షతన సమావేశమైన కాంగ్రెస్ డిసెంబర్ 31 అర్ధరాత్రి త్రివర్ణ పతాకాన్ని ఎగరేసి సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం పోరాటం ప్రారంభించింది.

1930 ఏప్రిల్ 5 న 'దండి'లో ఉప్పు సత్యాగ్రహంతో శాసనోల్లంఘనం మొదలైంది. ఆంధ్రలో కూడా పలుప్రాంతాల్లో ఉప్పు సత్యాగ్రహం జరిగింది. ఈ ఉద్యమంలో అనేకమంది స్త్రీలు పాల్గొన్నారు. అనేకులు అరెస్టయ్యారు. దేశవ్యాప్తంగా ఈ సత్యాగ్రహం విజయాన్ని సాధించింది. ప్రభుత్వం మే 5 న గాంధీని అరెస్టు చేసింది. పెషావరులో గార్వాల్ సైనికులు ప్రజలపై కాల్పులు జరిపేందుకు నిరాకరించారు. ప్రభుత్వం వారిని అరెస్ట్ చేసింది.

1930 నవంబర్ 12 న రాజ్యాంగ పునర్నిర్మాణానికై మొదటి రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. దానికి కాంగ్రెస్ హాజరు కాలేదు. ఆ తర్వాత తేజ్ బహదూర్ సప్రూ మొదలైనవారి సలహాపై గాంధీ ఇంగ్లాండ్‌లో వైస్రాయి ఇర్విన్‌ని కలిశారు. వీరిద్దరూ మార్చి 5 న ఒక ఒప్పందానికి వచ్చారు. ఈ ఒప్పందం ప్రకారం శాసనోల్లంఘన ఉద్యమం విరమించబడింది. సుభాష్, నెహ్రూ మొదలైనవారిలో ఇది అసంతృప్తి రేకెత్తించింది. ఈ ఒడంబడికలో భగత్‌సింగ్ తదితరుల ఉరిశిక్ష రద్దు గురించి గాని, గార్వాల్ సైనికుల విడుదల గురించి గాని ప్రస్తావించలేదు. 1931 సెప్టెంబర్ 7 న ప్రారంభమయిన రెండవ రౌండ్ టేబుల్ సమావేశం నిరాశనే మిగిల్చింది.

1932 ఆగస్టు 10 న 'కమ్యూనల్' అవార్డ్ జారీ అయింది. దీనికి వ్యతిరేకంగా గాంధీ సెప్టెంబర్ 20 న నిరాహారదీక్ష ప్రారంభించారు. ఆ తర్వాత పూనాలో అంబేద్కర్ కు, మాలవ్యాకు కుదిరిన ఒప్పందం ఫలితంగా నిరాహారదీక్ష విరమించారు.

1935 లో భారతప్రభుత్వ చట్టం ప్రవేశ పెట్టబడింది. 1936 లో జరిగిన లక్నో కాంగ్రెస్‌లో శాసనసభల ఎన్నికలలో పోటీ చేయాలనే నిర్ణయానికి కాంగ్రెస్ వచ్చింది. సోషలిజం తన లక్ష్యంగా ప్రకటించింది. 1936,37 లలో కాంగ్రెస్ అనేక ప్రాంతాలలో మెజారిటీగా వచ్చింది. 1938,39 కాంగ్రెస్ సభలలో ప్రపంచయుద్ధం వస్తే దాన్ని అవకాశంగా తీసుకుని, భారీ పరిశ్రమల స్థాపనకు, అభివృద్ధికి కృషి చేయాలనే సుభాష్‌కు, ఈ అభిప్రాయాలను వ్యతిరేకించే గాంధీకి విభేదాలు పరాకాష్ఠకు చేరాయి. 1939 లో గాంధీ నిలబెట్టిన భోగరాజు పట్టాభి సీతారామయ్య ఓడిపోయారు.

సుభాష్ నెగ్గటానికి కాంగ్రెస్ సోషలిస్టులు కూడా కారణం. సుభాష్ అదే సంవత్సరం ఈ విభేదాల కారణంగానే కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా ఇచ్చి 'ఫార్వర్డ్ బ్లాక్' అనే పార్టీని స్థాపించి దానికి అధ్యక్షుడయ్యారు. కాంగ్రెస్‌లో ఉంటూనే ఇలాంటి ఇతర సంస్థలకు పని చేయటం ముందునుంచీ ఉన్నదే. ఆ తర్వాత మూడు సంవత్సరాలకు కాంగ్రెస్ నుంచి సుభాష్ చంద్రబోస్ బహిష్కరింపబడ్డారు.

1940 మార్చిలో లాహోర్‌లో సమావేశమైన ముస్లింలీగ్ 'ప్రత్యేక ముస్లిం రాజ్యం' ముస్లింల ధ్యేయంగా ప్రకటించింది. రెండవ ప్రపంచయుద్ధంలో యావద్భారతదేశం యుద్ధ కృషికి తోడ్పడుతుందని బ్రిటిష్ ప్రభుత్వం ప్రకటించింది. దీనిని నిరసిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాలు 1939 నవంబర్‌లో రాజీనామా చేశాయి.

1940 లో కొమురం భీమ్ నాయకత్వంలో తెలంగాణ ప్రాంతంలోని ఆదిలాబాద్ జిల్లాలో గోండులు, కొలాములు బ్రిటిష్, నిజామ్ ప్రభుత్వాల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా సాయుధ తిరుగుబాటు చేశారు.[14]

1942 లో వచ్చిన క్రిప్సు రాయబారం విఫలమయింది. అతను ప్రతిపాదించిన సంస్కరణలను కాంగ్రెస్, ముస్లింలీగ్ రెండూ వ్యతిరేకించాయి. ఈ రాయబారం విఫలం కావటంతో 1942 ఆగస్టు 7 న క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభమయింది. దీన్ని 'ఆగస్టు విప్లవం' అని కూడా అంటారు. ఆగస్టు 9 న గాంధీతో సహా ప్రముఖ నాయకులందరిని ప్రభుత్వం అరెస్ట్ చేసింది. అప్పట్నుంచే రకరకాల రూపాల్లో జయప్రకాష్ మొదలైన వారి నాయకత్వంలో నడిచిన ఈ ఉద్యమం 1944 తర్వాత చల్లారింది. 1941 లో నిర్బంధం నుంచి తప్పించుకున్న సుభాష్ చంద్ర బోస్ జర్మనీ వారి సాయంతో 'ఆజాద్ హింద్ ఫౌజ్' స్థాపించారు. ఈ సమయంలోనే భారతీయులు ఇతనికి 'నేతాజీ' అనే నామకరణం చేశారు. తన సైన్యంతో నేతాజీ 1944 లో భారతదేశంలోని 'మన్ డోక్' భూభాగాన్ని స్వాధీనం చేసుకుని జెండా ఎగరేశారు. ఆయన త్యాగాలు భారతీయుల్ని ఉత్తేజపరచాయి.

1944 లో గాంధీ జైలు నుంచి విడుదలయ్యారు. 1946 లో భారతదేశంలోని నావికా సైన్యం తిరుగుబాటు చేసింది. ఇది అణిచివేయబడింది. 1946 లో తెలంగాణ జిల్లాలలో భూస్వాములకు వ్యతిరేకంగా 'దున్నేవానిదే భూమి' నినాదంతో కమ్యూనిస్టుపార్టీ నాయకత్వంలో సాయుధపోరాటం ప్రాంభమైంది. ఈ విధంగా 1942 తర్వాత వచ్చిన రకరకాల పోరాటల వల్ల బ్రిటిష్ ప్రభుత్వానికి తన పాలన సాగే సూచనలు కన్పించలేదు. ముస్లింలీగ్ ప్రత్యేక ముస్లిం రాజ్యం కోరటంతో భారతదేశంలో

ముస్లిం ఆధిక్యత కలిగిన ప్రాంతాన్ని పాకిస్తాన్‌గా విభజించి, భారతదేశాన్ని రెండు ముక్కలు చేసి చెరొక చేతిలో పెట్టారు.

1.2 సాంఘిక పరిస్థితులు

సాంఘిక పరిస్థితులనగానే సంఘ సంస్కరణకు పూనుకున్న బెంగాల్‌కు చెందిన రాజా రామ్మోహన్ రాయ్, మహారాష్ట్రకు చెందిన జ్యోతిబా పూలే, కేరళకు చెందిన నారాయణ గురు, తమిళనాడుకు చెందిన పెరియార్ రామస్వామి, ఆంధ్రకు చెందిన వీరేశలింగం, త్రిపురనేని రామస్వామి చౌదరి మొదలైనవారు గుర్తుకొస్తారు.

బెంగాల్‌లో రామ్మోహన్ రాయ్ సంఘంలో ఉన్న కశ్మలాన్ని కడిగి వెయ్యటానికి ప్రయత్నించారు. స్త్రీల దుస్థితిని చూసి వారికి విముక్తి కలిగించటం కోసం కృషి చేశారు. సతీసహగమనాన్ని, బాల్య వివాహాలను, బహుభార్యాత్వాన్ని, కుటుంబంలో స్త్రీకి ఆస్తిహక్కు నిరాకరించటాన్ని, స్త్రీలకు విద్య నిషేధించటాన్ని నిరసించి ఉద్యమాన్ని నడిపారు. కుల వ్యవస్థను వ్యతిరేకిస్తూ బ్రహ్మసమాజాన్ని స్థాపించారు. అయితే ఇది అగ్రకులాలకు సంబంధించిన హిందువులలో మాత్రమే వ్యాప్తి చెందింది.

బి.సి కులానికి చెందిన జ్యోతిబా పూలే కులవ్యవస్థకు వ్యతిరేకంగా స్త్రీపురుష సమానత్వం కోసం కృషి చేశారు. సత్యశోధన సమితి అనే సంస్థను స్థాపించారు. హిందూ అగ్రవర్ణాలు నిమ్నకులాల వారిని అణిచేశాయని అభిప్రాయపడ్డారు. సత్యశోధన సమితి వారి ఒక అధికార నివేదికలో ఈ విధంగా రాశారని నంబూద్రిపాద్, తారాచంద్ వాక్యాలను ఉల్లేఖించారు.

"బ్రాహ్మణులు తమ గ్రంథాల సహాయంతో సామాన్య ప్రజానీకాన్ని నిమ్నజాతులుగా ప్రకటించుతూ వచ్చారు. అనేక వేల సంవత్సరాలుగా వారిని దోచుకుంటున్నారు. బ్రాహ్మణుల ఆధిక్యతా బంధనాల నుండి వారిని విముక్తి చేయటానికి, వారికి విషయాలు తెలియచెప్పి తమ హక్కులను గుర్తించేట్లు చేయటానికిగాను, 1873 సెప్టెంబర్ 24 న సత్యశోధన సమితి స్థాపించబడింది."[15] పూలేను 'మహాత్మా పూలే' అని ఇప్పటికీ మహారాష్ట్రలో పిలుస్తారు.

తమిళదేశంలో ఇ. వి. ఆర్. రామస్వామి సంఘసంస్కరణ కోసమై తన జీవితాంతం పాటుపడ్డారు. ఈయనను తమిళులు 'పెరియార్' అని పిలుస్తారు. ఈయన

కూడ బ్రాహ్మణాధిక్యతను నిరసించారు. తిరువాన్కూరులో హరిజన హక్కుల కోసం జరిగిన 'వయక్కం పోరాటాని'కి ఆయన నాయకత్వం వహించారు. పెరియార్ తమిళనాడు కాంగ్రెస్ కమిటీ సెక్రెటరీ. తిరునల్వేలికి చెందిన 'శర్మదేవు'లో వి. వి. ఎస్. అయ్యరు స్థాపించిన గురుకులంలో బ్రాహ్మణేతర విద్యార్థులను తక్కువగా చూడటాన్ని గమనించిన పెరియార్ దాని పట్ల ప్రజలలో నిరసనభావాన్ని కలుగచేశారు. దాని ఫలితంగా ఆ సంస్థ ప్రజాదరణకి దూరమైంది. ఈ గొడవలలో పెరియార్ బ్రాహ్మణద్వేషి అని, కాంగ్రెస్‌లోని బ్రాహ్మణ సభ్యులు ప్రచారం మొదలుపెట్టి పెరియార్ పై విశ్వాసరాహిత్య తీర్మానం ప్రవేశపెట్టారు. అది ఓడిపోయింది. ఆ తరువాత కాంగ్రెస్ నుండి బయటకు వచ్చిన పెరియార్ 'స్వయం మరియాద్రై ఉద్యమం' మొదలుపెట్టారు. 'మేమూ మనుషులమే – మాకూ మర్యాద కావాలి' అనే నినాదంతో నిమ్నజాతుల్ని ఉత్తేజితుల్ని చేశారు. 1926 లో ఆయన జస్టిస్ పార్టీలో చేరారు. పెరియార్ నాస్తికుడుగా మారారని ఈ క్రింది మాటల వల్ల తెలుస్తోంది.

"అన్ని రంగాలలోనూ సాధించాల్సిన అభ్యుదయం మతంచే అడ్డగింపబడుతోంది." [16]

" మీరు అంటుకొంటేనే మైలపడే దేవుడు మీకు అవసరమా? అలాంటి దేవుడి విగ్రహాన్ని బద్దలుకొట్టి రోడ్లు వేయడానికి ఉపయోగించాలి. లేదా ఆ నల్లరాతి బండల్ని చాకిరేవులో బట్టలుతకడానికి వాడాలి."[17]

1940 లో స్వయం మరియాద్రై ఉద్యమం, జస్టిస్ పార్టీ కలిసి 'ద్రవిడ కజగం' గా ఏర్పడింది. 1879 సెప్టెంబర్ 17 న ఈరోడ్‌లో జన్మించిన పెరియార్ 1973 డిసెంబర్ 24 న మరణించారు.

ఆంధ్రదేశంలో కూడా మిగిలిన ప్రాంతాలలోలాగే బ్రాహ్మణాధిక్యత, అస్పృశ్యత మొదలైన దురాచారాలు ఉన్నాయి. భోగంవారి కులవృత్తి పేరిట వ్యభిచారం విశృంఖలంగా సాగేది. బాల్య వివాహాలు, వితంతువుల పునర్వివాహాలకు అంగీకరించక పోవటం, విద్యకు స్త్రీలను దూరంగా ఉంచటం జరిగేది. ఈ దురాచారాలను రూపుమాపటానికి మాటల్లోనూ, చేతల్లోనూ కృషి చేసినవారు కందుకూరి వీరేశలింగం. ఈయన తన ఉద్యమానికి నాందిగా సంఘ సంస్కార సమాజం స్థాపించారు. ఆయన అడుగుజాడల్లో నడచినవారు, ఆయనకు సహకరించినవారు అనేకులున్నారు.

బాల్యవివాహాల వల్ల, కన్యాశుల్కం వల్ల స్త్రీలు బాల వితంతువులు అయ్యేవారు. ఆ కాలంలో కన్యాశుల్కం కోసం తమ ఆడపిల్లల్ని తల్లితండ్రులు ముసలీ ముతకా అని కూడా చూడకుండా వారికి కట్టబెట్టేవారు. వితంతువులయిన ఆ చిన్న పిల్లలకు తలవెంట్రుకలు తీయించి సౌందర్యవిహీనులను చేసేవారు. ఆ తరువాత ఆ వితంతువులను ఇంట్లో చాకిరీకి వాడుకునేవారు. వీరేశలింగంగారి పెద్దయ్య పెళ్ళి, గురజాడ రాసిన పూర్ణమ్మ, కన్యాశుల్కం, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి కథలు వీరి పరిస్థితికి అద్దం పడతాయి.

మూడేండ్ల కాలంలో ఎన్ని బాల్య వివాహాలు జరిగాయో విజయనగరం మహారాజా ఆనంద గజపతిరాజు 1897 లో లెక్కలు తీయించారు. వాటిని గురజాడ కన్యాశుల్కం ముందుమాటలో తెలియచేశారు.

"కన్యాశుల్క వివాహాలు 1034 నమోదు చేయబడినాయి. అనగా సగటున ఏటా 344 జరిగాయి. 99 మంది ఆడపిల్లలకు అయిదేండ్ల వయసులోను, 44 మందికి నాలుగేండ్ల వయసులోను, 36 మందికి మూడేండ్ల వయసులోను, 6 గురికి రెండేండ్ల వయసులోను, ముగ్గురికి ఏడాది వయసులోను పెండ్లి జరిగింది. ఏడాది శిశువుల ధర ఒక్కొక్కరికి 350 రూపాయలనుండి 400 ల దాకా ఉండింది. విడ్డూరమనిపించవచ్చు గానీ, ఒక్కోసారి కడుపులోని పిల్లలకు బేరాలు కుదిరాయి. ఈ స్థితి సమాజానికి అవమానకరమైనది."[18]

"మద్రాసు రాష్ట్రంలో బ్రాహ్మణ స్త్రీలలో మూడింట ఒక భాగం మంది వితంతువులు."[19]

పరవస్తు వెంకట రంగాచార్యులవారి 'స్త్రీ పునర్వివాహ సంగ్రహము' ఆంధ్రదేశంలో వితంతు వివాహ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చింది. 1879 లో వీరేశలింగం కార్యదర్శిగా రాజమండ్రిలో వితంతు వివాహ సంఘం ఏర్పడింది. కాకినాడలో పైడా రామక్రిష్ణయ్య ఆర్థిక, హార్థిక సహకారాలతో 'వితంతు పునర్వివాహ సంఘం' ఏర్పడింది. ఈ ఉద్యమం గుంటూరును కూడా ప్రభావితం చేసింది. అక్కడ ఉన్నవ లక్ష్మీనారాయణ ఈ ఉద్యమాన్ని నిర్వహించారు. ఈ ఉద్యమ ఫలితంగా "1905 నాటికి జరిగిన మొత్తం వితంతు పునర్వివాహాల సంఖ్య 63. (ఆంధ్ర సంస్కర్తల కృషి వల్ల మద్రాసులోను, గుంటూరులోను, బళ్ళారిలోనూ కలిపి 63 పునర్వివాహాలు జరిగాయి.)"[20]

స్త్రీ విద్యను సమర్థిస్తూ, వ్యతిరేకించేవారి వాదనలను పరాస్తం చేస్తూ 'వివేకవర్ధిని'లో ఇంకా అనేక ఇతర పత్రికలలో వీరేశలింగం వ్యాసాలు రాశారు. రాజమండ్రిలో, ఒక బాలికల పాఠశాల ప్రారంభించారు. ఈయన పత్రిక 'సతీహితబోధిని' స్త్రీల ఆరోగ్యం, పిల్లల ఆరోగ్యం మొదలైన అనేక విషయాలపై జ్ఞానదాయకమైన రచనలు ప్రచురించి స్త్రీల అభివృద్ధికై పాటుపడింది. ఆ తరువాత పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరం, గుంటూరు మొదలైన చోట్ల బాలికల పాఠశాలలు స్థాపించబడ్డాయి. స్త్రీ విద్యకై. స్త్రీల అభివృద్ధికై పాటుపడేందుకు అనేక మహిళా సంఘాలు ఏర్పడ్డాయి. వాటిలో హిందూ బాలికల సంఘం, బృందావనపుర స్త్రీ సమాజం, స్త్రీ విద్యాభివర్ధిని సమాజం, శ్రీ భారతీ సమాజం, శారదా మందిరం మొదలైనవి ఉన్నాయి.

వేశ్యావృత్తిని నిర్మూలించాలని, ఆ వృత్తిని కులవృత్తిగా గల భోగంవారిని మేజువాణీల పేరిట వివాహాలకు, విందులకు ఆహ్వానించరాదని ఉద్యమాన్ని చేపట్టారు. ఈ వృత్తి నుండి స్త్రీలను రక్షించాలని చూశారు. వారిని ప్రజలు నీచంగా చూసేవారు. ఎవరిని అయినా హేళన చేయటానికి 'భోగం వాళ్ళలా' అనేవారు. నృత్యం, సంగీతం మొదలైన కళలు వారు మాత్రమే నేర్వతగ్గ కళలనే అభిప్రాయం పోగొట్టటానికి వాటిని తమ ఇంటిలోని స్త్రీలచే అభ్యసింప చేయాలని ప్రచారం చేశారు. ఈ ఉద్యమానికి కళావంతుల నుండి బాగా స్పందన వచ్చింది. వారి పరిస్థితి మెరుగు పరచటానికి భాస్కర్ల ఈశ్వరుడు, యామినీ పూర్ణ తిలకమ్మ మొదలగువారు చాలా కృషి చేశారు.

మద్యపానం వల్ల జరిగే నష్టాల గురించి ప్రచారం చేసి మద్యపాన వ్యతిరేక ఉద్యమం నడిపారు.

ప్రజలలో అనేక మూఢ విశ్వాసాలుండేవి. మడి, మైల మొదలైన ఆచారాల పట్ల చాలా నమ్మకాలుండేవి. ఇక్కడి కులవ్యవస్థ కారణంగా నిమ్నకులాల వాళ్ళని, బ్రాహ్మణేతర కులాల వాళ్ళని చాలా నీచంగా చూసేవారు. విద్య అనేది బ్రాహ్మణులకు మాత్రమే అందుబాటులో ఉండేది. సంస్కృతం మొదలైనవి చదవటానికి బ్రాహ్మణులు మాత్రమే అర్హులుగా భావించారు. బ్రాహ్మణాధిక్యతని భరించలేక కొందరు కులభేదం లేని క్రైస్తవమతాన్ని తీసుకున్నారు.

1910 తర్వాత మెల్లమెల్లగా వీరేశలింగం చేపట్టిన సంఘ సంస్కరణోద్యమానికి ప్రాముఖ్యం తగ్గటం మొదలైంది. సాంఘిక సంస్కరణ ముందా? రాజకీయ స్వాతంత్ర్యం

ముందా? అనే ప్రశ్న తలెత్తింది. రెండూ ఒకేసారి జరగటం వల్ల ప్రజల పరిస్థితి అభివృద్ధి చెందుతుందని సంఘసంస్కర్తలు అభిప్రాయపడ్డారు. దేశానికి స్వాతంత్ర్యం వస్తే మన సంఘాన్ని సంస్కరించుకునే పనులు సులువుగా చేయవచ్చు కనుక రాజకీయ స్వాతంత్ర్యాన్ని పొందడం ముఖ్యమని రాజకీయవాదులు అభిప్రాయపడ్డారు. రాజకీయ స్వాతంత్ర్యానికే ప్రాధాన్యం పెరగటంతో సంఘ సంస్కరణోద్యమం తగ్గుముఖం పట్టింది.

నిమ్నకులాల వారిని అంటరాదు అనటంతో పాటుగా కులవివక్ష విపరీతంగా ఉండేది. ఒక కులం వారితో మరొక కులం వారికి పంక్తిభోజనాలు ఉండేవి కావు. కులవివక్ష లేకుండా ఎవరైనా ప్రవర్తిస్తే వారిని వెలి వేసేవారు. ఉన్నవ లక్ష్మీనారాయణ గారితో కలిసి భోజనం చేయటాన్ని గుంటూరు జిల్లాలోని కమ్మవారు నిషేధించారు. కులవివక్ష లేని ఆయనకు ఏ హోటలులోనూ భోజనం పెట్టేవారు కాదు. 1921 లో గుంటూరులో అస్పృశ్యతా వ్యతిరేక మహాసభ జరిగింది. ఆంధ్రలోని కాంగ్రెస్ నాయకులెవరూ దీనికి హాజరు కాలేదు. సమాజంలో ఉన్న బ్రాహ్మణాధిక్యత, వారి నిరంకుశత్వం బ్రాహ్మణేతర ఉద్యమానికి దారి తీశాయి. 1931 లో ఆంధ్రలో జస్టిస్ పార్టీ పుట్టింది.

"త్రిపురనేని రామస్వామి చౌదరి, తాపీ ధర్మారావు లాంటి ఉత్తమ రచయితలూ, గూడవల్లి రామబ్రహ్మం లాంటి సుప్రసిద్ధ పత్రికాసంపాదకులూ, కట్టమంచి రామలింగారెడ్డి లాంటి మేధావులూ, సి. కాళిందరెడ్డి వంటి కొమ్ములు తిరిగిన లాయర్లూ నాటి జస్టిస్ పార్టీలో ఉండేవారు. వీరంతా బ్రాహ్మణేతరులే."

త్రిపురనేని రామస్వామి చౌదరి శంబుకవధ, సూతపురాణం, ఖూనీ మొదలగు రచనల ద్వారా బ్రాహ్మణాధిక్యతని నిరసించి హేతువాద దృక్పథాన్ని ప్రచారం చేశారు. గూడవల్లి రామబ్రహ్మం రైతుబిడ్డ, మాలపిల్ల వంటి సినిమాలు తీసి బ్రాహ్మణ ఛాందస భావాల్ని, జమీందార్ల నిరంకుశత్వాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించి అభ్యుదయ భావాల్ని ప్రచారం చేశారు. ఇనుపకచ్చడాలు, పెళ్ళి – దాని పుట్టు పూర్వోత్తరాలు, దేవాలయాలపై బూతు బొమ్మలెందుకు? మొదలైన వ్యాసాల ద్వారా తాపీ ధర్మారావు హేతువాద, నాస్తిక భావాల్ని ప్రచారం చేశారు. జస్టిస్ పార్టీ 20 సంవత్సరాలు ఉనికిలో ఉంది. 1935 తర్వాత కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీలో సోషలిస్టులు, కమ్యూనిస్టులు సంఘ సంస్కరణోద్యమాన్ని చేపట్టి వితంతు వివాహాలు, వర్ణాంతర వివాహాలు మొదలైనవి జరిపి కొనసాగించారు.

1.3. సారస్వత పరిస్థితులు

"మహాకవి గురజాడ అప్పారావు మొదటిసారి ముత్యాలసరాలు గుచ్చిన ఏడు (1910 లో) అప్పుడే తెలుగు కవిత్వంలో విప్లవశకం ఆరంభమైంది." – శ్రీ శ్రీ

"కందుకూరి సాంఘిక విప్లవమును గిడుగు భాషా విప్లవమును తనలో సమన్వయించుకొని, సరికొత్త సాహిత్య విప్లవము లేవనెత్తిన నవయుగ వైతాళికుడాయన."

సాహిత్యానికి లక్ష్యం సామాజిక ప్రయోజనం అనే అభ్యుదయ దృక్పథంతో పందొమ్మిదవ శతాబ్ది ఉత్తరార్థంలో కందుకూరి, గురజాడ మొదలైన రచయితలు సామాజిక సమస్యలను ఇతివృత్తంగా తీసుకుని రచనలు సాగించారు. ఆ కాలంలోనే గురజాడ, గిడుగు రామ్మూర్తిపంతులు కలిసి వ్యావహారిక భాషావాదాన్ని ఒక ఉద్యమంగా నడిపించి కృతకృత్యులయ్యారు. కొంచెం ఇంచుమించుగా అదే సమయంలో రాయప్రోలు సుబ్బారావు గారి కవిత్వం వచ్చింది. రాయప్రోలు కవిత్వం భావకవులను ఉత్తేజితులను చేస్తే గురజాడ కవిత్వం అభ్యుదయ కవులకు అడుగుజాడే అయ్యింది.

ఆంగ్లపాలన మన దేశం మీద, మన సంస్కృతి మీద ఎలాగయితే ప్రభావం కలిగించిందో అదే విధంగా సాహిత్యం మీద తన ప్రభావాన్ని చూపించింది. ఆంగ్లవిద్య ద్వారా పరిచయమైన కాల్పనిక కవిత్వం ఆంధ్రదేశంలో భావకవిత్వానికి బీజాలు వేసింది. అందుకే ఆంగ్లకవిత్వంలో ఆంగ్లకవుల పోకడలు ప్రతిఫలించడమే కాకుండా కొన్ని ఆంగ్లవ్యాసాలకు అనువాదాలు కూడా వచ్చాయి. భావకవిత్వానికి రాయప్రోలు ఆద్యుడైతే దేవులపల్లి కృష్ణశాస్త్రి పేరెన్నిక గన్నవాడు. రాయప్రోలు కవిత్వాన్ని అంది పుచ్చుకుని అబ్బూరి రామకృష్ణారావు, దువ్వూరి రామిరెడ్డి, తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రి, నాయని సుబ్బారావు, విశ్వనాథ సత్యనారాయణ, శ్రీశ్రీ మొదలైనవారంతా భావకవిత్వం రాశారు.

భావకవిత్వం ద్వారా వచ్చిన మార్పులలో సరళత, సౌకుమార్యం అనే గుణాలు కొన్ని. ఏ పురాణాలలోని గాథలనో తీసుకుని కావ్యం రాయడం కాకుండా సమకాలీన సమాజానికి సంబంధించిన విషయాలను ఇతివృత్తంగా తీసుకుని రాయటం కొంతవరకు జరిగింది. వీరు స్త్రీలయొక్క అంగాంగ సౌందర్యం కన్నా హృదయ సౌందర్యానికి ప్రాధాన్యమిచ్చారు. వీరు ఎక్కువగా ప్రణయ కవిత్వానికే ప్రాముఖ్యమిచ్చారు.

భావకవులలో ప్రణయ కవిత్వం చెప్పనివారు అరుదని చెప్పవచ్చు. ఈ ప్రణయకవిత్వం ఊహా ప్రేయసినో, సజీవమూర్తులనో ఆలంబనగా చేసుకుని సాగింది. వీరు వియోగాన్ని, విషాదాన్ని కూడా ప్రేమించి కవిత్వం రాశారు. వీరు ప్రకృతి సౌందర్యాన్ని ఆరాధించారు. కృష్ణశాస్త్రి అయితే తాను ప్రకృతిలో భాగమైతే బాగుండును అనే మక్కువతో 'ఆకులో ఆకునై' 'కొమ్మలో కొమ్మనై' 'నునులేత రెమ్మనై' అంటూ కవిత్వం రాశారు. భావకవి తన చుట్టూ ఉన్న ప్రకృతినే కాకుండా తాను పుట్టి పెరిగిన పల్లెల్ని కూడా ప్రేమించాడు. అందువలననే దువ్వూరి రామిరెడ్డి గారు తన 'కృషీవలుడు' రచనలోను తుమ్మల సీతారామమూర్తి గారు 'పరిగపంట' మొదలైన రచనలలోను పల్లెల్లోని జీవితాన్ని కొంతవరకు చూపించగలిగారు.

సాహిత్యం సమాజానికి అతీతంగా ఉండదు. అందువల్ల భావకవి ప్రకృతిని ఆరాధించినా, స్మృతి కావ్యాలూ ప్రణయకవిత్వాలూ, ఆత్మాశ్రయ కవిత్వాలూ రాసినప్పటికీ, నాటి రాజకీయ పరిస్థితి ననుసరించి జరిగిన స్వదేశీ ఉద్యమానికి స్పందించాడు. అందుకు నిదర్శనం రాయప్రోలు వారి " ఏ దేశమేగినా, ఎందుకాలిడినా, ఏ పీఠమెక్కినా, ఎవ్వరెదురైనా, పొగడరా నీ తల్లి భూమి భారతిని ", " దారులండగించిన ... మేలు కీళ్ళు సహించి గోపాలకృష్ణ", మంగినపూడి వెంకట శర్మ గారి "నా స్వకీయంబిది, నా జన్మభూమి ఇది యందు మనసార నెన్నడు గాని" , దువ్వూరి రామిరెడ్డి గారి 'నైవేద్యం' 'మాతృమందిరం', బసవరాజు అప్పారావు గారి 'కొల్లాయి గట్టితేనేమి' మొదలైనవి. ఇవే కాకుండా అస్పృశ్యతకు వ్యతిరేకంగా వచ్చిన కవిత్వం కూడా ఉంది. అందులో గుర్రం జాషువా కవిత్వం ప్రధానమైనది. అస్పృశ్యుల పరిస్థితులను కళ్ళకు కట్టినట్లు చూపించి హృదయాలను కదిలిస్తుంది. [23]

భావకవులు సమాజ పరిస్థితులకు స్పందించినప్పటికీ, సమాజంలో జరుగుతున్న మార్పులకు అనుగుణంగా సాహిత్యాన్ని ఒక చోదకశక్తిగా తయారు చేయాలనే విషయాన్ని గుర్తించలేదనే చెప్పాలి. ఈ కారణంగానే జాతీయోద్యమానికి స్పందించి దేశభక్తి కవిత్వం రాసినప్పటికీ చాలావరకు కృష్ణశాస్త్రి రచనలకు అనుకరణలుగా ప్రణయకవిత్వం రావటం మొదలైంది. ఈ విషయాలను వివరిస్తూ డా. సి. నారాయణరెడ్డి ఈ విధంగా రాశారు.

" 1930 నుండి ఈ కవితాశాఖ క్షీణదశకు రాసాగినది. కృష్ణరాయల కాలంలో వెలువడిన ప్రబంధ కవిత్వమునకు, తంజావూరు యుగంలో బయలుదేరిన

ప్రబంధములకు ఎంత అంతరమున్నదో, 1920-30 ల మధ్య కాలమున వెలువడిన భావకవిత్వ రచనలకు అంతటి అంతరము పొడసూపినది." దీన్ని బట్టి ఆ కవిత్వంలో సారం లేకుండా పిప్పే మిగులుతోందని చెప్పవచ్చు.

భావకవిత్వం మీద తిరుగుబాటు చేస్తూ శిష్ట్లా 'విష్ణుధనువు' లో "ప్రయత్నపూర్వకముగా ఛందస్సును వికృత మొనర్చినాడు. కొన్ని పద్యపు తునకలను, కొన్ని సూత్రాబద్ధ గేయ ఖండములను, కొన్ని వచనపు తుంటలను ఇష్టము వచ్చినట్లు పేర్చి విశృంఖల మనస్తత్వమును ప్రదర్శించాడు."

"నా ఈ వచనపద్యాలనే దుడ్డుకర్రల్తో
పద్యాల నడుములే విరగదంతాను
చిన్నయసూరి బాల వ్యాకరణాన్ని / చాలా దండిస్తాను"
"అనుసరిస్తాను నవీన పంథా, కానీ
భావకవిని మాత్రము కాన్నే
నహంభావ కవిని" అన్నాడు. పఠాభి

నారాయణబాబు 'కదన కుతూహల రాగం' లో

"రుధిర జ్యోతిర్ జ్వలనా లలనా ప్రియుండ
విప్లవ రుషిని, విద్రోహ కవిని, ఆహవ
రంగం నా హృదంతరంగం, పగిలిన
ఖలేజాలే నా పాటల జలేజాలు" అన్నాడు.

భావకవిత్వ వ్యతిరేకోద్యమాన్ని ప్రతిబింబించిన పత్రిక ముద్దుకృష్ణ సంపాదకత్వంలో వచ్చిన 'జ్వాల'.

ఆ సమయంలో ఈ కవిత్వం మీద తిరుగుబాటుగా పాశ్చాత్య సాహిత్యాన్ని అధ్యయనం చేసి 'లండన్ మేనిఫెస్టో'తో ఉత్తేజితుడైన శ్రీశ్రీ 'మరో ప్రపంచం మరో ప్రపంచం పిలిచింది' అనీ, 'పొలాలనన్నీ హలాలదున్నీ' అనీ, 'ఛందో సర్ప పరిష్వంగం' వీడి, 'శ్మశానాల్లాంటి నిఘంటువులు' దాటి, 'జాతి జనులు పాడుకునే మంత్రం'గా తన కవిత్వాన్ని వినిపిస్తానన్నాడు. 'ప్రపంచ పోరాట చరిత్ర మొత్తం వర్గపోరాటాల చరిత్రే' అనే సిద్ధాంతాన్ని అర్థం చేసుకున్న శ్రీశ్రీ 'ఏ దేశచరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం / నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం' అన్నాడు.

" నైలునదీ నాగరికతలో / సామాన్యుని జీవనమెట్టిది
తాజ్‌మహల్ నిర్మాణానికి / రాళ్ళెత్తిన కూలీలెవ్వరు"

అని ప్రశ్నించాడు.

"చీనాలో రిక్షావాలా
చెక్ దేశపు గని పనిమనిషి
ఖండాంతర నానాజాతులు
చారిత్రక యదార్థ తత్వం
చాటిస్తారొక గొంతుకతో "

అంటూ ఎప్పటికైనా ఈ ప్రపంచానికి శ్రామికవర్గ నియంతృత్వం తప్పదన్నాడు. శ్రీశ్రీ సహచర్యంలో ఆ తరవాత పురిపండా అప్పలస్వామి, ముద్దుకృష్ణ, పాలగుమ్మి పద్మరాజు మొదలైనవారు నూతన రీతులలో కవిత్వం మొదలెట్టారు. ఈ సమయానికి సోషలిస్టు భావాలున్న వాళ్ళు, కమ్యూనిస్టులు కూడా కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీలో చేరి పని చేస్తున్నారు.

మార్క్సిస్ట్ దృక్పథం భారతదేశంలో అప్పటికే కొంతవరకు వ్యాపించింది. 1935 లో లక్నో కాంగ్రెస్‌లో సోషలిస్ట్ భావాలు కలిగిన జవహర్ లాల్ నెహ్రూ ఇచ్చిన ఉపన్యాసం పలువుర్ని ఉత్తేజితుల్ని చేసింది. ఆ తర్వాత మున్షీ ప్రేమచంద్ అధ్యక్షతన 1936 ఏప్రిల్ 10 న అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడింది. 'రచయితల కర్తవ్యము వినోద విలాసములను చిత్రించుట కానే కాదని ప్రస్తుత సమాజమును దివ్విటీ పట్టి నడిపించుటయే అతని ధ్యేయమ'ని అధ్యక్షోపన్యాసంలో స్పష్టం చేశారు.

1943 లో ఆంధ్రలో అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడింది. 1944 లో 'నయాగరా' కవితల సంపుటి వెలువడింది. ఆ తర్వాత ఆరుద్ర, దాశరథి, నారపరెడ్డి, సోమసుందర్, అనిశెట్టి మొదలైన వారెందరో ప్రగతిశీల రచనలు చేసి అభ్యుదయ కవులుగా పేరు పొందారు. 1957 వరకు సాగిన ఈ రచనలలో కమ్యూనిస్ట్ పార్టీ నాయకత్వంలో తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న వారు, దానికి మద్దతు నిచ్చినవారు రాసినవే – ఎక్కువగా ఉన్నాయి.

గురజాడ ప్రారంభించిన చిన్న కథ శ్రీపాద, చలం, శ్రీశ్రీ, కొడవటిగంటి కుటుంబరావు మొదలైనవారి చేతుల్లో పెరిగి పెద్దయ్యి ప్రజలకు చాలా చేరువయింది.

కందుకూరి నవల, ప్రహసనాలు మొదలైన ప్రక్రియలను ప్రాచుర్యంలోకి తీసుకొచ్చారు. ఆ తరువాత చిలకమర్తి లక్ష్మీ నరసింహంగారు రాసిన చారిత్రక నవలలు, గణపతి మొదలైన ప్రహసనాలు వచ్చాయి. ఉన్నవ లక్ష్మీనారాయణ గారు రాసిన 'మాలపల్లి' నవల ప్రభుత్వ నిషేధానికి గురయ్యి, ప్రజల ఆదరణకు పాత్రమయింది. విశ్వనాథ, అడవి బాపిరాజు, మొదలైనవారి కలం నుంచి అనేక నవలలు వెలువడ్డాయి. అనేక ఆంగ్ల, వంగ తదితర భాషల నవలలు తెలుగులోకి అనువదించ బడ్డాయి. చలం, గోపిచంద్, కొడవటిగంటి కుటుంబరావు మొదలగు వారి నవలలు తెలుగు సాహిత్యాన్ని సంపన్నం చేశాయి.

ఈ నేపథ్యంలో గరిమెళ్ళ చేసిన సాహిత్య కృషి తరువాతి అధ్యాయాల్లో పరిశీలిస్తాను.

* * *

ఫుట్ నోట్స్

1. Ram Gopal -- Indian Muslims. Page -- 93
2. బి. జితేందర్ రెడ్డి – భారత స్వాతంత్ర్య సమరంలోని ఉజ్జ్వల ఘట్టాలు (1958–1947) పేజ్–47
3. అదే, పేజ్ – 79
4. అదే, పేజ్ – 71
5. అదే, పేజ్ – 80
6. ఇ. ఎం. ఎస్. నంబూద్రిపాద్, భారత స్వాతంత్ర్య పోరాట చరిత్ర, పేజ్ – 209
7. అదే పేజ్ – 85
8. అదే, పేజ్ – 97
9. బండి గోపాల రెడ్డి (బంగోరె) – మాలపల్లిపై నిషేధాలు పేజ్ – 24
10. అదే, పేజ్ – 116
11. ఇ. ఎం. ఎస్. నంబూద్రిపాద్, – భారత స్వాతంత్ర్య పోరాట చరిత్ర, పేజ్ – 285
12. యశ్ పాల్, – సింహావలోకనం (అను.) ఆలూరి భుజంగరావు
13. ముదార్ వేణు – చారిత్రక పత్రం, సృజన, మార్చి, 1974
14. కె. కె. రంగనాథాచార్యులు – నూరేళ్ళ తెలుగునాడు, పేజ్ – XLI
15. ఇ. ఎం. ఎస్. నంబూద్రిపాద్, భారత స్వాతంత్ర్య పోరాట చరిత్ర, పేజ్ – 106
16. సి. వి. – ఆంధ్రలో సాంఘిక తిరుగుబాటు ఉద్యమాలు, పేజ్ – 128
17. అదే, పేజ్ – 129
18. గురజాడ వెంకట అప్పారావు – కన్యాశుల్కం మొదటి ముద్రణ పీఠిక
19. వకుళాభరణం రామకృష్ణ – ఆంధ్రలో సంస్కరణోద్యమాలు, పేజ్ – 70
20. అదే, పేజ్ – 83
21. సి. వి. – ఆంధ్రలో సాంఘిక తిరుగుబాటు ఉద్యమాలు, పేజ్ – 20
22. డాక్టర్ సి. నారాయణరెడ్డి – ఆధునికాంధ్ర కవిత్వము
23. అదే

❋ ❋ ❋

అధ్యాయము - 2

పాటల పరిశీలన

శ్రీ గరిమెళ్ళ సత్యనారాయణ దాదాపు 1910 నుంచి సాహిత్యకృషి సాగించారు. ఈయన కలం నుంచి అనేక పాటలు, పద్యాలు, వ్యాసాలు వెలువడ్డాయి. పరిశోధనా సౌలభ్యం కోసం వ్యాసాలను తరువాతి అధ్యాయంలో పరిశీలిస్తాను. ఈ అధ్యాయంలో గరిమెళ్ళ పాటలను పరిశీలిస్తున్నాను.

1915 లో గురజాడ అప్పారావు గారి నిర్యాణం సందర్భంలో రాసిన 'వాడుక తెనుగు' అనే గేయం నుంచి ఆయన రచనలు మనకు దొరుకుతున్నాయి. 1927 లో 'కవులు రాజకీయాల నుంచి కవిత్వ విషయాలు ఎన్నుకోవాలి' అన్న గరిమెళ్ళ అప్పటికే దానిని ఆచరించి చూపారు. రాజకీయాలను ప్రజలకు చేరువగా తీసుకెళ్ళి వారిని చైతన్యవంతులను చేయాలనే అభిప్రాయంతో ఆయన అనేక పాటలను జానపద బాణీల్లో రాశారు. ఆయన పాటల్లో అత్యంత ప్రజాదరణ పొందిన మొదటి పాట 'మాకొద్దీ తెల్లదొరతనము'. ఆ రోజుల్లో ఈ పాటను 80 శాతం ప్రజలు పాడుకునేవారంటే అతిశయోక్తి కాదు. ఆ పాట ఎంత ప్రజాదరణ పొందినదో ప్రభుత్వానికి అంతకంటే ఎక్కువ భయాన్ని కలిగించింది. 1922 లో ప్రభుత్వం ఆ పాటను నిషేధించి రచయితను జైల్లో పెట్టింది.

కానీ, ఈ నిషేధాలూ రాజకీయాలూ ఏమీ ఎరగని చిన్నపిల్లలు పాడుతోంటే ఏం చెయ్యాలో ఎందులో రాసుంది? ఏ ఆటలాడుకుంటూనో, నడుస్తూనో పిల్లలు ఆ పాట పాడేవారట. అప్పుడు ఏం చెయ్యాలో తెలియని పోలీసులు ఒక దెబ్బ కొట్టి లాఠీ ఝుళిపించేవారట.[1]

ఆ రోజుల్లో పెద్దాపురం దగ్గరవున్న ఒక తోటలో పెళ్ళి జరుగుతున్నప్పుడు పెళ్ళివారు బ్యాండ్ వారిని 'మాకొద్దీ తెల్లదొరతనము' వాయించమని అడిగారట. ఇది తెల్సిన పోలీసులు ఆ పాట వాయించిన బ్యాండ్ వారిని చితకగొట్టారట.

ఎ.బి. నాగేశ్వర్రావు, వంగవీటి దీక్షితులు[2], గౌడేపల్లి మల్లిఖార్జునుడు[3], విశాఖపట్నంలో వైద్యకోర్సు[4] చదివే రోజుల్లో దేశభక్తిపూరితమైన నాటకం వేస్తూ 'మాకొద్దీ తెల్లదొరతనం' పాడినందుకు, రంగులైనా తుడుచుకోనివ్వకుండా పోలీసులు వారిని తీసుకెళ్ళి తన్ని నాలుగైదు నెలలు జైల్లో పెట్టారు.

స్వరాజ్యగీతాలు రెండు భాగాలూ కలిపి 39 పాటలున్నాయి[5]. కల్లు మానివేయమని గాంధీ ఇచ్చిన పిలుపు ననుసరించి త్రివిధ బహిష్కరణను ఆచరించమని, రాట్నం వడకి నూలు తీసి ఖద్దరు ధరించమని, అదే మన దరిద్రం తీరుస్తుందంటూ ప్రబోధించారు. కొన్ని విషయాల గురించి రెండు, మూడు బాణీల్లో పాటలు రాశారు.

సంక్రాంతి మాసంలో భక్తులు తెల్లవారుజామున నగర సంకీర్తన చేస్తారు. ఆ సమయంలో స్వరాజ్యగీతాలు మొదటి భాగంలో ఉన్న 'మేలుకొలుపు' పాటని పాడేవారు[6]. విషయాల్ని వివరించటం కోసం గరిమెళ్ళ ఎక్కువగా పాటనే ఎన్నుకున్నారు. కనుక పాట యొక్క ప్రాముఖ్యతని, ఇటువంటి విషయాలను చెప్పటం కోసం ఆయన పాటనే ఎంచుకోవటానికి గల కారణాలను పరిశీలిస్తాను.

పాట యొక్క ప్రాచీనత గురించి చెపుతూ 'వేదాలు ఎప్పటి నాటివని అడిగితే కొండల్లాంటి పండితులు కుండలాలు తడువుతారు... ఏ సూక్తం ఏ ఋషిదంటే పేరు పేరునా చెప్పే పెట్టారు. అదే పల్లె సాహిత్యం ఎప్పటిదంటే, అందులో ఏ పాట ఎవరిదంటే పులుకూ పులుకూ చూస్తారు. వారికే కాదు ఎవరికీ కాళ్ళు చేతులూ అందవు"[7] అంటారు పురిపండా అప్పలస్వామి గారు.

ప్రాచీన కళారూపమైన పాట నిత్య జీవితంలో ఎంతగా అల్లుకుపోయిందో చెపుతూ "పాటలు లేనిదే బ్రతుకే లేదా అన్పిస్తుంది. లేచింది మొదలు పడుకునే వరకు ఆటకు పాట, గెంతుకు పాట, నిద్రకు పాట, పనికి పాట, వెక్కిరింతకు పాట, పూజకు పాట, నీతికి పాట, పాపకు పాట, అటుచూసిన పాట, ఇటుచూసిన పాట, బ్రతుకే పాట, శ్రామికులు ఏ పని చేస్తున్నా పాట లేనిదే చేయరు"[8] అంటారు ఎల్లోరా.

అనేక కారణాల వల్ల మన దేశంలో ప్రజలు అధికశాతం నిరక్షరాస్యులు. అక్షరాస్యులైనా, నిరక్షరాస్యులైనా అధిక శాతం ఉన్న వాళ్ళు కలిసి రాకపోతే ఉద్యమాలు మంచి ఫలితాలనివ్వవు. ఉద్యమాలలోకి ప్రజలు రావాలంటే దానికి సంబంధించిన విషయాలు వాళ్ళకి అర్థం అవ్వాలి. అందువల్ల 20 వ శతాబ్ది ప్రారంభంలో ఉన్న రాజకీయ పరిస్థితుల్ని అర్థమయ్యేలా చెప్పటం కోసం, స్వాతంత్ర్య

కాంక్షని పెంచటం కోసం ప్రజల జీవితాల్లో అల్లుకుపోయిన పాటనే గరిమెళ్ళ సాధనంగా తీసుకున్నారు. పాటను సాధనంగా ఎంచుకుని రాజకీయాలను రకరకాల జనం దగ్గరకి ఆయన చెప్పే ఎలా తీసుకుపోయారో చెపుతున్న క్రమంలో ఆయన పాటల్ని పరిచయం చేస్తాను.

స్వరాజ్యగీతాలు మొదటి భాగం –

"వందనమిదే గైకొనుమీ – భారత జననీ
భారత జననీ – మా పాలిటి రాణీ"

అంటూ 'మాతృస్తవం' తో మొదలవుతుంది. ఇది భారతదేశాన్ని తల్లిగా సంబోధిస్తూ వందనాలర్పిస్తూ రాసిన గీతం. ఈ దేశం సకల పురాణాలకు పుట్టినిల్లని, ఉపనిషత్తులుద్భవించిన దేశమని, సకల సంపదలు గల దేశమనీ, ముప్పదికోట్ల జనులు బిడ్డలుగా గల తల్లి భరతమాత అని కీర్తించారు. ఈ దేశమాత జాతీయోద్యమ కాలంనాటి దేశమాత. అందుకే ఆమెను స్వరాజ్యదీక్ష గొనిన సత్యమూర్తిని అని, అసహాయవర్తిని అని స్తుతించారు.

'మేలుకొలుపు' – ఇది స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొనకుండా ఒడ్డున నిలబడ్డ వాళ్లందరిపై విసిరిన విసురు.

"పొడుపు కొండమీద – పొడిచెనల్లదే ప్రొద్దు
తడయకింకను వేగలేరా – భారత తల్లికి పుట్టితివౌరా"

అంటూ మొదలవుతుంది ఇది. "భారత తల్లికి పుట్టితివౌరా " అనటంలో తప్పు చేసినపుడు పెద్ద వాళ్ళు చిన్నవాళ్ళను 'మనిషివి కావూ' అని మందలించే ఉద్ధృతి కనిపిస్తుంది. అందులోంచి తేరుకునేలోగానే

"వేగుచుక్కతోడ వేకువ మేల్కాంచి
యోగ ముద్రలు మరిచినావు – ఓరీ
భోగాసక్తుడవైనావు"
అంటూ భోగాల కలవాటుపడి ఎలా చెడిపోయాడో చెప్పటం మొదలెడతాడు.
"తెల్లవారేదాక దీర్ఘనిద్రను పొంది –
యిల్లు దొంగల కిచ్చినావూ –
నీ ముల్లె మూటయు గోల్పడ్డావు"

అనడంలో బ్రిటిషువాళ్ళు మెల్లిమెల్లిగా దేశంలోకి వస్తూవుంటే తెలుసుకోకుండా ఊరుకుండి పోయారనే ఎత్తిపొడుపు ఉంది. ఈ రోజు కళ్ళు తెరిచేసరికి మొత్తం సర్వనాశనమైంది అంటూ

"సృష్టి యెల్లయు లేచి – సూర్యుని పూజింప వెష్ట యింకను
తగలలేదా – నీ భ్రష్టతకిక నంతురాదా"

అంటూ భారతదేశం మొత్తం ఉద్యమాభిముఖంగా నడుస్తోంది, ఇప్పటిక్కూడా నీకు కదలాలనిపించటం లేదా అంటూనే 'నష్టపోయింది చాలు', ఇంక ముందుకు నడు, కాంగ్రెస్ గీతాన్ని విను, ఆచరించు అంటారు. మళ్ళీ మెత్తగా

"జాలమయ్యేనని డీలు పొందబోకు – చాలునురా
ఆరునెలలు ఇంక నారు నురవాడు వెన్నెలలు "

అని బుజ్జగించి భుజం తడతారు. గాంధీ అంతటివాడు మనవెంట ఉన్నాడంటారు.

ముఖ్యంగా సామాజిక ప్రయోజనాన్ని ఆశించిన కవి తానెవరికి చెప్పదల్చుకున్నాడో వారిని, వారి మనస్తత్వాలను అంచనా వేసి సూటిగా చెప్పగలగాలి. ఈ విషయంలో గరిమెళ్ళ సిద్ధహస్తుడు. జాతీయోద్యమంలో పాల్గొనని మధ్యతరగతి వారి నెవరినైనా సరే ఆలోచింప చేస్తుంది ఈ పాట.

"కొయ్యడ కొయ్యడ ఇలాగ రారా
కోటి వింతలు చెపుతారయ్యో కొయ్యోడ"

అంటూ "కొయ్యడ గీతములు" మొదలవుతాయి. "కొయ్యడ కొయ్యడ ఇలాగ రారా" అన్న పాదంలోనే కవి తన శ్రోతలుగా ఎవర్ని ఎంచుకున్నారో తెలుస్తోంది. ఈ కొయ్యడ వరసగీతాలు పల్లెటూళ్ళలో పొలాల్లో పనులు చేసుకుని వచ్చిన పాటకజనం రాత్రి వేళ ఏ చెట్టు కిందో, రచ్చబండ దగ్గరో పాడుకునేవి. అలాంటి సమయంలో వాళ్ళు ఆ బాణీల్లో జానపద కథలు, పురాణ కథలు మొదలైనవి చెప్పుకుంటారు. అలసట మరిచిపోవటానికి, మనసుకు ఉల్లాసం కలిగించటానికి వారికి అది ఒక సాధనం. తాను చెప్పే కథ పురాణకథ, జానపద కథ కాదని చెప్పటానికి 'నే చెప్పినదల్ల విని తరువాత తప్పులు ఉంటే తిట్టరో' అంటూ న్యాయాన్యాయ విచారణ వాళ్ళకే వదిలేశారు. కథ చెపుతానంటూనే

“ కొయ్యాడంటే కోపంవస్తే కొరడా దెబ్బలు కాస్తావా
ఆ కొయ్యకంటే గొప్పోడవైతే కొరడా దెబ్బలు కాస్తావా”

అంటారు. శ్రమపడి, అలసిపోయి కాస్త చల్లగాలికి బయటికొచ్చి తుండు దులుపుకుని ఏదో విందామని కూర్చున్నవాళ్ళకి “కొయ్యకంటే గొప్పోడవైతే కొరడా దెబ్బలు కాస్తావా” అనగానే చిరాకు నెత్తికెక్కుతుంది.

“ సీమనుంచి ప్రభువులొచ్చి సేతులిరిసి గట్టేరురో
సేతులతోటి రాయకూడదు, సెప్పకూడదు నోటితో
కాళ్ళతోటి యీ ఊరొదిలి పొరుగూరెల్ల కూడదురో ”

అంటూ వాళ్ళలో పెరుగుతున్న కోపాన్ని ఒక్కసారిగా దారి మళ్ళిస్తారు. అలా అంటూనే బ్రిటిష్ వాళ్ళు చేసిన అన్యాయాలను అంచెలంచెలుగా చెపుతూ, మనలో కొంచెం తెలివైనవాళ్ళని కూడా హెచ్చు జీతాలు మొదలైనవి ఇచ్చి, ఎలా దద్దమ్మల్ని చేశారో చెపుతారు.

“హిందూదేశం పాతివ్రత్యం ఇపుడు పోతున్నాదిరో
అచ్చెరువంతా యిప్పుడేను ఆలోచించర తమ్ముడో”

దేశాన్ని తల్లి అంటూనే ఆమె పాతివ్రత్యం పోతోంది అనగానే తరతరాలుగా జీర్ణించుకుపోయిన నమ్మకాల మీద, భావాల మీద తగులుతుంది దెబ్బ. అలా జరుగుతోంటే చూస్తూ ఊరుకున్నామంటూ

“మగతనమింకా ఎక్కడరో – మన వీర్యంబల్లా మింగేరురో”

అంటారు. ఆ పాట వింటున్న వాళ్ళకి ఒళ్ళు ఉడికిపోయి ‘ఛస్తే చస్తామ్. బతికితే బతుకుతాం. ఒక్క బ్రిటీషు వాడినయినా సఫా చేద్దాం’ అనిపిస్తుంది. అలా జరక్కుండా

“ కత్తిబలం హేయంబంటూ గాంధీ చెప్పినాడురో
వానిమాట బ్రహ్మమాట దాని మీర రాదురో
మొత్తిన కాని మోదంబందుచు నుండురో
చిత్తంబందున నెచ్చగు జీతం చేదటంచు నెంచరో”

అంటూ తాను నమ్మిన అహింసా రాజకీయాలు చెపుతారు. ‘బ్రహ్మ మాట, మనిషి రక్తం తాగకు’ అనే మాటలు ఇంతకు ముందు తాము చేసిన ఆలోచన మంచిదా!

కాదా! అనే ఆలోచనలో పడేస్తాయి. కూలీ నాలీ చేసుకుంటూ బతికే జనానికి దేశంలో వేరే ఏదో జరుగుతోందనేది మాత్రం బాగా అర్థమవుతుంది.

'పంచములు' పాట చదివితే అగ్రకులాలవారు పంచములను ఎంత నీచంగా చూశారో తెలుస్తుంది. వేదశాస్త్రాల్లో, ధర్మశాస్త్రాల్లో ఏం ఉన్నాయో పదే పదే చెపుతూ కూర్చోటం కాదు. అందరూ ఒక్కటిగా ఉండే మార్గాలను తెలుసుకోమంటారు.

"అంటరాదనుచు నాడరాదనుచు – నతి దూరమునకు ద్రోసి
ఆ చంటిబిడ్డలకు నార్య రుషీంద్రుల శాస్త్ర రహస్యము మాని"

వాళ్ళకి విద్య లేకుండా చేసారంటారు.

"స్నానము చేస్తిమి దూరము బొమ్మని – చావ వారలను
గొట్టి – ఆ దీనులు తెచ్చిన వస్తువు లెల్లను – దిని వారల బడదిట్టి"

వాళ్ళని ఎంత నీచంగా చూశారో చెపుతారు. వాళ్ళు తెచ్చినవి తినటానికి పనికొస్తాయి కానీ, వాళ్ళు దగ్గరగా నిల్చోటానిక్కూడా కుదరదా? అంటూ ప్రశ్నిస్తారు. ఈ పాపానికి ఫలితమే

"ఎక్కడ జూసిన హిందూ దేశజు లెంగిలి మెతుకుల వలెను – ఆ కుక్కల కంటెను గూడ దక్కువగం గొట్టబడుదురీయిలను" అంటూ

"సర్వ సమానత బాదుకొచ్చి యా జనము గల యుండి –
ఆ సర్వేశ్వరుడు స్వేచ్ఛా వరంబును – సరగజల్లు మనపైని" అంటారు.

మనిషికి ఎపుడైనా, ఎదటివాడు సానుభూతిగా మాట్లాడితే అతని పట్ల కాసింత ప్రేమ, ఆప్యాయత ఏర్పడతాయి. అందుకే తాగుబోతులను చూచి 'కల్లు' అనే గీతంలో

"కల్లు తాగి నీ యిల్లు నెల్ల గుల్ల చేయకు నీ వళ్ళు
రోగాలకెల్ల వడ్డీకీయకూ" అంటారు.

ఏ మాత్రం ఆర్ద్రత మిగిలున్నా కళ్ళు చెమ్మగిల్లక మానవు.

"పిల్ల జల్లలను తెచ్చి వీధి పెట్టకు – ముసలి తల్లిదండ్రులను
బట్టి తన్ని కొట్టకు ॥ కల్లు ॥

కూడంబలి మాని సారా – కొట్టు కెళ్ళకు ఇంట్లో
మాడేడ్చు పిల్లలను మరుపు నొందకు" ॥ కల్లు॥

నీ ఆరోగ్యమే కాదురా తండ్రీ నీ వాళ్ళెలా బాధపడుతున్నారో చూడు అంటూ అతను తాగి, మిగిలిన వాళ్ళను పెడుతున్న బాధల గురించి చెపుతారు.

"నీ దారిద్ర్యమెల్లను నద్దాన నున్నది సంసారమది
మానుకుంటే చక్కగుంటాది."

నీ గుణం తెలిసే బ్రిటిషువాడు పన్ను పెంచాడని, నీవు తాగటం మానేస్తే బ్రిటిషువాడి ఆదాయం కరిగి, అధికారం తగ్గుతుందని దానివల్ల భారతదేశానికి స్వాతంత్ర్యం వస్తుందని చెపుతూ

" స్వరాజ్య కేతనమది సామి వంటిది
నీచపు కల్లు తాగువార్ని అది కలియనంటాది" అంటారు.

పై రెండు పాదాలు చాలు ప్రజల్లో స్వాత్రంత్ర్య కాంక్ష ఎంత ప్రబలంగా ఉందో చెప్పటానికి మద్యపానం వల్ల జరుగు అన్ని నష్టాల్ని చెప్పాక ఆఖరి ఆయుధంగా వాడిన పై పాదం ప్రభావం స్వాతంత్ర్య కాంక్ష ప్రబలంగా ఉన్నప్పుడే పని చేస్తుంది. తల్లిదండ్రులు, భార్యాబిడ్డలు, పేదరికం వీటన్నిటి కంటే కూడా ఆంగ్లేయులు మన దేశాన్ని వదిలి పోవాలనే విషయానికే ప్రాధాన్యం పెరిగేలా చేసింది జాతీయోద్యమ సాహిత్యం.

సహాయనిరాకరణ పిలుపు నందుకుని కోర్టులు బహిష్కరించమని, విద్యాలయాలు బహిష్కరించమని, సీమగుడ్డ వాడకం మాని, ఖద్దరు కట్టమని, రాట్నంపై నూలు వడకమని ప్రబోధిస్తారు. 'గ్రామము' పాటలో గ్రామాల్లో సొంత వ్యవసాయం చేసుకుంటూ స్వతంత్రంగా బతకాలనుకునే పేద రైతుల్ని, చేనేత పనివారలను 'మీరిలా అయిపోయారేం' అంటూ పలకరించి 'మనం మనం ఒకటే' అంటూ మీ గ్రామాలే కాదు, మొత్తం దేశం దీనావస్థలోనే ఉందంటారు.

"ఆంగ్లదేవి ఆకలికి (ఆ) హారమోయి మనము" అంటూ
"మనము సాయమవగ అది మనల నేలుచుండే"

ఆంగ్లదేవి మనలను ఎందుచేత ఏలగలుగుతోందో చెప్పి

"సాయమీయకున్న అల గాంధి మాట జరుగు
అది జరగకున్న ముప్పు నీ కగును"

అంటూ సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొనమంటారు.

"హిందువులును ముసల్ మానులు ఇంకా మిగిలిన జాతు
లును సందియంబులు మానండి - వందేమాతరం - మంత్రము
మదులను - సుందరముగ - పొందుపరచి ॥ రం ॥

'రండి రండి' మీరూ స్వాతంత్ర్యోద్యమ రథాన్ని లాగండంటూ పిలుస్తారు.

"మొన్న మొన్ననే సుమ్మ - మూడు సంద్రాల్ దాటి వారు
శత్రుల గెలిచొచ్చినారు - పాంచాల దేశములోని
వారు సత్యాగ్రహమని - సర్వేశు బూజింప కత్తితో
తెగ నరికినారు - అయ్యో - కటిక డెందపు తెల్లవారు" ॥ కంట ॥

అంటారు 'పాంచాలం' లో. ఎవరి శత్రువుల మీద వారు యుద్ధం చేయడం న్యాయమే. మరి మన శత్రువు మీద మనం శాంతియుతంగా యుద్ధం చేస్తోంటే చంపేస్తున్నారు, ఆలోచించండయ్యా అంటారు అన్యాపదేశంగా.

బడిపిల్లల నెల్ల - పది క్రోసులగు దవ్వు
పరుగెత్తమని చెప్పినారు - పరువకున్నను బాదినారు
అగ్గిగుళ్ళను బెట్టి యదనుకు వెయిమంది యశువుల నిట్టే
యార్పేరు వారీ - యసురుల నెట్టులోర్చేరో ॥ కంట ॥
కట్టుగుడ్డల విప్పి - కుచబంధముల రొప్పి
ఇట్టట్టులుగ జేసినారు మన - చిట్టి కన్నెలను సరకారు
ఇట్టు లెందుకు చేసిరనుచు - గట్టిగా నిది తగదటం
చును - పట్టి యడగిన పెదవులని - ట్టట్టను మెదప యూరకొనిరట
॥ కంట ॥

అంటూ జలియన్ వాలాబాగ్ దురంతాల్ని ఆ విషయమై బ్రిటీషు ప్రభుత్వం మాట్లాడక పోవటాన్ని కళ్ళకు కట్టినట్లు తెలియచేస్తారు. వారు చేసిన దుశ్చేష్టల గురించి చెప్పటానికి నోరు రావట్లేదు అంటారు. ఇటువంటి ప్రభుత్వం మీద

"నీ కన్నులిటపై విప్పరా - ఆ
ప్రభుతనింతట త్రిప్పరా - లేకున్న నీకగు ముప్పురా - మాయప్ప యిప్పుడు"
॥ కంట ॥

అని కర్తవ్యాన్ని గుర్తు చేస్తారు. కూలీనాలీ జనాన్ని, పేదరైతుల్ని, చేనేత పనివారిని, చేతివృత్తుల వారినీ వెంటేసుకుని

"దండాలండోయ్ – మేముండలేమండోయి బాబు – ఈ సైతాను ప్రభుత నింక సాగనీమండోయి బాబు" అంటారు.

"ఆడి తాతగారి దేశమట్లు ధాటీ చేస్తాడండి బాబు
జీతాలిచ్చి మాలో మాకే చిచ్చు పెడతాడండి బాబు" ॥ దం ॥

అని చెపుతూ బ్రిటీషు ప్రభుత్వం 'సైతాను ప్రభుత' ఎలాగయిందో చెపుతారు. సైతాను ప్రభుత అయినటువంటి తెల్ల దొరతనం 'మాకొద్దు' అంటూ ఢంకా మ్రోగించారు. ఈ పాటలో భారతదేశ దుస్థితి అంతా కళ్ళకు కట్టినట్లు ఉంటుంది.

"పన్నెండు దేశాలు పండుచున్నాగాని పట్టెడన్నమే లోపమండి"

పన్నెండు దేశాలు భారతీయులవి. పట్టెడన్నం లోపం భారతీయులది. ఈ అన్యాయం చేసినవాడు

"వర్తకంబునకొచ్చి – పట్టణంబుల పట్టి – రాజ్యమొకటి అల్లినాడు
దాన్ని రాణీ కప్పచెప్పినాడు – రాణీ పత్రంబు చించేసినాడు –
ఈ చిత్రమదేమంటే శిక్షిస్తానంటాడు ॥ మాకొద్దీ ॥

వాడెవరో ప్రతి భారతీయుడికి తెలుసు. వాడు ఇంకా ఏం చేశాడంటే

"నూట నలభై నాల్గు నోటికి తగిలించి – మాటలాడ వద్దంటాడు
మమ్ము పాట పాడవద్దంటాడు – వాడి మాట దాటవద్దంటాడు
మమ్ము చేటుక తెచ్చుక యిట్లు – చెడిపోవుమంటాడు ॥ మాకొద్దీ ॥

ఘోర శాసనాలు – కూడ దీసినాడు – సారము లెల్ల పీల్చాడు
సంసారము లెల్ల కూల్చాడు – మా చీరలనెల్ల వొల్చాడు ఆడు
ధనవంతులను బట్టి దడ దడ లాడ్తాడు ॥ మాకొద్దీ ॥

ధనము కోసం వాడు దారి చేసుకొని – కల్లు సారాయమ్ముతాడు
మాదు ముల్లె మూటయు దోచినాడు ఆలి – మెళ్ళో పూసలు
తెంచినాడు – మా కళ్ళ దుమ్మొశాడు – కాటికి దరి చేశాడు ॥ మాకొద్దీ ॥

పంట పోయిన గాని – పన్నులు విడువక గెంటి కరణాల్నంపు
తాడు వెంట – తహసిల్దారు నంపుతాడు – లేకుంటే
ఉద్యోగం తీస్తాడు – ఫైనులంటూ జీతం తగ్గిస్తాడు
మా యింటి లోపల ఇట్లు – ఇడుముళ్ళు పెడతాడు" ॥ మాకొద్దీ ॥

అంటూ అన్యాయంగా భారతదేశాన్నాక్రమించి బ్రిటీషు ప్రభుత్వం భారత ప్రజల ఆత్మగౌరవాన్ని, ధన, మాన, ప్రాణాల్ని హరించి ఎలా జీవచ్ఛవాలుగా చేసిందో చెపుతారు.

"ప్రభువు గాంధీ తోడ – భారతదేశ మాత – పరమ తపము చేసినాది
ధర్మదేవత ప్రత్యక్షమైనాది కోరిన – వరముల నిచ్చుచున్నది – ఆ
దొరల గుండెలలోన – దడ దడ పుట్టింది ॥ మాకొద్దీ ॥
ఇంకేం భయం లేదు, అని ధైర్యం చెపుతారు.

"స్వచ్ఛ తేజము తోడ – స్వేచ్ఛా వధూమణి – కారాగృహము నందున్నాది
పూలగుచ్ఛములను దాల్చినది – మీకు ముచ్చటలను తెల్పుతాది
ఈ చచ్చు రాజ్యం వీడి – సరగ జైలుకు రండి ॥ మాకొద్దీ ॥
అంటూ జీవచ్ఛవాలకు ఊపిరులూదుతారు.

జీవం పోసుకున్న ప్రతి తెలుగువాడు "మాకొద్దీ తెల్ల దొరతనం" అన్నారంటే ఆశ్చర్యపోనక్కరలేదు. ఈ పాటలన్నీ రాసినందుకు ఆయన మొత్తంగా రెండున్నర సంవత్సరాలు జైలుశిక్ష అనుభవించారు. [10]

జైలునుంచి విడుదల అయిన తర్వాత గరిమెళ్ళ ఆంధ్ర యూనివర్సిటీ, కాంగ్రెసులో గలాభా, రాజభక్తి గీతము, లాలాజీకి, జయకరు ఆజ్ఞ, ఆది స్వతంత్రము, నెమలి పాట, స్వరాజ్యమున కొకబాట, మోహన రంగడి పదములు మొదలైనవి రాశారు.

'ఆంధ్ర యూనివర్సిటీ'[11] అనే గీతం తలుపుపాట బాణీలో రాయబడింది. ప్రియురాలు – ప్రియుడి రూపంలో ఆంధ్ర ప్రజలు – ఆంధ్ర యూనివర్సిటీ ఉప పీఠాధిపతి జరిపిన సంభాషణ అది.

"వాచి పోతిని నీదు కోసము – ముఖము
వాడిపోయెను – కాదు మోసము
లేచివచ్చెను – నా సంతోషము – యిపుడు
చూచినంతనే నీ లేమీసము"

ఈ మాటల్లో 'ఆంధ్ర యూనివర్సిటీ' కోసం ఆంధ్ర ప్రజలు ఎంతగా ఎదురు చూశారో అన్యాపదేశంగా చెప్పబడింది. ఆంధ్ర యూనివర్సిటీ ఆంధ్రత్వాన్ని తెలుసుకోగోరి

"తెలుగు భాషను నాకు జూపుమా – అందు
వెలుగు రుచులను నాకు ద్రాపుమా
కళల బెళ్కులను చూపెట్టుమా – దాని
కమ్మదనమును నాకు పట్టుమా"

అని ప్రియురాలు అడుగుతుంది.

"మిల్టను నీ యింటి బంటు మా – అల్ల
మెకాలే వాకిట్లో కుంటుమా
వెల్టుడు జనులకు వీరలే – చాలా
వేడుకలను నించువారలే"

ఆంధ్ర యూనివర్సిటీలో ఆంధ్రత్వమెంతుందో, తెలుగు ప్రజలకు అది ఎంత దగ్గరగా ఉందో తెలుసుకోవటానికి పైపాదాలు సరిపోతాయి. ప్రియుడు దీన్ని సమర్థిస్తూ, అంగీకరించక పోతే కోపగిస్తూ ఏవేవో మాటలు చెపుతాడు. చివరకు ప్రియురాలు చెంత చేరుతుంది.

"ఆంధ్ర యూనివర్సిటీ సిద్ధించినందుకు విద్యాధికులు గర్వించెదరుగాక! వారి గర్వము యూనివర్సిటీ తమ వాకిట నిలువబడినందుకు కానీ ఆంధ్ర విశేషణమున విశేషమును గమనించి కాదు."[12] తెలుగు ప్రజలు పై విషయానికే సంతోషించారనేది ప్రియురాలు చెంత చేరటంలో వ్యక్తమయింది.

''కాంగ్రెసులో గలాభా''[13] అనే దాంట్లో కాంగ్రెస్ పార్టీలో వచ్చిన భేదాభిప్రాయాల్ని, వాటి వల్ల వచ్చిన అనైక్యతని, ఆ అనైక్యత వల్ల జస్టిస్ పార్టీకి, బ్రిటిషు ప్రభుత్వానికి వచ్చిన లాభాన్ని వివరించారు.

స్వరాజ్యమునకొక బాట, రాజభక్తి గీతము, మోహనరంగడి పదములు వ్యంగ్యాత్మకమైనవి.

“కరుణావంతులు వారు – కాళ్ళట్టుకుంటేను
కనకాబిసేకాల్ సేస్తారు – మీదు కష్టాలెల్ల తీరుస్తారు
కష్టాలెల్ల తీరుస్తారు – మీకు
కావలసిన వరములిస్తారు – వార్ని
కాదంటేను మీరే కక్షిలైసస్తారు”

అంతటి కరుణామయులు వార్ని కాదంటే ఏమౌతుందో ‘రాజభక్తి గీతం’లో [14] ఒక్క ముక్కలో చెప్పేశారు. శాసనసభల్లోకి చేరటానికి ఏం చేస్తారో, చేరి ఏం చేస్తారో ‘స్వరాజ్యమునకొక బాట’[15] లో చెపుతారు.

“కరాన కల్గిన ద్రవ్యము జల్లి
కౌన్సిలు లోపల దూరయ్యా
ఖరాల్ ఖరాలున ప్రశ్నలు వేస్తూ
కంగాళీకి దిగవయ్యా”

ఈ పాట వింటే ఆ రోజుల్లో చాలా మంది శాసనసభ్యులు ఎలా ఉండేవారో తెలుస్తుంది. కాంగ్రెస్‌లోనే ఉంటూ శాసనసభల్లో పాల్గొనే ప్రయత్నం ఆ రోజుల్లో చేశారు. అలాంటి వారిని చూసి

“కాంగిరేసనే తెరను వేసుకొని
కపట నాటకము సలుపయ్యా
కంగారుగ అది అడ్డం వస్తే
జ్ఞానంబనుకొని చించయ్యా” అంటారు. ఇక ‘మోహన రంగడి పదాలు’ లో[16]
“ఘాటూ లెచ్చర్లనిచ్చి – మాటా నమ్మకము గొల్పి
నోటులు మూట కట్టుకు తేరా – ఈ తెరలో
లలితా నాటకమాడుకొందము రారా – చల్ మోహనరంగా నాటక ...”

అంటూ మొదలుపెట్టి శాసన సభ్యుల్ని గురించి రాస్తారు. ఇందులోని ప్రియురాలు శాసనసభా సభ్యత్వం. ఆమె ఇంకా ఇలా అంటుంది.

"పగటి దీపాలు చూడు – పంకాల సొగసు చూడు
మగరాల మెట్ల సొబగులు చూడు – పేపర్లను బడు ఈ
నగరాల బొమ్మలెల్లను చూడు – చల్ మోహన రంగా ॥ నగరాలు ॥

"వోటూల వేళలందు – ఊళ్ళెల్ల తిరుగుటకు దే
శాటుల నేరు పరచవోయి – డబ్బు ఉంటే నీకిక
లోటన్నదెక్కడుండునోయి – చల్ మోహనరంగా ॥ లోటన్న ॥

ఎన్నికలు ఎంత అప్రజాస్వామికంగా జరుగుతున్నాయో చెప్పటానికి ఇంతకన్నా వేరే నిదర్శనాలు అక్కరలేదు.

నెమలి పాట, ఆది స్వతంత్రము, లాలాజీకి, జయకరు ఆజ్ఞ మొదలైనవన్నీ రాజకీయాలకు సంబంధించినవి. 'వలపు – వగలు' మాత్రం మినహాయింపు. 'అన్యాయ కాలంబు దాపురించిందిపుడు' అనే పాట కాంగ్రెస్ సోషలిస్టులు కలిసి పని చేస్తూ రైతు రక్షణ యాత్ర జరిపినపుడు రాసినది.[17]

మొదట్లో చెప్పినట్లుగానే గరిమెళ్ళ అశేష ప్రజాకోటిని శ్రోతలుగా ఎంచుకొన్నారు. అందుకే ఆయన వారికి చేరువ అవటానికి సాధనంగా పాటని ఎంచుకోవటమే కాకుండా జానపద బాణీలను కూడా ఎంచుకున్నారు. ఆ బాణీలతో పాటు వారి యాసను కూడా పుణికి పుచ్చుకున్నారు. ఆడి తాతగారి మూట, ఆడి పాటు పాడైపోను, బేగి చేయి పట్టుకొని పిలుచుకొచ్చాడే, నిను బత్తితో కొలచేము మొదలైనవి. ఇలాంటి ప్రయోగాలు జానపద బాణీలున్న పాటల్లో ఎక్కువగా కనిపిస్తున్నాయి.

గరిమెళ్ళ కొన్ని పాటలకు శాస్త్రీయ సంగీత బాణీలు యిచ్చారు. కొన్ని పాటలకు ఆనందభైరవి వంటి రాగాలు, 'పాలకడలీ శయనరారా'[18] వంటి బాణీలు నిర్దేశించారు.

భావకవిత్వాన్ని ఆదరించక పోయినప్పటికీ సమకాలీన పరిస్థితుల ప్రభావం నుంచి తప్పించుకోవటం గరిమెళ్ళకు సాధ్యం కాలేదు. 'వలపు – వగలు' గేయం ఇందుకు ఒక ఉదాహరణ. ఈ గేయం అలిగిన ప్రేయసిని ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో 'వలచి వచ్చితి కొండంత వాంఛ తోడ' అనే ప్రియుని పలుకులతో ప్రారంభం అవుతుంది.

"వలస దేశంబు లంబడి బడలి బడలి
ప్రాణములు బిగ్గబట్టి తినబడతి ! నీదు
ఆదరణ మొక్కనాడైన అనుభవించి
తుష్టిపడకుండ మరణింప నిష్టపడక "

అనే పాదాల్లో ఆమె పట్ల అతనికెంత ప్రేమో వ్యక్తమవుతుంది. చివరకు పూర్తిగా తానే రాజీ పడుతూ

"ఇప్పటికైన కౌగలించుకొనవే – కూర్మి కొసరుచు ఒప్పుల కుప్ప" అంటాడు.

భావకవిత్వ లక్షణాలైన ప్రణయతత్వం, ఆత్మాశ్రయతత్వం వీటిలో కనిపిస్తున్నాయి.

పాటలు, గేయాలతో పాటు సాంప్రదాయ కవితారీతిలో పద్యాలు, దీర్ఘ మాలికలు రచించారు. వీటిలో భావకవిత్వ లక్షణమైన ప్రకృతి వర్ణన కన్పిస్తోంది.

"సన్నని దీపమొండు పలుచన్ వెలిగించిన యట్లు, అందమౌ
మిన్నన భూమి నుండి నును మిణుగురు పుర్వును బోలె కాంతి మొం
దన్నుక వచ్చి అప్పటికి నప్పటికే మెయి పెంచి యెఱ్ఱనై
చెన్నగు లక్క లేపనము చేసెను తురుపుటంచు నెల్లెడన్"
జాడలు జూడ " నీశ్వరుని సంస్తుతి సేయగా నిచ్చయున్న యో
బాడబులార, వేగ విరిపానుపుల వీడరదేమి ! సంఘముల్
చీడలు పొంది లేమిడిని చిందర వందరలై నశింపగా
వీడులలో సనాతన పవిత్రములైన మనోజ్ఞ ధర్మముల్
పాడయి యాత్మగౌరవము భస్మము గాగ : పవిత్ర జాహ్నవీ
తోయము లందు స్నానము యథోచిత రీతి నొనర్చి, ఆగమా
ధ్యాయములన్ మహేశ్వరుని ధ్యానమొనర్చి మనంబులంది ని
ట్లే యెరుపైన రంగుల నటించెడి దివ్య దిధీతి (?) గాంచగా
నాయతు లింకగం డనుచు నాత్మహితంబుగా వీనుదోయిలో
కూయిడునట్టి యా ప్రకృతి కొమ్మ వహించు రహస్య దీన కా
షాయ కళా ప్రకాశమని సారెకు దోచుచునుండు నెంతయున్"

ఇవి 'వేగి ప్రొద్దు తలంపులు'[20] అనే పేరుతో రాసిన దీర్ఘమాలిక లోనివి. సూర్యోదయ సమయాన ప్రకృతిని వర్ణిస్తూ ఆ సమయంలో ఆయనకు కలిగిన భావాలను ఈ మాలికలో చిత్రించారు.

భారతదేశాన్ని పాకిస్తాన్ పేరుతో విడగొట్టడం గరిమెళ్ళకు చాలా బాధ కలిగించింది. తన బాధను వ్యక్తం చేస్తూ 'చీలికలు' అనే గేయం రాశారు.

ఈ పాటలు, గేయాలతో పాటు అనేక వ్యాసాలు కూడా రాశారని ఈ అధ్యాయం మొదట్లో ప్రస్తావించాను. ఆ విషయాలను తరువాతి అధ్యాయంలో పరిశీలిస్తాను.

❋ ❋ ❋

ఫుట్ నోట్స్

1. పెండ్యాల రామబ్రహ్మం గారితో ముఖాముఖీ - 19-6-1990 - రాజమండ్రి టైమ్స్, గౌతమి టైమ్స్ పత్రికలు నడిపారు. స్వాతంత్ర్య సమర యోధులు.
2. వీరిద్దరిదీ రాజమండ్రి.
3. పెదనందిపాడు, గుంటూరు జిల్లా.
4. ఎల్. ఎం. పి. కోర్సు.
5. మొదటి భాగం - 18, రెండవ భాగం - 21
6. సెట్టి ఈశ్వరరావు గారితో ముఖాముఖీ - 27-9-1990
7. ఎల్లోరా జానపద సాహిత్యం, పీఠిక, పురిపండా అప్పలస్వామి - పేజ్ XIII
8. అదే పేజ్
9. గరిమెళ్ళ సత్యనారాయణ - రథము పాట, స్వరాజ్య గీతాలు 1 వ భాగం
10. స్వరాజ్య గీతాల కేసు, మాకొద్దీ తెల్లదొరతనం అన్నందుకు శిక్ష. 5 వ అధ్యాయంలో వివరిస్తాను.
11. గరిమెళ్ళ సత్యనారాయణ - ఆంధ్ర యూనివర్సిటీ - కృష్ణాపత్రిక 12-9-1926
12. కృష్ణాపత్రిక సంపాదకీయం - 4-9-1926
13. గరిమెళ్ళ సత్యనారాయణ - కాంగ్రెసులో గలాభా, కృష్ణాపత్రిక 29-9-1926
14. గరిమెళ్ళ సత్యనారాయణ - రాజభక్తి గీతము - కృష్ణాపత్రిక - 2-10-1926
15. గరిమెళ్ళ సత్యనారాయణ - స్వరాజ్యమున కొకబాట - కృష్ణాపత్రిక - 02-04-1927
16. గరిమెళ్ళ సత్యనారాయణ - మోహన రంగడి పదములు - కృష్ణాపత్రిక - 16-04-1927
17. అన్యాయ కాలంబు దాపురించిందిపుడు అనే పాట గురించి 4 వ అధ్యాయంలో వివరంగా చర్చించాను.
18. స్వరాజ్యగీతాలు రెండోభాగంలో ఉన్న 'సీమగుడ్డ' అనే పాటకి 'పాలకడలీ శయనరారా' అనే వరస ఇచ్చారు.
19. గరిమెళ్ళ సత్యనారాయణ - వలపు-వగలు - భారతి మాసపత్రిక - డిసెంబర్. 1926
20. గరిమెళ్ళ సత్యనారాయణ - వేగి ప్రొద్దు తలపులు - ఆంధ్రపత్రిక ఉగాది సంచిక, 1934
21. చల్లా రాధాకృష్ణశర్మ - గరిమెళ్ళ సాహిత్యం - పేజ్ 28

❊ ❊ ❊

వ్యాస పరిశీలన

ఆంగ్ల సాహిత్య ప్రభావ ఫలితమైన తెలుగు వ్యాసం ఇరవయ్యవ శతాబ్దం పూర్వార్థం నాటికే విశేష ప్రాచుర్యం పొందింది. శ్రీ గరిమెళ్ళ సత్యనారాయణ 1926 నుంచి అపుడపుడు వ్యాసాలు రాసినప్పటికీ 1933 తర్వాత బతుకుతెరువు కోసం పత్రికారంగంలో అడుగు పెట్టాక వ్యాసాలు విరివిగా రాశారు. గరిమెళ్ళ రాసిన వ్యాసాల్లో దాదాపు 40 (నలభై) వరకు లభించాయి. పరిశీలనా సౌలభ్యం కోసం వాటిని సాహిత్య వ్యాసాలు, రాజకీయ వ్యాసాలు, ఆర్థిక వ్యాసాలు, రకరకాల సమస్యలను చర్చించినవాటిని 'ఇతరాలు' గా విభజించాను. గరిమెళ్ళ కాలం నాటి రాజకీయ పరిస్థితులు, సాంఘిక పరిస్థితులు, సారస్వత పరిస్థితులను మొదటి అధ్యాయంలో పరిశీలించినందువల్ల ఆ నేపథ్యాన్ని తిరిగి ఇక్కడ వివరించటం లేదు.

3. 1. సాహిత్య వ్యాసాలు

సాహిత్యం గురించి, సాహితీ ప్రక్రియల గురించి, భాష గురించి కొన్ని పుస్తకాలకు రాసిన సమీక్షా వ్యాసాలు ఈ కోవలో చేర్చాను.

నూతన సాహిత్య విజృంభణము[1], సాంఘిక నవల[2], ఆంధ్ర భాషా పరిణామం[3] అనేవి సాహిత్యం గురించి రాసినవి. 'కొత్త అనుశాసనము'[4] అను పేరుతో 'సూర్యనారాయణీయం' అనే పుస్తకం గురించి, శనివారపు సుబ్బారావు రాసిన 'పల్లెటూరి కథలు'[5] అనే పుస్తకం గురించి రాసినవి సమీక్షా వ్యాసాలు.

1926 ప్రాంతంలో ఉన్న సాహిత్య ప్రక్రియలను, సాహిత్యాన్ని పరిశీలిస్తూ రాసిన వ్యాసం 'నూతన సాహిత్య విజృంభణం'. ఆంగ్లేయుల పాలన, సంస్కృతుల ప్రభావంతో తెలుగు సాహిత్యంలో అనేక మార్పులు వచ్చాయి. అంతకుముందు వాటికంటే అవి

చాలా భిన్నమైనవి. అందువల్ల తెలుగు సాహిత్యంలో ఇది నూతన యుగమని ఆయన భావించారు. ఈ నూతన యుగానికి అంతకు ముందరి కాలానికి ఒక ముఖ్యమైన మలుపు ముద్రణా యంత్రం రావటం, ఆ తరవాత పెరిగిన పత్రికలు, దాని ద్వారా పెరిగిన పాఠకులు కారణమని గుర్తించారు. రాజులు చితికిపోయి పెద్ద స్థితిపరులుగా మారారు. శిష్యులు గురువుల వద్దకు పోయి శుశ్రూష చేసి విద్య గడించవలసిన పరిస్థితి మారి, శిష్యులకు పాఠశాలలో చదువు చెప్పే నెల జీతగాళ్ళుగా గురువులు మారారని భావించారు. పాండిత్యాన్ని గుర్తించి, ఆదరించే రాజులు లేని సమయంలో తమ విద్యని ప్రదర్శించటానికి పండితులే దేశ సంచారం చేయవలసి వచ్చింది. దానికి రైలు మార్గాలు తోడ్పడ్డాయి. దేశ సంచారంలో సహజంగానే పండితుల మధ్య వచ్చే వాద వివాదాలను పత్రికలు ప్రజలకు అందచేసేవని తెలియచేసారు. దీనికి నిదర్శనం తిరుపతి వెంకట కవులకు, అనేక ఇతర కవులకు వచ్చిన వాద వివాదాలు నానారాజ సందర్శనం, గీరతం మొదలైన పేర్లతో గ్రంథ రూపాన్ని ధరించటం అంటూ, మారుతున్న దేశ పరిస్థితులతో పాటే సాహితీ ప్రపంచంలో వస్తున్న మార్పులను కూడా గుర్తించారు. ఆ కాలం పత్రికలలో వస్తున్న పద్య కవిత్వం గురించి "వ్యర్థ పద్య ప్రచురణ మెక్కువయై నోటిలో నుంచి వచ్చెడి తుంపురులు అచ్చు పడుచున్నవే యని విచారింపవలసి వచ్చినది" అంటూ సున్నితంగా విమర్శించారు.

భావకవిత్వ ఆవిర్భావానికి ఆంగ్ల సాహిత్యం, వార, మాస పత్రికలు మొదలైనవి చేసిన దోహదాన్ని గుర్తించారు. ఈ పత్రికలలో సాహిత్యానికి సంబంధించినవి మాత్రమే కాక మిగిలిన శాస్త్రాలకు సంబంధించి కూడా తెలుసుకోవలసిన అనేక విషయాలు ఉండటం వల్ల తీరుబాటుగా ప్రబంధాలను, కావ్యాలను చదివి ఆనందించే పాఠకుల సంఖ్య క్షీణించిందని, ఏదో ఒక చిన్న విషయాన్ని తీసుకుని సరళమైన భాషలో పత్రికలలో కవిత్వం రాయటం నవీన కవులకు సులభమైందని భావించారు. ఏ మార్పులూ లేని ప్రబంధ కవిత్వం 'మొగం మొత్తిన పిండివంట యైంద'ని, అందువలన ప్రబంధ కవిత్వానికి సెలవిచ్చి ఈ నూతన కవిత్వానికి ఆహ్వానం పలుకక తప్పదని అభిప్రాయపడ్డారు. ఈ భావకవిత్వాన్ని ఆహ్వానిస్తూనే అందులో ఉన్న లోపాలను ఈ విధంగా తెలియజేశారు. ఈ రంగం యిపుడు చాలా అరాచకంగా ఉంది. అర్థము స్ఫుటముగా తెలిసేలా ఉండదు. సహజత్వానికి దూరంగా ఉంటుంది. స్వాతంత్ర్యం పేరుతో ఎవరికి తోచినట్లు వారు రాస్తూ పోతుండటం వల్ల భావకవిత్వం

తెరమరుగై పోయే అవకాశం ఉంది. ఈ లోపాలను సరిగా ఎత్తి చూపటానికి విమర్శకులు పూనుకోవాలి. కవులు కొంచెం నిగ్రహంతో రాస్తే ఈ కవిత్వం జీవితం ఇంకొంచెం పెరుగుతుందని సూచించారు.

ఆ కాలంలో వచ్చిన గీత కవిత్వం గురించి చెప్తూ ఆదిభట్ల నారాయణదాసు గారు ఈ గీతకవిత్వంలో నిష్ణాతులని భావించారు. గీతకవిత్వం పండిత పామర రంజకం. ఇది ఇంతవరకు భక్తి, శృంగార రంగములలో మాత్రమే ఉంది. కానీ జాతీయోద్యమ కాలంలో నాటకాల్లోకీ, దేశభక్తిని ఉద్బోధిస్తూ జాతి నుత్తేజితం చేయటానికీ రాజకీయ రంగంలో ప్రవేశించి అభివృద్ధి చెందిందని అభిప్రాయపడ్డారు. ఈ గీతకవిత్వాన్ని, జానపద బాణీలు మొదలైనవాటిని ఇతర భాషలవారు కాపాడుకొన్నంతగా తెలుగువారు కాపాడుకోలేక పోతున్నారని బాధపడ్డారు.

వీధి భాగవతాలు, హరికథలు, బొమ్మలాటలు మొదలైనవి గద్య, పద్య, గీత మిశ్రమాలు. వీటి విశిష్టతను నిలబెట్టటానికి అవసరమైతే సమకాలీన పరిస్థితుల కనుగుణంగా కథాక్రమాన్ని మార్చాలి. పూర్వము నుండి వచ్చే అనాగరిక హాస్యాన్ని తీసివేసి పదిమందిలోను కూచుని వినగలిగే హాస్యాన్ని నింపాలని సూచన చేశారు.

ప్రబంధ వచనముల గురించి రాస్తూ వచనమనేది ఒక కవిత్వ విశేషమనే అభిప్రాయంతో పూర్వ కవులైన పెద్దన, పోతన మొదలైనవారు రచనలు చేశారని, అందులో వ్యావహారిక ధర్మమున్నదనే అభిప్రాయంతో వచనం రాయలేదని పేర్కొన్నారు. ఆధునిక ఆంధ్ర గద్య రచనల్లో చిలకమర్తి లక్ష్మీనరసింహం గారి రచనలు విశిష్టమైనవిగా భావించారు.

ఆధునిక యుగంలో వచనం యొక్క ప్రయోజనం మారింది. అది చేయవలసిన పనులు ఏ విధంగా పెరిగిపోయాయో ఈ రకంగా తెలియచేశారు. వృక్షశాస్త్రము, రసాయనశాస్త్రము, మొదలైన శాస్త్రాలను పిన్నలకు, పెద్దలకు అర్థమయ్యే రీతిలో తెలియచెయ్యాలి. దేశ, కాల పరిస్థితులను విమర్శనాత్మకంగా పరిశీలించి ప్రజల కర్తవ్యాన్ని తెలియచెప్పాలి. ప్రపంచంలో జరుగుతున్న వింతలను విడ్డూరాలను లోకానికి చాటాలి. సాహిత్యంపై విమర్శలు రాయాలి. మహాపురుషులను గురించి తెలియచేసి పిల్లలలో సద్బుద్ధిని పెంచాలంటూ ఆయా రచనలకు తగిన శైలి వేరు వేరుగా వాటికి ఉంటుందని, వివిధ శాఖలలో రాసిన వీరేశలింగం గారు ఈ శైలికి పితామహుడని, తెలుగుజాతి ఈయనకు కృతజ్ఞత చూపిస్తుందని భావించారు.

నవలా వికాసంలో చారిత్రకయుగం లేక అనువాదయుగంగా పేరుబడ్డ కాలంలో ఈ వ్యాసం రాసిన కారణంగా గరిమెళ్ళ ఆ విషయాలే పేర్కొన్నారు.

'ఆఖ్యాయిక' అనే శీర్షికతో కథల గురించి రాశారు. 'గద్యకావ్యాలు' శీర్షికన వ్యాసాల గురించి రాస్తూ పానుగంటి లక్ష్మీనరసింహం, పురాణం సూరిశాస్త్రి గార్ల వ్యాసాలను చక్కటి వ్యాసాలుగా ఉదహరించారు.

నాటక రంగాన్ని గురించి చెపుతూ 'ఎన్ని వివాదములు, అభిప్రాయభేదములు ఉన్ననూ నాటకరంగ ముత్సాహవంతముగను, శుభసూచకంగానూ ఉంద'ని సంతోషించారు.

దేశచరిత్రలను ఆంగ్లేయులు సేకరించి వారి వారి సిద్ధాంతాల కనుగుణంగా రాయించారు. మన దేశచరిత్రను మన దేశీయులు పరిశీలించినచో నిజ లక్షణాలు బయటపడగలవనే ఉద్దేశంతో కొమర్రాజు లక్ష్మణరావుగారి వంటి వారు పఠిస్తున్నారు. వీరు చేసిన పరిశ్రమ నాధారం చేసుకుని ఆంధ్రదేశ చరిత్ర రాయవలసి ఉందని అభిప్రాయపడ్డారు.

వార్తాపత్రికలు చేస్తున్న సేవను కొనియాడుతూ, "ఆంధ్రపత్రిక సంపాదకీయాలు కొంచెం పొట్టివైతే బాగుంటుంది. బ్రాహ్మణులు దానవులు కారని తలుస్తే సమదర్శిని మంచి ఆదరణపాత్రమవుతుంది. బ్రాహ్మణేతరోద్యమముతో ఢీ కొనుటయే తన అవతారము యొక్క ఆదేశమనుకోకుంటే తెలుగు స్వరాజ్య పత్రిక తన విజ్ఞానమును మరీ బాగా వెదజల్లుతుంది. జాతిద్వేషగీతము నొక్క శృతి తగ్గించి పాపము సుబ్బమ్మగారి వంటి బాల వితంతువుల మీద నుంచి ఆయుధపు గురిని తప్పించినచో తెలగ పత్రిక ఎక్కువ శౌర్యవంత మవుతుంది. ... దురుసుతనమును, బాల్యచాపల్యమును విస్మరించిన కాంగ్రెసు పత్రిక ఎక్కువ మన్నన పాత్రమౌతుంది." అంటూ ఆయా పత్రికలు తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించారు.

గ్రంథ విమర్శన అంటే ఒకప్పుడు తప్పులు చూపించటంగా మాత్రమే ఉండేదని, ఆ తర్వాత వీరేశలింగంగారి వంటి వారు కొంచెం ముందుకు వచ్చి కవి జీవించిన కాల నిర్ణయం, అతని వంశావళి మొదలైన వాటి గురించి చెప్పటం కూడా చేశారని, అక్కడితో ఆగకుండ "... అందులోని పాత్రముల, స్వభావముల, ఔచితులు చర్చించుట, తోడివారి గ్రంథములలోని పాత్రములతో పోల్చి చూచుటలు, అందులో

మానవ స్వభావమున కొప్పినదెంతవరకో విమర్శన మెంతవరకో ... విమర్శన చేసి ... విద్యాధికులు, విద్యావిహీనులు కూడా పఠించి, విమర్శించి తమ తమ అభిప్రాయములకు వచ్చెడి రీతిని" విమర్శ చేయాలని భావించారు.

శాస్త్ర గ్రంథాల గురించి చెపుతూ శాస్త్ర గ్రంథాలు రచించే వారికి భాషా పాండిత్యం కన్నా శాస్త్ర పాండిత్యం అవసరమన్నారు.

వాడుకభాష గురించి, వాడుక భాషోద్యమం గురించి గరిమెళ్ళ అభిప్రాయాలను తెలుసుకోవటానికి ఈ వాక్యాలు బాగా ఉపకరిస్తాయి. ఆయన గ్రాంధిక భాషను పోతపాలతో పోల్చారు.

"వ్యాకరణము వ్రాసి మన యూనివర్సిటీ వారి సహాయముచే దానిని ప్రతిష్ఠించిరి. ఆంధ్ర విద్యాధికులకు ఈ పోతపాలు అలవాటయి, చంటిపాలు అంటూ ఒకటి ఉంటాయనే జ్ఞానమే లేకుండా చేసినారు."

గిడుగు రామ్మూర్తి పంతులు గారి భాషోద్యమం గురించి చెపుతూ "సహస్ర కోటి కంఠములు కాదు, కాదని కేకలు వేస్తున్నా ఒక్కడు ఔను, ఔను అని చేతులు రెండూ ఎత్తుతూ పాతపత్రాలవేపు, దిద్దిన గ్రంథాలవేపు, చరిత్రలవేపూ చూపెడుతూ మొర్రపెట్టి స్వస్థానము చూపించేడు" అంటారు.

గ్రాంధిక భాష అలవాటు అయిపోయి వ్యావహారిక భాషను వెంటనే అలవరచుకోలేక అవస్థ పడుతున్న తనవంటి వారి గురించి "ఇల్లు గుర్తు పెట్టుకున్నాము గదా! ఇటువేపు దృష్టి తిరిగింది గదా! ఇంటిలోకి వచ్చి కూర్చోవడం సాధ్యం కాకపోయినా ఆ ప్రాంతాలనేనా తచ్చాడుతాము" అంటారు.

"సాంఘిక నవల" అనే వ్యాసంలో ఆ కాలంలో వచ్చిన చాలా నవలలు అనువాదాలని, కొన్ని పౌరాణికాలు, చారిత్రక నవలలని, చాలా కొన్ని మాత్రమే రచయితలు సొంతంగా ఆలోచించి రాసిన రచనలని భావించారు. ఆయా నవలలోని అనేక లోపాలను ఎత్తి చూపించారు.

"సంఘ జీవనము నందాసక్తి పుట్టి వారి ... ఆశయములందు మనకభిరుచి జనించి వారి తళుకులు, బెళుకులు ... విచారములు, కష్టసుఖములు మొదలగువాని యందు సానుభూతి జనించి, ఆ అచ్చటలను ముచ్చటలను ... వీలయినంతవరకు

వారు మాటలాడుకునే శబ్దార్థాద్యలంకార రహితమగు శైలిలో చెప్పెడి ప్రశంసలనే ... " సాంఘిక నవలంటారని అభిప్రాయపడ్డారు.

సాంఘిక నవల ఇతివృత్తం కానీ, కథ కానీ సమకాలీన సమాజంలోంచి తీసుకోవాలి. ఆ కథలోని పాత్రల యొక్క జీవితాల పట్ల అవగాహన ఉండాలి. ఆయా జీవితాలకి సంబంధించిన సంస్కృతిని కూలంకషంగా అర్థం చేసుకోవాలి. పాత్రలు, గ్రామాలు, నదులు మొదలైన వాటి పేర్లు వాస్తవికంగా ఉండాలి. భాష సహజంగా ఉండాలి. సాంఘిక నవలలు వాస్తవిక జీవితాన్ని ప్రతిబింబిస్తాయి కనుక జీవితాల్నుంచి తీసుకునే ఇతివృత్తం ఎక్కడైనా మొదలు కావచ్చని, ఎక్కడైనా ఆపొచ్చని భావించారు. సాంఘిక నవలలు రాయదల్చుకున్న రచయితలు సంఘానికి దూరంగాక అందరితోను కలుపుగోలుతనంగా తిరుగుతూ అరమరికలు లేకుండా ప్రవర్తించాలని తెలిపారు. దీన్నిబట్టి సమాజానికి దూరంగా ఉండకుండా రచయిత వారితో కల్సి ఉంటూ వారి జీవితాల్ని వీలైనంత వాస్తవికంగా చిత్రించాలని గరిమెళ్ళ అభిప్రాయంగా తెలుస్తోంది. దాదాపు అరవై సంవత్సరాల క్రితమే ఇటువంటి అభిప్రాయాలను వెలిబుచ్చారనేది గమనార్హం.

" మానవులలో ఎట్టి పరిణామములు జరుగుచుండునో వారు మాట్లాడుచుండు లేక వ్రాయుచుండు భాషలలో కూడా అట్టి పరిణామములు జరుగుచుండుట సహజము" అంటూ 'ఆంధ్ర భాషా పరిణామము' అనే వ్యాసం మొదలవుతుంది. వేయి సంవత్సరాల క్రితం ఉన్న భాష ఈనాడు ఉండదు. ఏ శిలాఫలకాలో దొరికితే వాటి భాష ఆంధ్రమేనా అని అనుమానం కలుగుతుంది. అస్థిరమైన భాషలు మారినంతగా స్థిరమైన భాషలు మారవు. నన్నయభట్టు కాలం తర్వాత ఆంధ్ర భాషకు ఒక స్థిరత్వం ఏర్పడిందని భావించారు. ఆ తర్వాత ప్రబంధ భాష వచ్చినా కొత్త పాతల మేలుకలయికగా రాయల కాలం వరకు వర్ధిల్లుతూ వచ్చిందని చెపుతూ పై భావాలు వ్యక్తం చేశారు. దీనికి ఆంధ్ర జాతీయ చైతన్యమే కారణమని, ఆ తర్వాత వచ్చిన ఆంగ్లేయుల పరిపాలన వల్ల విజాతీయ నూతన చైతన్యం పెరిగిందంటూ దాని ప్రభావం గురించి ఈ విధంగా తెలియచేశారు. పాండిత్యం కంటే ఎమ్మే, బియ్యే డిగ్రీలపై మోజు పెరిగింది. విదేశీ సంస్కృతి ఆకట్టుకుంది. ఈ పరిస్థితిలో ఆంధ్ర భాష దుస్థితి అనుభవించింది. 1905 లో జరిగిన బెంగాల్ విభజన జాతీయ చైతన్యాన్ని పెంపొందించటం వల్ల ఆంధ్ర భాషలో నూతన చైతన్యం వచ్చింది. ఆంగ్ల భాష ప్రాముఖ్యం ఆంధ్ర భాషను వెనక్కి నెట్టేస్తోంది. ఈ పరిస్థితుల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఆంధ్ర రాష్ట్రం ఏర్పడాలని

ఆంధ్రులు గుర్తించినందుకు ఆయన సంతోషం వ్యక్తం చేశారు. వాడుక భాషోద్యమం ఆంధ్ర భాషలోని సహజత్వాన్ని వెలికి తెచ్చిందంటూ ఆ ఉద్యమం భాషకు చేసిన సేవను ప్రశంసించారు. వాడుక భాష రాయటం వల్ల, వివిధ ప్రాంతాల్లో ఉండే వాడుక భాష వివిధ రకాలుగా ఉండటం వల్ల, సంకుచితత్వం మాని వాటిని గౌరవించాలని సూచించారు. దుష్ట ప్రయోగాలు, నిర్దుష్ట ప్రయోగాలు అనే విషయానికి వచ్చినపుడు, 'భారత బొగ్గు' 'ఇండియన్ బీమా' మొదలైనవి ప్రజలలో బాగా ప్రచారమైన కారణంగా వాటిని గూర్చి చర్చించి ప్రయోజనం లేదు అని అన్నారు. అవి నిర్దుష్ట ప్రయోగాలుగానే పరిగణింపబడతాయని, శిష్టులు ఉపయోగించని 'లెగిసిపోతాది' మొదలైనవీ, బూతులూ దుష్ట ప్రయోగాలుగానే గుర్తించాలని భావించారు.

వాక్య నిర్మాణం గురించి చెపుతూ కర్త్రర్థకము, కర్మార్థకము, ఏకవచన క్రియ, బహువచన క్రియ మొదలైనవి ఉపయోగించినపుడు కామాలు, సెమి కోలనులు, హైఫనులు, అడ్డగీతలు మొదలైన వానిని పెట్టటంలో కొంచెం జాగ్రత్త వహించినట్లైతే లోపాలు తొలగిపోతాయి అన్నారు.

మారిన కాలంలో పాఠకులు సాహిత్య చర్చల కన్న హిస్టరి, జాగ్రఫీ, సైన్స్, రాజకీయాలు మొదలైన వాటి పట్ల ఆసక్తి చూపుతున్నారు. అంతేకాక తమ " పంటలెంత యెక్కువయైతే కాటకమంత యెక్కువగుటకు, ధనమెంత వృద్ధియైతే దారిద్ర్యమంత యెక్కువగుటకు, విజ్ఞానమెంత (సైన్స్) ఎక్కువైతే అజ్ఞానమంత యెక్కువగుటకు ... సైన్యములెంత వృద్ధియైతే అశాంతి అంత వర్ధిల్లుటకు కారణాలు తెలిసికొనుటకు తల్లడిల్లి పోవుచున్నారు.'' వీటికి గల కారణాలను విద్యాధికులైన వారు పక్షపాతరహితంగా ఆలోచించి, చర్చించి ప్రజలకు అర్థమయ్యే సరళమైన తేట తెనుగు భాషలో వాటిని ప్రజల కందించాలని సలహా యిచ్చారు. రకరకాల మాండలికాలు, కొన్ని ఉరుదూ, అరవ భాషా పదాలు ఆంధ్ర భాషలో కల్సిపోయినప్పటికీ, వాటిని ఆదరిస్తూనే ఆంధ్ర భాషోన్నతికి గుజరాతీ, బెంగాలీ, హిందీ, మరాఠీ భాషల వారి వలెనే ఆంధ్రులు కూడా ఆంధ్రరాష్ట్రం కోసం కృషి చెయ్యాలని నొక్కి చెప్పారు.

ఈ వ్యాసంలో 'ధోరణి' అని ఆయన రాసినప్పటికి అది శైలి అనే అర్థం చేసుకోవాల్సి వస్తోంది. విషయం శైలిని నిర్ణయిస్తుందని గుర్తించారు. దాన్ని ఈ మాటల వల్ల తెలుసుకోవచ్చు. " ... భాషల తత్వములు, ఆంధ్రభాష పరిణామములు మొదలైన విషయములు తీసుకున్నపుడు ప్రారంభించిన ధోరణికిన్నీ, వ్యావహారిక

భాషావశ్యకతను గూర్చి నిరూపించవలసిన ధోరణికిన్నీ యెంతో భేదము కన్పించుచున్నది. ఒకే ధోరణిలో వ్యాసమంతా సాగింతామంటే కుదిరింది కాదు" అంటారు.

మల్లాది సూర్యనారాయణ శాస్త్రి రచించిన 'సూర్యనారాయణీయం' అనే గ్రంథానికి రాసిన సమీక్షావ్యాసం 'క్రొత్త అనుశాసనము'. గద్యానికి ఉపయోగించవలసిన భాషను తెలియచేసే వ్యాకరణ గ్రంథం 'సూర్యనారాయణీయం'. అందువల్ల ముందు వాడుక భాషోద్యమం గురించి ఈ అనుశాసనం రావాల్సిన ఆవశ్యకత గురించి గరిమెళ్ళ చర్చించారు. సమీక్షలో ఈ భాగమే ఎక్కువగా ఉందని చెప్పవచ్చు. ఈ అనుశాసనాన్ని పరిచయం చేస్తూ దాని గొప్పతనాన్ని చెప్పి అందులో ఉన్న లోపాల్ని కూడా చూపించారు. వ్యావహారికభాష వ్యాకరణానికి లొంగదని చివరకు గుర్తించినట్లు ఈ మాటలవల్ల తెలుస్తోంది.

"ప్రారంభకులు వ్రాసినప్పుడు వారి వ్రాతలు దిద్ది వాటికి మరీ శిష్ట ప్రయోగాలు చూపించి ఈలాగుంటే బాగుంటుందని హెచ్చరించవలసిందే: కానీ, ఇవి అన్నీ అతనికి జ్ఞానం వచ్చి శైలి కుదిరేదాక చేయవలసిన సహాయాలే కాని, తరువాత అతను ఒక గ్రంథకర్త అయిన తరువాత అతను ఒక లక్షణానికి కాని, సలహాకు కాని కట్టుబడి ఉండడు" అంటారు.

శనివారపు సుబ్బారావు రాసిన కథల్ని 'పల్లెటూరి కథలు' అనే పేరుతో ప్రచురించారు. గరిమెళ్ళ ఈ పుస్తకాన్ని సమీక్షిస్తూ ఆయా కథల్లోని ముఖ్యాంశాలు తెలియచేశారు. ఆ కథల్లో ప్రేయసీ ప్రియుల విరహాలు, వైరాగ్యాలు మొదలైనవి లేవు. నిత్య జీవితంలో ఎదురయ్యే సంఘటనలు తీసుకుని, వాస్తవికంగా చిత్రించబడ్డాయని తెలుస్తోంది. వాస్తవ చిత్రణ ఉన్న సాహిత్యం సమాజానికి చాలా అవసరం. వాస్తవ సమాజ చిత్రణలో రచయిత సఫలీకృతులయ్యారని అభినందిస్తూ, ఈ దృక్పథాన్ని రచయిత ముందుకు తీసుకుపోవాలని సూచించారు.

3.2. ఆర్థిక వ్యాసాలు

ఆర్థిక పరిస్థితుల గురించి, ఆర్థిక పరిస్థితులు పునాదిగా మిగిలిన విషయాల గురించి, అర్థశాస్త్రం గురించి చర్చించిన వ్యాసాలు ఈ కోవలోకి వస్తాయి. 'వాణిజ్యం – అరాచకం – విరుగుడు' [6], 'పూర్వపు బానిసత్వం – నేటి ధన బానిసత్వం' [7],

‘అర్థశాస్త్రమా – అనర్థశాస్త్రమా’ [8], ‘అభ్యుదయ రాజ్యాంగ విధానం’ [9], ‘వృత్తులు – విజ్ఞాన విశేషాలు’[10], అనే వ్యాసాలు పై విషయాలను ప్రముఖంగా చర్చించాయి. ఈ వ్యాసాలన్నీ కూడా 1946 తర్వాత రాసినవి.

‘వాణిజ్యం – అరాచకం – విరుగుడు’ అనే వ్యాసంలో భారతదేశంలో జరుగుతున్న వాణిజ్యం గురించి, అందులో పెరుగుతున్న అరాచకం గురించి చెపుతూ ఆ అరాచకానికి విరుగుడు ఈ విధంగా తెలియచేశారు. భారతదేశంలో సరుకు చాలినంత ఉన్నప్పటికీ వర్తకులు లాభార్జన కోసం ధరలు విపరీతంగా పెంచారు. కొనుక్కోగలిగిన వారికి మాత్రమే అవి అందుబాటులో ఉంటున్నాయి. వారిక్కావలసిన లాభం వచ్చాక ఆ సరుకు చెల్లుబాటు కాకపోయినా, ప్రజలు దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించినా వర్తకులకు పట్టింపు లేదు. ఈ రకమైన అరాచకాన్ని ప్రభుత్వాలు గుర్తించినా చర్య తీసుకోవటం లేదు. రహస్యంగా వారినే సమర్థిస్తున్నాయి. ప్రజలు ఏ మాత్రం ఆందోళన చేసినా వారిపై చర్య తీసుకుని జైలుపాలు చేస్తున్నారు. వర్తకంలో జరుగుతున్న అరాచకాన్ని అరికడితే ప్రజల్లో సమ్మెలు మొదలైనవి వాటంతటవే కనిపించకుండా పోతాయని భావించారు. వ్యాపారంలో పెరుగుతున్న అరాచకం వల్ల కరువుకాటకాలు ఏర్పడి ప్రజల్లో అరాచకం ప్రబలుతోందని విశదీకరించారు. ఈ ప్రభుత్వాలు అరాచకాన్ని అరికట్టే చర్యలు తీసుకోవు కనుక “మహా నిస్వార్థి యగు త్యాగపురుషుడు, రాజకీయ పరిజ్ఞాన వేత్త ... యొకడుద్భవించి కార్యక్రమమునకు పూనుకొనకుంటే ఈ అరాచక మణగదు” అంటూ విరుగుడు చెప్పారు.

ప్రపంచంలో ఒకప్పుడు రోమ్ మొదలైన చోట్ల బానిసత్వం ఉండేదని, భారతదేశంలో అటువంటి బానిసత్వం ఉన్నటుల కనిపించదని, భారతదేశంలోని వర్ణాశ్రమ ధర్మాలు ఈ బానిసత్వాన్ని ఋజువు చేస్తున్నాయంటూ కొందరు చరిత్రకారులు చేసే వాదన సంకుచితమైదని ‘పూర్వపు బానిసత్వం – నేటి ధన బానిసత్వం’ అనే వ్యాసంలో అభిప్రాయ పడ్డారు. ఫ్యూడల్ యుగంలో జరిగిన పెత్తనాన్ని ప్రభు–సేవక దర్జాగా భావించారు. ఆ దర్జా పోయి బానిసలు పనిముట్లుగా మారారు. ఎక్కువ మంది బానిసలున్నవారు ఉత్పత్తి ఎక్కువ చేసి ఎక్కువ లాభం పొందారు. అవసరం అయినప్పుడల్లా వీరిని అమ్మటం కొనటం జరిగిందంటూ పెట్టుబడిదారీ యుగంలో వచ్చిన మార్పుల్ని వివరించారు. ఆ తరువాత పరిస్థితులలో వచ్చిన కొన్ని మార్పుల వల్ల చట్టబద్ధంగా బానిసలను అమ్మటం, కొనటం నిషేధించబడినా వారి కష్టాలు

గట్టెక్కలేదని, ఇంకా శ్వేతజాతుల కొక శాసనం, నీగ్రో మొదలగు జాతులకొక శాసనం అమలు జరుగుతోనే ఉందని, అటువంటి సమయంలో ఈ దురాచారాలను అరికట్టడానికి ట్రూమన్ కంకణం కట్టుకోవటం అభ్యుదయకరమే అంటూ సంతోషించారు. "ప్రతి నాగరిక దేశమును నేడు తన సేనలను పెంచుకున్నదంటే, ఆటంబాంబులను సృష్టించుకున్నదంటే, ప్రపంచ సౌఖ్యార్థము కాని వాణిజ్య పంటల సరకుల ఉత్పత్తి నెక్కువ చేయుచున్నదంటే, జనావశ్యక కార్యములను విసర్జించుచున్నదంటే ... " కారణము ధనాభిలాషయే కాని వేరు కాదు. ఈ ధనదాస్యం పోనిదే మానవ దాస్యం పోదని అభిప్రాయపడ్డారు. ఈ ధనదాస్యాన్ని పోగొట్టే ప్రయత్నం రష్యాలో జరుగుతోందంటూ, అది ఇంకా ప్రయత్న మార్గంలోనే ఉందనీ, ఈలోగా ఆ సంకల్పానికి అడ్డుగా పాశ్చాత్య డెమోక్రసీలు అనేక కుటిల ప్రయత్నాలు చేస్తున్నాయని అభిప్రాయపడ్డారు. భారతదేశ ప్రభుత్వం ముందుగా ఈ ధనదాస్యం గురించి ఆలోచించాలని సూచించారు.

"అర్థశాస్త్రమనగా మనుష్యులకు కావలసిన అనగా అత్యావశ్యకమైన వస్తు సముదాయమును ఉత్పత్తి చేసి, అందరికీ అందునట్లు పంచే విధానమును బోధించే శాస్త్రము అని అర్థము" అంటూ అర్ధశాస్త్రం గురించి 'అర్ధశాస్త్రమా – అనర్థశాస్త్రమా' అనే వ్యాసంలో రాశారు.

ఉత్పత్తి – పంపకం విధానంలో ప్రజల మధ్య అరాచకం తలెత్తవచ్చు. ఆ అరాచకాన్ని అణచటానికి కొన్ని కట్టుబాట్లు ఉండాలి. ఆ కట్టుబాట్లు సక్రమంగా అమలు జరగటానికి సమర్థమైన ప్రభుత్వం ఉండాలంటూ ప్రభుత్వం ఎలా పుట్టిందో చెప్పారు. అర్థశాస్త్రమంటే రాజ్యాంగ నిర్మాణ శాస్త్రమేనని అందువల్లనే చాణుక్యుని రాజనీతి శాస్త్రానికి 'అర్థశాస్త్రమ'ని పేరు వచ్చిందని అన్నారు.

ప్రపంచానికంతటికి పాశ్చాత్య అర్థశాస్త్రాలే వరవడులయ్యాయి. ఈ పాశ్చాత్య అర్థశాస్త్రాలు ప్రజల అవసర అనవసరాలతో సంబంధం లేకుండా ధనాన్ని పెంచే ఉత్పత్తిని పెంచడం మొదలైన సమస్యల మీదే దృష్టిని కేంద్రీకరిస్తున్నాయి. వీటికి యంత్ర పరిశ్రమలు దోహదం చేస్తున్నాయి. దానివల్ల ఉత్పత్తి పెరిగినప్పటికీ, ప్రజలలో నిరుద్యోగం ప్రబలి కొనుగోలు శక్తి తగ్గుతోంది. అప్పుడే ఇతర దేశాలు తమ సరుకుకు మార్కెట్ వెతుక్కుంటున్నాయి. ఈ విధంగా లాభాలు గడించిన దేశాలు మార్కెట్‌లకై తన్నుకోవటం వల్లనే మొదటి ప్రపంచ యుద్ధం కాని, అంతకు ముందు జరిగిన

యుద్ధాలు కాని జరిగాయని, వీటివల్ల తిరిగి పెట్టుబడిదారీ దేశాలే లాభం పొందాయంటూ పెట్టుబడిదారీ యుగంలో వచ్చిన అర్ధశాస్త్రాల గురించి, ఆర్థిక పరిస్థితుల గురించి విపులీకరించారు. ఈ వ్యాసంలో కేపిటలిస్టులను, డెమొక్రాట్లను, సోషలిస్టులను అందరినీ విమర్శించారు. చివరగా చాణుక్యుని అర్ధశాస్త్రమే సరైన అర్ధశాస్త్రమని మిగిలినవన్నీ అనర్ధశాస్త్రాలనీ తేల్చేశారు.

“జనులను, వర్తకులను, కర్షకులను, కార్మికులను, ఉద్యోగులను క్షుద్రతమ ధనాశా భావముతో కాక దేశాభ్యుదయమనే ఉత్తమ సంకల్పసిద్ధి కోసమే ఉత్సాహంతో పని చేయించే ఉపజ్ఞను” పురిగొల్పే రాజ్యాంగ విధానమే అభ్యుదయ రాజ్యాంగ విధానమంటూ ‘అభ్యుదయ రాజ్యాంగ విధానం’ అనే వ్యాసంలో తెలిపారు.

పూర్వకాలంలో విద్యపై కొందరి గుత్తాధిపత్యం సాగి ప్రజలను విద్యకు దూరం చేశారని కొందరు ఆధునికులు చేస్తున్న ప్రచారం సరియైనది కాదంటూ ‘వృత్తులు – విజ్ఞాన విశేషాలు’ అనే వ్యాసం ప్రారంభమవుతుంది.

విద్వత్తు అనేది దేవత వంటిది. తపస్సు చేసినంత పని చేసి మాత్రమే దాన్ని సాధించగలం. అందువల్ల అది వారి తాహతుకు తగ్గట్టుగా పూర్వకాలంలో అందింది. అందరూ అలా చేయటం లోకంలో కుదరదు. కనుక అలా కొద్దిమందికే అందిందనీ, “అనేక సౌఖ్య సౌకర్యాలను త్యాగం చేసి తన్మయమైతేనే కాని” విజ్ఞాన రహస్యాలు బోధపడవనీ ఆయన భావించారు.

వృత్తి అంటే ఇదివరకు ఎవరి మనసుకు నచ్చిన వృత్తిని వారు చేపట్టటం. అదే వారికి జీవనాధారమయ్యేది. కానీ ఈ రోజు అది భుక్తి. ఏ వృత్తి అయితే కడుపునిండా తిండి పెడుతుందో దాన్నే చిత్తవృత్తిగా చేసుకోవటం జరుగుతోంది. అలాగే చదువులు కూడా ఉదర పోషణార్థం చదువుతున్నారని బాధపడ్డారు. ఇటువంటి పరిస్థితిలో డబ్బు సక్రమమైన మార్గంలో సంపాదించలేరనీ, దగా ఒక్కటే మార్గమనీ చెపుతూ ఎంతెంత మోసాల్తో ధనాన్ని సంపాదిస్తున్నారో విశదీకరించారు.

ఈ విధమైన సంస్కృతిని ప్రవేశపెట్టిన పెట్టుబడిదారీ విధానం ఫ్యూడల్ సంస్కృతిని విమర్శించటాన్ని దానియొక్క అహంగానే భావించారు. ఆ విమర్శని ప్రచారం చేసేవారిని ఉన్నత పదవుల కోసం ఓట్లు సంపాదించటానికి ఈ ప్రచారాన్ని ఒక ప్రొఫెషన్‌గా పెట్టుకున్న పాతకులుగా నిందించి ఈ ప్రచారాలను ప్రోత్సహించటం “జాతీయ ప్రభుత్వ విధాన లక్షణమా?” అని ప్రశ్నించారు.

3.3. రాజకీయ వ్యాసాలు

రాజకీయ సమస్యల గురించి, రాజకీయ పరిస్థితుల గురించి, రాజకీయ పార్టీల గురించి రాసిన వ్యాసాలను ఈ కోవలో పరిశీలించాను. కాంగ్రెస్ గురించి, ముస్లింలీగు గురించి, కమ్యూనిజం గురించి, ఆంధ్రరాష్ట్ర నిర్మాణ సమస్య మొదలైన విషయాల గురించి చర్చించిన వ్యాసాలు ఇందులో ఉన్నాయి. ఒకే అంశం గురించి మూడు లేక నాలుగు వ్యాసాలున్నాయి. అందువల్ల ఆ వ్యాసాలను ఆయా అంశాల పరంగా విభజించి పరిశీలించాను. ఆయా అంశాలకు సంబంధించి ఆ వ్యాసాల్లో ఏం రాశారో క్లుప్తంగా తెలియచేస్తాను.

కాంగ్రెస్ గురించిన వ్యాసాలు:

"తెల్లవాడు తొలగందే పండగేమిటి మనకి? కాంగ్రెస్‌కు పట్టిన పిచ్చి ఆవేశం"[11], " పాత కాంగ్రెస్ వర్కర్లు లోకసేవకులు కావాలి"[12]. "కులతత్వ మూర్ఖులు, బ్రిటిషు ప్రాధేయులు"[13] అనే వ్యాసాల్లో కాంగ్రెస్ గురించి రాశారు.

"తెల్లవాడు తొలగందే పండగేమిటి మనకి? కాంగ్రెస్‌కు పట్టిన పిచ్చి ఆవేశం" అనే వ్యాసం స్వాతంత్ర్యోత్సవాలకు సంబంధించినది. అప్పటికే కాంగ్రెస్ నాయకులలో పదవులకై తగవులాడుకోవటం జరుగుతోంది. స్వాతంత్ర్యం కోసం చాలా త్యాగాలు చేసిన సామాన్యులకి ఈ పరిస్థితి బాధాకరమైనది. ఈ తగవులాటలు, పదవీవాంఛ వ్యక్తిగత లక్షణాలని చాలా కాలం అనుకోవటం జరిగింది. కాంగ్రెస్ వీటి గురించి ఏమీ మాట్లాడకుండా ప్రజలు ఆగస్టు 15, 1947 న ఎలాంటి స్వాతంత్ర్యోత్సవాలు జరపాలో తీర్మానించింది. దీనితో 'తప్పు' కాంగ్రెస్‌లోనే ఉన్నదా అనే అనుమానం సాధారణులకు కలుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. "ఇదే నిజమైన ఉత్సవం చేసుకోతగిన విజయమైతే వర్కింగు కమిటీ ఉపదేశం అవసరం లేకుండానే ప్రజలు చేసుకునేవారేమోనని, ఎక్కడ చూసినా దొంగతనాలు, హత్యలు, మార్కెట్లు, లంచాలు, దహనాలు, కరువులు, రోగాలు, చావులే ఉన్నపుడు అసలిది విజయమేనా" అని సందేహించారు.

"పాత కాంగ్రెస్ వర్కర్లు లోక సేవకులు కావాలి" అనే వ్యాసంలో కూడా కాంగ్రెసులో పెరిగిపోయిన పదవీ వ్యామోహం గురించే ఎక్కువగా రాశారు. గాంధీ సిద్ధాంతంలో 'సౌమ్యంగా ఎదిరించడం' లో రాను రాను ఎదిరించడం అనేది పోయి,

సౌమ్యతే మిగిలిందని, నిజంగా ఎదిరించిన వాళ్ళు సర్వస్వం కోల్పోయారని నామమాత్రపు బెదిరింపు చూపినవారు మంత్రులు, ఉపమంత్రులు వగైరా అయ్యారని అన్నారు. వీరిని గురించి వ్యాఖ్యానిస్తూ "పోయేనన్న తెల్లోడు పోకుండా పొంచే ఉన్నాడు. వాడి చెప్పుచేతలు కలవాటు పడినవారే శాఖామృగజీవులన్నీని" అంటారు.

"కులతత్వ మూర్ఖులు – బ్రిటిషు ప్రాధేయులు" అనే వ్యాసంలో హిందూ మహాసభ వారిని కులతత్వ మూర్ఖులని, లిబరల్సును బ్రిటిష్ ప్రాధేయులని కాంగ్రెస్ వారనటాన్ని నిరసిస్తూ 'కాంగ్రెస్ గుజరాత్ మారువాళీ ధనాధిష్ఠిత విజృంభణ'కు లోబడినదని, అది భారతదేశమునంతను ఆక్రమించుకొని బ్రిటిషు వారితో అధికార కరగ్రహణకు బేరము పెట్టగల ప్రతిభను సంపాదించుకుందని, కాంగ్రెస్ వారు తాము ప్రోత్సహించిన ధనాఢ్య వర్గమును కంట్రోలు చేసుకోలేక దానికే దాసులై ఏవేవో గంభీరోపన్యాసములతో కాలక్షేపము చేయుచున్నారని రాశారు.

కాంగ్రెసు గురించి ప్రముఖంగా రాసిన వ్యాసాలివి. మిగిలిన వ్యాసాల్లో కూడా అనేకచోట్ల కాంగ్రెస్ గురించి ఆయా సందర్భాల్లో ప్రస్తావించారు.

ముస్లింలీగు గురించిన వ్యాసాలు:

" 'ఇండియా'ను 'డినియా'గా మారుస్తారట – 'లీగు' ముస్లిములు మహమ్మదు మత కళంకులు'[14], "హైందవ జాతీయత – ముష్కర ముస్లిములు"[15], "జనాబ్ జిన్నాకు : అవ్వా కావాలి, బువ్వా కావాలి"[16], మొదలైనవి ముస్లింలీగు గురించి రాసిన వ్యాసాలు.

ముస్లిములు, హిందువులు అనే వాదన వచ్చినపుడల్లా ఆయన హిందూ శబ్దం దేశానికి సంబంధించినదని, మతానికి సంబంధించినది కాదని వాదించారు. ఈ దేశంలో ఉన్న ప్రజలంతా హిందువులేనని, ఈ సంఘము వివిధ వర్ణ, జాతి, మతాల సమాహారమని వివరించారు. ఇక్కడున్న వారితో విరోధించి బలప్రయోగంతో తమ మతంలోకి ప్రజలను మార్చే ప్రయత్నం చేసినవారు మహమ్మదీయులు. ఉద్యోగాలు, చదువులు మొదలైన లంచాలు పెట్టి, తమ మతంలోకి ప్రజలను మార్చినవారు క్రైస్తవులు. బ్రిటిషు ప్రభుత్వమువారు తమ 'విభజించి పాలించు' విధానంలో ముస్లిములను రెచ్చగొట్టి తమ ప్రయోజనాలను కాపాడుకున్నారంటూ ఆక్రోశించారు. బ్రిటిషువారి ప్రభావం, ఇదివరకు తాము ఈ దేశాన్ని పాలించిన పాలకవర్గం అనే గర్వంతో మహమ్మదీయులు ఈ దేశం మొత్తానికి తిరిగి పాలకులు కాగలిగితే

బలవంతానైనా అందరినీ మహమ్మదీయులుగా మార్చాలనుకుంటున్నారనీ, ఇంకా పరిస్థితులు అనుకూలిస్తే ప్రపంచాన్నంతటినీ షరియత్ పాలన కిందకు తేవాలని కలగంటున్నారనీ రాశారు.

కాని కాంగ్రెస్ మాత్రం ఈ దేశవాసులందరూ హిందువులే అనే దృక్పథంతో అందరి తరఫున ఈ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిందనీ, ఈ రోజు కాకుంటే రేపైనా ఇక్కడున్న అందరూ హైందవ సంఘముగా పరిణామం చెందుతారని కలలు కన్నారని కాని బ్రిటిషు వారి 'విభజించి పాలించు' నీతి హిందూదేశాన్ని 'పాకిస్తాన్' పేరుతో విడదీసిందని బాధపడ్డారు. పాకిస్తాన్ సాధించుకున్నాక కూడా ముస్లింలీగ్ బ్రిటిషు వారి సహాయంతో హిందువులను నానా వ్యథలకు గురి చేస్తూ, నానాజాతి సమితికి ఫిర్యాదు చేస్తోందంటూ ముస్లింలీగు చేస్తున్న అన్యాయాలను తెలియచేశారు. ఈ వ్యాసాల్లో చాలా చోట్ల ముస్లింలీగు పట్ల నిరసనతో ప్రారంభమై ద్వేషం రూపు తీసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి.

కమ్యూనిజం గురించిన వ్యాసాలు :

సోషలిజం గురించి, కమ్యూనిజం గురించి చర్చించిన వ్యాసాలు 'భారత దేశానుగుణమగు కమ్యూనిజము కావలెను'[17], 'భారతదేశమునకు కావలసిన సోషలిస్టు విధానము'[18].

సోషలిజం గురించి చెపుతూ భారతదేశంలో " మిల్లుల యజమాని దాల్మియా మొదలు సాధారణ కార్మికుని వరకు, వార్తా సంపుటీ చక్రవర్తియగు గోయెంకా మొదలు సాధారణ కంపోజిటర్ వరకు, జమీందారుల నాయకుడగు సుబ్బరాయన్ మొదలు రైతుకూలీ వరకు ... " అందరి 'పాలసీ' సోషలిజమే అయ్యిందంటూ 'భారతదేశమునకు కావలసిన సోషలిస్టు విధానము' అనే వ్యాసం ప్రారంభమవుతుంది.

సోషలిజం యొక్క ప్రథమాశయము అందరికీ నిత్యావసరములు తీర్చటం, ఆ తరువాత మిగులు ధనాన్ని దేశాభ్యుదయ కార్యక్రమాలకు ఖర్చు పెట్టటం అని గుర్తించారు.

సోషలిజంలో అందరికీ ప్రతినిధి ప్రభుత్వ సంస్థ. ప్రజల శ్రేయస్సు కొరకు ప్రభుత్వం ఏ ఆస్తినైనను తగు పరిహారం ఇచ్చి స్వాధీనం చేసుకోవచ్చు. ఇందుకు జమీందారు మొదలు రైతు వరకు పురోభివృద్ధికై శ్రమ పడటం నేర్చుకోవాలని అభిప్రాయపడ్డారు.

సోషలిజంలో ప్రభుత్వం సర్వాధికారియైనా, ప్రజల ఆర్థిక, నైతిక, వైజ్ఞానిక, శ్రామిక స్థాయిలను బట్టి వారికి కొన్ని బాధ్యతలను పంచి వారు చేసే పనులను ప్రోత్సహిస్తూ, అవసరమైన చోట్ల నివారిస్తూ అజమాయిషీ చేస్తూ ఉంటుందని వివరించారు. 'ఏ ప్రభుత్వం తక్కువగా పరిపాలిస్తుందో అది ఉత్తమ ప్రభుత్వము' అనేదానికి సోషలిస్టు ప్రభుత్వాన్ని నిదర్శనంగా అభిప్రాయపడ్డారు.

కమ్యూనిజం 'తానే సర్వమూ సహించి ప్రజలను అబాధ్యులుగా చేయడానికి పూనుకుంటుంది'. ఇంపీరియలిజం, కేపిటలిజంలలోను పెట్టుబడిదారులు, ధనవంతులు ప్రభుత్వాన్ని గుప్పిటలో పెట్టుకొని ప్రజల కష్టఫలితాన్ని తాము దోచుకుని అనుభవిస్తారు. అందువల్ల మన దేశానికి సోషలిజమ్ సరైనదంటూ బ్రిటిషువారు రాక పూర్వం మనదేశంలో సోషలిజమ్ ఉండేదని, బ్రిటిషు వారి రాకతో అది చిన్నాభిన్నమైందని బాధపడ్డారు.

మన దేశంలో భూమి చిన్న చిన్న ఖండాలుగా ఉన్న కారణంగా పెద్ద యెత్తున వ్యవసాయం చేయటం కుదరదు. వ్యాపార పంటలు మాని పెద్ద యెత్తున ఆహార పంటలు పండించకపోతే కరువు తీరదు. అందువల్ల ఎస్టేటులలో కలెక్టివు ఫార్మింగ్ మొదలెట్టి ప్రభుత్వమే ప్లానింగు చేసి ఆహారపంటలు పండించాలి. రైతులందరూ అది తమ అందరిదీ అనే దృష్టితో పని చెయ్యాలి. అందులో పని చేసిన వారికి "వారి కుటుంబముల సంఖ్య, వారి శ్రమల యొక్క తరగతి, వారి అవసరముల స్వభావాన్ని బట్టి ప్రతిఫలములు" ఇవ్వాలి. వ్యవసాయ రంగం వలెనే పారిశ్రామిక రంగాన్ని కూడా సంస్కరించాలని సూచించారు.

ఈ రకమైన సోషలిజం గురించి మన ప్రభుత్వం ఆలోచిస్తుందనే నమ్మకం గరిమెళ్ళకు ఉన్నట్లుగా కనిపించదు. అందుకే "... రష్యా మనకు సాయం చేయవస్తుంది. మనకూ దానికి పుస్తె అవుతుంది. మన జాతీయ తత్వమునకూ సంప్రదాయమునకూ తర్పణమవుతుంది. రానున్న అమెరికా యుద్ధంలో మన మొక పక్షంలో పడి నలిగిపోతాము. కనుక పై చెప్పిన సోషలిజమును దేశీయులెల్లరు బలపరుతురుగాక!" అంటూ ముగించారు.

'భారత దేశానుగుణమగు కమ్యూనిజము కావలెను' అనే వ్యాసంలో అమెరికా గురించి చెపుతూ, ప్రపంచమంతా లోపలొకటి, పైకి ఒకటిగా కనిపిస్తోందంటారు.

అలాంటి మహా సామ్రాజ్యాని కంతటికీ మకుటము ఐక్యరాజ్యసమితి, భద్రతామండలి. దీనికి అనేక ప్రపంచ శాఖలున్నాయి. దీని కంతటికీ అధిష్ఠాన దేవత అమెరికా. ఉపదేవతలు బ్రిటన్, ఫ్రాన్స్ మొదలైనవన్నీ. ఇవన్నీ అమెరికా చేతిలో ఉన్నాయి. దానికి ఏ మాత్రం ఎదురు తిరిగినా 'నవరంధ్ర నిర్బంధమై త్రాహి త్రాహి యని మాడవలసిందే' నంటారు. అమెరికాకు సమ ఉజ్జీ రష్యా అని, అది "ప్రతి ప్రాచ్య ప్రతీచి దేశములందును తన కమ్యూనిస్టుల చేత వీలయితే యుద్ధాలు, కాకుంటే సమ్మెలు చేయిస్తోందని" అమెరికా అర్ధనీతికి అపజయం రావచ్చేమో కానీ, రష్యా రాజనీతికి అపజయం రాదని భావించారు.

బ్రిటిషు పిశాచం ఉన్నప్పటి కంటె లేనప్పుడే ఎక్కువ పీడిస్తోంది. బ్రిటిషు వారి వల్ల ప్రవేశించిన పెట్టుబడిదారీ సంస్కృతి, వారు పోయిన తర్వాత పెట్టుబడిదారులను వరించింది. వారు దేశ ప్రయోజనాలను కాకుండా లాభాలనే పట్టించుకున్నారు. వీరు చెల్లించిన సుంకములు మొదలైనవే ప్రభుత్వానికి ఆధారం కనుక మన ప్రభుత్వాలు వీరి చెప్పుచేతల్లో ఉంటున్నాయి. పదవుల్లోకి వచ్చిన వారంతా యేదో పైపై మాటలు చెపుతూ దీపముండగానే యిల్లు చక్కబెట్టుకుందామన్న రీతిగా తయారయ్యారు. ఈ ధనాశాతత్వమే అనేక కులతత్వ ద్వేషాలకు మూల కారణమని భావించారు. మన దేశంలో ఉన్నది డెమోక్రసీ కాదు. "ప్రజలను గిలుబాడి వోటులను తస్కరించి లాభాలు దేవుకొనే వేషాల రాయుళ్ళు దేశాన్ని యేలుతున్నారు." ఈ ధనాశా నిమగ్నమైన నాయకత్వాన్ని పడగొట్టాలి. ఇది "గాంధీ మహాత్ముని సత్యాహింస, శాంతియధేచ్ఛా సిద్ధాంత పద్ధతుల వల్ల సాధ్యం కాదు. ఎవరో ఒక మహావీరుడు లేచి ఒక్క కలము పోటుతో దీనినంతటిని ఎత్తివేసి సర్వ సమానత్వమును నిలబెడితే సంతోషించే వాళ్ళు కోట్లు అవుతారు. యేడిచేవాళ్ళు యేడుగురే మిగులుతారు" అని రాశారు. రష్యాలో సాధించిన విజయాల్ని మెచ్చుకున్నారు. ధనం యొక్క పెత్తనాన్ని లేకుండా చెయ్యాలని, అట్టి చోట అనేక ఆచార వ్యవహారాలు తోటలో ఉన్న అనేక పూల మొక్కల్లా సహవాసం చేస్తాయని స్పష్టం చేశారు.

ఆంధ్ర రాష్ట్రానికి సంబంధించిన వ్యాసాలు :

'ఆంధ్రరాష్ట్రమునకు ఆలస్యమేల? (ఆలస్యము వలన కలుగు మహానర్థములు – సత్వర కార్య నిర్వహణావశ్యకత)'[19], 'ఆంధ్రరాష్ట్ర సమస్యల్లో ఓమందూరు వినోద

వికట చిట్కాలు[20], 'బస్తరు సంస్థానం : ఆంధ్రుల కర్తవ్యం'[21], 'భాషారాష్ట్ర నిర్మాణమే ప్రప్రథమ కర్తవ్యం'[22], 'కొన్ని బహు భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆవశ్యకత'[23] అనేవి ఆంధ్ర రాష్టం కావాలి, త్వరలో సాధించుకోవాలంటూ రాసిన వ్యాసాలు.

భాషా ప్రాతిపదిక మీద ఆంధ్ర రాష్ట్రం ఏర్పడాలనే ఉద్యమం 1915 ఆ ప్రాంతాల్లో మొదలయ్యింది. ఆ తరువాత మొత్తం భారతదేశ స్వాతంత్ర్యం అనేది ప్రధాన సమస్య అనీ, భాషారాష్ట్ర సమస్య ఆ తర్వాతదనీ జాతీయ నాయకులు భావించడంతో ఆంధ్రరాష్ట్ర సమస్య వెనకపడింది. కానీ, ఈ లోపుగానే భాషారాష్ట్ర నిర్మాణానికే ప్రాముఖ్యం యిచ్చి ఒరిస్సా మొదలైన వారు ప్రత్యేక రాష్ట్రాలను సాధించారు.

ఇపుడు స్వాతంత్ర్యం వచ్చాక కూడా ఈ విషయాన్ని తేల్చటానికి హైకమాండు తాత్సారం చేస్తోంది. ఇప్పటికయిన ఆలస్యం వల్లనే ఒరిస్సా వారు తమలో చేరిన భాగాల్లోని తెలుగు ప్రజలకు ప్రాధాన్యం లేకుండా, స్కూళ్ళలో తెలుగు లేకుండా చేస్తున్నారు. అలాగే బస్తరు కూడా మధ్య రాష్ట్రంలోకే జారిపోయే పరిస్థితి సంభవించింది. అరవలు మద్రాసు, చిత్తూరు, నెల్లూరు కూడా తమవే అనేదాకా వెళ్ళారు. ఆలస్యం అయే కొద్దీ ఆంధ్ర భాగాల్లో ఒకటొకటే చేజారిపోతున్నాయి అంటూ గరిమెళ్ళ అభిప్రాయపడ్డారు. తొందరగా తేల్చవలసిన సమస్య విషయంలో నెహ్రూ "ఇటువంటి సమస్యలు కదల్చడానికి, తలపెట్టడానికి ఇది అదను కాద"ని అనటం అన్యాయంగా ఉందని, "ఎద్దు పుండు కాకికి నెప్పి కాదు" కనుక నెహ్రూ అలాంటి మాటలు మాట్లాడ గలుగుతున్నారని, సత్వరం ఆంధ్ర ప్రజలు ఆంధ్ర రాష్ట్ర నిర్మాణానికై కృషి చెయ్యకపోతే చాలా నష్టపోతామని ఉద్బోధించారు. ఆ సందర్భంలో అప్పటి మంత్రుల ప్రకటనలను విమర్శిస్తూ వ్యాఖ్యానించారు.

జమీందారీ రద్దు గురించిన వ్యాసాలు:

'అన్ని జమీందారీలను ఎత్తివేయుట అన్యాయం' [24], 'జమీందారీ రద్దు చట్టము – జాతీయ సంప్రదాయ విరుద్ధము'[25], 'కళావారి శాసనం'[26] ఇవన్నీ జమీందారీ రద్దు చట్టం గురించి చర్చించిన వ్యాసాలు.

ఈ వ్యాసాల్లో జమీందారీలను రద్దు చేయటం వల్ల కొందరు జమీందారులు నష్టపోయారనే బాధ ఉంది. భూమి జమీందార్లది కాకపోతే నష్ట పరిహారం ఎందుకు చెల్లించారనే వాదం ఉంది. జమీందారీ రద్దు చట్టం వల్ల నిజంగా పేద రైతులకు

న్యాయం జరుగుతుందా? అనే ప్రశ్న ఉంది. జమీందార్లను ప్రభుత్వం తమ చెప్పుచేతల్లో ఉంచుకుంటూనే భూములను సోషలిష్టు పద్ధతిలో సాగు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందనే సలహా ఉంది.

3. 4 ఇతరములు

పై విషయాల గురించి ప్రముఖంగా చర్చించినవి కాకుండా మిగిలినవన్నీ ఈ కోవలో పరిశీలించాను. కొన్ని వ్యాసాల్లో పై విషయాలకు సంబంధించినవే కలగలుపుగా ఉన్నాయి. అలా కాని కొన్నిటిని మాత్రం ఇందులో పరిశీలిస్తాను. వాటిలో "ధర్మమేవ జయతే"[27], "ఘనాపాఠీ రాజన్"[28] మొదలైనవి ఉన్నాయి.

'ధర్మమేవ జయతే' అనే వ్యాసంలో కోర్టుల్లో న్యాయం, ధర్మం అనేవి ఎలా వ్యాపారం అయిపోయాయో కేసు వకీలు వద్దకు వెళ్ళటం దగ్గర్నుంచి జడ్జీలు తీర్పు చెప్పటం వరకు వివరించారు. **ఈ పద్ధతిని మార్చాలన్నా ఇందులో భాగస్వాములంతా ప్రధానులు, పట్టభద్రులు, ఉన్నతోద్యోగులేనని అందుకని వీరంతా ఈ పద్ధతి మార్చాలని ఉపన్యాసాలు వగైరాలు చేస్తారు.** కానీ ఎవరూ ఆచరణలో దీన్ని మార్చరని, మార్చటం వలన వారికి ఉన్న సదుపాయాలు పేరుప్రతిష్టలు అన్నీ వదులుకోవాల్సి వస్తుంది కనుక నిజాయితీగా ఎవరూ ప్రయత్నించరని అభిప్రాయపడ్డారు. న్యాయస్థానాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ విధానాలు సర్వం వక్రపథంలోనే నడుస్తున్నాయని. ఇటువంటి వాతావరణంలో పెరిగే పిల్లలు రేపు ఏం కాబోతున్నారనే ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన వ్యాసాల్లో ప్రపంచ పరిస్థితులు పరిణామాలు ప్రజలకు ఎంతవరకు ఉపకరిస్తున్నాయి, మన దేశాన్ని ఎలా అభివృద్ధి చేసుకోవాలి మొదలైన విషయాలను చర్చించారు.

కొన్ని వ్యాసాలు ప్రారంభిస్తూ వ్యాసగత విషయం సూచనప్రాయంగా తెలిసేలా పిట్ట కథలతో మొదలెట్టారు.

రెండు, మూడు అధ్యాయాల్లో పరిశీలించిన గరిమెళ్ళ సాహిత్యం ఆధారంగా మన దేశ పరిస్థితులను గరిమెళ్ళ ఏ విధంగా అవగాహన చేసుకున్నారు అనేది తరువాతి అధ్యాయాల్లో పరిశీలిస్తాను.

ఫుట్ నోట్స్

గమనిక : ఈ క్రింద పేర్కొన్న రచనలన్నీ గరిమెళ్ళ సత్యనారాయణ గారివి. అందువల్ల ప్రతీ వ్యాసానికి రచయిత పేరు తెలియ చెయ్యటం లేదు.

1. నూతన సాహిత్య విజృంభణము, కృష్ణా పత్రిక, 02-10-1926
2. సాంఘిక నవల, భారతి, ఆగస్టు, 1932
3. ఆంధ్ర భాషా పరిణామము, భారతి, ఏప్రిల్, 1938
4. క్రొత్త అనుశాసనము, కృష్ణా పత్రిక, 30-04-1927
5. పల్లెటూరి కథలు - సమీక్ష, భారతి, సెప్టెంబర్, 1931
6. వాణిజ్యం - అరాచకం - విరుగుడు, ఆనందవాణి, 15-08-1948
7. పూర్వపు బానిసత్వం - నేటి ధన బానిసత్వం, ఢంకా, నవంబర్ 1949
8. అర్ధశాస్త్రమా - అనర్థశాస్త్రమా?, ఢంకా, జనవరి 1949
9. అభ్యుదయ రాజ్యాంగ విధానం, ఢంకా, ఫిబ్రవరి, 1949
10. వృత్తులు - విజ్ఞాన విశేషాలు, ఢంకా, జూలై 1949
11. తెల్లవాడు తొలగందే పండగేమిటి మనకి, కాంగ్రెసుకు పట్టిన పిచ్చి ఆవేశం, ఆనందవాణి, 03-08-1947
12. పాత కాంగ్రెసు వర్కరులు లోక సేవకులు కావాలి, ఆనందవాణి, 29-02-1948
13. కులతత్వ మూర్ఖులు - బ్రిటిషు ప్రాధేయులు, ఆనందవాణి, 18-04-1948
14. ఇండియాను డినియాగా మారుస్తారట - లీగు ముస్లిములు మహమ్మదు మత కళంకులు, ఢంకా, అక్టోబర్, 1947
15. హైందవ జాతీయత - ముష్కర ముస్లిములు , ఢంకా, నవంబర్, 1947
16. జనాబ్ జిన్నాకు : అవ్వా కావాలి బువ్వా కావాలి, ఆనందవాణి 20-07-1947
17. భారత దేశానుగుణమగు కమ్యూనిజము కావలెను, ఢంకా, జూన్, 1948
18. భారతదేశమునకు కావలసిన సోషలిస్టు విధానము, ఢంకా, సెప్టెంబర్ 1947
19. ఆంధ్ర రాష్ట్రమునకు ఆలస్యమేల? భారతి. డిసెంబర్, 1937
20. ఆంధ్ర రాష్ట్ర సమస్యల్లో ఓమందూరు వినోద వికట చిట్కాలు, ఆనందవాణి 29-06-1947
21. బస్తరు సంస్థానం - ఆంధ్రుల కర్తవ్యం, ఆనందవాణి, 25-01-1948
22. భాషా రాష్ట్ర నిర్మాణమే ప్రప్రథమ కర్తవ్యము, ఆనందవాణి, 13-06-1948
23. కొన్ని బహుభాషా ప్రయుక్త రాష్ట్రాల ఆవశ్యకత, కిన్నెర, ఆగస్టు, 1952
24. అన్ని జమీందారీలను ఎత్తివేయుట అన్యాయం, ఢంకా, ఏప్రిల్, 1947

25. జమీందారీ రద్దు చట్టము - జాతీయ సంప్రదాయ విరుద్ధము, ఢంకా, డిసెంబర్, 1947

26. కళావారి శాసనం, ఆనందవాణి, 11-01-1948

27. ధర్మమేవ జయతే, ఢంకా, ఆగస్టు, 1949

28. ఘనాపాఠీ రాజన్, ఆనందవాణి, 15-06-1947

* * *

రాజకీయ పరిజ్ఞానం

భారతదేశం యొక్క ఆర్థిక, రాజకీయ పరిస్థితుల గురించి గరిమెళ్ళ అవగాహనను అర్థం చేసుకోవటానికి తొలుత మనకు సహకరించేవి 'మాకొద్దీ తెల్ల దొరతనము' పాట, స్వరాజ్య గీతాలు రెండు భాగాలు. ఇవి 1921 లో వెలువడ్డాయి. అంతకుముందు ఆయన కొన్ని పాటలు రాసినప్పటికీ అవి లభించలేదు. 1915 లో గురజాడ నిర్యాణం సందర్భంలో రాసినది రాజకీయాలకు సంబంధించినది కాదు. అందువల్ల 1921 లో వెలువడ్డ వాటినే తీసుకున్నాను. 1921 కి ముందు వెనుకల దేశ రాజకీయ పరిస్థితులను గురించి మొదటి అధ్యాయంలో వివరించాను. అయినా 1921 లో గాంధీ 'ఏడాదిలో స్వరాజ్యం' అనే నినాదంతో ఉద్యమం ప్రారంభించారనేది గుర్తుంచుకోవలసిన విషయం. ఆ స్ఫూర్తితో గరిమెళ్ళ కదిలారు. అనేక ఉత్తేజకరమైన పాటలు రాశారు. వాటిల్లో విశేష ప్రజాదరణాన్ని పొందినవీ, ప్రభుత్వ రికార్డుల్లో రాజద్రోహ నేరమారోపించటానికి ప్రముఖంగా గుర్తించబడినవీ 'మాకొద్దీ తెల్లదొరతనము', 'దండాలండోయ్ మేముండలేమండోయ్' పాటలు[1]. ఈ రెండు పాటల్లో దాదాపు అన్ని సమస్యలనూ ప్రజల ముందు పెట్టారు.

ఆ పాటల్లో ఉన్న భారతదేశ ఆర్థిక పరిస్థితులకు సంబంధించిన విషయాలను తెలుసుకునే ముందు మన దేశ ఆర్థిక పరిస్థితులను తెలుసుకోవటం అవసరం.

బ్రిటిష్ వారు మన దేశానికి వచ్చేవరకు మన దేశంలో గ్రామీణ వ్యవస్థ ఉండేది. ఇక్కడ కుల వ్యవస్థ పాటించబడింది. నేత, కమ్మరం, కుమ్మరం, వడ్రంగం మొదలైనవన్నీ కుల వృత్తులుగా ఉండేవి. వ్యవసాయానికి అవసరమైన పనిముట్లు, బట్టలు, మట్టిపాత్రలు మొదలైనవన్నీ వీరు సమకూర్చేవారు. ఆర్థిక, సామాజిక సేవలు కరణము, పురోహితుడు, చాకలి, మంగలి మొదలైనవాళ్ళు సమకూర్చే వాళ్ళు. ఇక్కడ

నేయబడిన నూలు, పట్టు, ఉన్ని వస్త్రాలు ప్రపంచ ప్రసిద్ధి గాంచినవి. కళలకూ, చేతివృత్తులకూ దేశీయ విదేశీయ మార్కెట్లుండేవి. గ్రామంలో కొంత భూమి ఉమ్మడిగా ఉండేది. గ్రామస్తులు పశువులు మేపుకోవటం, వంట చెరుకు తెచ్చుకోవడం మొదలైన అవసరాలకు ఆ భూమిని ఉపయోగించుకునే వారు. అప్పట్లో మారకం వస్తు రూపేణా ఉండేది. భూమిశిస్తు చెల్లించటానికి మాత్రమే వీరికి ప్రభుత్వంతో సంబంధం ఉండేది. గ్రామంలో జరిగే వ్యవహారాలను, వివాదాలను పంచాయతీలు పరిష్కరించేవి. యుద్ధాల వల్ల ఆ గ్రామాల్ని వదలవలసి వచ్చినా, వారు తిరిగి కొంతకాలం తర్వాత మళ్ళీ వాటిని రూపొందించుకునే వారు. ఇవి సమృద్ధ, స్వయంపాలన నిర్మాణం కలిగినవి. అయినప్పటికీ ఇవి కలిగించిన దుష్పరిణామాలను కె. ఎస్. గిల్ ఇలా తెలియచేశారు.

" గ్రామాల స్వయంసమృద్ధి అనేది పట్టణాలలోని చేతివృత్తులకు విస్తృతమైన మార్కెట్ సృష్టి కాకుండా కండ్లకు కనిపించని గట్టి అవరోధంగా ఉండింది. దీని వల్ల ఆర్థిక వ్యవస్థలోని అత్యంత చురుకైన రంగంలో పురోగతి ఆగిపోయింది. గ్రామం లోపల ప్రతి చేతిపనివాడూ ఉత్పత్తి ప్రక్రియకు సంబంధించిన అన్ని పనులూ చేయవలసి ఉండేది. పరిమితమైన మార్కెట్ మూలంగా ప్రత్యేకీకరణ జరగలేదు. అందువల్ల శ్రమ యొక్క ఉత్పాదకత తగ్గిపోయింది. నైపుణ్యం పెరగడానికి ఏమాత్రమూ అవకాశం లేకుండా పోయింది. ముకుళిత, కుల బంధిత నిర్మాణం మూలంగా శ్రామికులు వృత్తి మార్చుకోడానికి గాని, తమ వృత్తిలోనే ఉన్నత స్థాయికి ఎదగడానికి గాని, మరొక స్థలానికి పోవడానికి గాని అవకాశాలు లేకపోయినాయి. గ్రామం యొక్క సంకుచిత సరిహద్దుల్లో మానవమేధ అణగారిపోయింది. ... తమ సరిహద్దులకు ఆవలి ప్రపంచం లోని వ్యవహారాల పట్ల గ్రామ సమాజం పాశవికమైన ఉపేక్ష వహించింది. దీని మూలంగా జాతీయ చైతన్యం గాని, చివరకు విదేశ దండయాత్రికుని ప్రతిఘటించాలనే సంకల్పం పుట్టడానికి గాని అవకాశం లేకుండా పోయింది."[2]

ఇక ఈ గ్రామాలు ఎంత స్వయంపాలిత స్వభావం కలిగి ఉన్నప్పటికీ ఏదో ఒక రాజుకి, లేక రాజునుంచి కొన్ని గ్రామాలను బహుమానంగా పొందిన ఇనాందారుకు కాని లోబడి బతకవలసి వచ్చేది. రాజుకి, రైతుకు ప్రత్యక్ష సంబంధం లేకుండా మధ్యలో జమీందార్లు, నియమితులు మొదలైన దళారులుండేవారు. భూమిశిస్తు కట్టిన తరువాత మిగిలినది వారికి బతకడానికి మాత్రమే సరిపోయేది.

మొగల్ రాజ్యం విచ్ఛిన్నమైన తరువాత అనేక స్వతంత్ర, అర్ధ స్వతంత్ర రాజరిక రాజ్యాలు, సంస్థానాలు ఏర్పడ్డాయి. ఇవి నిరంతర కలహాల్లో మునిగితేలేవి. భారతదేశం సంపన్నంగానే ఉన్నా ఈ రాజుల మధ్య, సంస్థానాధీశుల మధ్య కలహాలను, గ్రామీణ వ్యవస్థ ఏకాకితనాన్ని ఉపయోగించుకొని బ్రిటిషు వర్తకులు మన దేశంలో అడుగు పెట్టారు. అలా వర్తకానికొచ్చి అంచెలంచెలుగా మన దేశాన్ని దోచేశారు. పత్తి, మిరప, పొగాకు మొదలైన వ్యాపార పంటలను తీసుకొచ్చారు. వ్యాపార పంటల వలలో చిక్కిన చిన్న రైతులు ఫకీరులయ్యారు. వ్యాపార పంటల గిరాకీ పెరగడంతో ఆహార పంటలు తగ్గించారు. ఆహారపంటలు తగ్గగానే తిండికి కరువేర్పడింది. ఈ విధంగా 'లాభం' లక్ష్యంగా గల పెట్టుబడిదారీ సంస్కృతి మన దేశంలో ప్రవేశించింది. వస్తు మారకం పోయింది. సంస్థానాల్లో మినహాయించి బ్రిటిష్ ఇండియాలో వెండి రూపాయ నాణెం చలామణీలోకి వచ్చింది. మారక ద్రవ్యంగా దాన్ని మాత్రమే గుర్తించడం ప్రారంభించారు. వారు మనల్ని ఏ విధంగా దోచుకున్నారో తెలుసుకోవటానికి ఈ క్రింది అంశాలు పనికి వస్తాయి.

"1. అసమాన వర్తకం.

2. భారతదేశానికి బ్రిటిష్ పెట్టుబడినీ, వ్యాపారపు చొరవనూ ఎగుమతి చేయడం.

3. అవసర వస్తువులు కొనుగోలు చేయడం.

4. వలసవాదపు పాలనలో బ్రిటిషు పౌరుల నియామకం.

5. సరుకుల దిగుమతుల కంటే ఎగుమతులు ఎక్కువగా ఉండటం.

6. బ్రిటన్‌కు అనుకూలంగాను, భారతదేశానికి ప్రతికూలంగాను ఉండేటట్లు వినిమయపు రేట్లను నిర్ణయించడం.

7. బ్రిటిషు సరుకుల మీద తక్కువ దిగుమతి సుంకాలు.

8. భూభాగాలు జయించడానికీ, యుద్ధాలకూ భారతదేశపు వనరులను వినియోగించడం."

బ్రిటిషు ప్రభుత్వం తన వర్తక ప్రయోజనాల కోసమే రైళ్ళు, రవాణా సౌకర్యాలు, తంతి తపాలా సౌకర్యాలు మొదలైనవి ప్రవేశపెట్టింది. అయితే అవి జాతీయ భావాలు పెరగటానికి సహకరించాయి.

మనల్ని ఇలా రకరకాలుగా పిప్పి చేసిన బ్రిటిషు వారిని 'అహింస' అనే ఆయుధంతో వెళ్ళగొడదామని గాంధీ పిలుపిచ్చారు. సహాయ నిరాకరణ కార్యక్రమాన్ని నిర్ణయించి 'యేడాదిలో స్వరాజ్యం' నినాదాన్నిచ్చి ఆ కార్యక్రమాన్ని ఆచరించండన్నారు. కోర్టుల బహిష్కరణ, విద్యా సంస్థల బహిష్కరణ, శాసనసభల బహిష్కరణ అనే త్రివిధ బహిష్కరణలతో పాటు నూలు వడకడం, నేయడం మొదలైనవి ఆ కార్యక్రమంలో ఉన్నాయి. 1911 లో బెంగాల్ విభజన రద్దు కావటం, ఆ తరువాత మొదటి ప్రపంచ యుద్ధం, 1917 లో రష్యాలో వచ్చిన విప్లవం వీటన్నిటి ప్రభావం భారత ప్రజలమీద ఉంది. 1919 లో వచ్చిన రౌలట్ చట్టం, దాన్ని వ్యతిరేకిస్తూ జరిగిన ఉద్యమంపై జరిగిన దాడి బ్రిటిషు పరిపాలనపై విముఖతను పెంచాయి. అందువల్ల 1921 లో జరిగిన సహాయ నిరాకరణోద్యమంలో ప్రజలు చురుకుగా పాల్గొన్నారు. ఈ నేపథ్యం గరిమెళ్ళ వారి పాటల్లో కనిపిస్తుంది.

మన గ్రామీణ వ్యవస్థకు గల స్వయంపాలిత స్వభావాన్నే ఆయన పరిగణనలోనికి తీసుకున్నారు. దుష్ఫలితాలను గమనించలేదు. బ్రిటిష్ విదేశీయత నెదుర్కోవడానికి ప్రాచీన మత సంస్కృతిని ఆలంబన చేసుకున్నట్లే పెట్టుబడిదారీ వ్యవస్థ నెదుర్కోవడానికి గ్రామీణ వ్యవస్థను గొప్ప చేశారు. ఈ అవగాహనలో భాగంగానే కుల వ్యవస్థలో పై భాగంలో ఉన్న బ్రాహ్మణుల, క్షత్రియుల పరిస్థితులను నాటికి, నేటికీ పోలుస్తూ ఈ క్రింది పాదాలు రాశారనిపిస్తోంది.

[4] "ఛప్పన్న శాస్త్రాలు చెప్పుచుండే భూమి బాబు
నూటికొకడికైన నోట ముక్క లేదండోయి బాబు"

"ఎఫ్ఫే, బియ్యే. చెపుతానని బడులు పెట్టినాడు బాబు
అప్పు చేసి ఉన్న పొలాలమ్మించేసినాడు బాబు"

"ఘోర శత్రువులను నేల కూల చేసినాము బాబు
శవము తోటి కూడ మేము సాలలేమండోయి బాబు"

గ్రామీణ వ్యవస్థలో పాడి, పంట ముఖ్యమైనవి. ఇంటికి సరిపడా పాలిచ్చే ఒకటి రెండు పశువులుంటే కడుపు నిండినట్లుగా భావించే పల్లెటూరి వారు ఇంకా అక్కడక్కడ కనిపిస్తారు. అందుకే గ్రామీణ వ్యవస్థను పాలకడలితో పోలుస్తూ

"పాలకడలి వంటి రాజ్యం బద్దలయిందండి బాబు

కూలి చేసుకున్నా పొట్టకు కూడు లేదండోయి బాబు ॥ దం ॥" అంటారు. చేతివృత్తుల గురించి

"సాలె పంచ లేని దేశంపు నూలదేదీ

ఈ జూలు చింకి మిరిజా యే పురుషుడొసగే" [5] అంటూ ప్రశ్నించారు. చేనేత పనివారి దుస్థితి గురించి చెప్తూ

"దారమొడికే బొటనవేళ్ళు నరకుకున్నామండి బాబు

రాట్నవిద్య మంటబెట్టి రట్టు పొందినాము బాబు " అంటారు. నూలు మిల్లుల వల్ల చేనేత బట్టలకు గిరాకీ ఏ విధంగా తగ్గిందో చెప్పటానికి

"లాంకషైరొచ్చింది లంఖణము నాకే

పట్టణంబు కెల్ల పట్టుకున్నాదే -

పల్లెటూళ్ళకు కూడ పాకిపోయిందే" [6] అని 'రాట్నం - స్త్రీ సంభాషణ' లో అనిపిస్తారు.

"వృత్తులెల్ల పోయె - మన వీధి కళలు పోయె

బిచ్చమెత్తుటొండే దిక్కు - లేకున్న మిత్తి నొక్కు"[7] అంటూ చేతివృత్తులు మొదలైనవి పోయాక మన పరిస్థితి ఏమిటో చెపుతారు. మిల్లు బట్టలు అమ్మి నేత పనివాళ్ళ పొట్ట కొట్టటమే కాకుండా

"ఏడాది కేడాది కెక్కువ శిస్తేసి - ఈ భూమి నాదేనన్నాడు

మమ్ము కూలికి దున్నుమన్నాడు - కడుపుమంటతో

చావుమన్నాడు ! బానిసలకు వాడు ప్రభువవుతనన్నాడు ॥ మాకొద్దీ ॥

భారతదేశానికి వెన్నెముక అయిన రైతును ఏ స్థితికి తీసుకొచ్చారో చెపుతారు. అంతేకాదు-

"ధనం కోసం వాడు - దారి చేసుకొని - కల్లు సారాయమ్ముతాడు

మాదు ముల్లె మూటయు దోచినాడు - ఆలి మెళ్ళో పూసలు

తెంచినాడు - మా కళ్ళ దుమ్మొశాడు - కాటికి దరిచేశాడు ॥ మాకొద్దీ ॥

అలా దోచిన సొమ్మును వాడేం చేస్తున్నాడంటే

"చెన్నపట్నం నుండి ఆడి - సీమకెళ్ళేదాకా బాబు

డబ్బు కాలువ గట్టినాడు - దానిక్కాపు లెట్టినాడు ॥ దం ॥

‘ఇదేం అన్యాయం’ అని ఎవరైనా అడగాలనుకున్నా
“కోర్టులంటూ పెట్టి పార్టీలు పుట్టించి – స్నేహభావము చంపినాడు
ద్రవ్య దాహంబు కల్పించినాడు చెడ్డ – ఊహలు కడు పెంచినాడు
మా – ఆహారములు ద్రుంచి – హా హా యనిపించాడు” అంటారు.

“పంచాయితీలు మానిపించి కోర్టులెట్టినాడు బాబు
కోర్టులెట్టి రైతువాడి – కూడు తన్నినాడు బాబు ॥ దం ॥

కోర్టుకెడితే రైతు పరిస్థితి ఏమవుతుందో కూడా చెప్పాడు. ప్రజలంతా ఇలా దిక్కూ దివాణం లేకుండా అవటానికి కారణం వర్తక ప్రభుత్వమే అని దాని స్వభావాన్ని చిన్న రెండు పాదాల్లో అతి సామాన్యులక్కూడా అర్థమయ్యే రీతిలో

“తక్కెడ సిప్పల సాహుకార్ని ధరణీచక్ర మేలమంటే
ఎక్కువ తక్కువ సేయుట తప్ప ఏటి సెయ్యగలడు బాబు ॥ దం ॥

అంటూ అరటిపండు వలిచి చేతిలో పెట్టేశాడు. అటువంటి సమయంలో

“మన పూర్వ నాగరికత – మళ్ళీ తెస్తానంటు బాబు
మన గాంధి మహాత్ముడు – మళ్ళీ పుట్టినాడు బాబు” ॥ దం ॥

అందుకని

“ఆడియూసు పెట్టకుండ – ఆడిజోలి తలచకుండ
కాంగ్రెస్సు చెప్పినట్లు – గడుపుకొంటామండి బాబు ॥ దం ॥
“కల్లు పాక కింకమీద – యెళ్ళబోమండోయి బాబు
పిల్లాజల్లా సల్లగాను – బ్రతికి యుంటామండి బాబు ॥ దం ॥

అంటారు.

త్రివిధ బహిష్కరణను ఆచరిస్తామని చెపుతూ
“కోర్టు గుమ్మమెక్కితేను – కుక్కతోను సమం బాబు
చెప్పు తీసి దౌడమీద – కొట్టవచ్చునండి బాబు” ॥ దం ॥

“తెల్లవోడి చదువుకింక – సలామెడతామండి బాబు
గులాం పనులు చేతామని – కోర్కె లేదండోయి బాబు” ॥ దం ॥

"శాసనాల సభలలోను – గూరుచున్న వాళ్ళని బాబు
ప్రతినిధులుగ మేము – పరిగణించమండి బాబు ॥ దం ॥

అంటారు. బ్రిటిష్ ప్రభుత్వం యొక్క ప్రజావ్యతిరేక స్వభావం గురించి చెపుతూ

"రక్కసి సర్కారు – దాపరించేడండి బాబు
తప్పుగుందామంటే – మాకు దారి తోచదోయి బాబు" ॥ దం ॥

"ప్రజల కోర్కె తీర్చడానికి – మనసు లేదండోయి బాబు
రావణాసుర రాజ్యమంటే – నొచ్చుకుంటారేల బాబు" ॥ దం ॥

"జయిళ్ళకున్ను కాల్పులకు – సారమెల్ల అదే బాబు
ఎన్ని జైళ్లెంత మందు – ఈడికున్నాదోను బాబు" ॥ దం ॥

"అందరినీ జంపుకున్న – అడ్డమెట్టమండి బాబు
దేశమంతా మాది అంటూ – తెలిసి ఛస్తామండి బాబు" ॥ దం ॥

ప్రాణాలర్పించటానికై సిద్ధమే అంటాడు.

"హంగేరీయులు కొరియనులు – అయిరిషోళ్ళు ఈజిప్టోళ్ళు
ఆళ్ళ కన్న మేమేమిన్ను – అధములము కాము బాబు" ॥ దం ॥

"కోరుటు కెళ్ళే ప్లీడరుల – గోల మాకు లేదు బాబు
కూలి నాలి సేసుకునేవాళ్ళే – మాకు సాలు బాబు" ॥ దం ॥

అంటూ గాంధీ ఇచ్చిన కార్యక్రమంలో వాళ్ళకి పాత్ర ఏమీ లేకపోయినప్పటికీ ఏదో ఒక రూపంలో వారు పాల్గోవటాన్ని. వాళ్ళ చైతన్యాన్ని గుర్తించారు.

"అల్లాయన్న రాముడన్న అంతయున్ను నొకటి బాబు
భాష భేదం చేత అట్లు పిలుచుకుంటామండి బాబు" ॥ దం ॥

అని

"ఎవరెన్ని చెప్పినా హిందు దేశవాసు లేక దేశోదరులు సుండి –
అంటు దోషాలు మాకు లేవండి పాపమంటు చాటుతాము
రండి – మీ కుంటి వాదనలు గూటిలో పెట్టండి" ॥ మాకొద్దీ ॥

అంటూ మత సామరస్యాన్ని ప్రబోధిస్తారు.

భారతదేశ పేదరికానికి కారణం బ్రిటిషువాడి దోపిడీ అని తెలుసుకున్నా, వాడు ఎందుకు అలా దోచుకోగలిగేడనేది గరిమెళ్ళకి అర్థం కాలేదేమోనని, లేకపోతే శాస్త్రీయ దృక్పథంతో మన దేశ పరిస్థితులు అర్థం చేసుకోవటానికి ప్రయత్నించకుండా ప్రాచీన మత సంస్కృతిని గొప్ప చెయ్యటం వలన అది ఆయన మీద చూపిన ప్రభావం కూడా కావచ్చని ఈ క్రింది పాదాలు చదివితే అనిపిస్తుంది.

"ఎన్ని జన్మములందు - ఏమి పాపము చేసి - కన్ను గానక తిరిగినామొ
ప్రజల అన్నమెల్లయు గ్రుమ్మినామొ - దైత్యులకన్న చెడ్డగ మెలగినామొ
నేడు దున్నల వలెనిట్లు దొరికితిమీ దొరలకు ॥ మాకొద్దీ ॥

"వాడి శాసనాలు మాడిపోనూ ! వాటి గోడియే మాకొద్దు సుండీ
ధర్మదేవుడే మా రక్షసుండి ! కష్టకాండమె పాలుసుండి
ప్రజల ప్రేమయే మాకు దిక్కండి ! సృష్టి మము జూచి సుందరమననీండి
॥ మాకొద్దీ ॥

అంటారు. శాసనసభలను బహిష్కరించమని చెపుతూ, బహిష్కరించని వాళ్ళను

"ప్రజల యాసలు నీవు పట్టుకోకుండాను
ప్రతినిధి నటంచును - ప్రేలే వెంకయ్య
దొరల క్రిందను నీవు - దోసిలొగ్గే కర్మ
మెపుడు పోవునో బేగి - సెప్పో రెంకయ్య
మాతృదేశానికి మహితమైన స్వేచ్ఛను
ఎటుల తీరుస్తావు - సెప్పో రెంకయ్య
ఆ కిలాఫతు ప్రశ్న అందరకు హితముగా
ఎటుల తీరుస్తావు - సెప్పో రెంకయ్య" అంటూ నిలదీస్తారు.

శాసనసభలోకి వెళ్ళే వారిని ప్రశ్నించినట్లుగానే గాంధీని ప్రశ్నించాలని ప్రజలు అనుకోలేదు కానీ ఆయన సన్నిహితులు ఆయనని ప్రశ్నించారని, ఒక మేరకు అంచనా వేశారని తెలుస్తోంది.

1921 లో సుభాష్ చంద్రబోస్ విదేశీయుల నుండి అధికారాన్ని హస్తగతం చేసుకోవటానికి గాంధీ యొక్క కార్యక్రమాన్ని, వివిధ దశలను తెలుసుకోవాలని గాంధీని

కలుసుకున్నారు. ఆ ప్రశ్నకు జవాబు రాలేదు. ఆ విషయాన్ని 'భారత పోరాటం' అనే పుస్తకంలో సుభాష్ చంద్రబోస్ ఈ విధంగా రికార్డు చేశారు.

"ఆయన నిజంగా ఏమి జరుగుతుంది అనుకుంటున్నాడో నేను అర్థం చేసుకోలేకపోయాను. ముందుగానే తన రహస్యాలను తెలిపేందుకు ఆయనకు ఇష్టం లేకనైనా పోవాలి. లేదా ప్రభుత్వం చేతులను కట్టే యెత్తుగడలను గూర్చి స్పష్టమైన భావం ఆయనకు లేకుండానైనా ఉండాలి."[10]

"మన నాయకులలో చాలా మందికి స్వరాజ్యమంటే స్వతంత్రం కన్నా చాలా తక్కువైనదేదో అని స్పష్టమే. ఈ విషయంలో గాంధీజీ స్పష్టపరచడు. ఆ అస్పష్టతలోనే ఆనందిస్తాడు. దాన్ని గురించి స్పష్టంగా ఆలోచించేందుకు కూడా ఆయన ఇతరులను ప్రోత్సహించడు."[11] అని జవహర్లాల్ నెహ్రూ తన ఆత్మకథలో రాసుకున్నారు.

1921 ఆఖరు నెలలకి ఉద్యమం ఉధృతంగా ఉంది. ఆ ఉద్యమాన్ని, ప్రజలలో చెలరేగిన అసంతృప్తిని చూసి బ్రిటిషు ప్రభుత్వం కంపించింది. దేశంలో రాజభక్తిని పెంపొందించటం కోసం వేల్సు యువరాజును భారతదేశ యాత్రకు తీసుకుని వచ్చింది.

దేశభక్తులైన ప్రజలు అతణ్ణి తిప్పికొట్టారు. ప్రజలలో చెలరేగిన అసంతృప్తి, బ్రిటిషు క్రూర నిర్బంధ విధానం ఆ సందర్భంలో స్పష్టంగా బయటపడ్డాయి. ఆ తర్వాత అహ్మదాబాద్ కాంగ్రెస్ జరిగింది. ఈ సమావేశంలో ముస్లిం ప్రజాస్వామిక నాయకుడు హజరత్ మొహానీ 'అన్ని విధాలా విదేశీ పెత్తనం లేని సంపూర్ణ స్వతంత్రం' అని స్వతంత్రాన్ని నిర్వచిస్తూ పెట్టదలచిన తీర్మానాన్ని గాంధీ తీవ్రంగా వ్యతిరేకించారు.[12] " స్వరాజ్యం స్థాపించబడే వరకు భారత ప్రభుత్వాధికారం ప్రజల హస్తగతమయ్యే వరకు ... తీవ్రోత్సాహంతో అహింసాయుత సహాయ నిరాకరణ ఉద్యమాన్ని సాగించేందుకు కాంగ్రెస్ దృఢ నిశ్చయంతో ఉన్నది" అంటూ అన్ని అధికారాలను గాంధీజీకి అప్పగించి కాంగ్రెస్ ఏకైక కార్యకర్తగా గాంధీని అహ్మదాబాద్ కాంగ్రెస్ ప్రకటించింది. పన్నుల నిరాకరణ గూర్చిన తీర్మానలేవీ చేయబడలేదు. ఆ తరువాత కొంతకాలానికి 'బార్దోలి'లో 'సమష్టి సత్యాగ్రహం' చేయటానికి నిర్ణయించారు. దాని కంటె ముందుగానే ఉత్తరప్రదేశ్‌లో 'చౌరీచౌరా' సంఘటన జరిగింది. వెంటనే బార్దోలీ సత్యాగ్రహాన్ని, వలంటీర్ల ఊరేగింపుల్ని, సభలను అన్నింటినీ నిలిపివేస్తున్నట్లుగా గాంధీ ఫిబ్రవరి 8 న ప్రకటించారు. "మాకొద్దీ తెల్లదొరతనము" రాసి పాడినందుకు ఫిబ్రవరి

9 న గరిమెళ్ళకు ఒక సంవత్సరం కఠిన కారాగారవాస శిక్ష విధించారు. ఆ తరువాత 'స్వరాజ్య గీతాలు' పుస్తకాలను నిషేధించి జూలైలో 1922 వ సంవత్సరంలో రెండు సంవత్సరాలు కఠిన కారాగారవాస శిక్ష విధించారు.

ఈ విధంగా ఉద్యమం ఆపివేయబడిన వెంటనే జైలుకు వెళ్ళటం వలన ఆయనకు బయటి ప్రపంచంతో ప్రత్యక్ష సంబంధం తప్పింది. ఉద్యమం ఆపివేయబడటం వలన ప్రజలలో పెరిగిన అసంతృప్తి కాని, వారి మనోభావాలను కాని పరిశీలించటానికి ఆయనకు అవకాశం లేకపోయింది. జైలులో ఉండగా ఆయన తమిళం బాగా నేర్చుకున్నారు. 1926 నుంచి ఆయన రచనలు తిరిగి కనిపిస్తున్నాయి.

1926 నాటికి భారత రాజకీయ పరిస్థితుల్లో మార్పు వచ్చింది. జైలులో ఉండగా తమిళ సాహిత్యం, వివిధ భాషల సాహిత్యం పట్ల పెరిగిన అభిలాష ఆయన దృష్టిని కొంత అటువైపు మరల్చింది. కాని ఆయన పూర్తిగా రాజకీయాల నుంచి విరమించుకున్నారు అనటానికి ఆస్కారం లేదు. కాంగ్రెస్‌లో జరుగుతున్న తర్జనభర్జన లన్నింటిని ఆయన గమనిస్తూనే ఉన్నారు. అందువలననే 'కాంగ్రెస్‌లో గలాభా' అంటూ దాన్ని అక్షరబద్ధం చేశారు.

ప్రజా ఉద్యమాన్ని అంత హఠాత్తుగా ఆపేశాక ప్రజలను చైతన్యవంతులను చేయటానికి కాంగ్రెసుకు నూతన కార్యక్రమమంటూ లేకుండా పోయింది. మోతీలాల్ నెహ్రూ, సి.ఆర్.దాస్, లాలా లజపతిరాయ్, జయకర్, మాలవ్యా, శ్రీనివాస్ అయ్యంగార్ మొదలైన వారందరూ శాసనసభల ప్రవేశం పట్ల భిన్నాభిప్రాయాల్ని కలిగి ఉన్నారు. గాంధీకి ఇదివరకే ఉన్న హరిజనోద్ధరణ, మద్యపాన నిషేధం, రాట్నం వడకటం, నూలు తియ్యడం వంటి కార్యక్రమం తప్పితే కొత్త కార్యక్రమమంటూ లేదు. పైవారి వాదనలను గాంధీ బలంగా ప్రతిఘటించలేకపోయారని అనిపిస్తోంది. గాంధీ మాటలుగా :

"తగవులిట్లే మీరు తీర్చుక మీదు
ధర్మమేదో గుర్తెరుంగుడి – నాకు
తగిన త్రోవను మీకు చూపెద – సుంత
తాళుడు మిము బ్రతిమాలెద."[13]

అంటూ రాశారు. 'సుంత తాళుడు' అనటంలో పై భావాలన్నీ వ్యక్తమవుతున్నాయి.

"వారిలో వారే తన్నుకొందురు – ఒక
వైఖరికిని రాకయుందురు – అథవా
ఎప్పుడైనా కలసి వచ్చినా – అది
యేదైనా యొక చిన్ని వరముకై
ఉద్యోగమొసగిన కొందరు – ఇట్లే
ఊరకుందురు నోరుమూసుక
వట్టి పిడికిలి చూపినందుకే – పెక్కు
వందనముల నిత్రు కొందరు
అసహాయోద్యమ మొల్ల నాటేను ...
బ్రిటను దేశము యొక్క తరగలు –
ఎల్ల పృథివీ తలిని నేలుచుండుత –
ఎల్ల తరగలపై బ్రిటను ప్రభుతలు – సదా
తాండవములు సల్పుచుండుత "

అంటూ ఈ గలాభా వల్ల బ్రిటిషు ప్రభుత్వమే లాభపడుతోంది అంటూ 'పార్లమెంట్' చేత పై మాటలు చెప్పిస్తారు. సూటిగా చెప్పకపోయినా శాసనసభా ప్రవేశానికి గరిమెళ్ళ విముఖులని తెలుస్తోంది.

"సౌమ్యమున స్వేచ్ఛ వెనక్కు సాగుననుచు
విముఖ భావంబుననె శక్తి వెలుగుననుచు
ఎదురుకోలొక్కటే ముక్తినిచ్చుననుచు
మాతృదేశంబు నమ్మక మానదయ్య"

"ధన్యమగు సూటిదౌ నట్టి దారి నుండి
జారువారల కొక్క బాష్పంబు విడచి
క్రొత్తగా వచ్చు వారల కొఱకు నొక్క
పూలహారంబు వేయక పోవదయ్య"[14]

అంటూ లాలా లజపతిరాయ్‌ని గూర్చి రాసిన పై పద్యాల్లో గరిమెళ్ళ అభిప్రాయం తెలుసుకోవచ్చు.

సాహిత్యవ్యాసాల్లో కూడా సాహిత్య ప్రయోజనం సామాజిక ప్రయోజనంగానే ఉండాలని భావించారు. ఒక పక్క ప్రజలలోకి వెళ్ళి వారిని చైతన్యవంతులను చేయవలసిన సమయంలో ప్రణయగీతాలు రాస్తూ కూర్చున్న భావ కవుల్ని ప్రేమించలేక పోయారు. వారి గురించి రాస్తూ " నేనెవ్వరి కొరకైనను కాని వ్రాయలేదు. పిట్ట వలె అవ్యక్తముగా పాడుకున్నాను. ఆ ఆనందము నాకున్నది. దేశము నిండా పత్రికలును, అచ్చాఫీసులును ఉన్నవి కనుక పంపించి నా పేరుతో అచ్చు వేయించుకున్నానన్నచో విమర్శకుడు దాని కొరకై సిరా దండుగ చేసి పాళీ మొద్దు చేసికొననక్కరలేదు"[15] అన్నారు.

అభ్యుదయ పథంలో నడిచిన ఆనాటి వ్యావహారిక భాషోద్యమాన్ని సమర్థించారు. రాబోయేది ప్రజాస్వామ్య యుగమని దానికి ప్రతి ఒక్కరూ చదువుకుని ఉండటం అవసరమని, వాడుక భాష మాత్రమే ప్రజలను త్వరితగతిని అక్షరాస్యులను చెయ్యగలదని గుర్తించి గురజాడ మరణించాక ఒంటరిగా అహరహం వాడుక భాషోద్యమానికై శ్రమించిన గిడుగు రామ్మూర్తి పంతులుగార్ని కొనియాడారు.

కాంగ్రెసులో కన్పించిన అనైక్యత, 1921 కార్యక్రమానికి 1930 లో కార్యక్రమానికి మార్పు ఎక్కువగా లేకపోవటం, తన కుటుంబంలో దిగజారుతున్న ఆర్థిక స్థితి మున్నగు కారణాల వల్ల 1921 లో పాల్గొన్నంత ఉత్తేజంతో గరిమెళ్ళ 1930 లో శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొనలేదు అనిపిస్తోంది. ఆ సమయంలో గరిమెళ్ళ పాటలు రాశారో లేదో తెలియరాలేదు. ఏమీ లభించలేదు.

కానీ ఎపుడూ ప్రజల ఉన్నతిని గురించి ఆలోచించేవారు అనటానికి మాత్రం దాఖలాలున్నాయి. 'సాంఘిక నవల' వ్యాసంలో, 'పల్లెటూరి కథలు' సమీక్షలో రచయితలు సామాజిక జీవితానికి దగ్గరగా ఉండి దానిని తమ రచనల్లో ప్రతిబింబింప చెయ్యాలని అన్నారు. ప్రజల జీవితాన్ని ప్రతిబింబించిన ఆ కథల్ని మెచ్చుకున్నారు.

1938 లో 'ప్రోగ్రెసివు రైటర్ల మహాసభ'[16] లో ప్రజల్ని అక్షరాస్యులుగా చెయ్యవలసిన అవసరాన్ని, వయోజన విద్య ప్రవేశపెట్టవలసిన అవసరాన్ని గురించి నొక్కి చెప్పారు. చదువు లేకపోతే ప్రస్తుత సమాజంలో జీవితం అంధకార బంధురమే అని, కళ్ళున్నా ప్రయోజనం లేని స్థితనీ మాట్లాడారు.

"మాకొద్దీ తెల్ల దొరతనము" పాట తర్వాత జనంలోకి తిరిగి అంత బలంగానూ వెళ్ళిన పాట 'అన్యాయ కాలంబు దాపురించిందిపుడు'. ఈ గేయం చల్లా రాధాకృష్ణశర్మ గారు రాసినట్లుగా గరిమెళ్ళ వ్యక్తిగత నిస్పృహ నుంచీ, నిరాశ నుంచీ వెలువడలేదు. ఈ గేయానికి కూడా వేళ్ళు ప్రజా ఉద్యమంలోనే ఉన్నాయి.

1936 లో జరిగిన లక్నో కాంగ్రెస్. ఫైజ్‌పూర్ కాంగ్రెసులు అంతకు ముందు కంటె మేలైన భావాలను వ్యక్తం చేశాయి.

లక్నో కాంగ్రెసులో నెహ్రూ సోషలిజమే లక్ష్యమన్నారు. 1936 డిసెంబర్ ఫైజ్‌పూర్ కాంగ్రెస్ తాత్కాలికంగా ఒక రైతు కార్యక్రమాన్ని ప్రకటించింది. ఇందులో "... జమీందారీ పన్నులను, భూమి శిస్తులను తగ్గించాలి. అప్పులను రద్దు చేయాలి. లేదా తగ్గించాలి. వెట్టి చాకిరీని, జమీందార్లకిచ్చే బాకీలను రద్దు చెయ్యాలి. వ్యవసాయ కూలీలకు జీవనానికి తగిన కూలీ ఇవ్వాలి. రైతు సంఘాల హక్కులు ..."[18] మొదలైన అంశాలున్నాయి. వ్యావసాయిక దేశమైన మన దేశంలో రైతులను గురించి, వారి సమస్యలను గురించి పట్టించుకోవటం జరిగింది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీలో సోషలిస్టులు సగానికి పైగా ఉన్నారు.

ఈ అంశాలతో పాటు అప్పటి రైతు పరిస్థితి కూడ పరికించటం అవసరం. 1771 నాటికి రైతునకు గల సగటు భూమి 40 ఎకరాలైతే అంచెలంచెలుగా తగ్గుతూ అది 1930 ల నాటికి 2 ఎకరాలైంది. 1812 నాటికి భూమి లేని రైతు అరుదయిన పరిస్థితి ఉంటే 1931 నాటికి భూములు కోల్పోయి కూలీలుగా మారిన వారు 40 శాతం.[19]

1939 నాటికి మద్రాసు రాష్ట్రంలో 1659 జమీందారీలు ఉన్నాయి. వీరంతా కలసి పర్మనెంటు ఒడంబడిక ప్రకారం రైతుల నుంచి 63 లక్షల రూపాయలు వసూలు చేయవచ్చు. 44 లక్షలు ప్రభుత్వానికి పేష్కష్‌గా చెల్లించాలి. కానీ వారు వసూలు చేస్తున్న మొత్తం 213 లక్షలు. దీనిని బట్టి రైతు ఎంత దోపిడీకి గురవుతున్నాడో అంచనా వెయ్యవచ్చు.[20]

ఇంక కార్మికుల పరిస్థితికి వస్తే 1938 లో జెనీవాలో జరిగిన అంతర్జాతీయ కార్మిక మహాసభలో భారత కార్మిక ప్రతినిధి ఇచ్చిన నివేదికలో ఈ క్రింది విధంగా ఉన్నట్లుగా రజనీ పామీదత్తు తెలియచేసారు.

"... ప్రధానమైన, బాగా నిర్మితమై ఉన్న బట్టల మిల్లులలో నెల జీతాలిలా ఉన్నవి. గోకాక్‌లోని నూటికి 18 మంది కార్మికులకు 3 షిల్లింగులకు 9 షిల్లింగులకు మధ్య, షోలాపూర్‌లో నూటికి 32 మందికి 7 షిల్లింగుల 6 పెన్నీలకు 15 షిల్లింగులకు మధ్య, నూటికి 20 మంది కార్మికులకు 32 షిల్లింగుల 6 పెన్నీలు, బొంబాయి పట్టణంలో నూటికి 32 మంది కార్మికులు 22 షిల్లింగుల 6 పెన్నీలకు 30 షిల్లింగులకు మధ్య జీతాలు తీసుకుంటున్నారు."

" ... జబ్బులు, నిరుద్యోగం, ముసలితనం, మరణం ఇలాంటి ప్రమాదాల నుండి భారత కార్మికులకు రక్షణ లేదు..."

" భారతదేశంలో ఎక్కువ పారిశ్రామికమైన బొంబాయిలో ఇళ్ళ వసతి సభ్యదేశానికే అవమాన కారణమని 1931 జనాభా లెక్కల నివేదిక తెలుపుతున్నది... కాలిబాటలే కొంపలుగా బతుకుతున్న వేలకొలది కార్మికులు బొంబాయిలో ఉన్నారు."

"కార్మికవర్గంలోను, ఇతరులలోనూ ... శిశుమరణాల సంఖ్యను తగ్గించడానికి ప్రభుత్వమేమీ చేయడం లేదు. ఆ మరణసంఖ్యకు కటువైనా సరైన పదం దారుణహత్య."[21]

కార్మికులు, కర్షకులలో పై దుర్భర పరిస్థితుల వల్ల చెలరేగిన అసంతృప్తికి ఈ క్రొత్త కార్యక్రమం ఒక మార్గాన్ని ఇచ్చింది. లక్నో కాంగ్రెసులో అధిక ప్రాతినిధ్యం గల మధ్య తరగతులు, కార్మికులు, కర్షకులను కలిపి సామ్రాజ్య వ్యతిరేక 'సంయుక్త ప్రజా సంఘటన' ఏర్పడాలనటం వీరి మధ్య ఐక్యతకు ప్రాతిపదికనిచ్చింది. 1936 నాటికి మద్రాస్, పంజాబ్, బీహార్, ఉత్తరప్రదేశపు దేశాలలో రాష్ట్ర రైతు సంఘాలేర్పడి ఉన్నాయి. 1936 ఏప్రిల్ 11 న లక్నోలో అఖిల భారత రైతు సభ జరిగింది. జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడైన జవహరలాల్ సందేశమిస్తూ జాతీయ కాంగ్రెస్ రైతుల పక్షాన నిలబడుతుందని హామీ ఇచ్చారు. 1937 లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పాల్గొని బెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్, బొంబాయి, ఒరిస్సా, మద్రాస్ రాష్ట్రాల్లో మంత్రి వర్గాల నేర్పాటు చేసింది. రైతుసంఘాల్లో కాంగ్రెస్ వారు, కాంగ్రెస్ సోషలిస్టులు, కాంగ్రెస్ సోషలిస్టులలో చేరి కమ్యూనిస్టులు ప్రచ్ఛన్నంగా కమ్యూనిస్టుల పని చేశారు. వీరి ఆధ్వర్యంలో అనేక సభలు, ఊరేగింపులు మొదలైనవన్నీ జరిగాయి. ఈ నేపథ్యంలో 1937-38 లో కొమ్మారెడ్డి సత్యనారాయణ మూర్తి, చలసాని వాసుదేవరావు గార్ల

ఆధ్వర్యంలో చారిత్రాత్మక ఆంధ్ర రైతు రక్షణ యాత్ర జరిగింది. ఈ యాత్ర ఇచ్ఛాపురం నుండి రాజమండ్రి, ఒంగోలు మీదుగా మద్రాస్ చేరుకుంది. యాత్ర వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

కాలినడకన	..	1512 మైళ్ళు
బస్సులపై	..	152 మైళ్ళు
ప్రత్యక్ష పర్యటన	..	520 గ్రామాలు
సేకరించినవి	..	25000 సంతకాలు
రూపొందించినవి	..	800 విజ్ఞాపనలు
సమీకరించబడిన రైతాంగం	..	450000 మంది
పర్యటించిన కాలం	..	130 రోజులు.
	03-7-1937 నుండి 27-3-1938	

ఈ రైతు ఉద్యమానికి ఉత్తేజితుడై రాసిన పాటలు అన్యాయకాలంబు దాపురించిందిపుడు, కర్షకరాజ్యం, జన్మభూమి.

"అన్యాయకాలంబు దాపురించిందిపుడు
అందరము మేలుకోవాలండి "[22]

అనినా ఆ 'అందరూ' జమీందార్లు, రైతులు, ఫ్యాక్టరీ యజమానులు, ఫ్యాక్టరీ కార్మికులూ కలిసి కాదు. రైతులు, కార్మికులూ మాత్రమే.

"ఏటి పొడుగున ఎరువేసి నీరెట్టి నూర్చి
పండించేది మనమంతా
గోటు సేయుచు బూతు కూతలను కూసి
కలకొట్టి పోవుటింకొకరొంతా" ॥ అ ॥
"పొగలలో మరలలో పొగిలి పొగిలి సరుకు
పుట్టించి యిచ్చేది మనమంతా
తొగరు వాతెర సొగసు తొయ్యలులతో కలిసి
విరగబడుచుండు టింకొకరొంతా ॥ అ ॥

ఇందులో ఒకరిచేత ఇంకొకరు దోచుకోబడుతున్నారు అనేది స్పష్టంగానే ఉంది. 'మనం' దోచుకోబడుతున్న వాళ్ళే. మేలుకోవలసినదీ దోచుకోబడుతున్న వాళ్ళే.

"పండించుట మనమైతే – బాగా పండేడిది పుడమియైతే ఈ
దళారి జమీందార్ల పెద్దతనమది మనకిక యేలా" ॥ కర్షక ॥

"అందరమొకటవుదామోయి – దీర్ఘ యాత్రలెన్నో చేదామోయి
మందులమాట వినద్దోయి – రాజ్యం మనదవాలీ ప్రోద్దోయీ ॥ కర్షక ॥

జమీందార్లకి వ్యతిరేకంగా యాత్రలు నడిపింది రైతులే. రైతురాజ్యం రావాలంటున్నాడనేది కూడా స్పష్టమే.

"జనులెల్లరికి నేను జన్మభూమినిరా
ఛేదించవయ్యా అసమాన భేదముల" [24] అంటారు 'జన్మభూమి' గీతంలో.

"పెద్దలకు లాభాలు బాంకుల్ల నిండా
పేదలకు దుఃఖాలు హృదయాల నిండా"

"సైన్యాలు వార్నెపుడు రక్షించవలెనా
కర్షకుల కార్మికుల శిక్షించవలెనా"

అంటూ అసమాన భేదాలు గురించి చెపుతారు. సైన్యాలు, ప్రభుత్వం ఎవరికి అండగా నిలబడుతున్నాయో చెపుతారు.

"భాగ్యవంతుల వైభవములంటే నాకు
బాధించు వ్రణమని బాగ తెలియండి"

"కర్షకులు కార్మికులు కలవండి వేగ
వార్షికోత్సవములు జరుపండి వేగ"

"ఆనందమున నన్ను అలరించువారు
మీరలే మీరలే మేలు కొనుడింక"

ఎవరినయితే కలవమన్నారో వాళ్ళనే మేల్కోమన్నారు. అవి సామ్యవాద భావాలయినా, ఆ విషయం తెలిసే అంగీకరించే రాశారు. ముఖ్యంగా గమనించవలసింది 1921 లో వచ్చిన గేయాలలో లాగా 'దేవుని సహాయం' కావాలనటం కన్పించదు. ఎవరు ఎవరిమీద పోరాడాలనే దాంట్లో అస్పష్టత లేదు.

రైతు రక్షణయాత్ర అనంతరం మద్రాస్ ప్రభుత్వం జమీందారీల్లో రైతుల పరిస్థితులను పరిశీలించి నివేదిక ఇవ్వవలసిందిగా టంగుటూరి ప్రకాశం అధ్యక్షతన

ఒక కమిటీని వేసింది. ఆంధ్ర రాష్ట్ర రైతు సంఘం ఏడవ మహాసభలో జమీందారీల రద్దుకు కృషి చెయ్యాలని తీర్మానించింది. 1939 లో భారతదేశాన్ని రెండవ ప్రపంచ యుద్ధంలో బలవంతంగా దించటాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాలు రాజీనామా చేశాయి. ఆ తరువాత దేశవ్యాపితంగా 'క్విట్ ఇండియా' ఉద్యమం జరిగింది. ఈ ఉద్యమానిక్కూడా గాంధీదే నాయకత్వం. అహింసాయుత సహాయ నిరాకరణే కార్యక్రమం. గరిమెళ్ళ ఈ ఉద్యమానికి స్పందించినట్లుగా కన్పించదు.

1946 చివరి నెల నుంచి గరిమెళ్ళ వ్యాసాలు కనిపిస్తున్నాయి. 1946 లో నావికా తిరుగుబాటు తర్వాత బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశానికి స్వరాజ్యం ఇవ్వడానికి నిశ్చయించుకుంది.

"ఎక్కడ చూసినా దొంగతనాలు, హత్యలు, దొంగ మార్కెట్లు, లంచాలు, దహనాలు, కరువుకాటకాలు, రోగాలు, చావులే" ఉన్నపుడు అసలిది విజయమేనా? మనకి వచ్చినది స్వరాజ్యమేనా? అంటూ 1947 లో ప్రశ్నించారు. 'ధర్మమేవ జయతే' అంటూ ప్రచారం చేస్తున్న భారత ప్రభుత్వం అరికట్టాల్సిన అధర్మం చాలా ఉందని రాశారు.

ఈ దేశంలో లక్షలాది ఎకరాల భూమి వడ్డీరుణాలిచ్చిన గుజరాతీ మార్వాడీల చేతుల్లోకి పోయింది. వీరెవ్వరూ ప్రజావసరాలను పట్టించుకోలేదు. వ్యవసాయం చేసినా వ్యాపారం చేసినా, నూలుమిల్లులు స్థాపించినా లాభార్జనా దృష్టితో చేసేవారు. ఈ విషయాలను గుర్తించి కాంగ్రెస్ గుజరాతీ మార్వాడీ ధనాధిష్ఠిత విజృంభణకు లోబడిందని అన్నారు. దాన్ని వివరిస్తూ " ... వర్తకులు బాగుపడుతూ ప్రభుత్వానికి పెద్ద పన్నులు చెల్లించి, ఖర్చులు భరించి సాగుటకు సాయపడుతున్నారు కనుక ప్రభుత్వములు రహస్యముగా వారినే బలపరచుచున్నవి"[26] అంటారు.

కాంగ్రెస్ ప్రభుత్వ స్వభావం గురించి " ... ఇట్లు వర్తకులును ప్రభుత్వమును కలిసి ప్రజల మాన ప్రాణములు హరించుచున్నారు. ప్రభుత్వములు వర్తకులు చేస్తున్న ఈ అరాచకమునింత సహిస్తూ కూడా, ప్రజలిందుకు విరోధముగా ఏమాత్రము ఆందోళనము చేసినను చెవిని పెట్టకుండుటయే కాక, వారినే అరాచకులుగా భావించి కేసులు పెట్టి జైలు శిక్షలు విధించుచున్నారు"[27] అంటూ దాని స్వభావం ఏమిటో తేటతెల్లం చేశారు. "మాకొద్దీ నల్ల దొరతనము"[28] అని రాయక పోయినప్పటికీ నల్లవారిది కూడా "దొరతనమే" అనేది స్పష్టం చేశారు.

కొన్ని జమీందారీల రద్దు వల్ల సాహితీ సంస్కృతులకు అన్యాయం జరిగిందని విజయనగరం జమీందార్, జయపురం జమీందార్ మొదలైనవారిని ఉదహరించారు. విజయనగరం జమీందారు అభ్యుదయ కార్యక్రమాలు చేపట్టటానికి కారణం ఆ చుట్టుపక్కల మన్యంలోనూ, ఖాందాలోను జరిగిన గిరిజన పోరాటాలు.[29] కానీ అందరికీ ఇది వర్తించదు. పెట్టుబడిదారీ సంస్కృతి కొంత డబ్బూ చదువూ ఉన్న జమీందారుల్నే ముందుగా ప్రభావితం చేసింది. విశ్వనాథ వారి 'వేయిపడగలు'లో మనం దీన్ని చూడవచ్చు. ముందు జమీందార్లు పట్టణ జీవితానికి అలవాటుపడ్డారు. రాను రాను జమీందారీల్లో వచ్చే అదనపు మొత్తాలు పరిశ్రమల వైపు, సినిమారంగం వైపు తరలించబడ్డాయి. ఆ క్రమంలోనే దిన, వార, మాస పత్రికలు, సాహిత్య పత్రికలు వచ్చాయి. ఈ పరిణామాన్ని గరిమెళ్ళ గుర్తించలేక పోవటానికి కారణం పెట్టుబడిదారీ వ్యవస్థ పట్ల వ్యతిరేకతేనని అనిపిస్తోంది.

జమీందారీ రద్దు చట్టం చేస్తూ ప్రభుత్వం జమీందార్లకు 22.78 కోట్లు నష్టపరిహారం చెల్లించింది. భూమి జమీందార్లది కాకపోతే నష్టపరిహారం ఎందుకు చెల్లిస్తారని ప్రశ్నిస్తారు గరిమెళ్ళ. నష్టపరిహారం చెల్లించినంత మాత్రాన భూమి జమీందారులది కాదు. ఈ విషయం ప్రకాశం కమిటీ నివేదికలో వెల్లడైంది. రైతులకు అండగా నిలుస్తానన్న కాంగ్రెస్ ప్రభుత్వంలోని పోలీసు నివేదిక ఆంధ్రరాష్ట్ర రైతు ఉద్యమాన్ని 'నేరాల' శీర్షికలో చేర్చింది. దానిని కాంగ్రెస్ మంత్రులు ఆమోదించారు. రైతు సంఘ కార్యకర్తలపై కేసులు పెట్టి అరెస్టు చేశారు. కాళీపట్నం జమీందారు చేసిన వాగ్దానాన్ని చెల్లించుకోవాలంటూ అక్కడి రైతులు సమ్మె చేస్తోంటే పోలీసులు కాంగ్రెస్ జండాను కింద వేసి కాళ్ళతో తొక్కడం, ప్రజల్ని బాధించిన తీరు, 'ఈ సమ్మె చెడు సలహాలపైనా తొందరపాటుతోనూ' చేయబడిందని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ వారి తీర్మానం కాంగ్రెస్ ఎవరికి అండగా ఉందో నిరూపిస్తున్నాయి. అందువల్ల మాత్రమే జమీందార్లకు నష్ట పరిహారం ఇవ్వబడింది.

కొన్ని జమీందారీలను రద్దు చేయటం అన్యాయం, నష్టపరిహారం ఎందుకు ఇచ్చారు అని అడిగినప్పటికీ ఆయన చివరికి వేసిన ప్రశ్న 'ఈ చట్టం వల్ల రైతులకు మేలు జరుగుతోందా?' అని. ఆయనే రైతులు జమీందారుల చేతుల్లోంచి రైతు భూస్వాముల చేతుల్లో పడ్డారు అంటారు.

ఇది చాలా నిజం. 'రైతు రక్షణయాత్ర' వల్ల రైతులు ఎపుడైతే చైతన్యవంతులై ప్రశ్నించడం మొదలెట్టారో జమీందారులు కూడా అప్పట్నుంచే జాగ్రత్తపడటం మొదలు పెట్టారు. మెల్ల మెల్లగా అనేక భూములకు తమ స్వంతానికి పట్టాలు పొందారు. ఆ విధంగా జరుగుతున్నప్పుడే కాళీపట్నం రైతులు సమ్మె చేశారు. అప్పటికే రుద్రరాజు రామలింగరాజు కుటుంబం, మంగినవారి కుటుంబం, ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాద్, ఎం. టి. రాజు, అడుసుమిల్లి గోపాలకృష్ణయ్య మొదలైనవారు రైత్వారీ భూముల్లో వేల ఎకరాల భూమిని కలిగి ఉన్నారు. ఈ పరిస్థితుల్లో నిజంగానే పేదరైతు పరిస్థితి మారటానికి పెద్దగా అవకాశం లేదు. ఈ జమీందారీ రద్దు చట్టం కంటితుడుపు చర్య అనీ అది ఓట్లు నొల్లుకోవటానికి మాత్రమే ఉద్దేశించబడిందనీ స్పష్టం చేశారు.

ప్రభుత్వాలు సోషలిస్టు విధానాలలాగో, కమ్యూనిస్టు విధానాలలాగో వ్యవసాయం చేపట్టాలనీ, అపుడే అది నిజమైన ప్రజారాజ్యమో రైతురాజ్యమో అవుతుందని, లేకపోతే కపట రైతురాజ్యంగా మారి అనేక అనర్థాలకు దారితీస్తుందని హెచ్చరించారు. ఇంకా కొన్ని వ్యాసాల్లో కూడా ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

వీటిని సాధించటానికి గాంధీ యొక్క సత్యాహింసల విధానం పనికిరాదని చెప్పారు. సత్యాహింసల విధానం కాక మరే విధానం పనికొస్తుందో గరిమెళ్ళ స్పష్టపరచ లేదు. కానీ 'మహానిస్వార్థియగు త్యాగపురుషుడు, రాజకీయ పరిజ్ఞానవేత్త, కఠినచర్యా సమర్థుడగు యొకడుద్భవించి కార్యక్రమమునకు పూనుకొనకుంటే ఈ అరాచక మణగదు'[30] అంటారు. అంటే ఈ విషయంలో ఆయనకు స్పష్టత లేదనే అర్థం చేసుకోవచ్చు. స్పష్టంగా తెలిసిన దానిని దేన్నీ ఆయన బయట పెట్టటం మానలేదు. 'మాకొద్దీ తెల్లదొరతనము', 'సైతాను ప్రభుత', 'అన్యాయకాలంబు దాపురించిందిపుడు' మొదలైన వాటిల్లో అది స్పష్టమే.

రష్యాలో సాధిస్తున్న విజయాల పట్ల మెచ్చుకోలు ఉంది. అయితే అప్పటి భారత ప్రభుత్వాలు సోషలిజాన్ని స్థాపిస్తాయని ఆయనకు ఏ మాత్రం నమ్మకం లేదు. అందుకని రష్యా సాయం చేయటానికి వస్తుందని ఆ రూపేణా మనం రష్యాకు ఋణపడి, అమెరికా రష్యా యుద్ధంలో ఒక పక్కన నలిగిపోతామని అంటారు. అమెరికా స్వభావం గురించి చెపుతూ "జర్మనీ, జపాను ఫాసిస్టులు తమ చుట్టు పట్ల వారి నెవరినో భయపెట్టి దిగమ్రింగిరేమో కానీ, నేడు అమెరికా విశ్వప్రపంచమును అతి తమాషాగా

దిగ్రమింగి పాదాక్రాంతము చేసుకొన వచ్చుచున్నది"[31] అంటారు. నేటి పరిస్థితులను ఒకసారి సింహావలోకనం చేస్తే గరిమెళ్ళ అపుడే వేసిన అంచనా ఆశ్చర్య జనకంగానే ఉంటుంది. ప్రజల మీద ఆయనకు ఎప్పుడూ నమ్మకము పోలేదు. సోషలిస్టుల వ్యవసాయ పద్ధతుల్లో వ్యవసాయం చేయించాలని, పారిశ్రామిక రంగంలో కూడా అటువంటి సంస్కరణలే జరగాలని చెపుతూ 'దేశీయులందరూ బలపరుతురుగాక' అంటారు.

ఆయన మాటల్లో విప్లవకారులను పొగడటం కాని, తెగడటం కాని చేయలేదు. మోప్లాల మీద జరిగిన ప్రచారానికి ప్రభావితుడైనట్లుగా కనిపించదు. మోప్లాల మీద, పంజాబు ప్రజల మీద జరిగిన దాడులను హత్యలుగానే ఖండించారు. సామ్యవాద భావాల పట్ల మొగ్గు ఉంది. కమ్యూనిస్టు పార్టీ బ్రిటిషు ప్రభుత్వం చేతా, కాంగ్రెస్ ప్రభుత్వం చేత నిషేధించబడటం, ఆ సమయంలో ఆ పార్టీపై జరిగిన దుష్ప్రచార ప్రభావం కొంత కనిపిస్తుంది.

భారతదేశంలోని అరాచకాలను ఎదుర్కోవటానికి సోషలిస్టు వ్యవస్థే తగినది అంటారు. దానిని సాధించుకోవటానికి వచ్చేసరికి 'దేశీయులు' ముందుండాలి అంటారు. కాని ముస్లిముల విషయం వచ్చేసరికి మాత్రం దానిని ఎదుర్కోవటానికి హైందవ జాతీయతే పనికొస్తుంది అంటారు. భారత విభజన ఒక్క హిందూ ముస్లిం ప్రాతిపదిక మీద మాత్రమే జరిగినట్లు తోచదు. అప్పుడున్న హిందూ ముస్లిం ఆవేశాల్లో ఈ విషయాన్ని అర్థం చేసుకోవటానికి ఆస్కారం కూడా తక్కువ.

భారతదేశానికి స్వరాజ్యం వచ్చాక ఆంధ్రరాష్ట్రం కోసం ఉద్యమం నడిచింది. ఆలస్యం జరుగకుండా ఆంధ్రరాష్ట్రం ఏర్పడవలసిన అవసరాన్ని, ఆలస్యం అవటం వల్ల జరుగుతున్న నష్టాల్ని చెప్పారు. 1935 నుంచి ఈ విషయాలను తన వ్యాసాల్లో అక్కడక్కడ చెపుతున్నప్పటికీ 1948 లో ఆ సమస్య గురించే వ్యాసాలు రాశారు. ఏ భాషకీ మెజారిటీ లేని కొన్ని ప్రాంతాలను కలిపి బహుభాషాప్రయుక్త రాష్ట్రాలుగా ప్రకటించాలని కూడా అభిప్రాయపడ్డారు.

భారత స్వాతంత్ర్య పోరాటానికి ఉత్తేజాన్నిచ్చిన పునరుద్ధరణ భావాల ప్రభావం ఆయనను వదలలేదు. అందుకే ప్రాచీన వర్ణ వ్యవస్థలో ఉన్నది వర్గ వ్యవస్థే అన్న వాదాన్ని ఖండిస్తూ అది వర్గ వ్యవస్థ కాదనీ, అక్కడ దాస్యం బానిసత్వం లేవనీ,

అదొక ప్రభు సేవక దర్జా అనీ సమర్థిస్తారు. ముస్లింల వల్ల భారతదేశం రెండుగా చీలింది అనే కోపంతో వారిని మహమ్మదు మత కళంకులు అనీ, ముష్కర ముస్లిములు అనీ పరుషంగా మాట్లాడారు. ఒక పక్క 'హిందూ' పదాన్ని హిందూమతానికి పర్యాయపదంగా దేశమంతా ఉపయోగిస్తోంటే, అది మన దేశాన్ని సూచించే పదమే అనీ, దాన్ని అలాగే భావించాలనీ, హిందూ సంస్కృతి అంటే భారత సంస్కృతేనని, భారత సంస్కృతిలో జైనం, బౌద్ధం మొదలైనవన్నీ కలిశాయనీ అలాగే ఇస్లాం మతం కూడా కలిసే ఉండాలని ప్రతిపాదిస్తారు.

రాజకీయ స్వాతంత్ర్యం ప్రధానమా? సాంఘిక సంస్కరణ ప్రధానమా? అనే చర్చ వచ్చినపుడు గరిమెళ్ళ రాజకీయ స్వాతంత్ర్యానికే ప్రాధాన్యత నిచ్చినట్లు కనిపిస్తుంది.

ఈ రాజకీయ పోరాటాలు, రాజకీయ అవగాహన గరిమెళ్ళ జీవితం మీద, వ్యక్తిత్వం మీద ఎటువంటి ప్రభావాన్ని చూపించాయో తరువాతి అధ్యాయంలో వివరిస్తాను.

❊ ❊ ❊

ఫుట్ నోట్స్

1. చూడు అనుబంధం
2. కె. ఎస్. గిల్. – భారతదేశ ఆర్థిక వ్యవస్థ (1600–1947) పేజ్ – 9
3. అదే. పేజ్ – 25
4. గరిమెళ్ళ సత్యనారాయణ – సైతాను ప్రభుత – చూడు అనుబంధం–I
5. గరిమెళ్ళ సత్యనారాయణ – స్వరాజ్య గీతములు – గ్రామము పాట, పేజ్ 13
6. అదే. పేజ్ 5
7. అదే పేజ్ – 14
8. గరిమెళ్ళ సత్యనారాయణ – మాకొద్దీ తెల్ల దొరతనము – చూడు అనుబంధం –I
9. గరిమెళ్ళ సత్యనారాయణ – స్వరాజ్య గీతములు – 2 వ భాగం పేజ్ 4, 5
10. రజనీ పామీదత్తు – నేటి భారతదేశం – పేజ్ 331
11. అదే. పేజ్ 331
12. అదే. పేజ్ 333
13. గరిమెళ్ళ సత్యనారాయణ – కాంగ్రెసులో గలాభా – కృష్ణాపత్రిక, 25–09–1926
14. గరిమెళ్ళ సత్యనారాయణ – లాలాజీకి – కృష్ణాపత్రిక, 09–10–1926
15. గరిమెళ్ళ సత్యనారాయణ – నూతన సాహిత్య విజృంభణము, కృష్ణాపత్రిక, 02–10–1926
16. అక్టోబర్ 25, 1938 న పశ్చిమ గోదావరి జిల్లా కేశవరం గ్రామంలో ఆంధ్రా ప్రోగ్రెసివ్ రైటర్ల మహాసభ జరిగింది. ఇది అభ్యుదయ రచయితల సంఘు మహాసభ కాదు. వయోజన విద్యను ప్రవేశ పెట్టాలంటూ అప్పటి రచయితలు ప్రపంచ ఫెస్టివల్సు నిర్వహించారు. దానికి గరిమెళ్ళ అధ్యక్షోపన్యాసం చేశారు. ఈ పుస్తకంలో మొదట్లో ప్రచురించిన ఫోటో ఆ రోజు అధ్యక్షోపన్యాస ప్రసంగ పాఠంతో పాటు ఆంధ్ర పత్రికలో వచ్చినది.
17. చల్లా రాధాకృష్ణ శర్మ – గరిమెళ్ళ సాహిత్యం – పేజ్ 66
18. రజనీ పామీదత్తు – నేటి భారతదేశం – పేజ్ 490
19. కొమ్మారెడ్డి సత్యనారాయణ మూర్తి 50 వ వర్ధంతి సంస్మరణ సంచిక – పేజ్ 56
20. అదే. పేజ్ 139
21. రజనీ పామీదత్తు – నేటి భారతదేశం – పేజ్ 374, 375
22. చూడు అనుబంధం – I
23. అదే.

24. అదే
25. గరిమెళ్ళ సత్యనారాయణ - తెల్లవాడు తొలగందే పండుగేమిటి మనకి? - ఆనందవాణి 03-08-1947
26. గరిమెళ్ళ సత్యనారాయణ - వాణిజ్యం-అరాచకం-విరుగుడు - ఆనందవాణి, 15-08-1948
27. గరిమెళ్ళ సత్యనారాయణ - వాణిజ్యం-అరాచకం-విరుగుడు - ఆనందవాణి, 15-08-1948
28. చల్లా రాధాకృష్ణ శర్మ - గరిమెళ్ళ సాహిత్యం - పేజ్ 15
29. సి. వి. సుబ్బారావు (సంపాదకుడు) - విభాత సంధ్యలు-తెలుగు సాహిత్యంలో సమాజం - పేజ్ 9
30. గరిమెళ్ళ సత్యనారాయణ - వాణిజ్యం-అరాచకం-విరుగుడు - ఆనందవాణి. 15-08-1948
31. గరిమెళ్ళ సత్యనారాయణ - భారత దేశానుగుణమగు కమ్యూనిజము కావలెను - ఢంకా - జూన్, 1948

❊ ❊ ❊

అధ్యాయము - 5

కవి జీవితం

ఆంధ్ర నాటక చరిత్రని అభ్యుదయ పథం వేపు తిప్పిన కన్యాశుల్కం ప్రదర్శన జరిగిన మరుసటి సంవత్సరం అంటే 1893 లో శ్రీకాకుళం జిల్లా నరసన్న పేట తాలూకాలోని గోనెపాడు గ్రామంలో [1] గరిమెళ్ళ మాతామహుల ఇంట జన్మించారు. తల్లిదండ్రులు సూరమ్మ, వెంకట నరసింహం. వెంకట నరసింహం గారిని రామక్రిష్ణమ్మ అని కూడా పిలిచేవారు.[2] పితామహులు సూరయ్యగారు. వీరిది ప్రియాగ్రహారం. వీరికి ప్రియాగ్రహారంలో సొంత ఇల్లు, కొన్ని భూములు ఉండేవి. వెంకట నరసింహం గారికి ఐదుగురు మగపిల్లలు, ముగ్గురు ఆడపిల్లలు.[3] వీరిలో సీతారావమ్మ, లలితమ్మ సజీవులు.

సత్యనారాయణ ప్రాథమిక విద్య ప్రియాగ్రహారంలో పూర్తి చేశారు. ఉన్నత విద్య ఎక్కడ పూర్తి చేసినదీ వివరాలు స్పష్టంగా తెలియలేదు. బి. ఏ. మొదటి సంవత్సరమో, రెండవ సంవత్సరమో విజయనగరంలో చదివినట్లుగా పుల్లెల శీతారామయ్య [4] తెలియచేశారు. శీతారామయ్య గరిమెళ్ళకి జూనియర్. గరిమెళ్ళ, శీతారామయ్య మరికొందరు విద్యార్థులు కలిసి 'అవర్స్ అసోసియేషన్' అని ఒక సంస్థ ఏర్పాటు చేశారు. ప్రతీ సాయంత్రం కలుసుకునేవారు. అప్పటి సమాజాన్ని గూర్చి చర్చిస్తూ ఉండేవారు. గరిమెళ్ళ పద్యాలు పాటలు రాసుకొచ్చి మిగిలిన వారికి వినిపిస్తూ ఉండే వారు. అప్పటికే ఆయన రచనలు పత్రికలలో వస్తూ ఉండేవి.

1907 లో బిపిన్ చంద్ర పాల్ ఆంధ్రలో పర్యటించి ఉపన్యాసాలు ఇచ్చారు. అపుడు ఆయన విజయనగరంలో కూడా ఉపన్యసించారు. ఆ రోజుల్లో విశాఖ, విజయనగరం వైపు కాంగ్రెస్ ప్రచారం బాగా ఉంది. వీటి ప్రభావం విద్యార్థుల మీద ఉంది. 18–25 సంవత్సరాల మధ్య వయసులో ఉన్న ఈ యువకులు యువసహజమైన

ఉత్సాహంతో ఉత్తేజంతో ముందు ఉండేవారని తెలుస్తోంది. తిలక్ ఇచ్చిన 'స్వరాజ్యం నా జన్మహక్కు' అనే నినాదం ప్రజల్ని ఉత్తేజితుల్ని చేసింది. మేధావుల్ని ఆలోచింప చేసింది. స్వరాజ్యం జన్మహక్కు అయినపుడు విదేశీ దొరతనం సహించలేని విషయం. ఈ చైతన్యం లోంచి వచ్చినదే 'మాకొద్దీ తెల్ల దొరతనము' అనే పల్లవి. ఈ పాట విజయనగరంలో విద్యార్థిగా ఉన్న రోజుల్లోనే రాశారు. స్నేహితులంతా శీతారామయ్య గారి బంధువులింట్లో పెళ్ళికి వెళ్ళినపుడు భోజనాల సమయంలో అందరూ పాటలు పాడుతున్న సందర్భంలో గరిమెళ్ళ "మాకొద్దీ తెల్ల దొరతనము" పాట కాయితాలు తీసుకొచ్చి శీతారామయ్య గారి చేతిలో పెట్టారు. అప్పటికి గరిమెళ్ళ ఇంకా బిడియస్థుడే. ఉద్యమం పేరు చెపితేనే ఉత్సాహం పొంగులెత్తే మనసు, వయసులో ఉన్న తాను వెంటనే ఆ పాట పాడానని, తమ బంధువులు కంగారు పడ్డారని శీతారామయ్య తెలియచేశారు. ఈ పాట మొదట్లో ఎన్ని చరణాలుందో తెలియరాలేదు. కాని ఇది అంచెలంచెలుగా విస్తృతి పెంచుకుంది అనేది స్పష్టం. ఆయన విద్యార్థిగా ఉన్ననాటికి చీరాల పేరాల సంఘటన, పలనాటి సత్యాగ్రహం, చిత్తరంజన్ దాస్ కుటుంబాన్ని బాధించటం అనేవి జరగలేదు. ఈ విషయాలన్నీ ఆ పాటలో తర్వాత చేరుస్తూ పోయినట్లుగా అర్థం చేసుకోవచ్చు. ఈ పాట జానపద బాణీలో ఉంది. అప్పటికే అనేక జానపద బాణీలు గరిమెళ్ళకు నాలిక మీద ఆడేవనిపిస్తోంది. ఈ పాటను తన చిన్నతనంలో విజయనగరం మాలపేట లోని 'రెల్లి' కులం వాళ్ళు పాడుకుంటుంటే తాను అనేకసార్లు విన్నానని సెట్టి ఈశ్వరరావు తెలియచేశారు.

ఏ కారణాల చేతో గరిమెళ్ళ బి. ఏ. విజయనగరంలో పూర్తి చేయలేదు. తర్వాత మచిలీపట్నంలోని నోబుల్ కళాశాలలో చదివారు. 'ఆ తర్వాత ఎల్. టి. చదవటం కోసం రాజమండ్రి వచ్చారు. చదువుతూ ఉండే సమయంలోనే మధ్య మధ్య చదువును ఆపిన సందర్భంలో మాత్రమే ... కొన్నాళ్ళు గంజాం జిల్లా కలెక్టర్ గారి కార్యాలయంలో గుమస్తాగాను, ఆ తర్వాత విజయనగరం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగాను... '[7] చేసి ఉండవచ్చు.[8]

ఆయన మాటల్లోనే ఈ ఉద్యమం గురించి చెప్పాలంటే బ్రిటిషు ప్రభుత్వానికి "గోదావరి కృష్ణ డెల్టాలంటే గుండె లదురుతాయి బాబు". ఈ రెండు జిల్లాల్లోను విద్యార్థిగా ఉన్నపుడు ఆయన ఉద్యమంలో ఉంటూ అనేక పాటలు రాశారు. గాంధీ యిచ్చిన త్రివిధ బహిష్కరణ కార్యక్రమంలో తన ఎల్. టి. చదువుకు స్వస్తి చెప్పారు.

తిరిగి పూర్తి చేయలేదు.[9] ఆ రోజుల్లో 'మాకొద్దీ తెల్ల దొరతనము' పాట సైక్లోస్టైల్ తీయించి వాటిని అణాకి ఒకటి చొప్పున అమ్మేవారు. ఇలా ఎంతమంది ఎన్నిసార్లు సైక్లోస్టైల్ తీశారో చెప్పటం కష్టం.

4-2-1922 న Godavari District Superintendent of Police, Personal Assistant of D.I.G. of Police, Railways and C.I.D. Madras కు స్వరాజ్య గీతాలు రెండు భాగాల గురించి రాస్తూ

The said Satyanarayana recently published here a similar cyclostyled leaflet and steps have been taken for his arrest and warrant is pending[10] అంటూ మాకొద్దీ తెల్ల దొరతనము గురించి రాశారు.

05-4-1923 న హిందూ పత్రిక గరిమెళ్ళ వారి కఠిన కారాగార శిక్ష సాధారణ కారాగార శిక్షగా తగ్గించబడినదని తెలియచేస్తూ " ... Long before the conviction he was arrested Under Section 103 Criminal Procedure Code and Sentenced to one year by the District Magistrate of Coconada on 09-02-22' అని రాసింది.

నాలుగవ తేదీకి పెండింగ్ లో ఉన్న వారంటును ఆ తర్వాత విడుదల చేసి ఉండవచ్చు. ఈ అరెస్టుకి కారణం 'మాకొద్దీ తెల్ల దొరతనము' పాట అని స్పష్టంగా తెలుస్తోంది. గోదావరి జిల్లాకు ముఖ్య పట్టణం కాకినాడ. జిల్లా కలెక్టర్ కు మెజిస్ట్రీరియల్ అధికారాలు ఉండేవి. ఈ అరెస్టు, విచారణ సందర్భంలో ఆ పాట పాడించుకుని గోదావరి జిల్లా కలెక్టర్ విని ఉండవచ్చు. ఈ విషయాన్నే క్రొవ్విడి లింగరాజు గారు చెపితే మద్దూరి సుబ్బారెడ్డి గారు రికార్డు చేశారు అనిపిస్తోంది.[11] అపుడే గరిమెళ్ళకు ఒక సంవత్సరం కఠిన కారాగారవాస శిక్ష విధించారు. ఈ విషయం చెప్పినప్పుడు మొదట గాంధీ నమ్మలేదు. ఆ తరువాత మిగిలిన వారినందరినీ ఆ విధంగా పాటలు రాయమని ఆదేశించారట.[12]

1921 లో ఆయన రాసిన పాటలు కొన్నిటిని 'స్వరాజ్య గీతములు' అనే పేరుతో ఇండియా యేజంసీ బీరో వారు మద్రాస్ నుండి ప్రచురించారు. నెల తెలియ రాలేదు. 1922 లో ఇండియా యేజంసీ బీరో వారే 'స్వరాజ్య గీతములు' రెండవ భాగం ప్రచురించారు. ఈ భాగంలోనే 113 చరణాలు గల 'సైతాను ప్రభూత'[13] ఉంది. ఈ రెండు భాగాల్లోను 'మాకొద్దీ తెల్లదొరతనము' పాట లేదు.

8-4-1922 న Additional District Magistrate, Godavari Commissioner of Police, Madras కి స్వరాజ్య గీతాల గురించి రాస్తూ "I am of opinion that the portion of the Book from Page 33, Verse-14 with heading Satanic Government comes under Sections 124 A, and 153 A of I. P. C. and recommended that you should institute Proceedings either under these Sections or under Section 108 of Criminal Procedure Code against the Printer and Publisher. " అని రాశారు.

మద్రాస్ కౌన్సిల్ లోని పబ్లిక్ డిపార్ట్‌మెంట్ ఈ రెండు భాగాలను ఇంగ్లీష్‌లోకి అనువాదం చేయించి వాటిపై అడ్వకేట్ జనరల్ అభిప్రాయం కోసం సి.పి. రామస్వామయ్యర్ కు పంపించింది. అడ్వకేట్ జనరల్ అభిప్రాయాన్ని, Special Branch C. I. D. ల రిపోర్టులను తీసుకుని G.O. Ms. No. 429, Dated 18-05-1922 ప్రకారం[14] Section-124 A క్రింద రాజద్రోహ నేరమారోపిస్తూ మద్రాస్ ప్రభుత్వం గరిమెళ్ళపై కేసు పెట్టింది. G. O. No. 466, Dated 26-05-1922 [15] ప్రకారం 'స్వరాజ్య గీతాలు' రెండు భాగాల్ని నిషేధిస్తూ ఉత్తర్వు జారీ చేసింది. ఈ ఉత్తర్వు జారీ అయ్యాక స్వరాజ్య గీతాలు రెండవ భాగం రెండవ ఎడిషన్ అచ్చయ్యింది. ఈ విషయాన్ని మద్రాస్ ప్రభుత్వానికి తెలియచేస్తూ పబ్లిషర్ మారిన కారణంగా ఈ పుస్తకాన్ని నిషేధిస్తూ తిరిగి ఉత్తర్వులు ఇవ్వవలసిందిగా స్పెషల్ బ్రాంచ్, సి.ఐ.డి. అధికారులు చీఫ్ సెక్రెటరీకి రాసిన నోట్‌లో కోరారు. కొత్త ఉత్తర్వులు అవసరం లేదనీ పై ఉత్తర్వులే దీనికి కూడా వర్తిస్తాయని ప్రభుత్వ అధికారులు జవాబిచ్చారు. ఈ పుస్తక రచయిత జైల్లో ఉన్నా, మే నెలలోనే పుస్తకాలు నిషేధించబడినా రెండవ భాగానికి రెండవ ఎడిషన్ వచ్చిందనేది గమనించాల్సిన విషయం. ఆ తర్వాత ప్రభుత్వం చెన్నపురి, ఎగ్మూర్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారణ జరిపి 1922 జూలై మాసాంతంలో రెండేండ్లు కఠిన కారాగారవాస శిక్ష విధించింది. ఈ వివరాల వల్ల ఆయన జైలుకు పోయినది 'మాకొద్దీ తెల్లదొరతనము' 'స్వరాజ్య గీతాల' రచయితగానే అని, రెండు కేసుల్లో శిక్షను మధ్యలో విడుదల కాకుండానే అనుభవించారని తెలుస్తోంది.[16] ఈ పుస్తకాల వల్ల వచ్చే లాభం తిలక్ స్వరాజ్యాశ్రమానికి వినియోగింపబడుతుందని కూడా ప్రకటించారు.

స్వరాజ్య గీతాల కేసు సందర్భంగానే 1922 జూలై 11 న హిందూ పత్రికలో ఒక ప్రకటన ఇచ్చారు. దానిని కోర్టులో చదువుటకు మేజిస్ట్రేట్ ఒప్పుకోలేదు. తర్వాత 'ఆంధ్ర పత్రిక' దానిని ప్రచురించింది.

'హిందూ' పత్రికలో ప్రకటన ఇచ్చే నాటికి స్వరాజ్య గీతాల కేసు ఇంకా తేలలేదు. 'మాకొద్దీ తెల్ల దొరతనము' రాసినందుకే జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. ఈ ప్రకటనలో "... నా గళాన్ని, కలాన్ని ఒక ఏడాదిపాటు జోకొడదామని బ్రిటిష్ నిరంకుశ పాలకవర్గం నిర్ణయించింది. పౌర జీవిత ప్రశాంతికి అంటే తన మనుగడకే ప్రమాదకారినని భావించింది. ఇది నాకే కనువిప్పు ..."[17]

గళం అని అనటానికి కారణం గరిమెళ్ళ తాను రాసిన పాటల్ని జనంలో పాడేవారు. "... భాషరాని నాకే గగుర్పాటు కలిగించింది. ఇక దేశీయుల్లో ఎంత ఉత్తేజం కలిగిస్తుందో అర్థమైంది. ..."[18] అన్నారట గోదావరి కలెక్టర్ బ్రేకన్ ఒక సంవత్సరం శిక్ష విధిస్తూ.

కె. వి. రమణారెడ్డి మాటల్లో చెప్పాలంటే "గరిమెళ్ళ గొంతెత్తితే పిడుగుల జడే."[19]

ఇక కాళోజీ మాటల్లో చెప్పాలంటే "అపుడు గరిమెళ్ళ పాటలకి జనాలెట్లొచ్చే వాళ్ళో ఇప్పటి వాళ్ళకి ఎట్లా తెలుస్తుంది. కానీ ఒక్కటి మాత్రం చెప్పగలను. ఈ రోజు జానపద బాణీల్లో రాజకీయాలు చెపుతోంటే జనప్రవాహం ఎట్లా కదులుతోందో ఆ రోజుల్లో ఆయన పాటలకి అట్లా కదిలేది."[20]

గరిమెళ్ళ పై ప్రకటనలోనే " ... మన స్వేచ్ఛలను నిషేధాల ద్వారా నోరునొక్కే రోజులు గతించాయి. ..." అన్నారు. కోర్టులో మేజిస్ట్రేట్ నిరాకరించిన ప్రకటనను 28-7-1922 న ఆంధ్రపత్రిక ప్రకటించినది. అది దీర్ఘ ప్రకటన. దీంట్లో మన దేశానికే కాదు, ప్రపంచానికే అసహాయోద్యమం శరణ్యం అన్నారు. ఆనాటి ఆయన అభిప్రాయాల గురించి తెలుసుకోవటానికి ఈ క్రింది విషయాలు పనికొస్తాయి.

" ఏ దేశమునైన పరిపాలించు ఏ విదేశీ ప్రభుత్వమునకైనను ముఖ్యముగా హిందూ దేశమునేలు విదేశీ ప్రభుత్వమునకు నేను విరోధిని. ... " " ... బ్రిటీషు ప్రభుత్వమును తొలగించి జాతీయ ప్రభుత్వమును నెలకొల్పుటయే మా ఆశయము ..."

" దురదృష్ట వశమున ఈ బ్రిటీషు ప్రభుత్వమునందు సత్యము రాజద్రోహముగ పరిణమించినది. ... రాజద్రోహము నొనర్చితినని చెప్పగలిగినందుల కెంతయు గర్వితుడనగుచున్నాను. ..."

తన పుస్తకాల గురించి " నా గ్రంథము 5000 ప్రతులను నా పాదముల కడ ప్రోగు పెట్టినపుడు నాకు గర్వమును, దుఃఖమును కూడ వెంటనే కలిగెను. ఆ యమర శిశువులు మరణభీతిచే నన్ను కాపాడమని నా వంక దయాదృష్టుల నిగుడించెను. ... నేను కేవల మసమర్థుడను గదా."

" సముద్ర తరంగ కన్యకలు తీర పరిసరమున నృత్య మొనరించు చున్నంత కాలమును, మంద మారుత కిశోరము లుద్యానమున విహరించునంత కాలమును నా జాతీయ గీత రాగవల్లులు దేశభక్తుల వీనుంగవలకు విందొనరించుచునే యుండునని మాత్రము నేను ప్రభుత్వమునకు స్పష్టపరుప గోరెదను. ... ఈ గీతములను వ్రాసి, వర్ణించి, పాడి, వ్యాపింప చేసిన ఉత్తముల కందరికినీ నేను వందనముల నొనరించుచున్నాను" అంటూ ప్రజల నుంచి శలవు తీసుకుని జైలుకు వెళ్ళిపోయారు.

కాలేజీ రోజుల్లో ఉండగానే " నాయనా! నీవు ఉద్యమంలోకి వెళ్ళిపోతున్నావు. నీవు జ్యేష్ఠుడవు. కుటుంబం పెద్దది. అందువలన అనేక క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనక తప్పదు. అయినప్పటికీ నీవు వెడుతున్నావు. కానీ, ఎట్టి పరిస్థితులలోనూ నీవు వెనుదిరగకు, క్షమాపణ చెప్పకు."[21] అని చెప్పిన తండ్రి గరిమెళ్ళ జైలులో ఉండగానే మరణించారు. క్షమాపణ కోరలేదు. ఓదారుస్తూ తాతగారైన సూరయ్య గారికి ఉత్తరం రాశారట. జైలులో ఉండగానే మరికొంత కాలానికి తాతగారు చనిపోయారు. ఆ కుటుంబం పెద్ద దిక్కు లేని కుటుంబమయింది. పైగా చిన్న కుటుంబం కూడా కాదు. ఇద్దరు చెల్లెళ్ళకు పెళ్ళిళ్ళు అయినప్పటికీ ఇంకా ఒక చెల్లెలికి పెళ్ళి చెయ్యాల్సిన బాధ్యత ఉంది. తానేమో కఠినశిక్ష అనుభవిస్తున్నారు. ఇవన్నీ ఎవరికైనా కలత కలిగించే విషయాలు. కానీ, గరిమెళ్ళ గుండె నిబ్బరం మనిషి. జైలులో హాలస్యమయ్యరు, కృష్ణ స్వామి అయ్యరుల సాహచర్యంలో తమిళ భాష నేర్చుకోవటమే కాక ఆ భాషలో పాండిత్యాన్ని కూడా సంపాదించారు. "చివరి సంవత్సరంలో విడి ఖైదీని చేసి పుస్తకములను వ్రాత పరికరములను తెప్పించుకొననిచ్చిన ... "[22] మూలంగానే తనకది సాధ్యమయింది అంటారు. 1924 లో జైలునుంచి విడుదల అయ్యారు. జైలు నుంచి ఇంటికి వచ్చినపుడు చాలా సన్మానాలు జరిగాయని అదే ఆయన జీవితంలో ఆఖరి ఆనందకర ఘట్టం అయ్యుంటుందని ఎర్రగుంట్ల వెంకట క్రిష్ణారావు రాశారు. ఆ తరువాత ఆయన భార్య చనిపోయింది. ఆమెకిరువురు ఆడపిల్లలు. 'ఆంగ్లవిద్య

మాని, ఆంగ్లదుస్తు మాని' లో భాగంగా వాటిని తాను ఆచరించటమే కాక ఇంట్లో ఆచరింప చేశారు. ఆయన తమ్ముళ్ళ చదువు మాన్పించారు. ఇంగ్లీష్ చదువుకున్న వారికిచ్చి తన చెల్లెలి పెళ్ళి చేయనంటూ అప్పట్లో వీణ విద్యార్థిగా ఉన్న మేడేపల్లి నరసింహారావుగారికిచ్చి వివాహం చేశారు. తాను తిరిగి రెండవ వివాహం చేసుకున్నారు.

'కూర్చుని తింటే కొండలయినా తరుగుతాయ'ని సామెత. ఏవో కొన్ని భూములు, స్వంత ఇల్లు మాత్రమే కలిగిన ఈ పెద్ద కుటుంబానికి గడవటం కష్టమే. తాను జైలులో ఉన్నపుడు, ఆ తరువాత కుటుంబం కోసం చేసిన అప్పులను తీర్చటానికి భూములు అమ్మివేయవలసి వచ్చింది. ఎవరికీ ఉద్యోగాల్లేవు. ఈ పరిస్థితిని తట్టుకోలేక ఒక తమ్ముడు ఇల్లు వదిలి వెళ్ళిపోయాడు.

ఆంగ్లసేవ చేయదల్చుకోలేదు కనుక గరిమెళ్ళ భాషాసేవ చేయాలనుకున్నారు. శారదా గ్రంథమాలను ప్రియాగ్రహారంలో స్థాపించారు. ఆ సంస్థ తరఫున ఏడు పుస్తకాలు ప్రచురించారు. ఈ పుస్తకాలను ఆంధ్రలోకం ఆదరించలేదు. ఫలితంగా పుస్తకాలు చెదలు పట్టిపోయాయి. శారద, కృష్ణాపత్రిక, ప్రబుద్ధాంధ్ర మొదలైన పత్రికలకు రచనలు పంపుతుండేవారు. స్వంత ఇల్లు ఉంది కనుక వారు తిన్నా తినకపోయినా పెద్దగా ఎవరికీ తెలిసేది కాదు.

"... ఎడమ చేతిని నడుము మీద పెట్టుకుని తలవంచుకుని ఇన్నీసుపేట లోని ఇంటి ఎత్తు అరుగుల మీద పచారు చేస్తుండేవారు. ... గోదావరికి అడ్డుపడి అవతలికి చేరుకునేవారు." "కవిగారు కన్నడ భాషాజ్ఞానాన్ని వృద్ధి చేసుకొందామని మా ఇంటికి (1927) ఎప్పుడైనా వచ్చేవారు" అన్న టేకుమళ్ళ కామేశ్వరరావు గారి మాటల వల్ల 1927 ప్రాంతంలో గరిమెళ్ళ రాజమండ్రిలో కూడా నివసించారని తెలుస్తోంది.

గరిమెళ్ళ గురించి ఆయనను బాగా తెలిసిన టేకుమళ్ళ కామేశ్వరరావు గారిలా రాశారు.

"ఆయన నలుపు అని చెప్పదగిన ఛాయ. మామూలు మనిషి కంటే కొంచెం ఎత్తరి. మోటుగా కనపడతారు. పెద్ద నుదురు. ఒత్తైన క్రాపింగు. పెద్ద కళ్ళు. గంభీరమైన చూపు. ఖద్దరును ధరించేవారు. బహు మితభాషి. ... మాట్లాడటం మొదలు పెడితే అడ్డులేని వాగ్ధరి. పెద్ద కంఠస్వరం. ఉద్రేకంతో మాట్లాడతారు. నిష్కల్మషమైన నవ్వు. పెద్దపెట్టున నవ్వుతారు."[23] ఇదీ స్థూలంగా గరిమెళ్ళ రూపు.

ఈయన ఎదుటివారిలో ఉన్న విజ్ఞానాన్ని గుర్తించి గౌరవించగల సహృదయులు.[24] ఏదైనా ఉద్యోగం చేద్దామనే ఉద్దేశంతో గరిమెళ్ళ 1933 లో మద్రాస్ వచ్చారు. బహుభాషా పాండిత్యం ఉన్నవారు, చేయితిరిగిన రచయితా కనుక పత్రికారంగంలో ప్రవేశించారు. ఆయనకున్న ముక్కుసూటిదనం, స్వతంత్ర ప్రియత్వం, నిశిత విమర్శనాదృష్టి ఏ పత్రికలోను నిలవనీయలేదని ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా 1946 తర్వాత లభించిన వ్యాసాలవల్ల తెలుస్తోంది. గరిమెళ్ళ ఆంధ్రప్రభ, గృహలక్ష్మి పత్రికలలో పని చేశారు. ఢంకా, ఆనందవాణి, కిన్నెర, త్రిలింగ మొదలైన పత్రికలలో ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా వ్యాసాలు రాశారు.

గరిమెళ్ళ రెండవ భార్యకు ఇద్దరు ఆడపిల్లలు. తల్లి, తమ్ముడు రామలింగ మూర్తి, అతని భార్యాపిల్లలు అందరూ కలసి మద్రాసులోని మైలాపూరులో ఉండేవారు. భూములు, ఇల్లు అయిపోగా ఆడవాళ్ళ వంటి మీద ఉన్న కొద్దిపాటి బంగారంతో మద్రాస్ చేరారు. ఆ బంగారం మద్రాసులో ఖర్చయిపోయింది. రామలింగమూర్తి కన్నేపల్లి వారి[25] 'శ్రీనివాస హోటల్'లో పని చేసేవారు. తమ్ముడికి వీలు కానపుడు గరిమెళ్ళ 'గల్లాపెట్టి' దగ్గర కూర్చునేవారు. మధ్యాహ్నమపుడు పోయి వావిళ్ళవారి ప్రెస్‌లో ప్రూఫులు దిద్దేవారు. ఆ తరువాత కొందరు శ్రేయోభిలాషుల సలహాపై 'కల్పక విలాస్' అనే హోటలును అన్నదమ్ములిద్దరూ నడిపారు. ఆకలిబాధ తెలిసిన ఆ అన్నదమ్ములిద్దరూ ఆ రాబడివల్ల తమ కడుపులు నిండేలా, లాభాలు వచ్చేలా ఆ హోటలుని నడపలేక పోయారు. అది త్వరలోనే మూతపడింది.

పత్రికారంగంలో పని చేస్తున్న సమయంలో గరిమెళ్ళకు దర్శి చెంచయ్య, 'కిన్నెర' సంపాదకులు పందిరి మల్లికార్జునరావు మొదలైన వారితో పరిచయాలు ఏర్పడ్డాయి.[26] వీరి పరిచయంతో కమ్యూనిస్టు సాహిత్యం చదివారు. పఠనాసక్తి చాలా హెచ్చు. గరిమెళ్ళ రచనలు చదువుతోంటే ఆయన ఏ గ్రంథాలయాల్లోనో కూర్చునో, ఎవరి దగ్గర నుంచైనా సంపాదించో అనేక పుస్తకాలు చదివారని తెలుస్తోంది. ప్రపంచంలో ఎక్కడ ఏం జరిగినా ఎక్కువ శాతం తెలుసుకుంటూనే ఉన్నారు.

1944 లో అండగా ఉన్న రామలింగమూర్తి చనిపోయారు. చాలాకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న గరిమెళ్ళ భార్య 1946 లో చనిపోయింది. 1942 నుంచి గరిమెళ్ళ కళ్ళజబ్బు వల్ల బాధపడుతున్నారు. 1946 ఆ ప్రాంతాల్లో

కళ్ళకు శస్త్రచికిత్స జరిగింది. అప్పటికే ఆయన ఆర్థిక పరిస్థితులు దుర్భరంగా ఉన్నాయి. ఆ సమయంలో ఆంధ్రరాష్ట్ర పత్రికా సంపాదకుల సంఘం ముందుకొచ్చి పత్రికాప్రకటన చేసి గరిమెళ్ళని ఆదుకోమని తెలుగు ప్రజలను కోరింది.[27] అటువంటి పరిస్థితిలో కూడా ఆయన రాయటం మానలేదు. రాయటం కూడా ఏదో ఒకటి రాయటం కాకుండా ఏదో ఒక అన్యాయం గురించో లేదా తాను అన్యాయం అనుకున్నదాని గురించో వేలెత్తి చూపుతూ రాశారు. అవసరమైతే గాంధీ, జవహర్లాల్ దగ్గరనుంచి రాజాజీ, రాజన్ మొదలైనవాళ్ళ వరకు విమర్శించకుండా వదిలి పెట్టలేదు. ఇందువల్లనే ఏమో ఆంధ్రపత్రిక యజమానులు 'అమృతాంజనం' పాటలు మాత్రమే రాయించుకుని ఆర్థిక సహాయం చేసేవారు అనిపిస్తోంది.

స్వరాజ్యం వచ్చాక ఇక ఆంధ్రరాష్ట్రం కోసం త్వరపడాలంటూ ప్రబోధించారు. మూడవ కూతుర్ని మేనల్లుడు పెళ్ళి చేసుకున్నారు. 1951 లో తల్లి చనిపోయింది. 10, 12 సంవత్సరాల ఆఖరమ్మాయి ఇందిర, గరిమెళ్ళ కలిసి ఉండేవారు. ఆయన ఎంత పేదరికం అనుభవించారో కళ్ళారా చూచిన టేకుమళ్ళ కామేశ్వరరావు గారు బాధాకరమే అయినా దాన్ని రికార్డు చేశారు. "ఒకసారి ఆయన చేతికర్ర మీద ఆనుకుని నడుస్తూ దారిని పోతున్న ఇద్దరిని ఆపి చెయ్యి చాపారు. వాళ్ళు వేసింది లేదులెండి. నేను అంతకుముందు చెవులతో విన్నదే కళ్ళారా చూసేను. ... ఆయన మనసు నొప్పించడమెందుకని పక్కకి తప్పుకున్నాను..."[29] ఈ విషయంలో కూడా గరిమెళ్ళ పేద ప్రజలతోనే ఉన్నారు.

1952 లో మద్రాసు రాష్ట్రానికి ఎన్నికలు జరిగాయి. గరిమెళ్ళ పాటలు కాంగ్రెస్ వారికి ఉపయోగించాయి. అప్పట్లో మద్రాస్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉన్న నీలం సంజీవరెడ్డి గరిమెళ్ళ వారికి ప్రచారంలో తోడ్పడినందుకు పారితోషికం ఏమిమ్మంటారని రాశారట. దానికి సమాధానం ఇస్తూ నేను కాంగ్రెస్ మనిషిని. నాకు పారితోషికం ఇవ్వవలసిన పని లేదు. నేను చేయవలసిన పనిని చేశాను అని రాశారట.[30]

ఆర్థికంగాను, ఆరోగ్య విషయంలోనూ ఎంత దుస్థితిలో ఉన్నప్పటికీ రచనా వ్యాసంగాన్ని మానలేదు. ఆంగ్లభాషలో Andhra Herald లో రాసిన Bi-Lingual Provinces are the Connective Links of Indian Culture, తెలుగులో 'కిన్నెర' పత్రికలో రాసిన 'బహుభాషా రాష్ట్రాల ఆవశ్యకత'[31] అనేవి లభించిన సమాచారం మేరకు ఆఖరు రచనలు. చనిపోయే ముందు కొన్నాళ్ళు పక్షవాతంతో

బాధపడ్డారు. స్నేహితులు అప్పుడప్పుడు డాక్టర్ని తీసుకువచ్చి చూపించేవారని బంధువులు తెలియచేసారు.

ఆంధ్రరాష్ట్రం కావాలని ఎంతగానో తపించారు కదా! ఆ ఆంధ్రరాష్ట్రం కోసం 1952 అక్టోబర్ 19 న పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించారు. 58 రోజుల నిరసనదీక్ష అనంతరం డిసెంబర్ 15 వ తేదీ పొట్టి శ్రీరాములు అమరులయ్యారు. మంచం మీద ఉన్న గరిమెళ్ళకు పొట్టి శ్రీరాములు మరణించటం, ఆ తరువాత తెలుగు ప్రజలు మద్రాస్ రాష్ట్రం మొత్తంలో ఉవ్వెత్తున హర్తాళ్ జరపటం తెలుస్తూనే ఉన్నాయి.

వేయికళ్ళతో ఎదురుచూస్తున్న ఆంధ్రరాష్ట్రం రాలేదు సరికదా పొట్టి శ్రీరాములు మరణం ఆయనను క్రుంగదీసింది. అసలే అంతంత మాత్రం ఆరోగ్యంతో ఉన్న గరిమెళ్ళ డిసెంబర్ 18 న ఉదయం పన్నెండు గంటల ప్రాంతంలో మరణించారు. పొట్టి శ్రీరాములు మరణంతో జరిగిన హర్తాళ్ లో బంధువులు వెంటనే రాలేకపోయారు. స్నేహితులే అంత్యక్రియలు జరిపారు.

గరిమెళ్ళ అల్లుడు, మేనల్లుడైన ఎర్రగుంట్ల వెంకట కృష్ణారావు గారు ఇందిరను తమ ఇంటికి తీసుకువెళ్ళారు. ఆ తర్వాత ఆమె వివాహం చేశారు. గరిమెళ్ళ భద్రపరుచుకున్న పుస్తకాలను ఏదైనా గ్రంథాలయానికి ఇవ్వవలసినదిగా కస్తూరి కృష్ణారావు గారికి అప్పగించారు. కస్తూరి కృష్ణారావు గారు ఇపుడు లేరు. ఆ పుస్తకాలు ఏ గ్రంథాలయానికి ఇచ్చారో తెలియరాలేదు.

'కిన్నెర' జనవరి 53 సంచికలో గరిమెళ్ళ మరణం గురించి తెలియచేస్తూ పందిరి మల్లికార్జునరావు గారు తమిళులు సుబ్రహ్మణ్య భారతిని మరణించాక అయినా గుర్తించారు. గరిమెళ్ళను తెలుగు ప్రజలు ఇప్పుడైనా గుర్తిస్తారా? అంటూ రాశారు. టేకుమళ్ళ కామేశ్వరరావు గారు గరిమెళ్ళ రచనలు సంపుటాలుగా తేవాలనీ, రాజమండ్రిలో బస్ట్ సైజ్ గరిమెళ్ళ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలనీ రాశారు.

ఏది ఏమైనా తెలుగుజాతి తరతరాలు ఏడ్చేలా గరిమెళ్ళ జీవితం " Unwept, Unsung, Unhonoured " గా ముగిసింది.

❋ ❋ ❋

ఫుట్ నోట్స్

1. గోనెపాడు గ్రామంలో గరిమెళ్ళ సత్యనారాయణ గారి మాతామహులు ఉండేవారని, ఆయన అక్కడ జన్మించారని గరిమెళ్ళ సోదరి లలితాంబగారు తెలియచేసారు. 15-07-1990 ముఖాముఖి.
2. టేకుమళ్ళ కామేశ్వరరావు - నా వాఙ్మయ మిత్రులు - పేజ్ 327
3. వీరు సత్యనారాయణ, రామమూర్తి, లక్ష్మణమూర్తి, రామలింగమూర్తి, సూర్యనారాయణ, సీతారామమ్మ, చిన సీతారామమ్మ, లలితమ్మ.
4. స్వాతంత్ర్య సమరయోధులు, దివంగత భారత ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ నుంచి స్వాతంత్ర్య సమరయోధులుగా తామ్రపత్రాన్ని అందుకున్నారు.
5. సెట్టి ఈశ్వర్రావు గారితో ముఖాముఖి.
6. గూడూరు నమశ్శివాయ గారి ఉత్తరం
7. చల్లా రాధాకృష్ణ శర్మ - గరిమెళ్ళ సాహిత్యం - పేజ్-6
8. గరిమెళ్ళ త్రికరణశుద్ధిగా త్రివిధ బహిష్కరణను ఆచరించారు. తరువాత కాలంలో ఆయన మిత్రులు చదువు కొనసాగించి లాయర్లు, ఉద్యోగులు అవుతున్న సందర్భంలో కూడా గరిమెళ్ళ తన అల్లుళ్ళుగా ఇంగ్లీష్ చదివినవాళ్ళు పనికి రారన్నారు. కనుక త్రివిధ బహిష్కరణకు ముందే గరిమెళ్ళ ఆ ఉద్యోగాలు చేసి ఉండవచ్చు.
9. జనమంచి కామేశ్వరరావు గారి ఉత్తరం. - 10-10-1990. కామేశ్వరరావు గారి తండ్రి అయిన జనమంచి వెంకట్రామయ్య గారు నాలుగు మాసాల కోర్సు పూర్తి చేసి ఉద్యమంలోకి దిగమని గరిమెళ్ళని బతిమాలారని, కానీ గరిమెళ్ళ చెవిని పెట్టలేదనీ, ఆ తరువాత ఎల్. టి. కోర్సు పూర్తి చేయలేదని తెలిపారు.
10. చూడు అనుబంధం - II
11. మద్దూరి సుబ్బారెడ్డి, తెలుగులో జాతీయోద్యమ కవిత్వం - పేజ్ - 260
12. గురజాడ రాఘవ శర్మ (సంపాదకుడు) జాతీయ గీతములు, పీఠిక పేజ్ -79
13. చూడు అనుబంధం -I పాటలు
14. చూడు. అనుబంధం II స్వరాజ్యగీతాల కేసు వివరాలు
15. అదే.
16. " వానికి ప్రతిఫలం ఒక సంవత్సరము జైలు శిక్ష. శ్రీకృష్ణ జన్మస్థానమున దొరలిన గేయములు వ్రాసి, కంఠస్థము చేసుకొని బయటకు రాగానే ప్రచారమునకు బూనుకొనినారు. మరల వారికి రెండున్నర సంవత్సరములు శిక్ష విధించినది ప్రభుత్వం. ఇది సత్యదూరం." గురజాడ రాఘవశర్మ - జాతీయ గీతములు పీఠిక - పేజ్ 76.

17. కె. వి. రమణారెడ్డి – ఆధునికయుగంలో కవిలోకం. 'వాల్మీకి ధార' వ్యాసం. పేజ్ – 14
18. మద్దూరి సుబ్బారెడ్డి, తెలుగులో జాతీయోద్యమ కవిత్వం – పేజ్ – 260
19. అదే.
20. 15–07–1990 గరిమెళ్ళ 98వ జయంతి సందర్భంలో ఉదయం జరిగిన సెమినార్ లో కాళోజీ నారాయణరావు అధ్యక్షోపన్యాసం. ఇప్పటి రోజుల్లో అంటే 90 లో జానపద బాణీల్లో రాజకీయాలు చెపుతున్న సాంస్కృతిక సంస్థ జననాట్య మండలి. ఆ సంస్థ కళాకారుడు గద్దర్. మార్చ్ నెలలో హైదరాబాదులో అతడిచ్చిన ప్రదర్శనకు లక్షలాది జనం హాజరయ్యారు. అతన్ని దృష్టిలో పెట్టుకునే కాళోజీ ఆ మాటలన్నారు.
21. 15–07–1990 న ఉదయం జరిగిన సెమినార్ లో పరకాల పట్టాభి రామరావుగారి ప్రసంగ వ్యాసం.
22. గరిమెళ్ళ సత్యనారాయణ, అర్థత్రయ సర్వస్వము – మొదటిభాగం పీఠిక, పేజ్ xii
23. టేకుమళ్ళ కామేశ్వరరావు, నా వాఙ్మయ మిత్రులు
24. ఇ. వి. ఆర్. రావు గారి ఉత్తరం 26–07–1990. సాలూరులో హైస్కూల్లో తెలుగు మేష్టారుగా పని చేసే కాశీభట్ల కృష్ణరాయశాస్త్రి గారిని కలిసి వచ్చాక, కృష్ణరాయశాస్త్రి గారి గురించి, ఆయన పాండిత్యం గురించి చాలా గౌరవంగా చెప్పారని రాశారు.
25. శ్రీనివాస హొటల్ కన్నేపల్లి రఘునాథస్వామి గారిదని పుల్లెల శీతారామయ్య గారి అభిప్రాయం. కన్నేపల్లి సాంబయ్య గారిదని ఎర్రగుంట్ల వెంకట కృష్ణారావు గారి అభిప్రాయం. ఇద్దరూ ఖచ్చితంగా చెప్పలేదు. అందువల్ల 'కన్నేపల్లి' వారిది అంటున్నాను.
26. మహీధర రామ్మోహనరావు గారి ప్రసంగ వ్యాసం, 15–07–1990
27. చిలకమర్రి సత్యనారాయణాచార్య గారి ప్రకటన, ఢంకా మే, 1946
28. అమృతాంజనం పాటలు, ఢంకా, ఏప్రిల్ 47, నవంబర్ 47, డిసెంబర్ 51.
29. టేకుమళ్ళ కామేశ్వరరావు, నా వాఙ్మయ మిత్రులు, పేజ్–326.
30. ఎర్రగుంట వెంకట కృష్ణారావు గారితో ముఖాముఖీ, 15–07–1990.
31. కిన్నెర, ఆగస్టు 52, పేజ్–373, 376.

❋ ❋ ❋

ముగింపు

గరిమెళ్ళ సాహిత్యం మంచి చేసిందా? చెడు చేసిందా? అంటే ప్రజలను చైతన్యవంతులను చేసి వారికి మంచి చేసింది. ప్రభుత్వాలకు చెడు చేసింది.

గరిమెళ్ళ భారతదేశానికి రాజకీయ స్వాతంత్ర్యం ప్రధానావసరంగా భావించారు. ఆ విషయాలే రాశారు. ఆయన సాహిత్యంలో రాజకీయాలకి సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయి.

ఈ దేశంలో అప్పటికి ప్రజలు అత్యధికశాతం నిరక్షరాస్యులు. కష్టం చేసి బతికేవారు. వారిని చైతన్యవంతుల్ని చేయాలనుకున్నారు కనుక వారికి అర్థమయ్యే రీతిలో సరళమైన భాషలో వారి సంస్కృతికి దగ్గరగా ఉండే జానపద బాణీల్లో రాసి వారిని చైతన్యవంతుల్ని చేశారు. ప్రజానాట్యమండలి, జననాట్యమండలి సంస్థలుగా నిర్వహించిన కార్యభారాన్ని జాతీయోద్యమ కాలంలో ముఖ్యంగా 1920 ప్రాంతాల్లో కొద్దిమంది వ్యక్తులు మాత్రమే నిర్వహించారు. వారిలో శక్తివంతంగా ప్రజల దగ్గరకు వెళ్ళిన వాళ్ళలో ప్రథమ స్థానం గరిమెళ్ళ సత్యనారాయణ గారిది. ఈ వారసత్వాన్ని ప్రజానాట్యమండలి, జననాట్యమండలి సమర్థవంతంగా కొనసాగించాయని చెప్పవచ్చు.

" అయితే మనకును, సాహిత్య లేఖకులకును గల వ్యత్యాసమేమనగా వారు పరిశుభ్రమైన సోపానకులును, కళాభిమానులును అయి ఉండగా మనము ఆ రసములను కళలను ప్రజాసేవకు, విజ్ఞానమునకు, దేశ పురోభివృద్ధికి వినియోగించుటకై తయారై యున్నవారము. ఇట్టి వారికే ప్రోగ్రెసివు రైటర్సు అను నామము తరచుగా ఉపయోగించుచున్నారము... " అంటూ ఆంధ్ర ప్రోగ్రెసివు రైటర్సు మహాసభలో ప్రసంగించారు. పురోభివృద్ధి లేఖకుడుగా, తన బాధ్యతను నిర్వర్తించ దలచుకొన్నందువల్ల ఆయన ప్రజాసాహిత్యం సృష్టించారు. ప్రజలకు అన్యాయం చేసే

ప్రభుత్వాలను మన్నించలేదు. అందువల్లే కొన్ని సందర్భాలలో స్వతంత్ర భారత ప్రభుత్వాన్ని కూడా విమర్శించారు.

రచనా వ్యాసంగానికి దగ్గరగా ఉండే పత్రికారంగంలో జీవిక కోసం అడుగుపెట్టారు. ఎప్పుడూ ప్రజల గురించే ఆలోచించే గరిమెళ్ళ ఆ రంగంలో నిలదొక్కుకోలేకపోయారు.

ప్రజల కోసమే పాటుపడ్డప్పటికి ఆలోచనా దృక్పథంలో అశాస్త్రీయత ఉంది. ఇది పెట్టుబడిదారీ సంస్కృతి తరవాత రావలసిన సంస్కృతి గురించి ఆలోచించకుండా ప్రాచీన సంస్కృతిలోనే అంతా బాగుండేది కనుక అది తిరిగి రావాలనటం, వర్ణవ్యవస్థలో వర్గవ్యవస్థ లేదనటం, హిందూ ముస్లిం సమస్యను మతదృష్టితోనే ఆలోచించడంలో ఇది ప్రతిబింబిస్తుంది.

పై అభిప్రాయాలను గరిమెళ్ళ వ్యాసాల రూపంలో వ్యక్తం చేస్తున్న కాలానికి అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడింది. అది ఉద్యమాల్లోంచి పుట్టిన సంస్థ. అందులో కవులు, రచయితలు చాలావరకు ఉద్యమాలకు స్పందించినవారు. గరిమెళ్ళ కూడా ఉద్యమాలకు స్పందించి కవిగా ప్రజల పక్షాన నిలబడ్డవారు. కానీ, 'అరసం' గరిమెళ్ళను పట్టించుకున్నట్లుగా కనిపించదు. ఆర్థికంగా పట్టించుకునే స్థితిలో ఉన్నా లేకపోయినా ఆయన భావాల్లోని అశాస్త్రీయతను, అస్పష్టతను పోగొట్టే ప్రయత్నం చేయవలసినది. కానీ 'అరసం' ఆ ప్రయత్నం చేసినట్లుగా నా దృష్టికి అందినంతవరకు కనిపించలేదు. ఆయన వ్యాసాలలో ఉన్న లోపాలను సవరించటానికి ఎవరూ ప్రయత్నించలేదు. ఆ ప్రయత్నం చేసి ఉంటే ఆ రచయిత కలం నుంచి ఇంకా మంచి వ్యాసాలు వచ్చి ఉండేవి. ఒక ఉద్యమకవికి, ఉద్యమాల్లోంచి పుట్టిన సంస్థకి మధ్య ఏర్పడిన దూరం గురించి, ఈ సమస్య వెనుక ఉన్న పరిస్థితుల గురించి భావి పరిశోధకులు పరిశోధించాల్సి ఉంది.

గరిమెళ్ళ పద్య రచనా ధోరణిని పరిశీలిస్తే, ఆయన ఆ మార్గంలో కృషి చేసి ఉంటే సంప్రదాయ కవితా రచనలో బాగా ఆరితేరి ఉండేవారు అనిపిస్తోంది. కానీ ఆయన దృక్పథం వేరు కనక చివరివరకు ప్రజల వైపు ఉండటానికే ప్రయత్నం చేసి ప్రజాకవిగా రూపొందారు.

అందుకే ప్రజాకవిగా గరిమెళ్ళ సత్యనారాయణ ఆంధ్ర ప్రజలకు చిరస్మరణీయులు.

అనుబంధం - 1

గరిమెళ్ళ పాటలు

అన్యాయకాలంబు దాపురించిందిపుడు !

అన్యాయకాలంబు దాపురించిందిపుడు
అందరము మేలు కోవాలండి.
మాన్యాలు భోగాలు మనుజులందరి కబ్బు
మార్గాలు వెతకాలి రండి
ఏటి పొడుగున దున్ని యెరువేసి నీరెట్టి నూర్చి
పండించేది మనమంతా
గోటు చేయుచు బూతు కూతలను కూసి
కలకొట్టి కొనుపోవుట ఇంకొకరి వంతా
పొగలలో, మరలలో పొగిలి పొగిలి సరకు
పుట్టించి యిచ్చేది మనమంతా
తొగరు వాతెరసొగసు తొయ్యలులతో కలిసి
విరగబడు చుండుట ఇంకొకరి వంతా
కూలి చాలక, కడుపు మాడుతూ గుహలలో
కుందుతూ కుళ్ళడము మనమంతా
గాలి మేడలలోను కమ్మ తావులలోను
గర్వముగ భోగం ఇంకొకరి వంతా -

(మొట్టమొదట 'చిత్రగుప్త' లో అచ్చయి, 1938 లో రాజమండ్రి బుక్ సెల్లర్స్ వారు ప్రకటించిన జాతీయ గీతముల పుస్తకంలో ప్రచురించబడిన గరిమెళ్ళ సత్యనారాయణ గారి విప్లవ గీతం.)

కర్షక రాజ్యం

కర్షకులారా లెండి మన కాంగ్రేసుకు పదండి !
సంఘర్షణ చేయండి – మన స్వాతంత్ర్యము చాటండీ ॥ కర్షక ॥

పండించుట మనమైతే – బాగా పండేడిది పుడమియైతే ఈ
దళారీ జమీందార్ల పెద్దతన మది మనకిక యేలా? ॥ కర్షక ॥

అందర మొకటవుదామోయి – దీర్ఘ యాత్ర లెన్నో చేదామోయి

మందుల మాట వినద్దోయి – రాజ్యం మన దవాలీ ప్రొద్దోయి॥ కర్షక ॥

జన్మభూమిని

జనులెల్లరికి నేను జన్మభూమినిరా
ఛేదించవయ్యా అసమాన భేదముల
ఆనందమున నన్ను అలరించువారు
మీరలే మీరలే మేలుకొనుడింక
ఆసపోతులకంత అధికారమేలా
మోసకృత్యంబులందు మోహంబులేలా
పెద్దలకు లాభాలు బాంకుల్ల నిండా
పేదలకు దుఃఖాలు హృదయాల నిండా
నీది నాదనెడి అన్యాయంబు వీడు
మనము మనదనెడి సద్గానంబు పాడు
మీ యిల్లు మీ సుఖము మీ ధనముతోనే
మేదినీ తలమెల్ల మెరయుచుండాలి
సైన్యాలు వార్నెపుడు రక్షించ వలెనా
కర్షకుల కార్మికుల శిక్షించవలెనా
భాగ్యవంతుల వైభవంబు లంటే నాకు
బాధించు వ్రణమని బాగా తెలియండి

కర్షకులు కార్మికులు కలవండి వేగ
వార్షికోత్సవములు జరుపండి వేగ
ఆనందమున నన్ను అలరించు వారు
మీరలే మీరలే మేలుకొనుడింక

మాకొద్దీ తెల్లదొరతనము

పల్లవి : మాకొద్దీ తెల్లదొరతనము దేవ మాకొద్దీ తెల్లదొరతనము
అనుపల్లవి: మా ప్రాణాలపై పొంచి – మానాలు హరియించె ॥ మాకొద్దీ ॥

చరణములు

1. పన్నెండు దేశాలు పండుచున్నా గాని – పట్టెడన్నమె లోపమండీ !
ఉప్పు ముట్టుకుంటే దోషమండీ !
నోట ! మట్టికొట్టి పోతాడండీ !
అయ్యో కుక్కలతో పోరాడి కూడు తింటామండి ॥ మాకొద్దీ ॥

2. ధనము కోసం వాడు దారి చేసుకొని – కల్లు సారాయమ్ముతాడు !
మాదు ముల్లె మూటయు దోచినాడు !
ఆలి మెళ్ళో పుస్తెలు త్రెంచినాడు !
మాదు కళ్ళల్లో దుమ్మోశాడు – కాటికి దరి చేరుస్తాడు ॥ మాకొద్దీ ॥

3. వర్తకంబునకొచ్చి – పట్టణంబులు పట్టి – రాజ్యమొక్కటి అల్లినాడు !
దాన్ని ! రాణి కొప్పుచెప్పినాడు
రాణి పత్రంబు చించేసినాడు !
ఈ చిత్రమిదేమంటే – శిక్షిస్తానంటాడు ॥ మాకొద్దీ ॥

4. గాంధీటోపీ పెట్టి – పాఠశాలలోకి – రావద్దు రావద్దంటాడు !
రాట్నం బడిలో పెట్టవద్దంటాడు !
టోపీ తీసి వీపులు బాదుతాడు !
అయ్యో రాజద్రోహమంత – రాట్నంలో ఉందంట ॥ మాకొద్దీ ॥

5. కోర్టులంటూ పెట్టి – పార్టీలు పుట్టించి – స్నేహభావము చంపినాడు !
ద్రవ్యదాహము కల్పించినాడు
చెడ్డ యూహలు కడు పెంచినాడు
మా ఆహారముల ద్రుంచి – ఆహా! యనిపించినాడు ॥ మాకొద్దీ ॥

6. ఏడాది కేడాది కెక్కువ సిస్తేసి – ఈ భూమి నాదేనన్నాడు
మమ్ము కూలికి దున్నుమన్నాడు
కడుపు మంటతో చావ మన్నాడు
బానిసలకు వాడు – ప్రభువౌతనన్నాడు ॥ మాకొద్దీ ॥

7. పంటపోయినగాని – పన్నులు విడువక – వెంట కరణాలనంపుతాడు
వారి వెంట తహసిల్దారు నంపుతాడు – లేకుంటే ఉద్యోగం తీస్తాడు
ఫైను – లంటూ జీతం తగ్గిస్తాడు
మా యింటి లోపల యిట్లు – యిడుముళ్ళు పెడతాడు ॥ మాకొద్దీ ॥

8. కయ్యాలకు ముందు – కాలు దువ్వి వెనుక – దయ్యమై మము
మ్రింగుతాడు ! లేదా – దయ్యారై మము కాల్చుతాడు
మాదు నెయ్యము చెడగొట్టుతాడు –
సేనకయ్యో పాపం కట్టుతాడు – వెయ్యేల ! పోలీసు విధులు మరిపిస్తాడు
॥ మాకొద్దీ ॥

9. ఘోర శాసనాలు – కూడదీసి మాదు – సారమునెల్ల పీల్చాడు మా
సంసారములెల్ల కూల్చాడు
వాడు ధనవంతులను బట్టి (తైతక్కలాడ్తాడు) దడ దడ లాడ్తాడు ॥ మాకొద్దీ ॥

10. ఆడి తాతగారి మూట దాచి పెట్టినట్లు – ధాటి చేస్తాడీ దేశమున
పోరాట మాడుతాడాపైన
మొగమాటము పడదు సుంతైనా
ఆడి పాటు పాడైపోను – మాట చెపితే వినడు ॥ మాకొద్దీ ॥

11. నూట నలభై నాల్గు – నోటికి తగిలించి – మాటలాడ వద్దంటాడు
మమ్ము ! పాట పాడ వద్దంటాడు
వాడి మాట దాట వద్దంటాడు
అయ్యో ! చేటు తెచ్చుకు యిట్లు – చెడిపోవు మంటాడు ॥మాకొద్దీ ॥

12. ప్రజల క్షేమం కోసం – పెట్టిన సంస్థలను – ప్రభుల కోసం మారుస్తాడు
వాటిని ప్రజల శత్రులుగా చేస్తాడు
మమ్ము గజగజలాడ చేస్తాడు
వాడి గజిబిజి వర్ణింప – కాదు బ్రహ్మకు నైన ॥ మాకొద్దీ ॥

13. మా స్వరాజ్య మందిర – స్థాపితమైనట్టి జెండాలన్నీ పీకుతాడు
దేశం ముండ మోయవలె నంటాడు !
వాడు బండతనము చూపుతాడు !
ఈ ఛండాలపు వృత్తి – స్వీకరించెను నేడు ॥ మాకొద్దీ ॥

14. దండు పట్టుక వచ్చి – తగుదునమ్మా యంటు దార్ల వెంబడి త్రిప్పుతాడు
పైగా జెండా మీదికి యెక్కుతాడు
దానికి దండమూ పెట్టమంటాడు
వాడి గుండుబలము క్రింద – కూల రమ్మంటాడు ॥ మాకొద్దీ ॥

15. మా పరువు పురువు తీసి – బజారులో ఏలంపాటను పాడుతాడోయి
నర పురుగులట్టుల చూస్తాడోయి! కత్తి బిరబిర త్రిప్పుతాడోయి
ఆడి అరమర పడుటకంటే – మరణమే తెరిపోయి ॥ మాకొద్దీ ॥

16. నూరుమంది మలబారు వాసులను – కూరినాడొక పెట్టెలోన
నోట నీరు పోయడు దేవునాన – గాలి దూరనీయ డించుకైన
వాడి దారుణమును నెట్లు – తరిగివైతువో దేవ ॥ మాకొద్దీ ॥

17. మా చూడియావుల కడుపు – వేడి వేడి మాంసం
వాడికి బహు యిష్టమంట – మా పాడి మొదవుల కోస్తాడంట
మా మతము పాడు చేసి వేస్తాడంట –
మా చూడి యావుల మంద సురిగి యింటికి రాదు ॥ మాకొద్దీ ॥

18. ఎన్ని జన్మములందు – ఏమి పాపము చేసి – కన్నుగానక
తిరిగినామొ – ప్రజల అన్నమెల్లయు గ్రమ్మినామొ
దైత్యుల కన్న చెడ్డగ మెలగినామొ
నేడు దున్నల వలె నిట్లు – దొరికితిమి దొరలకు ॥ మాకొద్దీ ॥

19. వాడి శాసనాలు మాడిపోనూ – వాటి గోడియే మాకొద్దు సుమ్మీ
ధర్మదేవుడే మా రక్షసుండి – ప్రజల ప్రేమయె మాకు దిక్కుండి
కష్ట కాండమె మా పాలు సుండీ
ఈ సృష్టి మమ్ము చూచి – సుందరమన నీండి ॥ మాకొద్దీ ॥

20. ఎవరి ఆజ్ఞ పైని – హిందూదేశమునందు పరిపాలనము
పెట్టినాడు – వీడు ఎవరికి జవాబు నీడు
ధర్మ మార్గము నంటుకొని పోడు !
వీడి దారుణత్వము కింక – తగిన యీడే లేదు ॥ మాకొద్దీ ॥

21. చిత్తరంజను దాసు – చిన్నారు కొమరుని – చెయి విరచి
చెర బెట్టినాడు – అతని పెత్తనమును నెట్టినాడు –
వారి ముత్తైదువుల బట్టినాడు –
వాడి సత్తువకు ఇలమీద సాటి లేదన్నాడు ॥ మాకొద్దీ ॥

22. లజపతిరాయి వంటి – దిగ్గజముల నెల్లాను బంధించుతాడు
ముందట భయము బోధించుతాడు –
వెనువెంట ధైర్యము లోపింప చేస్తాడంట –
ఇట్లు దాస్యమును మా యింట – తగ నిల్పుతాడంట ॥ మాకొద్దీ ॥

23. ధర్మపక్షము నేడు – దారుణమైనట్టి బడలిక పాలయ్యే నయ్య
దాని వదలించుకొన లేదయ్య ! దేవా ! నీదు –
పదనగు ధారనీయవయ్య – నీదు పదములపై
వ్రాలి – ప్రార్థించినామయ్య ॥ మాకొద్దీ ॥

24. ఎవరెన్ని చెప్పినా – హిందూదేశ వాసులేక సోదరులే
సుండీ – అంటు దోషాలు మాకు లేవండీ
పాపమంటూ – చాటుదాము రండి
మీ కుంటి వాదనలు – గూటిలో పెట్టండి ॥ మాకొద్దీ ॥

25. స్నాన ధ్యానము చేసి – రామాకృష్ణా యంచు
దేముని గుడిలోకి రండి – అభిషేకమతనికి చేయండి
నిర్మలత్వ మాత్మను పెంపొందండి
ధర్మ మార్గంబు తవిలి – హరిజనులు నడవండి ॥ మాకొద్దీ ॥

26. నిరాకరణ లక్ష్మి నిర్లక్ష్యముగ నిలచి – పిలుచుచున్నది
మనలనెల్ల – ప్రభుత్వము కూలుచున్నది దానివల్ల –
బలము తేలుచున్నది – అఘముడుల్లా
ఈ తెల్లబలము మళ్ళా – తెప్పరిల్లుట కల్ల ॥ మాకొద్దీ ॥

27. మేజిస్ట్రేటులు కూడా – మేజిస్ట్రీలను మాని
మిణుకు మిణుకు చూస్తున్నారు – చెయ్యి వణకి
శిక్షలు వ్రాస్తున్నారు – మనసు బెణికి లోపల కుంగుతున్నారు –
కాస్త పణము కోసం ఇది ఒక – పడుపనుకుంటున్నారు ॥ మాకొద్దీ ॥

28. బ్రాహ్మణా బ్రాహ్మణ – పంచమ బ్రాహ్మణ – భేదాల తెగులు
మీకేల ! మీ భేదాలు వడి – కాల్పరేలా !
చెడ్డబోధలకు లొంగెదరది యేల?
ఈ మధూకరం వృత్తి – మరగినారది యేల ॥ మాకొద్దీ ॥

29. గుండు పట్టుక వచ్చి మమ్ము కూల్చవచ్చిన గాని - కూర్చున్న
చోటులను విడము - పాడుకొంటూ రాట్నం త్రిప్పుతాము
రాజ్య సూత్రము వడి, వడుకుతాము!
శాంతి తప్పము - సంతసము విడువము ॥ మాకొద్దీ ॥

30. తెల్లదొరల సేవ వల్ల - బ్రతుకుట పెద్ద నల్లని మచ్చని యెంచరోరి
జాతికల్లా ముప్పని చూడరోరి - దైవ మొల్లడనుచును నమ్మిమోరీ
భారత తల్లీ యేడ్పులు వినరోయి - ఆమె పిల్లల మొర
వినబడదటోరి - నీ ఉల్లమెల్లానున్ను - కష్టపడదటోరి ॥ మాకొద్దీ ॥

31. మా నెహ్రూల దాసుల - లాలాల ఆలీల - నిజమైన
విలువెరుగడింత! బుర్ర - పరువెల్ల నోటిలో సంత! వాడి
బలమనగ వాడనగ నెంత? నీతి తెరువు విడిచినంక -
తెగువకు లేదొక పుంత ॥ మాకొద్దీ ॥

32. అట్టి నాయకులను బట్టి - న్యాయము నరిగట్టి - పన్నులు తే
తెమ్మంటాడు ! నోట మన్ను కొడతా రమ్మంటాడు !
మమ్ము కన్నులు మూయమంటాడు - వాడి
ప్రభుతయును మాకొద్దు - పన్నులీయగ వద్దు ॥ మాకొద్దీ ॥

33. దేశభక్తులనెల్ల దోషులుంగాను పెద్ద - మోసగాండ్రని
యెంచుతాడు! శాంతి నాశకులని పిల్చుతాడు !
దొంగలతో సాటిగా చూచుతాడు -
వాడి ఈసు యెట్టిదో కాని - చూసి ఓర్వగలేడు ॥ మాకొద్దీ ॥

34. ప్రపంచ మంతటిని - పట్టి పిండేటంత పశుబలము
వాడికుందంట - దాన వశపరచుకొను మమ్ము అంటా
మమ్ము కసితీర కొరుకుతాడంట - వాడి
శశభిష లెల్లాను చెపుతాడు మా యింట ॥ మాకొద్దీ ॥

35. జయము నపజయమును – చెడు తాసులో బెట్టి శక్తులను
కొలుస్తానంటాడు – ధర్మ విజయమును ఎద నమ్మలేదు
దైవ నైజము గుర్తెరుగ లేరు – మాదు నిజశక్తి గుర్తించలేరు –
కలుష భోజనమె జయమునకు – లక్షణ మనుకుంటాడు ॥ మాకొద్దీ ॥

36. మా చీరాలను ఇప్పుడు – చేరినాడు – చూచి సిగ్గును
పొందబోడోయి ! ఇంక బీరాలు పలుకుతాడోయి
మాదు సారము గ్రహియింపడోయి – వాడి
దూరాలోచనలెల్ల – ధూళిలో కలిసిపోవు ॥ మాకొద్దీ ॥

37. ప్రభువు గాంధీ తోడ – భరత దేశమాత పరమ తపము
చేసినాది – ధర్మదేవత ప్రత్యక్షమైనాది –
కోరిన వరముల నిచ్చుచున్నాది –
ఆ దొరల గుండెల లోన – దడ దడ పుట్టింది ॥ మాకొద్దీ ॥

38. ప్రపంచమున శాంతి – ప్రేమ దీపంబులు వెలిగించె నీ
భరతమాత! గాంధీ – తెనిగించెనా ప్రాతవ్రాత ! మా నొసట
లిఖియించె నొక కొత్త గీత ! స్వేచ్ఛ మొలిపించె మా శక్తి చేత
క్రూరశక్తుల పైని అహింస – చరచినది ఒక ఘాత ॥ మాకొద్దీ ॥

39. మా పాపముల నెల్ల – మాపి రక్షించుమో – పాపనాశన ధర్మమూర్తి
ఇంక కోపముంచకు రామమూర్తి ! మా ఆపదలాపే చక్రవర్తి –
నీ వ్యాపారమొక సారి – నెరపు మీ పృథివిపై ॥ మాకొద్దీ ॥

40. దీనుల పాలిటి తేజము నీవని – వీనులారా నేను వింటి – కోటి
దీనుల మా భూమి గంటి ! మమ్ము – సానునయముగా
చూడుమంటి – మా ప్రాణాలైన వొల్చి – మానాలిమ్మనుమంటి ॥ మాకొద్దీ॥

41. దొరల బాధలు మాకు – తొలగించు మా తండ్రి నిరతము నిను
గొల్తుమయ్య ! నీదు చరణధ్యానమె విడువమయ్య ! మేము మరువము
మా ధర్మమయ్య ! ఐకమత్యము తోడ అలరారుతామయ్య ॥ మాకొద్దీ ॥

42. వల్లకాడుగా జేయు – తెల్ల ఉద్యోగుల – గొలువిచట మాన్పుమయ్య
కళ్ళ – నల్ల మబ్బుల విప్పుమయ్యా ! అఘముడుల్ల ధర్మము
తెల్పుమయ్యా ! ఐకమత్యముతో అలరారుతామయ్య ॥ మాకొద్దీ ॥

43. సకల దేశములార – సత్యవర్తన తోడ సారించు డిటుల మీ దృష్టి
యింక కనుడీ హైందవ ధర్మ పుష్టి – వేగ తెరవు దొరకుట
కొత్త సృష్టి – ఎట్టి దండనలెదురైన – కాదు మాకే నష్టి ॥ మాకొద్దీ ॥

44. రాట్నలక్ష్మి నవ్వు – రంజిల్లు మోముతో – పాడుచున్నది నోటినిండా
కరువు మాడుచున్నది దాని యెండా ! పరువు మొలచుచున్నది
దాని యండ – స్వేచ్ఛ తిరుగుచున్నది దాని గుండా
ఆ దొరల తేజంబెల్ల – కూల్చే జండా యుండా ॥ మాకొద్దీ ॥

45. స్వచ్ఛ తేజముతోడ – స్వేచ్ఛా వధూమణి – కారాగారము
నందున్నాది – పూల గుచ్ఛములను దాల్చినాది –
మీకు ముచ్చటలను తెల్పుతాది – యీ
చచ్చు రాజ్యము వీడి సరగ జైలుకు రండి ॥ మాకొద్దీ ॥

46. విచ్చులవిడిగాను విప్పి రెక్కలు మీరు విహరింపగా వచ్చు నచట
ఘనుల – మెచ్చులు పొందవచ్చు నచట !
దైవం మెప్పులందగ వచ్చు నచట –
తల్లి కచ్చియున్న ఋణము – నర్పింప వచ్చుచట ॥ మాకొద్దీ ॥

సైతాను ప్రభుత

దండాలండోయి, మే – ముండ లేమండోయి బాబు ॥ దండా ॥
ఈ సైతాను ప్రభుత నింక – సాగనీ మండోయి బాబు ॥ దండా ॥

1. వర్తకాని కంటు ఇంట్లో – పాదమెట్టినాడు బాబు
పాదమెట్టి దొంగతనం – ప్రారంభించేడండి బాబు ॥ దండా ॥

2. పాలకడలి వంటి రాజ్యం– బద్దలయిందండి బాబు
కూలి చేసుకున్నా పొట్టకు – కూడు లేదండోయి బాబు ॥ దండా ॥

3. ఛప్పన్న శాస్త్రాలు – చెప్పుచుండే భూమి బాబు
నూటి కొకడికైన నోట – ముక్క లేదండోయి బాబు ॥ దండా ॥

4. ఘోర శత్రువులను నేల – కూల్చినాము బాబు
శవముతోటి కూడా మేము సాలలేమండోయి బాబు ॥ దండా ॥

5. పలక్కర్ర పుల్ల క్కూడా – పన్ను లేసినాడు బాబు
పిలక పట్టి జయిళ్ళ పెట్టి – పిండిక పోతాడండి బాబు ॥ దండా ॥

6. ఉప్పు పన్ను పప్పు పన్ను– ఊరు వెళితే పన్ను బాబు
కొప్పు కాస్త దేముడికి – మొక్కుకుంటే పన్ను బాబు ॥ దండా ॥

7. కల్లు సారాయి తెచ్చి యిళ్ళు – గుల్ల సేసేడండి బాబు
పెళ్ళాం మెళ్ళో పుస్తెలు కూడ – యెళ్ళి పోయేయండి బాబు ॥ దండా ॥

8. అన్నదమ్ములలోన భేదమాడు – పెట్టేడండి బాబు
ఉన్నదల్ల ఊడ దన్ని – ఊరు తున్నాడండి బాబు ॥ దండా ॥

9. ఘోరమైన శాసనాలు – కూడ దీశాడండి బాబు
కూడదీసి నోళ్ళలోను – గుడ్డ కుక్కినాడు బాబు ॥ దండా ॥

10. కదలకూడదు మెదలకూడదు – కష్టమైన సెప్పకూడదు
పదిమందిలోన కాస్త – పరువు గలిగి తిరగకూడదు ॥ దండా ॥

11. చెన్నపట్నం నుండి ఆడి - సీమకాడి కెళ్ళేదాకా
దబ్బు కాలువ గట్టినాడు - దాని క్కాపు లెట్టినాడు ॥ దండా ॥

12. పంచాయితీలు మానిపించి - కోర్టు లెట్టినాడు బాబు
కోర్టులెట్టి రైతువాడి - కూదు తన్నినాడు బాబు ॥ దండా ॥

13. ఎఫ్ఫే బియ్యే చెపుతానని - బదులు పెట్టినాడు బాబు
అప్పుచేసి ఉన్న పొలా - లమ్మించేసినాడు బాబు ॥ దండా ॥

14. బోలిడేసి పన్ను వేసి - మోదుతా డండోయి బాబు
పోలీసోళ్ళకి సార్జంటులకు - పోస్తా డండోయి బాబు ॥ దండా ॥

15. సదువులకు సంధ్యలకు - సాలదంటాడోయి బాబు
పెదవి కదిలిస్తేను జయిళ్ళ - పెడుతా నంటా డోయి బాబు ॥ దండా ॥

16. ఆడి తాతగారి దేశమట్లు - ధాటి చేస్తాడండి బాబు
జీతాలిచ్చి మాలో మాకే - చిచ్చు పెడతాడండి బాబు ॥ దండా ॥

17. దేశభక్తి తోను మేము - తిరుగుతుండగానే బాబు
రాజద్రోహులంటు మమ్ము - రచ్చ పెట్టుతాడు బాబు ॥ దండా ॥

18. సాటి జాతులోళ్ళు మమ్ము - చేటు పెట్టుతుంటే బాబు
నోటి కడ్డుపెట్టుకొని - మాట లాడడోయి బాబు ॥ దండా ॥

19. ఆఫ్రికాలో అమెరికాలో - అదిమి కొట్టుతుంటే బాబు
ఏటి సేయలేక మాతో - నేడ్చుకుంటాడోయి బాబు ॥ దండా ॥

20. పంజాబు హత్యలకు - బదులు న్యాయ మిమ్మనంటే
మరచిపొమ్మటంచు దొంగ మాయలాడుతాడు బాబు ॥ దండా ॥

21. ఆడి తప్పిపోవడము - ప్రజల కొంప ముంచడము
ఆలోసించకుండ ఆడి - కలవాటయిందండి బాబు ॥ దండా ॥

22. తక్కెడసిప్పల సాహుకార్ని - ధరణీచక్ర మేలమంటే
ఎక్కువ తక్కువ సేయుట తప్ప - ఏటి సెయ్యగలడు బాబు ॥ దండా ॥

23. సేతకాని ప్రభువునని - చెప్పబో డండోయి బాబు
నీతిశాలి నంటు బలే - నిక్కుతా డండోయి బాబు ॥ దండా ॥

24. సీమనూలు మల్లు తెచ్చి - చెరిపినా డండోయి బాబు
బట్ట లేక యీాధుల నిలవ - బెట్టినా డండోయి బాబు ॥ దండా ॥

25. దార మొడికే బొటనవేళ్ళు నరకు కొన్నామండి బాబు
రాట్న విద్య మంటబెట్టి - రట్టు పొందినాము బాబు ॥ దండా ॥

26. నీతి జాతి మంట గలిపి - నిక్కు తెచ్చినాడు బాబు
సనాతనపు నాగరికత - సాగనంపినాడు బాబు ॥ దండా ॥

27. ధర్మబుద్ధి మాయము చేసి - తప్పించేసినాడు బాబు
ధనముమీద సేవమీద - మనసు కొల్పిన్నాడు ... ॥ దండా ॥

28. మన పూర్వ నాగరికత - మళ్ళీ తెస్తానంటూ బాబు
మన గాంధీ మహాత్ముండు - మళ్ళ పుట్టినాడు ... ॥ దండా ॥

29. ఆడి యీాసు పెట్టకుండ - ఆడి జోలి తలచకుండ
కాంగ్రెస్సు చెప్పినట్లు - గడుపుకుంటా మండి బాబు ॥ దండా ॥

30. కల్లుపాక కింక మీద - యెళ్ళబో మండోయి బాబు
పిల్లా జల్లా సల్లగాను బ్రతికి యుంటామండి బాబు ॥ దండా ॥

31. కోర్టు గుమ్మమెక్కితేను - కుక్కతోను సమం బాబు
చెప్పు తీసి దౌడ మీద - కొట్టవచ్చు నండి బాబు ॥ దండా ॥

32. పెద్ద మనుష్యులు చెప్పినట్లు - వినుకుంటా మండి బాబు
లంచాలున్ను కట్నాలున్ను - పోయలేమండోయి బాబు ॥ దండా ॥

33. తెల్లవోడి సదువు కింక - సలామెడతా మండి బాబు
గులాంపనులు చేతామని - కోర్కె లేదండోయి బాబు ॥ దండా ॥

34. జాతి ద్వేషములు మాని జరుపుకుంటా మండి బాబు
నీతి గలిగి బ్రతుకు టొకటే - జాతి తలప మాకు ... ॥ దండా ॥

35. జాతిలేని కుక్క అదే – జాతిలోన నున్న బాబు
నీతికెల్ల పరువుతక్కువ – సంభవించు నండి ... ॥ దండా ॥

36. ఎక్కువ తక్కువ లెంచుకొని – కరచుకో మండోయి బాబు
నిక్కమైన అడకువయే – నిజమైన జాతి ... ॥ దండా ॥

37. అల్లాయన్న రాముడన్న – అంతయున్ను నొకటి బాబు
భాష భేదం చేత అట్లు – పిలుచుకుంటామండి ... ॥ దండా ॥

38. అంటరానితనము మాకు – ఆది నుంచి లేదు బాబు
మధ్య వచ్చినట్టి మాయ – మంట కలుపుతాము ... ॥ దండా ॥

39. స్నానమున్ను ధ్యానమున్ను – జరుపుకుంటు వుంటే బాబు
లేనీ పోనీ జాతి తక్కువ లేచిపోవునండి ... ॥ దండా ॥

40. శాసనాల సభలలోనూ – గూరుచున్న వోళ్ళని బాబు
ప్రతినిధులుగాను మేము – పరిగణించ మండి ... ॥ దండా ॥

41. ఇంట యింట వోటు ముష్టి – నెత్తుకుంటూ వుంటే బాబు
బిచ్చ మెట్టకుండ ఆళ్ళని – కసరి పంపుతాము ... ॥ దండా ॥

42. దొరలసేవ సేయుచుంట – పరువుతక్కు వేను బాబు
కరువుతోను సాలలేని – ఘనుల కదొక తెరవు ... ॥ దండా ॥

43. జాతి పాడుసేయుచున్న – సంకటము అదే బాబు
నీతి గలిగి వచ్చుటకు – ధైర్యం లేదండోయి ... ॥ దండా ॥

44. దొరల పంచ కూడు తింట – మరగినారండోయి బాబు
స్వేచ్ఛ తోడ వచ్చు మెతుకు – నోటి కిమడదోయి ... ॥ దండా ॥

45. సూటు బూటు హేటులతో – తిరగ మరగినాము బాబు
మోటుబట్ట లంటే కోతి – మొగము పెట్టుతాడు ... ॥ దండా ॥

46. సీమనూలు బట్ట కట్టి – సిగ్గు పొందరోయి బాబు
గోటుతోను రోడ్డుమీద – గొప్ప పడతారోయి ... ॥ దండా ॥

47. పట్టుచీరల మీద మోహం – దాయలేరండోయి బాబు
కట్టుకుని వీధిలో – షికారు లొస్తారోయి ... ॥ దండా ॥

48. దొరలగుడ్డ లోను గల – పరువు తక్కువేదో బాబు
అరసి వొక్క నిముసమైన – ఆలోసించ రేమో ... ॥ దండా ॥

49. పాఠశాల లొదిలి దాస్య – పనుల లోన బడిన దాది
దేశభక్తి ముచ్చటలు – తెల్లవారి పోయె ... ॥ దండా ॥

50. కాలేజీలోను చదువు – జ్ఞానులను కూడా బాబు
కద్దరు బట్ట కట్టుడని – జెప్పవలసి వచ్చే ... ॥ దండా ॥

51. నూలుపోగు మీద రాజ్య – మూగుతున్న దండి బాబు
సీమ నూలు తెంచితేను – సితికిపోవు నండి ... ॥ దండా ॥

52. రాట్నంపట్టి నాలుగు పోగులు – లాగలేకుండాను బాబు
రాజ్యమంత తెల్లవోడి – కప్ప సెప్పుతారు ... ॥ దండా ॥

53. నీతియున్ను న్యాయమున్ను – నీట కలసినాయి బాబు
పాతక మీ దొరలక్రింద – పడియుండుటేను ... ॥ దండా ॥

54. కద్దరుబట్ట కట్టుకొని – కనపడితే తప్పు బాబు
మలబారు హత్యలకు – మూల మల్ల అదే ... ॥ దండా ॥

55. కల్లు తాగవద్దటంచు – గట్టిగంటే తప్పు బాబు
ధార్వాడ కాల్పులకు – తగిన హేతువదే ... ॥ దండా ॥

56. పాపసేవ మానుడని – పలకడమే తప్పు బాబు
ఆలీసోదరుల జయిలు – కదే హేతువండి ... ॥ దండా ॥

57. మతము చొప్పున నడచుకోమని – మాటయంటే తప్పు
బాబు – రాజద్రోహమని కేసు – చేసి పోతాడండి ... ॥ దండా ॥

58. నీతి మతం దేశభక్తి నిర్మలత్వం లేనివాళ్ళే
రాత్రింబగళ్ళు వాళ్ళకి – ప్రీతి నీయగలరు ॥ దండా ॥

59. అన్నవాళ్ళ నందరిని – అడ్డ మెట్టలేడు బాబు
ఆళ్ళ నొదిలి పెట్టితేను – పరువు తక్కువంట ... ॥ దండా ॥

60. ఎవర్ని చూసి వోర్వలేరో – ఆళ్ళని పట్టుతారు బాబు
సబబులున్న ధర్మములు – కట్టి పెట్టినారు ॥ దండా ॥

61. ఆలీసోదరుల స్థానే – అరవై మంది లేచినారు
పాలుబోక కళ్ళు రెండు – తేల వేసినారు ... ॥ దండా ॥

62. పాలించలేక బుఱ్ఱ – బ్రద్దలౌతున్నది బాబు
చేత కాదటంచు పైకి – చెప్పుకుంటే సిగ్గు ... ॥ దండా ॥

63. ప్రజల కోర్కె తీర్చడానికి – మనసు లేదండోయి బాబు
రావణాసుర రాజ్యమంటే – నొచ్చుకుంటారేల ... ॥ దండా ॥

64. జయిళ్ళకున్న కాల్బులకు – సారమెల్ల అదే బాబు
ఎన్ని జయిళ్ళైంత మందు – ఈడి కున్నాదోను ... ॥ దండా ॥

65. మాటలాడితేను దండు – మీద పెట్టుతాడు బాబు
కాకులట్లు ప్రజల నెల్ల – అదర చూచుతాడు ॥ దండా ॥

66. ప్రాణమంటే ఆశ గల – పారుబోతుకు భయంకాని
దేశభక్తుల కాళ్ళ లక్ష్య – మేమి లేదండోయి ... ॥ దండా ॥

67. అందరిని జంపుకున్న – అడ్డ మెట్టమండి బాబు
దేశమంతా మాది అంటూ – తెలిసి చస్తామండి ... ॥ దండా ॥

68. కదలమండి మెదలమండి – కంప్లైంటు చేయమండి
వదలకుండా వాని బలం – పట్టుకొని రమ్మనండి ॥ దండా ॥

69. అహింస త్యాగమున్ను – ఆళ్ళ కడ్డు నిలచెనండి
సాహసించి వీని తోడ – సమరమును సేయనిండి ॥ దండా ॥

70. వల్లకాడు చేసి మాదు – వసుధనెల్ల యేలనిండి
తెల్లవాడి కీర్తి నాల్గు – దిశలయందు వెలగనిండి ॥ దండా ॥

71. ప్రాణమున్న యంతసేపు – పట్టు మేము విడవమండి
స్వరాజ్య మింతలోనే – సాధించి తీరుతామండి ॥ దండా ॥

72. హంగెరీయులు కొరియనులు – అయిరిషోళ్ళు ఈజిప్టోళ్ళు
ఆళ్ళకన్న మేమేమిన్ని – అథములము కాము ... ॥ దండా ॥

73. చేతుల్నిండా గాజులున్న – చేడియలము కాము బాబు
చేడియలును పురుషులకు – తీసిపోరండోయి ... ॥ దండా ॥

74. బాలికలకు బాలకులకు – పట్టె నిట్టి తెలివి బాబు
బేల లౌచు పెద్దలెల్ల – కూరుసోరండోయి ... ॥ దండా ॥

75. కోర్టు కెళ్ళే ప్లీడరుల – గోల మాకు లేదు బాబు
కూలి నాలి చేసుకునే వాళ్ళే మాకు – సాలు ... ॥ దండా ॥

76. కల్లు వోళ్ళు మన మాట – గడప బోరండోయి బాబు
వర్తకులు అభిమానం – పట్టుతారండోయి ... ॥ దండా ॥

77. సదువు మాని యౌవనులు – సాయమౌతారండోయి బాబు
పదిమంది దీవనలు – పలుకుతారండోయి ... ॥ దండా ॥

78. రాత్రి పగలు రాట్నమెట్టి – వడకుతామండోయి బాబు
నేతబట్టల తోడ దేశం – నింపుతామండోయి ... ॥ దండా ॥

79. దేశములో పెద్దలెల్ల – త్రిప్పుతారండోయి బాబు
వేలుపులు పువులు గురి – పించుతారండోయి ॥ దండా ॥

80. చెన్నపట్నమున కొక్క – శని పట్టిందండి బాబు
కష్టాలెల్ల యిక్కడకె – కాపురాలొచ్చాయి ॥ దండా ॥

81. తిరుగుబాటులు లేస్తాయని – దిగులు పుట్టిందండి బాబు
కత్తి కఠార్లన్ని నూరి – తయార్చేశాడండి ॥ దండా ॥

82. గోదావరి కృష్ణకిన్ని –కాపు లెట్టేడండి బాబు
గుంటూర్లోను సిపాయిలను – దించి వేసేడండి ... ॥ దండా ॥

83. కయ్యాలకు ముందుగుండ – కాలు దువ్వుతాడు బాబు
అల్లరయిందని గుళ్ళు – అపుడే పేలుస్తాడు ... ॥ దండా ॥

84. జనుల ప్రాణాలంటే ఆడికి – ప్రేమ లేదండోయి బాబు
గుండుబలం చూసుకుని – గునిసి పోతాడండి ... ॥ దండా ॥

85. సేనాశాసనము వేగ – చాటించేస్తాడండి బాబు
ఋజువు సాక్ష్యం లేకుండాను – రుంజుతాడండోయి ... ॥ దండా ॥

86. పంజాబు హత్యలకే – పట్టి పోరుతుంటే బాబు
మలబారు యిపుడు మాకు – మళ్ళీ దాపరించెనండి ... ॥ దండా ॥

87. కాంగ్రెస్సు సేవకులను – కడగి రానీడండి బాబు
కలసి బోధ చేసి శాంతి – నెలకొల్ప నీడు ... ॥ దండా ॥

88. తెలివితక్కువోళ్ళని బట్టి – ఆట లాడుతాడు బాబు
ఆటలాడి వాళ్ళ పీక – అట్టే నులుపుతాడు ... ॥ దండా ॥

89. రక్కసి సర్కారు – దాపరించేరండి బాబు
తప్పుగుందా మంటే మాకు – దారి తోచదోయి ... ॥ దండా ॥

90. దెబ్బలాటకు ముందు పెంట – రాజ పెట్టుతాడు బాబు
రాజపెట్టి కక్షకట్టి – రక్కుతాడండోయి ... ॥ దండా ॥

91. పండు వంటి శాంతినెల్ల – పగుల గొట్టినాడు బాబు
మళ్ళీ కలపడము ఆడి – వల్లనయింది కాదు ... ॥ దండా ॥

92. రాజధాని పట్టణమునకె – రక్ష లేకపోయే బాబు
బుద్ధి లేక కక్ష లెంచితె – పోర్లు పుట్టవండి ... ॥ దండా ॥

93. రౌతుకొద్ది గుఱ్ఱమన్న – మాట నిజమండి బాబు
విల్లింగ్టను ప్రభువిట్లు – వెలుగు తున్నాడండి ... ॥ దండా ॥

94. బొంబాయి పెద్దలను – పుచ్చి మాటలాడి బాబు
గౌరవముగ శలవు – పుచ్చుకోను లేకపోయే ॥ దండా ॥

95. మలబారు థామసుకు – గుత్త కిచ్చేశాడు బాబు
చెన్నపట్నం మాయిరు దొరకు – జారా యిచ్చినాడు || దండా ||

96. చీరాలను భూమి నుంచి – చెరప జూచుతాడు బాబు
రేపల్లెతో సాలలేక – సలా మెట్టేశాడు ... || దండా ||

97. ధర్మమున్ను భక్తియున్ను – జారిపోక పోతే బాబు
భరతరాజ్యం తోటి దీన్ని – పోల్చ వచ్చునండి ... || దండా ||

98. పెంటల లేండు పెట్టినట్టి – భేదపాలనైన గాని
సరిగా నడిపి కీర్తి తోడ – వెలయ లేదండోయి బాబు || దండా ||

99. అన్ని పార్టీలకి ఆఖరికి – అనువయేడండి బాబు
అనువయి గౌరవానికి – అసడ్డయేడండి ... || దండా ||

100. చేతకాక పోయినాను – శౌర్యమెక్కువండి బాబు
తప్పులన్ని ఆళ్ళ ఈళ్ళ – తలకి కడతాడండి బాబు || దండా ||

101. నాన్ కో ఆపరేషనంటే – మండి పడతాడండి బాబు
మంట చూసిన లేడి లాగా – బెదిరి పడతాడండి ... || దండా ||

102. శస్త్రమస్త్రం లేని ఉత్తర – సర్కారులను జూచితేను
చిత్రంగాను అదెందుకో – సిందులు తొక్కుతాడు ... || దండా ||

103. గోదావరి కృష్ణ డెల్టా లంటే – గుండె లదురుతాయి బాబు
మంత్రుల నంపి కో ఆపరేషను – మీటింగు చేశాడండి || దండా ||

104. రాజ్యానికి కొమ్ము మీద – రీడింగున్నాడండి బాబు
గాంధీ మహాత్ముణ్ణి ముందు – కట్టి పోతాడంట ... || దండా ||

105. సప్రూగారు విప్లవులను – చేరుతాడంట బాబు
షాఫీ గారు రిజైనిచ్చి – సక్కా వస్తాడంట || దండా ||

106. రాజ్యమల్లా కూలుతాదని – సోదె సెప్పుకుంటూ బాబు
శర్మగారు మధ్యస్తంగా – నిలిసిపోతాడంట || దండా ||

107. గాంధీగారిని నిజంగాను – పట్టుకున్న నాడు బాబు
ఎల్లవారికిన్ని తెలియు – నీరి మాటల సారం ॥ దండా ॥

108. తంగిరి పింగిరి పనులు చేసి – దానికి గొప్ప తేవడానికి
వేల్సు యువరాజు గారిని – వెంటబెట్టు కొస్తారు ॥ దండా ॥

109. రాజేరానీ రాణేరానీ – కొడుకేరానీ కొమ్మేరానీ
ఎవరు వచ్చినాను ఇందుకే – ఇష్టం లేదండోయి ... ॥ దండా ॥

110. బొంబాయిలో చేరిన్నాడు – పురములందు పల్లెలందు
అయిష్టము చూపేటందుకు – హర్తాలు చేస్తామండి బాబు ॥ దండా ॥

111. రాజ్యంకంటే దేశం నడిపే – నాయకుల కంటే బాబు
రాజుకొడుకంటే మాకు – రంగు లేదండోయి ... ॥ దండా ॥

112. ఆలీ సోదరుల మీద – గాంధీ మొదలగు వారి మీద
స్వరాజ్యం మీదను మాకు – ఆత్మ నిలచిందండి బాబు ॥ దండా ॥

* * *

Enclosure to Letter No. 264/20, dated 13-05-1922 from the
Commissioner of Police, Madras.

Copy of Letter No. Confdl./Magl./22 of 1922, dated the 8th April, 1922 from the Additional District Magistrate, Godavari to the Commissioner of Police, Madras.

....

Subect :- Book entitled Swarajya Geetamulu.

....

I enclose a copy of the Telugu Book Swarajya Geetamulu printed by C. Munuswamy Mudaliyar & Sons, Sivakami Vilas Press, No. 41, Lingachetty Street, George Town, Madras and published by the India Agency Bureau Post Box No. 420, Triplicane, Madras. The Book is circulating in this district. I am of opinion that the portion of the book from Page-33, Verse-14, with heading Satanic Government comes under Sections 124 A and 153 A, I.P.C. and recommend that you should institute proceedings either under these sections or under Section 180, Criminal Procedure Code against the Printer and Publisher.

....

Copy of letter dated the 4th February, 1922 from the District Superintendent of Police, Godavari District to the Personal Assistant to the Deputy Inspector General of Police, Railway and C.I.D., Madras.

....

One Garimella Satyanarayana of Tilak Ashramam, Rajahmundry has written a book called Swarajya Geetamulu in 2 parts and it has been printed by V. Muniswamy Modaliyar & Sons, Sivakami Vilas Press, 41, Lingachetty Street, George Town, Madras. It has been written in colloquial Telugu intended for the use of ordinary people specially for the lower classes and contains several portions highly seditious and objectionable. The third part is said to be in Press. I am told that as all the local Presses refused to print it he got it printed in Madras. It is being sold by the India Agency Bureau, Post Box No. 420, Triplicane, Madras.

I have, therefore, the honour to request you to take immediate steps to get the offenders punished and prevent the publication of the third part.

The said Satyanarayana recently published here, a similar cyclostyled leaflet and steps have been taken for his arrest and warrant is pending.

………….

Sd/-
For Commissioner of Police,
Madras City, 13-05-1922

SEDITION

Public Department

Swarajya Geethamulu - Author, Printer and Publisher -- Prosecution under Section-124 A -- Sanctioned.

ORDER : Misc. No. 429, dated 18-5-1922

....

Under the Provisions of Section-196 of the Code of Criminal Procedure, the Governor in Council hereby sanction the prosecution of 1. Garimella Satyanarayana, Tilak Ashramam, Rajahmundry, 2. C.M. Natesa Mudaliyar, Sivakami Vilas Press, Madras and 3. Asanti Satyanarayana Pantulu of the India Agency Bureau, Triplicane, Madras, the Author, Printer and Publisher respectively of a Telugu Book entitled Swarajya Geethamulu Part-1 for an offence under Section-124 A of the Indian Penal Code in respect of certain passages contained in the said book, an English translation of which is appended below.

Page-8 of the Book

The Government worried our young virgins, removed the clothes on their persons and took of their bodies Oh ! they burnt down our very honour. They held the mouths of barristers and poured urine into them: they pulled the fine clothes off the breasts of woman .

Page-11

Give up the English title, the English Court, the English Service and the English Government.

Page-27

Is it not our duty to regard the enemy of Mohammadanism as the enemy of our Hinduism. xxx If we cannot exhibit all our powers and turn out the westerners, the whole of the East will perish today.

Page-30

To drive out this dishonest Government which, in the name of commerce immerses the people in troubles.

Page-36

May the foreign Government leave us and run away, may our honour stand. May the Punjab Massacres never more take place, may the Government fail.

The Inspector General of Police is requested to depute an officer of a rank not below that of an Inspector of police to file a complaint for an offence under the above mentioned section in the Chief Presidency Magistrate Court, Madras. The complaint should be prepared in consultation with the Public Prosecutor, Madras who will conduct the case.

(By order of the Governor in Council)

Sd/-
Chief Secretary.

To
The Inspector General of Police, (With copy of Advocate General's opinion and translation of the Books Part-I and II).

GOVERNMENT OF MADRAS
PUBLIC DEPARTMENT

....

G. O. No. 466, 26th May, 1922

Criminal Procedure Code -- Proscription -- Telugu Book

Swarajya Geetamulu .

Order No. 466, Public, dated 26th May, 1922.

The following notification will be published in the Fort St. George Gazette :-

NOTIFFICATION

In exercise of the powers conferred on him by Sub-Section (1) of Section-99 A, of the Code of Criminal Procedure, 1898, the Governor in Council hereby declares to be forfeited to His Majesty all copies wherever found of the Telugu Book entitled Swarajya Geetamulu (Parts-I and II), written by Garimella Satyanarayana, printed by C. Muniswamy Mudaliyar & Sons at the Sivakami Vilasa Press, 41, Lingachetti Street, Madras and published by the India Agency Bureau, Triplicane, Madras and all other documents containing copies of translations or extracts from the said book, in as much as the said book contains matter which is likely or has a tendency to bring into hatred or contempt or to excite disaffection towards the Government established by law in British India.

(By order of the Governor in Council)

R.A. GRAHAM,
Chief Secretary.

To
All the District Magistrates.
The Chief Presidency Magistrate.
The Commissioner of Police.
The Deputy Inspector General of Police, Railways & Criminal Investigation Department.
The Collector of Customs.
The Post Master General.
The Director General of Posts & Telegraphs (C. L.).
The Superintendent, Government Press.
The Publicity Officer.
Copy to other Local Governments and the Government of India, Home Department (C. L.).
Forwarded to the
(By Order)

Superintendent

స్త్రీ పురుష భిన్న ప్రవృత్తులు
గరిమెళ్ళ సత్యనారాయణ

స్త్రీ పురుషులకు గల సంబంధాలు ఎట్లుండాలి? వారు ఎవరి మానాన వారు సర్వ స్వతంత్ర వ్యక్తులా లేక ఒకరిపై ఒకరు ఆధారపడి జీవించవలసిన వారా? ఇద్దరికీ నేర్పే విద్యావిధానము సరిగా ఒకే రీతిదై ఉండాలా లేక యెవరి వ్యక్తిత్వమునకు తగినట్లు వారిది వేరు వేరై ఉండాలా అనే సమస్య మీదనే ఏ దేశపు విద్యావిధానమైనా ఆధారపడి ఉంటుంది.

ఇంగ్లీషు భాషలో 'పెర్సన్' అనే శబ్దం స్త్రీకి పురుషునికి కూడా చెందుతుంది. సంస్కృతంలో పురుష శబ్దం కూడా స్త్రీకి పురుషునికి కూడా చెందుతుంది. కనుక ఉభయులకు ఎన్ని భేదాలున్నా వారు ఒకే ఆధారం నుంచి జనించిన వారనీ, ఒకే ఆధారం నుంచి జనించినా రెండు రకాలుగా చీలియున్నారు కనుక వారివారి బాధ్యతలు, చేయవలసిన కార్యాలు రెండు రకాలుగా ఉంటాయనీ, రెండు రకాలుగా ఉంటున్నా ఒకే విశ్వశ్రేయో సంకల్పంలోనో మోక్షప్రాప్తిలోనో రెండూ లీనమవుతూ ఉంటాయనీ పురుష శబ్ద లేక పెర్సన్ శబ్ద భావము.

రెండు దృక్పథాలు

వారుభయులూ ఒకే ఆధారం నుంచి ఎంత జనించినా, ఒకే విశ్వశ్రేయస్సు లేక మోక్షప్రాప్తి కొరకు యెంత పాటుపడవలసిన వారైనా, ఎవరి లక్షణ ప్రకారం వారు వర్ధిల్లి ఉభయులూ సహకారం చేసుకోవాలనే ఈశ్వర సంకల్పం కానీ, ఒకే ఆధారజనితులైనంత మాత్రాన సర్వవిధాలా ఒకరితో ఒకరు సమానులు కారు కనుక ఇద్దరికీ ఒకే మోస్తరు శిక్షణ కాకుండా రెండురకాల శిక్షణలిచ్చి ఎవరి కనుగుణ్యమైన రీతిగా వారిని పెంచి విశ్వకల్యాణానికి ఉభయులూ ఆవిధంగా సహాయకారులు కావాలని ఒక విధాన వర్గం వారి వాదన.

ఇద్దరూ ఒకే రీతి పనులు చేసి వేరువేరుగా సంపూర్ణ పరిణామము నందగలరు. అదే ప్రపంచ జీవనము యొక్క ప్రధాన లక్షణమై ఉండాలి. అట్లు ఉండలేకపోవడమల్లా అన్యాయం. ఏదో ఒక వర్గం అందులో మగ వర్గం ఆడవర్గాన్ని బానిసత్వంలోకి యీడ్వడానికి యెత్తు. ఆ యెత్తు వల్లనే ప్రపంచంలో ముఖ్యంగా ప్రాచ్య దేశాలలో స్త్రీలు గృహములకు దాసీలై, పురుషులకు కేవల కామసంతృప్తికర సామగ్రులై అధోగతిలో పడ్డారు. దీనిని తప్పించడానికి పాశ్చాత్యులవలంబించిన సర్వస్వతంత్ర ప్రాథమిక హక్కుల విధానం తప్ప వేరు గతి లేదు. విద్యావిధానమునట్లు సరిదిద్దాలి అనేది రెండవ వర్గం వారి వాదన.

అలవాటు బలము

ఇంక శక్తుల విషయంలోనూ కొందరు మగవాళ్ళు ఆడవాళ్ళ కంటే బాగా వండగలరు. ఆడవాళ్ళు ఆప్తసంతి వారైతే మగవాళ్ళే పిల్లలను జాగ్రత్తగా పెంచి మంచి శిక్షణమునిచ్చుకుంటున్నారు. కొందరు మగవాళ్ళు ఇంటిని నీటుగా ఉంచినట్లు ఆడవాళ్ళు ఉంచనే లేకున్నారు. కొందరు ఆడవాళ్ళు రణరంగంలో వైరులను జయించినట్లు పురుషులు పోరాడ లేకపోయారు. ఆడవాళ్ళు పురుషుల కంటే బాగా టైపులు కొడుతున్నారు. గవర్నరు పనులు చేస్తున్నారు. విదేశీ రాయబారాలు నడుపుతున్నారు. ఫ్యాక్టరీలలో పురుషుల కంటే వేగంగా పనిచేసి చూపుతున్నారు. శక్తిసామర్థ్యాలు అలవాటుమీద ఆధారపడి ఉంటవి. ఏ యింటి చిలుకకు ఆ యింటి పలుకన్నట్లు ఎవరి పరిసరముల కనువగునట్లు, అలవాటుల కనువగునట్లు ఆ పనులు జరుగుతూ ఉంటాయి.

ఒక సాలెవాడు నూరు చీరలు నేయగలడు కాని బస్తా ధాన్యం మోయలేడు. ఒక రాణివాసపు స్త్రీ నూరు పూలమాలలు గుచ్చగలదేమో గాని మూడు పిడకలు చరచలేదు. ఒక కాలేజీ గరల్ నూరు మార్కులు తెచ్చుకోగలదు. కాని పట్టెడు మెతుకులు వార్చలేదు. ఒక యిల్లాలు నూరు బిందెలు కొళాయి నీళ్ళను వేరు గృహస్తులకు అందించగలదు కాని ఒక అక్షరం చదవలేదు. ఎవరికే శిక్షణ ఉంటే అందులోనే వారు రాణిస్తారు కాని, రెండోదానిలో వారు కాసుకు చెల్లరు. ఇది శిక్షణ అలవాటుల తారతమ్యం కాని సామర్థ్య తారతమ్యం కాదు.

కావలసిన లక్ష్యం

మనమాలోచించ వలసినదల్లా అందరికీ అన్ని సామర్థ్యాలు కూర్చగలమా, కూర్చజాలమా అని కాదు. ఎటువంటి సామర్థ్యాలను ఎవరికి కూర్చితే ఉభయ తారకంగా ఉండి లోకకళ్యాణ సాధకమవుతుందన్నదే నేటి ప్రశ్న. విద్యావిధాన వేత్తలు ఈ దృష్టితోనే తాము నేర్పే శిక్షణలను ఆలోచించాలి.

సమాన గౌరవం

మన దేశానికి ఇప్పుడు పట్టిన మహారిష్టమల్లా కొన్ని పనులు తక్కువనీ, కొన్ని పనులు గొప్పవి అని భావించుకోవడం. సంఘాభివృద్ధికి అన్ని పనుల వల్లను అవసరమున్నది. ఏ రకం పని తక్కువైతే ఆ లోటు కనిపించుతూనే ఉంటుంది. అటువంటప్పుడు కొన్ని రకాల పనులు గొప్పవని గౌరవించడం, మరికొన్ని నీచమని నిరసించడం శుద్ధ అవివేకము. కొన్నిరకాల పనులను గౌరవించడం వల్ల ఆ వృత్తుల వారందరూ ఆ పనులను విసర్జించి కలము పట్టుకుని గుమాస్తా పనిచేయడం, పాగా పెట్టుకొని కలెక్టరు పనిచేయడం, లాంగుకోటు తొడిగి లాయరు పనిచేయడం ప్లాటుఫారాలెక్కి లెక్చర్లు అరవడం మాత్రమే గొప్పవని భావించి ఆయా వృత్తులలోకి దిగబడుతున్నారు.

ఆదాయాల తేడా

ఇంకో మహారిష్టమేమిటంటే కొన్ని వృత్తులు పెద్ద ఆదాయములను కూర్చేవి. కొన్ని వృత్తులు చాలీచాలని ఆదాయం కూర్చేవి కావడం. నేడు ఎవరికీ రిక్షా లాగాలని కాని, బట్ట నెయ్యాలని కానీ, పొలము దున్నాలని కానీ – ఆఖరుకు ఆడవాళ్ళకు ఇంట్లో వండాలని కానీ, సంపూర్ణమైన అభిలాష లేదు. ఎందువల్ల? ఆ వృత్తుల వల్ల కాయకష్టం ఎక్కువ, కడుపు గడవడం తక్కువ. రెండు క్లాసులు ప్యాసయి నలుగురు పెద్దల నాశ్రయించి ఒక గుమాస్తా ఉద్యోగమో, టైపిస్టు ఉద్యోగమో సంపాదిస్తే కష్టం తక్కువగుటయే కాక డబ్బు ఎక్కువ చేతిలో పడుతుందని ఆశ. ప్రజలందరూ డబ్బు వచ్చే వృత్తులకు ఎగబడుతున్నారు. డబ్బులేని వృత్తులను గతిలేక చేస్తున్నారు.

ఒక వృత్తికి ఎక్కువ ఆదాయం రావడం ఒక వృత్తికి తక్కువ ఆదాయం రావడం కంటే లోకంలో ఎక్కువ అన్యాయం లేదు. అందులోను కొన్ని వృత్తులవారు నలిగి

చచ్చి దారిద్ర్యంలో కుళ్ళుతూ ఉండడం, కొన్ని వృత్తులవారు మహాసౌధాలలో అంగరంగ వైభోగాలలో యీదగలిగే ఆదాయాలను దోచుతూ ఉండడం మరీ అన్యాయం. అట్టి పద్ధతిని లోకం ఖండించక పోవడమే కాక ప్రభుత్వాలు కూడా శ్రీమంతుల అడుగులకు మడుగులొత్తుతూ ఉండటం, పేదల అభ్యుదయ కార్యాలను వెనుకకునెట్టుతూ ఉండటం రివాజు అయిపోయింది. ఈ విధానం వల్ల లాభాలు వచ్చే వృత్తుల కోసం పోటీలు, టక్కరులు పైకెక్కి సామాన్యులు త్రొక్కబడటం, అత్యంత శ్రీమంతులు కొంచెం మంది, ఆగర్భ శ్రీమంతులు కొంచెం మంది, ఆగర్భ దరిద్రులు కోట్లమంది కావడం తటస్థించక తప్పదు. అదే నేటి ప్రపంచంలో తటస్థించింది.

రష్యా ఉదాహరణలు

ఈ ఆట సాగినన్నాళ్ళు సాగుతుంది. ఒకానొక రోజున దరిద్ర ప్రజలందరూ ప్రాణాలకు తెగించి శ్రీమంతులను రష్యాలో వలె నరుకవచ్చును. అట్లు స్త్రీలను పెంచుకొనుటకు ఆదరములైన విద్యలను నేర్పిన, నేర్పెడి పండితులను శిరచ్ఛేదము చేయవచ్చును. అసలే దరిద్రం, అందులో అజ్ఞానం మిళితమైతే కమ్యూనిజమొక్కటే శరణ్యమవుతుంది. కనుక యేది లాభమైతే దానికి పరిగెత్తే పారిశ్రామికులు, దానిని నేర్పే, నెరవేర్చే విద్వత్పుంగవులు విద్యావేత్తలందరూ కమ్యూనిజము నేర్పే పాఠాలను గూర్చి హెచ్చరిక తీసుకోవాలి. శిక్షలు, హత్యల వల్ల కమ్యూనిస్టు భూతం మరింత భీకరమవుతుంది. కాని దాని ఉధృతి చల్లారదు. కనుక యే విద్యావిధానమునకు లాభం కాని నేటి దృక్పథం ప్రకారంగా గౌరవం వృత్తులను నేర్పి దోహదం చేయడం ఒక సల్లక్షణం కాదని గ్రహించాలి.

చదువుల పోటీకి కారణాలు

నేటి విద్యా విధానమిట్టి దుర్లక్షణయుతమై ఉన్నది కనుకనే ప్రతీ హైస్కూలులోను, కాలేజీలోను ఇంజనీరింగు, మెడికల్ మొదలగు కాలేజీలలో లెక్కకు మించిన విద్యార్థులు, విద్యార్థినులు చేరుచున్నారు. ఒక్కొక్క కాలేజీని ఒక్కొక్క పట్టణమంత పెద్దదిగా పెంచినా వచ్చే విద్యార్థుల కందరికీ చోటు చాలకున్నది. ఎక్కడలేని సొమ్ము, విద్యార్థుల జీతాల క్రింద దండుగవుచున్నది. నూటికి 30 మంది ప్యాసయితే 70 మంది ఫెయిలవుతున్నారు.

ఎవరు ప్యాసయితే ఎవరికి కావాలి, ఫేలయితే ఎవరికి కావాలి. వారివల్ల వచ్చే ఆదాయం వీసం తగ్గదు. పైగా ప్రభుత్వాలు వాటికి లక్షలకొద్దీ విరాళాలిస్తారు. ఈ డబ్బంతటినీ టీచర్లు, ప్రొఫెసర్లు, డి.ఇ.ఓ.లు, డి.పి.ఐ.లు అనుభవిస్తూ ఉంటారు. పదిమంది ప్రొఫెసర్లు బతకడం, మరో పదిమంది ప్రొఫెసర్ల గుమాస్తాలు కాగలగడం తప్ప నేటి విద్యావిధానం వల్ల వేరెట్టి ప్రయోజనము లేదు.

చదువులు సంత సరుకైనవి

సంతలో సరుకులు అమ్ముతారు, కొంటారు. స్కూళ్ళలో చదువులమ్ముతారు, కొంటారు. రెండింటిలోనూ లాభసాటి భేదం దృష్టి తప్ప అంతకతీతమైన విజ్ఞానదృష్టి ఏమీ లేదు. అందువల్ల ఈ చదువును చదువులనడానికే వీలు లేదు. పెద్దలు వానిని చదువులని అంటున్నారు కనుక యెద్దులు కూడా వానిని మేస్తున్నవి. అవి వంటికి పట్టి అదృష్టమున్న యెద్దులు ధనవంతములై బలియుచున్నవి. ఆ చదువులు అరగని యెద్దులు ఉన్న పిసరు పిప్పి కూడా ఊడి బక్క చిక్కి యీసురోమని యీడ్చుకొనుచున్నవి. అది తప్ప ఈ దేశంలో వేరే చదువు లేదు కనుక నిరక్షరాస్యతా వాసనం, డొక్కశుద్ధి కోసమైనా దానిని ప్రతీ వ్యక్తి చదువక తీరకున్నది.

పరస్పర ఈర్ష్యలు

ఈ చదువుల కోసం ఈ ఉద్యోగాల కోసం ఇప్పుడీ దేశంలో ఆడవాళ్ళకు మగవాళ్ళకు మధ్య పోటీలు. మగవాళ్ళు తమను మించిపోతున్నారని ఆడవాళ్ళ ఏడుపు. ఆడవాళ్ళతో తులతూగ లేకపోతున్నామే అని మగవాళ్ళ దుఃఖం. ఈ చదువుల విధానాలలో చర్చలు. ఆడవాళ్ళకు మగవాళ్ళకు వేరే స్కూళ్ళుండాలా, లేక ఇద్దరికీ ఒక దొడ్లోనే చదువు చెప్పాలా? అని, ఇద్దరికీ ఒక్కలాంటి చదువే చెప్పాలా వేరే విషయాలు నేర్పవలెనా? అని. పెళ్ళాడటం కోసం చదువు వదిలిపెట్టాలా? యెక్కువ నేర్వాలా, లేక చదువు కోసం ఉద్యోగం కోసం పెళ్ళి మానుకోవాలా? అని, యౌవనంలో యదేచ్ఛగా తిరిగి వయసు మళ్ళిన తరువాత పెళ్ళాడాలా లేక ముందుగానే పెళ్ళాడి ఉద్యోగాలకు భంగం కలిగించుకోవాలా? అని.

డబ్బు, కామం, దర్జా, విలాసం

మహామహా దేవతలకైనా ఇటువంటి బ్రహ్మ సందేహాలు కలుగలేదు. ఈ చర్చలన్నీ జ్ఞానానికి సంబంధించిన వనుకోవడం వెర్రి. డబ్బు, కామం, దర్జా, కీర్తి వీటికోసమే

ఈ తాపత్రయమంతా. ఈ తుచ్ఛవాంఛా తృప్తి కోసం బి.యే.లు, ఎం.యే.లు అని డిగ్రీలు. టీచర్లు, ప్రొఫెసర్లు అని బిరుదులు. లాయర్లు, కలెక్టర్లు అని ఉద్యోగాలు. మగవాళ్ళు ఆడవాళ్ళు అని ఈర్ష్యలు. బ్రాహ్మణులు అబ్రాహ్మణులు అని భేదాలు. లోకసేవకులు పొట్టసేవకులు అని కీర్తులు.

పాఠశాలలా? వృత్తిశాలలా?

ఈ కీర్తి కోసం, విలాసం కోసం, డబ్బు కోసం, ఈర్ష్యల కోసం కాకుంటే ఈ కాలేజీలలోకి విద్యాలయాలలోకి అడుగు పెట్టవలసిన అవసరం ఏమైనా ఉందా? వీటికోసం తాపత్రయపడి కొట్లాడుకోవటానికి ఉపయోగించే సంస్థలను పాఠశాలలని ఎలా పిలవాలి?

మంగలి పదిమందికి క్షవరం చేయడం నేర్పుతాడు. దానిని మంగలి స్కూలు అనడు. చాకలివాడు బట్టలుతకడం తాను ఇరుగుపొరుగు వారికి నేర్పుతాడు. దానికి చాకలి స్కూలు అనడు. అట్టే కుమ్మరి స్కూళ్ళు, కమ్మరి స్కూళ్ళు, వడ్రంగి స్కూళ్ళు లేవు. ఆ సంస్థల్లో వాటికి పాఠశాల నామధేయాలు లేవు.

ప్రతి వ్యక్తికి ఏదో ఒక వృత్తి ఉండాలి. ప్రతివ్యక్తి తనకిష్టమైన వృత్తి నేర్చుకుంటున్నాడు. దానినిప్పుడు వృత్తివిద్య అని గాంధీ గారన్నారు. కనుక ఆ పేరు వాడడంలో దోషం లేదు.

కానీ విద్య యొక్క ముఖ్యమైన ఆశయం వృత్తులు నేర్పడం. కానీ, మానవతత్వం, శాస్త్రతత్వం, సాహిత్యతత్వం, సంఘతత్వం యెవరెవరికి యే విధంగా యెక్కిస్తే బాగుంటుందో ఆ మోస్తరుగా యెక్కించడమే అని మరువరాదు. అందుకు నోటిమాటల కంటే అక్షరజ్ఞానం, అంకెలజ్ఞానం యెక్కువగా ఉపకరిస్తవి కనుక వానిని నేర్పుతారు. నేర్చుకోవాలి.

చదువు వృత్తియైతే పాఠశాల కార్ఖానా

కాని ఈ అంకెలు, అక్షరాలు, బొమ్మలు గీయడాలు, పటములు వ్రాయడాలు, చదవడం వ్రాయడమును కూడా ఒక పెద్ద వృత్తిగా చేస్తే పాఠశాలలు చదువుల కార్ఖానాలవుతాయి కాని, పాఠశాలలను నామధేయమునకు అనర్థములగును. ఏ పని చేసినా ఎంతో కొంత జ్ఞానం కలుగుతుంది. అలాగే ఈ కార్ఖానాలలో కలిగినా

ఏదో జ్ఞానం దారితప్పి కలుగుతుంది. కానీ, అంతమాత్రాన వానిని జ్ఞాన పాఠశాలలు అనరాదు. అదీ ఒక వృత్తి అయినది కనుక, మహా అయితే దానిని గాంధీ మహాత్ముడు నిర్ణయించిన 'వృత్తివిద్యా కళాశాల'లనాలి.

కో-ఎడ్యుకేషన్ లక్ష్యం

వృత్తి కోసం నేటి చదువులన్నిన్ని. దీనికి సాయం స్త్రీ పురుష సమానత్వం ఒకటి క్రొత్తగా ఏర్పడ్డది కనుక, రెండు వర్గాల వారికి వేర్వేరు వృత్తులుండడం పరువు తక్కువగా కనిపించుచున్నది కనుక, ఒకే వృత్తి అయితే లాభాలు సరిగానో లేదా పోటీశక్తిని బట్టి ఒకరికంటే ఒకరు ఎక్కువగానో పంచుకోవచ్చు కనుక, ఈ వృత్తి కోసం, ఈ సమానత్వం కోసం, ఈ పోటీ కోసం ఒకరితో ఒకరు భుజాలు కలుపుకుంటూ, పెళ్ళిళ్ళు మానుతూ, పై అధికార్లను ఇచ్చకాలాడి ఉద్యోగాలు సంపాదించుకుంటూ, క్రిందివారి మీద తాషక్కు చేసి గర్విస్తూ, చేజిక్కిన సొమ్మును నవనాగరికతా వికాసములలో విరజిల్లుతూ, సంసార బాధ్యతలు లేకుండా వుడ్లాండ్స్ లోనో, మోడర్న్, మైసూర్ మొదలగు కేఫ్ లలోనో దినాలు వెళ్ళబుచ్చుతూ పదవులలో తేలడం కోసమేనా ఈ చదువులు!

ఈ రకాలవారికి నిజంగా వేర్వేరు పాఠశాలల కంటే స్త్రీ పురుషులు కులాసాగా విహరించగల కో-ఎడ్యుకేషన్ పాఠశాలలే నయం. ఉభయులకూ, వేర్వేరు రకాల పాఠాలు, వృత్తులు కంటే ఒకే మోస్తరు ఎఫ్ఫే, యెమ్మే చదువులు, ఒకే ఆఫీసులో ఉద్యోగాలు, ఒకే స్కేలు జీతాలు ఉంటేనే నయం.

వీరందరూ సంఘానికి వన్నెల విసనకర్రల వంటివారు. వివేకులైన వారెవరూ వీరి బోధలు విని ఆచరణలోనికి ఉరకరు. అట్లు ఉరికినందువల్ల లాభం కలుగుతుందని నమ్మినవాళ్ళు ఉరకక మానరు. సంసార కుటుంబ స్త్రీ పురుషులకు ఇంతలేసి పెద్ద వేషాలు వేయగల శక్తిలేక లాభమో నష్టమో లోకయాత్రలో కొట్టుకుంటూ ఉంటారు. కనుక వీరి బోధనలు విని "బాగుపడరు", వినక పాడూ కారు. అయినా వీరీ విజ్ఞానతత్వము నీవిధంగా ప్రబోధిస్తూనే ఉంటారు. వినవలసిన వారెవరో వింటూనే ఉంటారు.

ప్రపంచమొక పెద్ద వృత్తుల ఫ్యాక్టరీ

చిట్టచివరి మాట. ఈ వ్యాసాన్ని బట్టి వృత్తులను నిరసిస్తున్నానని అనుకోరాదు. మానవ జీవనంలో జీవనోపాధి సాధనా ప్రయోజనం కూడా ఒక ముఖ్య లక్ష్యమే. జీవమంటూ నిలుస్తేనే జ్ఞానాన్ని నేర్చుకోగల అవకాశం చిక్కుతుంది. వృద్ధి అవుతుంది. వృత్తులు నేడు మునుపెన్నటి కంటే క్లిష్టతరములైనవి. సాంకేతిక యంత్ర పరిజ్ఞానం లేకుంటే ఏ వృత్తి కానీ పూర్వపు పంథా ప్రకారం చేస్తే రాణించదు. ప్రపంచం నేడు పెద్ద కళాశాల అయిందనడం కంటే పెద్ద వృత్తుల ఫ్యాక్టరీ అయిందనడం న్యాయం. అందుకోసం వృత్తి విద్యాలయాలే అనండి, వృత్తి కళాశాలలే అనండి కొన్ని కార్ఖానాలు స్థాపించడం చాలా అవసరమయింది. ఆ కార్ఖానాల్లో తర్ఫీదయిన వారు పనులను చులకనగా సుళువుగా విలాసంగా వేగంగా చేసుకుంటున్నారు. లేనివాళ్ళు వెనుకపడుతున్నారు.

ఇల్లు ఊడవడం, పొయ్యి ఊదడం, అన్నం వండడం, బట్టలు కుట్టడం మొదలు మోటరు నడపడం విమానం చెయ్యడం, రోడ్డు వెయ్యడం, పొలం దున్నడం, బట్ట నెయ్యడం, గుమస్తాపని, మంత్రి పని చెయ్యడం దాకా అన్ని వృత్తులకూ తర్ఫీదు కావాల్సి వస్తున్నది. చివరకు పిల్లల్ని కనడం, పెంచడం, ఆరోగ్యం కాపాడడానికి కూడా శిక్షణ అవసరమగుచున్నది. కర్షకునికిస్తే ప్రయోజనం లేదు. ఎవరి కనుకూలమైన ఫాక్టరీలలో వారిని చేర్చితే ప్రయోజనముంటుంది. అన్ని వృత్తులు సమాన దర్జాగలవే అని మనం ఊహించాలి. ఒక వృత్తికి వేలకొలది లాభం, ఒక వృత్తికి పొట్ట గడవక పోవడం సలక్షణం కాదు. దానిని తొలగించాలి.

స్త్రీలకు తగిన వాతావరణం

అప్పుడు దర్జాగిర్జా కోసం, లాభంనష్టం దృష్టితోనూ గాక, యెవరికే తర్ఫీదు ముఖ్యంగా అవసరమో వారా వృత్తిని నేర్చుకొని చక్కగా చేస్తారు. ఆడవాళ్ళు సహజంగా కొన్ని సుకుమార వృత్తులకు తగినవారు. లాభం, దర్జా అను మిషతో వారు నేడు తమకు నైజమైన వృత్తులను మాని ఇతర వృత్తుల్లో పడి నలిగి శుష్కించిపోతున్నారు. పెడదారులు పడుతున్నారు. పురుషులు కూడా ఇంకోవిధంగా చెడుదారిలో పడుతున్నారు. పరిశుద్ధ విజ్ఞానంకాక, లాభం, దర్జా నేటి విద్యా లక్షణాలయినందువల్ల ఈ ఉపద్రవం సంభవిస్తున్నది.

స్త్రీలకు గృహ నిర్వహణ విద్యలతో పాటు ఇంతో అంతో సంగీతం, నృత్యం, కోలాటం మొదలగు కళలు విలాస కారణములై, జీవనానందానుభవ కారణములై ఉంటవి. పురుషులొకరో ఇద్దరో అందులో ప్రవీణులుందురుగాక, పురుషజాతి అంతటినీ ఆ విలాస విద్యలలో తేల్చేస్తే అసలు వృత్తుల్లో ప్రపంచ గమనమే వెనుకపడుతుంది. సాధ్యమైనంతవరకు పురుష వృత్తులన్నీ గృహమును వీడి బయట చేయాల్సినవై ఉండాలి. ఇద్దరినీ కలిపి ఒకే మోస్తరు శిక్షణనిస్తామంటే ఎవరికీ ఎందువల్లా ప్రయోజనం ఉండదు. పైగా నీతినిబంధనలు సంసార లక్షణాలు సన్నగిల్లి పోవును.

(అంకుశం 21-5-1949)

* * *

ప్రవృత్తుల పరిశీలన - గరిమెళ్ళ దృష్టి

బి. కృష్ణకుమారి

(గరిమెళ్ళ సత్యనారాయణ రచించిన " స్త్రీ పురుష భిన్న ప్రవృత్తులు " అనే ఈ వ్యాసం 21-05-1949 న పబ్లిష్ అయ్యింది. ఇది అప్పటి విద్యావిధానాన్ని చర్చించిన వ్యాసం.)

'స్త్రీ పురుషులకు గల సంబంధాలు ఎట్లుండాలి? వారు ఎవరి మానాన వారు సర్వస్వతంత్ర వ్యక్తులా లేక ఒకరిపై ఒకరు ఆధారపడి జీవించవలసిన వారా? ఇద్దరికీ నేర్పే విద్యావిధానం ఒకే రీతిది అయి ఉండాలా లేక ఎవరి వ్యక్తిత్వమునకు తగినట్లు వారిది వేరు వేరై ఉండాలా? ...' అంటూ మొదలవుతుంది.

ఈ వ్యాసం 1949 లో వచ్చింది. అది రాజ్యాంగ రచన, హిందూకోడ్ బిల్ మొదలయినవి తయారవుతున్న సందర్భం. ఆ హిందూకోడ్ ద్వారా స్త్రీలకి, భిన్న సామాజిక వర్గాలకి చెందాల్సిన హక్కుల గురించి, భారతదేశంలోని వివిధ రాష్ట్రాలలో అప్పటికే అమలు అవుతున్న హక్కుల గురించి, వాటి క్రోడీకరణ గురించి సుదీర్ఘమైన చర్చలు మొదలైన సందర్భం. ఇవన్నీ అప్పటి తెలుగు, ఇంగ్లీష్ వార్తా పత్రికలలో వచ్చే ఉంటాయి. ఆ చర్చలలో రాజమండ్రికి చెందిన దుర్గాబాయి దేశముఖ్‌తో సహా మహిళా సభ్యురాళ్ళు ఉన్న సందర్భం. కష్టాల్లో ఉన్న స్త్రీలు చదువుకుని, తమను తాము పోషించుకోవటానికి అవసరమైన శిక్షణను అందిస్తూ ఆంధ్ర మహిళాసభ (మద్రాస్) సంఘసేవ చేస్తున్న సందర్భం. సరోజినీ నాయుడు, పద్మజానాయుడు గవర్నర్లుగా ఉన్నారని, విజయలక్ష్మీ పండిట్ భారత రాయబారిగా పని చేశారని చదివిన గుర్తు ఉంది. అప్పటికే మద్రాస్ సెక్రటేరియట్‌లో మహిళలు టైపిస్ట్

ఉద్యోగాల నుంచి ఆఫీసర్ల దాకా వివిధ స్థాయిల్లో ఉన్నారని (కొడవటిగంటి కుటుంబరావు సాహిత్యం, ఈ మధ్యనే ఓల్గా రాసిన 'గమనమే గమ్యం'లో విశాలాక్షి) చదివిన గుర్తుంది. అంతవరకు నాటకరంగంలోను, ఎవరో ఒకరి అండదండలతో సంగీత, నాట్య కళలని నమ్ముకుని బతుకుతున్న కళాకారిణులు సినిమా రంగంలోకి వచ్చి పేరు ప్రఖ్యాతులు గడిస్తున్న సందర్భం. రకరకాల సామాజిక వర్గాలనుంచి వచ్చిన యువకులు విద్య, హోదా ఇచ్చే గౌరవాన్ని గుర్తించి ఎదగటానికి ప్రయత్నించిన సందర్భం. (కత్తి చంద్రయ్య మొదలైనవారు)

ఈ వ్యాసం మొదలు కావటం 'పెర్సన్' (ఇంగ్లీష్), 'పురుష' (సంస్కృతం) పదాల అర్థాలతో మొదలు అయినా, ఢిల్లీ సభలో జరిగిన చర్చల్లో ప్రాతినిధ్యం వహించిన 'సనాతన వాద / సాంప్రదాయ వాద' దృక్పథాన్ని, 'సనాతన / సాంప్రదాయ భావాల్ని విదేశీ విద్యల, అనుభవాల వెలుగులో సంస్కరించుకుని సమన్యాయం వైపు నడవాల'నే ఇంకో దృక్పథాన్ని 'రెండు దృక్పథాలు' పేరుతో యించుమించుగా నిర్వచిస్తూ మొదలవుతుంది.

ఈ వ్యాసం విద్యావిధానం గురించి రాసినా, పైన చెప్పిన సామాజిక సందర్భాన్ని దాటిపోదు.

ఆ తర్వాత పేరా 'అలవాటు బలము' చదవగానే నాకు కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే గుర్తు వచ్చారు. ఆవిడ ఒక మీటింగులో (1995–98 మధ్యలో) ఎవరో అడిగిన ప్రశ్నకి సమాధానం చెపుతూ పునరుత్పత్తి విషయంలో తప్ప మిగిలిన సామర్థ్యాలలో స్త్రీ పురుషులు సమానులేనని, పురుషులకు స్త్రీలకు కూడా వారికి ఇచ్చిన శిక్షణ, అలవాట్లను బట్టే నైపుణ్యాలు అలవడతాయని అన్నారు.

అలవాటు బలము పేరాలో గరిమెళ్ళ 'ఒక సాలెవాడు నూరు చీరలు నేయగలడు కానీ, బస్తా ధాన్యం మోయలేడు. ఒక రాణివాసపు స్త్రీ నూరు పూలమాలలు గుచ్చగలదేమో గాని, మూడు పిడకలు చరచలేదు. ... ఇది శిక్షణ, అలవాటు తారతమ్యం కానీ, సామర్థ్య తారతమ్యం కాదు' అంటారు. 1949 లోనే రాసిన ఈ మాటలు ఎంత బాగున్నాయి.

కాని, 'సమాన గౌరవం' దాకా వచ్చేసరికి ఇంత క్లారిటీ ఉండదు. 'మన దేశానికి ఇపుడు పట్టిన మహారిష్టమల్లా కొన్ని పనులు తక్కువనీ కొన్ని పనులు గొప్పవి

అనీ భావించుకోవడం ... ఆ వృత్తుల వారందరూ (నీచంగా చూడబడిన వృత్తుల వారందరూ, స్త్రీలూ అని గరిమెళ్ళ అభిప్రాయం అనుకుంట.) ఆ పనులను విసర్జించి కలము పట్టుకుని గుమాస్తా పని చెయ్యడం, పాగా పెట్టుకొని కలెక్టర్ పని చేయడం, లాంగు కోటు తొడిగి లాయర్ పని చేయడం, ప్లాటుఫారాలెక్కి లెక్చర్లు అరవడం మాత్రమే గొప్పవని భావించి ఆయా వృత్తులలోకి దిగబడుతున్నారు.' అంటారు. 'ఆదాయాల తేడా' వల్ల కూడా వృత్తుల గౌరవాగౌరవాల్లో (గౌరవ, అగౌరవాలలో) తేడా వస్తోందని సరిగానే గుర్తించారు.

ఆ రోజుల్లో వచ్చిన సంస్కరణ ఉద్యమాల వల్ల, అస్తిత్వ భావాల వల్ల (ఉద్యమాలు అనచ్చో లేదో నాకు తెలీదు.) సమాజంలో కొన్ని మార్పులు వచ్చాయి. స్త్రీలూ, వెనకబడిన సామాజిక వర్గాలవారు చదువుల్లోకి రావాలనుకోవటం అందులో ఒకటి. పట్టణీకరణలో భాగంగా కొన్ని వృత్తులు సెలూన్లుగా, లాండ్రీలుగా మారటం, అవసరం అయినవాళ్ళు ఆ వృత్తుల వారి దగ్గరకే వెళ్ళాల్సి రావటం రెండోది. ఈ మార్పుని ఆయన గమనించలేదేమో అని, గమనించినా అంగీకరించటానికి ఇష్టపడలేదేమో అని ఆ భాషనిబట్టి అనిపిస్తుంది.

విఫలప్రయోగం అని తెలిసీ, స్వాతంత్రోద్యమ సమయంలో (1920-30 ల మధ్య అనుకుంటా) నడిపిన 'జాతీయ కళాశాల'ల కాన్సెప్ట్ ప్రభావం నుంచి ఆయన బయటపడలేదేమో అనిపిస్తుంది. అందుకే భారతప్రభుత్వం ప్రోత్సహించిన ఇంజనీరింగ్ కాలేజీలను, మెడికల్ కాలేజీలను ఆయన వ్యతిరేకించారు అని అనిపిస్తుంది. 'ఈ చదువులను చదువులు అనడానికే వీలు లేదు. పెద్దలు వానిని చదువులని అంటున్నారు కనుక ఎద్దులు కూడా మేస్తున్నాయి' అంటారు.

పోనీ, 1920-30 ల మధ్య వచ్చిన విదేశీ విద్య బహిష్కరణ, విదేశీ వస్త్ర బహిష్కరణ, జాతీయ కళాశాలల కాన్సెప్ట్ వల్ల గరిమెళ్ళ సత్యనారాయణ ఏమయినా సుఖపడ్డారా! అంటే అదేమీ లేదు. 'మాకొద్దీ తెల్లదొరతనము...' పాట రాసినందుకు జైలుశిక్ష అనుభవించి వచ్చాక, ఇంటికి పెద్దకొడుకుగా తమ్ముళ్ళను ఆంగ్లవిద్య మాన్పించారు. చెల్లెళ్ళను ఆంగ్లవిద్య చదవనివారికి ఇచ్చి పెళ్ళిళ్ళు చేశారు. ఈ పనుల వల్ల ఆర్థికంగా అందరూ చాలా కష్టాలు పడ్డారు. ఆ తర్వాత చాలామంది పునరాలోచించి తమ అభిప్రాయాలను మార్చుకున్నారు. గరిమెళ్ళ సత్యనారాయణ మాత్రం తన అభిప్రాయాలను మార్చుకోలేదు అనిపిస్తోంది. అలా మారిన వాళ్ళలో

ఆయన చెల్లెలి భర్త ఒకరు. గరిమెళ్ళ మేనల్లుళ్ళు (చెల్లెలి పిల్లలు) ఎర్రగుంట్ల వెంకట కృష్ణారావు, ఎర్రగుంట్ల వెంకట రఘునాథరావు ఆంగ్లవిద్య నేర్చి హైదరాబాద్ లోని ఈ.సి.ఐ.ఎల్.లో ఉన్నత పదవులలో పదవీ విరమణ చేశారు. కృష్ణారావు గారు గరిమెళ్ళ అల్లుడు కూడా. గరిమెళ్ళ చనిపోయాక ఆయన ఆఖరి కూతురు ఇందిరని తమతో తీసుకు వెళ్ళి, పెళ్ళి బాధ్యత తీసుకుని పెళ్ళి చేశారు.

అలవాటు ప్రభావం, పరిసరాల ప్రభావం, శిక్షణల ప్రభావం గురించి మాట్లాడినప్పుడు గవర్నర్లుగా, రాయబారులుగా వివిధ రంగాల్లో రాణించిన స్త్రీల గురించి చక్కగా రాశారు.

కానీ, స్త్రీ పురుష వివక్ష గురించి, స్త్రీల విద్యని ప్రోత్సహించే క్రమంలో ఆడపిల్లలికి ప్రత్యేకమైన స్కూళ్ళు ఉండాలా! మగపిల్లలతో కలిసి చదివేలా ఉండాలా: పెళ్ళికి ప్రాధాన్యం ఇవ్వాలా! చదువుకి ప్రాధాన్యం ఇవ్వాలా: మొదలయిన విషయాల గురించి ఆ రోజుల్లో జరిగిన చర్చల్ని 'పరస్పర ఈర్ష్యలు'గా కొట్టి పారేశారు. ఈ చదువుల గురించి మాట్లాడే వాళ్ళంతా జ్ఞానాన్ని దృష్టిలో పెట్టుకుని మాట్లాడటం లేదని, 'డబ్బు, కామం, దర్జా, విలాసాల'ను దృష్టిలో పెట్టుకుని మాట్లాడుతున్నారని రాశారు.

ఇంకా, 'కో–ఎడ్యుకేషన్ లక్ష్యం' లో ఏమన్నారంటే, ... స్త్రీ పురుష సమానత్వం ఒకటి క్రొత్తగా ఏర్పడ్డది కనుక, రెండు వర్గాల వారికి వేర్వేరు వృత్తులుండటం పరువు తక్కువగా కనిపించుచున్నది కనుక ... ఈ సమానత్వం కోసం, ఈ పోటీ కోసం ఒకరితో ఒకరు భుజాలు కలుపుకుంటూ, పెళ్ళిళ్ళు మానుతూ ... కెఫేలలో దినాలు వెళ్ళబుచ్చుతూ ...' గరిమెళ్ళ ఎందుకు ఇంత వైవిధ్య, వైరుధ్యాలతో ఉన్నారు అనుకున్నప్పుడు దిగులేస్తుంది. అక్కడ ఆగినా బాగుండేది.

'వీరందరూ సంఘానికి వన్నెల విసనకర్రల వంటి వారు. వివేకులైన వారెవరు వీరి బోధలు విని ఆచరణ లోనికి ఉరకరు. అట్లు ఉరికినందువల్ల లాభం కలుగుతుందని నమ్మినవాళ్ళు ఉరకక మానరు. సంసార కుటుంబ స్త్రీ పురుషులకు ఇంతలేసి పెద్దవేషాలు వేయగల శక్తిలేక, లాభమో నష్టమో లోకయాత్రలో కొట్టుకుంటూ ఉంటారు. కనుక వీరి బోధనలు విని బాగుపడరు, వినక పాడూ కారు. అయినా వీరీ విజ్ఞానతత్వము నీవిధంగా ప్రబోధిస్తూనే ఉంటారు. వినవలసిన వారెవరో వింటూనే ఉంటారు.' ఏం చేస్తాం, మా ఖర్మ అన్నట్లుగా ఉంది అది.

స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత రాసిన వ్యాసం ఇది. అప్పటికి స్త్రీల అక్షరాస్యతా శాతం ఎంత ఉందో తెలుసుకునే సాంకేతిక పరిజ్ఞానం నాకిప్పుడు లేదు. కానీ, చాలా తక్కువ శాతం ఉందనే అనిపిస్తుంది. లేకపోతే స్త్రీవిద్య, ప్రోత్సాహాల గురించి సభలలోను, పత్రికలలోనూ అంత చర్చ జరగదు కదా! స్త్రీవిద్య, అక్షరాస్యతే ఆ స్థాయిలో ఉన్నపుడు 'స్త్రీ పురుష సమానత్వం' అన్న ఆలోచన ఎంత దూరంలో ఉందో ఊహించవచ్చు. అయితే గియితే స్త్రీవిద్య 'స్త్రీ పురుష సమానత్వం' వైపుగా అడుగు వెయ్యటానికి దోహదం చేస్తుంది అని ఎవరైనా అని ఉండవచ్చు. ఆ మాత్రానికే 'స్త్రీ పురుష సమానత్వం ఒకటి కొత్తగా ఏర్పడ్డది కనుక ...' అని కంటగింపుగా అనటం ఎంతవరకు సబబు. 'స్త్రీ పురుష సమానత్వం' అనే భావన ఉంటే గింటే బీజప్రాయంగా ఉందేమో. చదువుకున్న స్త్రీలు కాస్త నవ్వుతూ మాట్లాడినంత మాత్రాన 'వన్నెల విసనకర్రలు' అయిపోతారా!

జంధ్యాల పాపయ్య శాస్త్రి (కరుణశ్రీ) పుష్పవిలాపంలో 'బుద్ధదేవుని భూమిలో పుట్టి ... ఎంత దయలేనివారు ఈ ఆడువారు' అంటారు.

ఆడవాళ్ళకి చదువు ఏమైనా మంచిదారి చూపించగలదేమో అని ఆశపడ్డ, గురజాడ వెంకట అప్పారావు పుట్టిన ఉత్తరాంధ్రలో పుట్టి, గురజాడ మరణించినపుడు మంచి గేయం రాసిన గరిమెళ్ళ ఇలాంటి అభిప్రాయాలను ఎలా ఏర్పరుచుకున్నారా! అని బాధ వేస్తుంది.

చివరాఖరికి వచ్చేసరికి 'ప్రపంచమొక పెద్ద వృత్తుల ఫ్యాక్టరీ' అయిపోయిందని, అందుకని సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా శిక్షణ అవసరమే అంటారు. శిక్షణలేని వృత్తులు నైపుణ్యత లేక మంచి ఆదాయాన్ని అందించలేవని అంటారు.

అంటే, ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా, దేశంలోకి అనివార్యంగా వచ్చే సాంకేతిక విజ్ఞానాన్ని, అది జీవితాల్లో తీసుకువచ్చే మార్పులను గమనించారు. సాంకేతిక అభివృద్ధి వల్ల అసమానతలు పెరుగుతాయని, ఆర్థిక అసమానతలు పెరుగుతాయని ఆయనకి అర్థమయింది. కానీ, అసమానతలు లేని అభివృద్ధి కావాలంటారు. కానీ, ఆ అసమానత అనేది శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం తప్పు కాదని, ఆ జ్ఞానాన్ని పెంచుకునే ఉపయోగించే క్రమంలో అది మంచి ఫలితాలనిస్తుందనే ఆశించిఉంటారన్న విషయాన్ని, అర్థం చేసుకోవాలని చాలమందికి తెలియదేమో

అనిపిస్తుంది. దుర్వినియోగం ఉందని జ్ఞానాన్ని నియంత్రించకూడదు కదా! దుర్వినియోగాన్ని నియంత్రించే ప్రయత్నం చెయ్యాలి కానీ, విజ్ఞానాన్నే నియంత్రించటం కాదనటం మంచిది కాదేమో అనిపిస్తుంది.

ఆ అసమానతలు లేని అభివృద్ధి 'కమ్యూనిజం' ప్రభావం వల్ల జరుగకూడదు అంటారు. మద్రాసులో ఉన్న గరిమెళ్ళకి కమ్యూనిజానికి సంబంధించిన పుస్తకాలు, సాహిత్యం అందుబాటులో లేవని అనుకోలేము. సమసమాజాన్ని స్థాపించే దిశగా సాహిత్యాన్ని సృష్టించాలనుకున్న అభ్యుదయ రచయితల సంఘం, అభ్యుదయ రచయితలు (కొడవటిగంటి కుటుంబరావు, శ్రీశ్రీ తదితరులు) అప్పటికి మద్రాసులో ఉన్నారు. ఆ ప్రభావం ఎంతో కొంత ఆయన మీద ఉంది. కొన్ని విషయాల్లో క్లారిటీకి అది కూడా కారణం కావచ్చు. గాంధీని దేవుడిగా పూజించిన ఆయన భక్తి చాలాసార్లు ఆయనను క్లారిటీతో ముందుకు వెళ్ళనివ్వకుండా ఆయన్ని వెనక్కి లాగిందేమో అనిపిస్తోంది.

స్త్రీలకి సంబంధించిన విద్య, వృత్తులు ఇంటికి సంబంధించినవై ఉండాలని, పురుషులకు సంబంధించిన విద్య, వృత్తులు బయటికి సంబంధించినవై ఉండాలని అంటారు.

గరిమెళ్ళ సత్యనారాయణ రాసిన ఈ వ్యాసం క్లారిటీతోనే మొదలయ్యింది. మళ్ళీ వెంటనే నిరాశనీ, Anti-Establishment భావాలని గుమ్మరిస్తుంది. మధ్యలో కొన్ని విషయాలకు క్లారిటీని ఇస్తుంది. చివరికి వచ్చేసరికి స్వాతంత్ర్యోద్యమ సమయంలో వచ్చిన జాతీయ కళాశాల కాన్సెప్టుని, ఎంత నేర్చినా ఎంత చదివినా ఆడవాళ్ళు, వాళ్ళ చదువులు కూడా ఇంటికీ, సంసారానికీ ప్రాధాన్యం ఇవ్వాలి అనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తుంది.

కొసమెరుపు ఏమిటంటే, గరిమెళ్ళ లేడీ డాక్టర్ల గురించి (మహిళా వైద్యుల గురించి) ఒక్కమాట కూడా పొరపాటుగా మాట్లాడలేదు. అప్పటికి విమలాచంద్రయ్య (మద్రాస్), కొమర్రాజు అచ్చమాంబ (విజయవాడ) వంటి వైద్యులు ప్రాక్టీస్ చేస్తున్నారు.

* * *

('స్వాతంత్ర్యోద్యమం – గరిమెళ్ళ' అనే సంకలనంలో ఈ వ్యాసం గరిమెళ్ళ రాసిన వ్యాసం అచ్చయ్యాయి. పుస్తక ప్రచురణ 'గరిమెళ్ళ విజ్ఞాన కేంద్రం – శ్రీకాకుళం.)

ఆధార గ్రంథాలు

1. అర్థత్రయ సర్వస్వం - మొదటి భాగము, గరిమెళ్ళ సత్యనారాయణ, శ్రీ శారదా గ్రంథమాల, ప్రియాగ్రహారం B.O. , (వయా) కళింగపట్నం, గంజాం జిల్లా.
2. ఆధునికాంధ్ర కవిత్వం, డా. సి. నారాయణరెడ్డి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 4-1-435, విజ్ఞాన భవన్, హైదరాబాద్ - 1. తృతీయ ముద్రణ, జూలై 1989.
3. ఆధునిక యుగంలో కవిలోకం, కె. వి. రమణారెడ్డి, మాగ్జిమ్ గోర్కీ ప్రచురణాలయం, నెల్లూరు-524004. ప్రథమ ముద్రణ 1984.
4. ఆంధ్రలో సంఘ సంస్కరణోద్యమాలు, వకుళాభరణం రామకృష్ణ, హైదరాబాద్ బుక్ ట్రస్ట్,
5. ఆంధ్రలో సాంఘిక తిరుగుబాటు ఉద్యమాలు, సి. వి. విశాఖ హేతువాద సంఘం, డిసెంబర్ 1981.
6. కన్యాశుల్కం, గురజాడ వెంకట అప్పారావు, ఎం. శేషాచలం అండ్ కో, తొమ్మిదవ ముద్రణ, ఆగస్టు, 1987.
7. గరిమెళ్ళ సాహిత్యం, చల్లా రాధాకృష్ణశర్మ, లక్ష్మీనారాయణ గ్రంథమాల, ముద్రణ 1989.
8. జాతీయ గీతములు, గురజాడ రాఘవశర్మ (సంపాదకుడు), ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ, కళాభవన్, సైఫాబాద్, హైదరాబాద్-4, ప్రథమ ముద్రణ 1973
9. జానపద సాహిత్యం, ఎల్లోరా, దీప్తి పబ్లికేషన్స్, ప్రథమ ముద్రణ డిసెంబర్, 1982
10. తెలుగులో జాతీయోద్యమ కవిత్వం, మద్దూరి సుబ్బారెడ్డి, రాగసుధా ప్రచురణలు, 518, బాలాజి కాలనీ, తిరుపతి.

11. తెలుగు సాహిత్యంలో నవ యుగోదయం, సెట్టి ఈశ్వర్రావు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞాన్ భవన్, హైదరాబాద్-1.
12. నా వాఙ్మయ మిత్రులు, టేకుమళ్ళ కామేశ్వరరావు, చిత్తూరు, 1966.
13. నూరేళ్ళ తెలుగునాడు, కె. కె. రంగనాథాచార్యులు (సంపాదకుడు), ఆంధ్ర సారస్వత పరిషత్, తిలక్ రోడ్, హైదరాబాద్. ముద్రణ 1984.
14. నేటి భారతదేశం, రజనీ పామీదత్తు, అనువాదం విద్వాన్ విశ్వం, బత్తుల వెంకటేశ్వరరావు మెమోరియల్ ట్రస్ట్, సత్తుపల్లి, రెండవ ముద్రణ 1984.
15. భారతదేశ ఆర్థిక వ్యవస్థ (1600-1947), కె. ఎస్. గిల్, హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ఫిబ్రవరి, 1985.
16. భారత స్వాతంత్ర్య పోరాట చరిత్ర, ఇ. ఎం. ఎస్. నంబూద్రిపాడ్, అనువాదం వాసిరెడ్డి కేశవరెడ్డి, బొమ్మారెడ్డి, ముద్రణ జూన్, 1987, ప్రజాశక్తి ప్రెస్, విజయవాడ-2.
17. భారత స్వాతంత్ర్య సమరంలోని ఉజ్జ్వల ఘట్టాలు (1858-1947), బి. జితేందర్ రెడ్డి, శివాజీ ప్రెస్, సికింద్రాబాద్. ద్వితీయ ముద్రణ 1983.
18. మాలపల్లిపై నిషేధాలు, బంగోరె, (బండి గోపాల రెడ్డి), పబ్లిషర్ బంగోరె, ఏప్రిల్, 1979.
19. విభాత సంధ్యలు-తెలుగు సాహిత్యంలో సమాజం, సి. వి. సుబ్బారావు (సంపాదకుడు), నవోదయ పబ్లిషర్, ఏలూరురోడ్, విజయవాడ-2.
20. స్వరాజ్య గీతములు, గరిమెళ్ళ సత్యనారాయణ, ఇండియా ఏజెన్సీ బ్యూరో, మద్రాస్, ముద్రణ-1921.
21. స్వరాజ్య గీతములు-2వ భాగము, గరిమెళ్ళ సత్యనారాయణ, ఇండియా ఏజెన్సీ బ్యూరో, మద్రాస్, ముద్రణ-1922.
22. Indian Muslims, Ram Gopal
23. ఆంధ్రపత్రిక ఉగాది సంచిక, 1934
24. ఆనందవాణి, 15-6-1947
25. ఆనందవాణి, 29-6-1947
26. ఆనందవాణి, 20-7-1947
27. ఆనందవాణి, 03-8-1947

28. ఆనందవాణి, 11-01-1948
29. ఆనందవాణి, 29-02-1948
30. ఆనందవాణి, 18-4-1948
31. ఆనందవాణి, 13-6-1948
32. ఆనందవాణి, 15-8-1948
33. కృష్ణా పత్రిక, 04-9-1926
34. కృష్ణా పత్రిక, 11-9-1926
35. కృష్ణా పత్రిక, 29-9-1926
36. కృష్ణా పత్రిక, 02-10-1926
37. కృష్ణా పత్రిక, 09-10-1926
38. కృష్ణా పత్రిక, 02-4-1927
39. కృష్ణా పత్రిక, 16-4-1927
40. కృష్ణా పత్రిక, 30-4-1927
41. కిన్నెర, ఆగస్టు, 1952
42. కిన్నెర, జనవరి, 1953
43. ఢంకా, ఏప్రిల్, 1947
44. ఢంకా, సెప్టెంబర్, 1947
45. ఢంకా, అక్టోబర్, 1947
46. ఢంకా, నవంబర్, 1947
47. ఢంకా, డిసెంబర్, 1947
48. ఢంకా, జూన్, 1948
49. ఢంకా, నవంబర్, 1948
50. ఢంకా, జనవరి, 1949
51. ఢంకా, ఫిబ్రవరి, 1949
52. ఢంకా, జూలై, 1949
53. ఢంకా, ఆగస్టు, 1949
54. ఢంకా, డిసెంబర్, 1951
55. ప్రజాసాహితి, ఏప్రిల్, 1981

56. భారతి, డిసెంబర్, 1926
57. భారతి, సెప్టెంబర్, 1931
58. భారతి, ఆగస్టు, 1932
59. భారతి, సెప్టెంబర్, 1937
60. భారతి, ఏప్రిల్, 1938
61. సృజన, మార్చి, 1974
62. కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి 50వ వర్ధంతి సంచిక, 06-5-1990



బొమ్మకంటి కృష్ణకుమారి: సుందర గోపాలం, సీతా తులసిల మూడవ సంతానం. భర్త గోపరాజు రవి. 1957 జూన్, 15 న పశ్చిమ గోదావరి జిల్లాలోని చిన అమిరంలో జన్మించారు. యూనివర్సిటి ఆఫ్ మద్రాస్ నుంచి ఎం.ఫిల్., ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎం.ఏ. (ఇంగ్లీష్) ఎల్.ఎల్.బి. చదివారు. కమిషనర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆఫీసులోనూ, వివిధ పాలిటెక్నిక్‌లలో ఇంగ్లీష్ లెక్చరర్ గాను పని చేసి రిటైర్ అయ్యారు.

‘మాకొద్దీ తెల్లదొరతనము’ అనే పాటను తెలుగువారెవరూ మరిచిపోయుండరనే నా నమ్మకం. ఎందుకంటే స్వాతంత్రోద్యమ సమయంలో తెలుగు జాతి నాలుకల మీద ఆడిన పాట అది. వారిని ఎంతగానో చైతన్యపరచిన పాట అది. ఆ రోజుల్లో ఆ పాటని సైక్లోస్టైల్ చేసి అణాకి అమ్మేవారు. అలా ఎన్ని సార్లు సైక్లోస్టైల్ చేయబడిందో లెక్క లేదు. రచయిత గరిమెళ్ళ సత్యనారాయణ గారికి ఆ పాట రాసినందుకు అప్పటి గోదావరి కలెక్టర్ బ్రేకన్ ఒక సంవత్సరం కఠిన కారాగారవాస శిక్ష విధించారు. ఈ విషయం చెప్పినపుడు గాంధీజీ మొదట నమ్మలేదట. ఆ తరువాత మిగిలిన వారినందరినీ కూడా ఆ విధంగా పాటలు రాయమని ఆదేశించారట. గరిమెళ్ళ రాసిన దేశభక్తి గీతాలను 1921 లో ‘స్వరాజ్య గీతములు’ పేరుతో రెండు భాగాలుగా ‘ఇండియా ఏజంసి బీరో’ ప్రచురించింది. బ్రిటిషు ప్రభుత్వం ఆ పుస్తకాలను నిషేధిస్తూ రచయితకి మరోసారి కారాగార శిక్ష విధించింది. రెండు కేసుల్లోనూ కలిపి ఆయన రెండున్నర సంవత్సరాలు జైలు జీవితం గడిపారు.

“ ... నా గళాన్ని, కలాన్ని ఒక ఏడాదిపాటు జోకొడదామని బ్రిటిష్ నిరంకుశ పాలకవర్గం నిర్ణయించింది. పౌర జీవిత ప్రశాంతికి, అంటే తన మనుగడకే ప్రమాదకారినని భావించింది. ఇది నాకే కనువిప్పు ...” తన పుస్తకాల గురించి “ నా గ్రంథము 5000 ప్రతులను నా పాదముల కడ ప్రోగు పెట్టినపుడు నాకు గర్వమును, దుఃఖమును కూడ వెంటనే కలిగెను. ఆ యమర శిశువులు మరణభీతిచే నన్ను కాపాడమని నా వంక దయాదృష్టుల నిగుడించెను. ... నేను కేవల మసమర్థుడను గదా.”

(జైలుకు వెళ్లేముందు ఆయన ఇచ్చిన ప్రకటన నుండి; ఆంధ్రపత్రిక, 28 జూలై 1922).